ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
విజయవాడ 2-2-2026 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 173 రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



భారత్ నుంచి అంతర్జాతీయంగా డేటా సెంటర్ సర్వీసులను అందించే విదేశీ సంస్థలకు 20 ఏళ్లపాటు పన్ను విరామం ప్రకటిస్తున్నాం.
జీఎస్టీ సరళీకరణ, నూతన కార్మిక చట్టాల రూపకల్పన సహా 350కి పైగా సంస్కరణలను ఇప్పటికే అమల్లోకి తీసుకొచ్చాం. ఈ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ఇదే జోరుతో ముందుకు తీసుకెళ్తాం.
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పుల్లేవ్

జనాకర్షక ప్రకటనలకు దూరం


మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట

వృద్ధి పథాన..

దీర్ఘకాలిక పురోగతిని లక్షిస్తూ కేంద్ర బడ్జెట్

తయారీ రంగంలో ఉద్యోగాల సృష్టికి అధిక ప్రాధాన్యం

- మునుపెన్నడూ లేనంతగా మూలధన వ్యయానికి రూ.12.22 లక్షల కోట్లు
- మొత్తం రూ.53.47 లక్షల కోట్లతో పద్దు
- రక్షణ రంగానికి కేటాయింపులు 15% పెంపు
- వీబీ- జీ రామ్ జీ పథకానికి రూ.95,692 కోట్లు
- సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌ను ముందుకు తీసుకెళ్తామన్న నిర్మలా సీతారామన్



దిల్లీ

అంతర్జాతీయంగా అనిశ్చితి మేఘాలు కమ్ముకున్నా.. అభివృద్ధి పథంలో దేశాన్ని వేగంగా పరుగులు తీయించాలన్న సంకల్పంతో మోదీ సర్కారు బృహత్ ప్రణాళికను రూపొందించింది! తయారీ రంగంలో స్వావలంబనతో సుస్థిర వృద్ధికి బాటలు పరిచే కార్యాచరణను సిద్ధం చేసింది!! స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తయ్యేనాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న ప్రభుత్వం. . ఆ లక్ష్య సాధనకు అనుగుణంగా తీర్చిదిద్దిన కేంద్ర బడ్జెట్ (2026-27)ను ఆదివారం పార్లమెంటు ముందుంచింది. దీర్ఘకాల ఆర్థిక వృద్ధికి దన్నుగా నిలిచే మౌలిక వసతుల అభివృద్ధికి తాము ఎంతగా ప్రాధాన్యమిస్తున్నదీ దానిద్వారా చాటిచెప్పింది. ఔషధాలు, సెమీకండక్టర్లు సహా మొత్తం ఏడు రంగాల్లో ఉద్యోగాల సృష్టి, ఉత్పాదకత పెంపుపై ప్రత్యేకంగా దృష్టిసారించనున్నట్లు ప్రకటించింది. మొత్తం రూ.53.47 లక్షల కోట్ల ఈ కేంద్ర పద్దులో.. రక్షణ, గ్రామీణాభివృద్ధి సహా పలు రంగాలకు కేటాయింపులు నిరుటితో పోలిస్తే గణనీయంగా పెరిగాయి. ఆదాయపు పన్ను రేట్లను మాత్రం యథాతథంగా ఉంచారు. కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. వృద్ధికి ఊతమివ్వడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, ప్రగతి పథంలో అందరినీ కలుపుకొని వెళ్లడం అనే మూడు కర్తవ్యాలకు కట్టుబడి ఉంటూ తాజా బడ్జెట్‌ను రూపొందించినట్లు కేంద్రం ఉద్ఘాటించింది.

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ వంటి కీలక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నా- పద్దులో ప్రభుత్వం జనాకర్షక పథకాల జోలికి వెళ్లలేదు. ఆర్భాటాలు, విప్లవాత్మక ప్రకటనలకు దానిలో స్థానమివ్వలేదు. ప్రధానంగా దీర్ఘకాలిక వృద్ధిని దృష్టిలో పెట్టుకొని వ్యవహరించింది. మూలధన వ్యయం కోసం మునుపెన్నడూ లేనంతగా ఏకంగా రూ.12.22 లక్షల కోట్లు కేటాయించింది.


ఉపాధి కల్పన.. ఉత్పాదకత పెంపు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం ఉదయం తొలుత రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిశారు. బడ్జెట్ ప్రతులను ఆమెకు అందజేశారు. అనంతరం అక్కడి నుంచి లోక్‌సభకు వచ్చి.. రికార్డు స్థాయిలో వరుసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. విత్త క్రమశిక్షణను పాటిస్తూ.. తాత్కాలిక ప్రయోజనాలకు కాకుండా, దీర్ఘకాలిక వృద్ధికి పద్దులో నిర్మల ప్రాధాన్యమిచ్చారు. పర్యాటకం, ఔషధ ఉత్పత్తి, రక్షణ తదితర రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా నిలబెట్టే ప్రణాళికలను (మిగతా 3లో)

ఈ బడ్జెట్ చరిత్రాత్మకమైనది. అవకాశాల రహదారి. ఇది 140 కోట్ల మంది దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబం. సంస్కరణల ప్రయాణాన్ని బలోపేతం చేయడంతో పాటు వికసిత్ భారత్ నిర్మాణానికి మార్గనిర్దేశకం చేస్తుంది. ఈ సంస్కరణలు యువతకు అద్భుతమైన అవకాశాలు కల్పిస్తాయి. భారత్ అతి త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. 2047 నాటికి వికసిత్ భారత్ దిశగా మన ప్రయాణానికి ఈ పద్దు పునాది లాంటిది.
–ప్రధాని మోదీ



మనదేశానికి ఉన్న అనుకూలతలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి ఈ బడ్జెట్ దోహదం చేస్తుంది. అన్ని ప్రాంతాలు, వర్గాల అభివృద్ధికి ఉపయోగపడుతుంది. ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. వారు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక సుస్థిరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను రూపొందించారు. ఏపీ ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింత దూకుడుగా వెళ్లడానికి ఈ బడ్జెట్ సహకరిస్తుంది. రాష్ట్ర అభివృద్ధికి చేస్తున్న అన్ని ప్రయత్నాలకూ వెసులుబాటు కల్పించేలా ఈ బడ్జెట్ ఉంది.
– సీఎం చంద్రబాబు



బడ్జెట్‌పై ప్రత్యేక కథనాలు 5, 6, 7, 8, 9 పేజీల్లో

తితిదే ఈవో సింఘాల్‌పై బదిలీ వేటు

- సిట్ సిఫారసుతో ప్రభుత్వ చర్యలు
- సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు అదనపు బాధ్యతలు


అనిల్‌కుమార్ సింఘాల్


రవిచంద్ర

ఈనాడు, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) కార్యనిర్వహణాధికారి (ఈవో) అనిల్ కుమార్ సింఘాల్‌పై బదిలీ వేటు పడింది. తితిదేకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో అప్పట్లో ఉన్నత స్థానాల్లో ఉన్న ముగ్గురు అధికారులపై చర్యలు తీసుకోవాలని సిట్ ప్రభుత్వానికి లేఖ రాయడంతో అప్పటి, ప్రస్తుత ఈవో సింఘాల్‌ను ప్రభుత్వం ఆదివారం బదిలీ చేసింది. తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆయన్ను ఆదేశించింది. ముఖ్యమంత్రికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న ముద్దాడ రవిచంద్రకు తితిదే ఈవోగా అదనపు (మిగతా 3లో)

జంతువుల కొవ్వు కలిసిందని..

ఎన్‌డీడీబీ ల్యాబ్ పరీక్షల్లో తేలింది

చర్యలు తీసుకోవడానికి సిట్ వేస్తే
వైకాపా నాయకులు
నేను క్షమాపణ చెప్పాలంటున్నారు

కల్తీ నెయ్యి వ్యవహారంపై
ఘాటుగా స్పందించిన చంద్రబాబు 2లో

అభివృద్ధిలో.. 'బుల్లెట్' పరుగులే

- రాష్ట్రంలో డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్
- 7 హైస్పీడ్ రైల్ కారిడార్లలో 3 ఏపీ మీదుగానే
- సెమీకండక్టర్ మిషన్ 2.0 ఏర్పాటుతో ప్రయోజనాలు
- పోలవరానికి రూ.3,320 కోట్లు
- అమరావతికి రూ.1,561 కోట్లు
- 2026-27 బడ్జెట్లో ప్రకటించిన కేంద్రం



ఈనాడు – అమరావతి, దిల్లీ

పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా.. ఉద్యోగ కల్పనకు ఊతమిచ్చేలా కేంద్రం ఏపీకి బడ్జెట్‌లో వరాలిచ్చింది. రాష్ట్రంలో డెడికేటెడ్ రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అరుదైన ఖనిజ నిల్వలు అధికంగా ఉన్న నాలుగు దక్షిణాది రాష్ట్రాలకు కారిడార్లు ప్రకటించగా.. వాటిలో ఏపీ ఒకటి. దీనివల్ల మైనింగ్, ప్రాసెసింగ్, పరిశోధన, ఉత్పత్తిరంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తాయి. యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌ను చుట్టేస్తూ బుల్లెట్ రైళ్లు పరుగులు తీసేలా హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టుల్ని ప్రకటించింది. ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలో హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-అమరావతి-చెన్నై, చెన్నై-బెంగళూరు కారిడార్లు మన రాష్ట్రం మీదుగా వెళ్లేవే. ఈ మూడు కారిడార్ల మొత్తం పొడవు 1,671 కి.మీ ఉంటే అందులో ఏపీలో నిర్మించేది 857 కి.మీ.. అంటే 51% మన రాష్ట్రంలోనే.. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక పరిధిలో 49% సాగుతుంది. కీలక ప్రాజెక్టులైన పోలవరం, అమరావతి రాజధానికీ కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. 2025-26 బడ్జెట్లో పోలవరం ప్రాజెక్టుకు రూ.5,936 కోట్లు కేటాయించినా. . అంచనాల సవరణలో రూ.3,017.20 కోట్లకు తగ్గింది. 2026-27 బడ్జెట్లో రూ. 3,320.39 కోట్లు కేటాయించారు. రాజధాని అమరావతికి ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ), ఇంటర్నేషనల్ బ్యాంకు ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్ (ఐబీఆర్‌డీ) నుంచి రూ.1,561 కోట్లు సమకూరుస్తోంది.

సెమీకండక్టర్ పరిశ్రమకు బూస్ట్..

రూ.40,000 కోట్లతో ప్రతిపాదించిన ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 (ఐఎస్ఎం)లో భాగంగా.. ఏపీలో కర్నూలు, తిరుపతిలో కార్బైడ్ చిప్స్, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్ పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందనుంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రూ.14,000 కోట్ల పెట్టుబడితో సిలికాన్ కార్బైడ్ సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఇప్పటికే (మిగతా 3లో)

ఏపీ అభివృద్ధికి ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది
ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

దీర్ఘకాలిక ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్
మంత్రి నారా లోకేశ్

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహంతో ఉపాధికి దన్ను
సీఐఐ ప్రతినిధులు 3లో

'స్కిల్' కేసులో చంద్రబాబుకు ప్రమేయం లేదు
ఆయన పాత్రపై ఎలాంటి ఆధారాలూ లభించలేదు 2లో
ఏ నేరాదాయ సంబంధిత ప్రక్రియలోనూ లేరు
అందుకే ఈ కేసులో నిందితుడిగా చేర్చలేదు
తాజా అనుబంధ అభియోగపత్రంలో ఈడీ వెల్లడి

భారత్‌తో ఆడం
టీ20 ప్రపంచకప్ ముంగిట పాక్ ప్రకటన
మిగతా మ్యాచ్‌ల్లో బరిలోకి
– వివరాలు ఛాంపియన్‌లో

జోగి నోటి దురుసుపై భగ్గుమన్న తెదేపా శ్రేణులు 16లో
ఇబ్రహీంపట్నంలోని ఆయన ఇంటిపై దాడి

ఇదీ సంగతి!



తీపి వార్త డియర్! బడ్జెట్‌లో షుగర్ మందుల ధరలు తగ్గాయి కదా.. ఆ సంతోషంలో ఈ స్వీట్లతో పాటు, ఎక్స్‌ట్రా మాత్రలు కూడా తెమ్ముకున్నా!

అంబటికి రిమాండ్

- సీఎంపై అసభ్య వ్యాఖ్యల కేసులో 14 రోజుల పాటు విధింపు
- గుంటూరు ప్రత్యేక జూనియర్ సివిల్ జడ్జి ఉత్తర్వులు
- రాజమహేంద్రవరం జైలుకు తరలింపు
- చంద్రబాబును ఉద్దేశించి అలా మాట్లాడాల్సింది కాదన్న రాంబాబు!

ఈనాడు– అమరావతి, న్యూస్‌టుడే– గుంటూరు లీగల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై అసభ్య, అసహ్య వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబుకు 14 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ గుంటూరు ప్రత్యేక జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తి జి. స్రవంతి ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం గుంటూరులోని గోరంట్ల వద్ద అంబటి రాంబాబు తన వాహనంలో వస్తూ పోలీసులతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడిన ఘటన తీవ్ర దుమారం రేపింది. దీనిపై తెదేపా శ్రేణులు భగ్గుమన్నాయి. అంబటి ఇల్లు, కార్యాలయంపై దాడికి పాల్పడ్డాయి. గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, నల్లపాడు ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అంబటి రాంబాబుపై నల్లపాడు పోలీసుస్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో అంబటిని శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. నల్లపాడు పోలీసుస్టేషన్‌కు తరలించి ఆదివారం రాత్రి 7 గంటల వరకు అక్కడే ఉంచారు. అనంతరం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి రక్తపోటు, మధుమేహ పరీక్షలతోపాటు ఈసీజీ తీయించారు. రాత్రి 8.45 గంటలకు స్థానిక ప్రత్యేక జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానంలో హాజరుపరిచారు.

ఆయనకు సంబంధం లేదు: పొన్నవోలు

అంబటికి రిమాండ్ విధించాలని పోలీసుల తరఫున సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు విజయలక్ష్మి, జగదీష్‌లు కోర్టును కోరారు. సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అంబటి రాంబాబుకు ఈ నేరాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. తిరుపతి లడ్డూలో (మిగతా 3లో)


గుంటూరు ప్రభుత్వాసుపత్రి వద్ద పోలీస్ వ్యాన్ దిగుతున్న అంబటి రాంబాబు

జేఈఈ మెయిన్ దరఖాస్తుకు 25 వరకు గడువు

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్ తుది విడత పరీక్షకు ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఆదివారం తెలిపింది. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసి.. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. తుది విడత పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి 9వ తేదీల మధ్య నిర్వహించనున్నట్లు పేర్కొంది. కాగా, తొలి విడత పరీక్షలు జనవరి 29తో ముగియగా.. వాటి ఫలితాలు ఈ నెల 12వ తేదీలోపు వెల్లడవుతాయి.

'స్కిల్' కేసులో చంద్రబాబుకు ప్రమేయం లేదు

- ఆయన పాత్రపై ఎలాంటి ఆధారాలూ లభించలేదు
- ఏ నేరాదాయ సంబంధిత ప్రక్రియలోనూ లేరు
- అందుకే ఈ కేసులో నిందితుడిగా చేర్చలేదు..
- తాజా అనుబంధ అభియోగపత్రంలో ఈడీ వెల్లడి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ 2014-19 మధ్య చేపట్టిన సీమెన్స్ ప్రాజెక్టు నిధులు దుర్వినియోగమయ్యాయనే ఆరోపణలపై నమోదైన కేసులో.. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏ ప్రమేయమూ లేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తేల్చిచెప్పింది. ఈ కేసులో నేరాదాయానికి (ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్) సంబంధించిన ఏ ప్రక్రియలోనూ, కార్యకలాపాల్లోనూ ఆయన పాత్ర లేదని కుండబద్దలు కొట్టింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) కింద చేపట్టిన దర్యాప్తులో ఈ కేసులో చంద్రబాబు పాత్ర ఉన్నట్లు ఏ ఆధారాలూ లభించలేదని నిర్ధారించింది. అందుకే ఆయన్ను నిందితుడిగా చేర్చలేదని స్పష్టం చేసింది. విశాఖపట్నంలోని పీఎంఎల్‌ఏ కోర్టులో 2023 మే 1న దాఖలుచేసిన ప్రధాన అభియోగపత్రం, తాజాగా సమర్పించిన అదనపు అభియోగపత్రంలో ఈడీ ఈ విషయాల్ని వెల్లడించింది. సీమెన్స్ ప్రాజెక్టు నిధుల దుర్వినియోగం ఆరోపణలపై 2021 డిసెంబరులో పెట్టిన కేసులో చంద్రబాబును ప్రధాన నిందితుడిగా (ఏ-1) చేర్చి విజయవాడలోని ఏసీబీ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశామంటూ ఏపీ సీఐడీ 2024 ఏప్రిల్‌లో తమకు లేఖ రాసిందని.. అయితే పీఎంఎల్‌ఏ కింద తాము నమోదు చేసిన కేసులో చంద్రబాబు పాత్ర ఎక్కడా తేలలేదని అనుబంధ ఛార్జ్‌షీట్‌లో వివరించింది. వైకాపా, దాని అనుబంధ ముఠాలు ఇన్నాళ్లుగా చంద్రబాబు చేస్తున్నవన్నీ దుష్ప్రచారాలేనని తేటతెల్లమైంది.

చంద్రబాబును ఇరికించాలనే దురుద్దేశంతో..

సీమెన్స్ ప్రాజెక్టులో నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ 2021 డిసెంబరులో సీఐడీ కేసు నమోదు చేసింది. నైపుణ్యాభివృద్ధి సంస్థలో పనిచేసిన అధికారులతో పాటు సీమెన్స్ ప్రాజెక్టు అమలు చేసిన వివిధ సంస్థల ప్రతినిధుల్ని నిందితులుగా చేర్చింది. ఈ కేసులో మనీ లాండరింగ్ వ్యవహారాలు వెలుగు చూశాయంటూ తర్వాత ఆ ఎఫ్ఐఆర్‌ను ఈడీకి పంపించింది. దాని ఆధారంగా ఈడీ కూడా.. 2022 డిసెంబరులో ఈసీఐఆర్ఐ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. అయితే ఆ కేసులో చంద్రబాబు నిందితుడు కాదు.

◆ నాటి ముఖ్యమంత్రి జగన్ కక్ష సాధింపులో భాగంగా.. సీఐడీ నమోదు చేసిన కేసులో 2023 సెప్టెంబరులో చంద్రబాబును నిందితుడిగా చేరుస్తూ.. ఏసీబీ కోర్టులో మెమో దాఖలుచేసిన సీఐడీ అధికారులు వెంటనే చంద్రబాబును అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం జైల్లో 53 రోజుల పాటు నిర్బంధించారు. తర్వాత సీఐడీ 2024 ఏప్రిల్‌లో విజయవాడ ఏసీబీ కోర్టులో అభియోగపత్రం దాఖలు చేసి చంద్రబాబును ప్రధాన నిందితుడిగా పేర్కొంది. ఆయన్ను ఈడీ కేసులోనూ ఇరికించాలనే దురుద్దేశంతో జగన్ హయాంలోనే ఈ విషయాలన్నీ ఈడీకి పంపించారు. తమ దర్యాప్తులో వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న ఈడీ అసలు ఈ కేసులో చంద్రబాబు పాత్రే లేదని తేల్చి చెప్పేసింది.

◆ ఈడీ నమోదు చేసిన కేసులో చంద్రబాబు ఎన్నడూ నిందితుడిగా లేరు. అయినా సరే వైకాపా ముఠా పదేపదే ఆయన్ను ఈ కేసుకు ముడిపెడుతూ దుష్ప్రచారం చేసింది.

ఈడీ కేసులోనూ క్లీన్‌చిట్

నైపుణ్యాభివృద్ధి సంస్థ సీమెన్స్ ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వ్యవహారంలో జగన్ ప్రభుత్వ హయాంలో సీఐడీ బనాయించిన కేసులో చంద్రబాబుకు ఇప్పటికే విముక్తి లభించింది. ఆయనపై మోపిన నేరాభియోగాలను 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'గా పేర్కొంటూ సీఐడీ విజయవాడ ఏసీబీ కోర్టులో తుది నివేదిక దాఖలు చేయగా న్యాయస్థానం దాన్ని అంగీకరించింది. నేరారోపణల నుంచి విముక్తి కల్పిస్తూ జనవరి 12న ఉత్తర్వులిచ్చింది. తాజాగా ఈడీ దర్యాప్తులోనూ ఈ కేసులో చంద్రబాబు ప్రమేయం లేదని స్పష్టమైంది.

ఆ సంస్థల అంతర్గత వ్యవహారాల్లో మనీలాండరింగ్..

◆ సీమెన్స్ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ఏపీ ప్రభుత్వం నుంచి వివిధ సంస్థలకు నిధులు విడుదలైన తర్వాత.. వాటి ప్రతినిధులు డొల్ల కంపెనీల ద్వారా వాటిని దారి మళ్లించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ స్పష్టం చేసింది. వారి ప్రమేయంపై అభియోగాలు మోపింది. ◆ డొల్ల కంపెనీలు ఉపయోగించి బహుళ అంచెల లావాదేవీలు, నకిలీ ఇన్‌వాయిస్‌లతో నేరానికి పాల్పడినట్లు గుర్తించి, వారికి సంబంధించిన మొత్తం రూ.54.74 కోట్ల ఆస్తులను ఈడీ ఎటాచ్ చేసింది. ఆ వ్యవహారాల్లో వేటితోనూ చంద్రబాబుకు సంబంధమే లేదని ఈడీ తేల్చింది.

జంతువుల కొవ్వు కలిసిందని.. ఎన్‌డీడీబీ ల్యాబ్ పరీక్షలో తేలింది

- చర్యలు తీసుకోవడానికి సిట్ వేస్తే నేను క్షమాపణ చెప్పాలంటున్నారు
- వైకాపా నాయకులు వేంకటేశ్వరస్వామిని బజారుకు ఈడ్చాలనుకుంటున్నారు
- కల్తీ నెయ్యి వ్యవహారంపై ఘాటుగా స్పందించిన సీఎం

ఈనాడు, చిత్తూరు: వైకాపా నాయకులు వేంకటేశ్వరస్వామిని బజారుకు ఈడ్చాలని అనుకుంటున్నారని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. తాను మాత్రం అలా చేయనని అన్నారు. కలియుగ దైవంతో పెట్టుకుంటే వచ్చే జన్మలో కాదు.. ఈ జన్మలోనే శిక్ష అనుభవిస్తారని చాలాసార్లు చెప్పానని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు ఎన్నో చూశానని తెలిపారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని.. ఎన్‌డీడీబీ తెలిపిందని మరోసారి స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం తులసినాయనపల్లెలో ఆదివారం ఆయన మాట్లాడారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'వైకాపా పాలనలో తిరుమలలో అనేక ఘోరాలు జరిగాయి. నేను ముఖ్యమంత్రి అయ్యాక స్వామివారి పవిత్రతను కాపాడటానికి, తిరుమలను ప్రక్షాళన చేయడానికి, పూర్వ వైభవం తీసుకురావడానికి తితిదే ఈవోగా శ్యామలరావును పంపాను. ఆయన ఈ క్రమంలో నెయ్యి నాణ్యతపై అనుమానం వచ్చి నమూనాలను ఎన్‌డీడీబీకి పంపారు. అక్కడ చేసిన పరీక్షల్లో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని నిర్ధారణ అయింది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కల్తీ జరిగిందని తాను చెబితే, నానా యాగీ చేశారని, సుప్రీంకోర్టుకు వెళ్లారని చంద్రబాబు గుర్తు చేశారు. 'ఒక పరిపాలకుడిగా చర్యలు తీసుకోవడానికి సిట్ వేస్తే నేను క్షమాపణలు చెప్పాలని అడుగుతున్నారు. వైకాపా నాయకుల ప్రవర్తన ఎలా ఉందో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ. నేను ఎప్పుడూ ఆయన దగ్గర అపచారం చేయలేదు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడిగా మహాద్వార, వైకుంఠ ద్వారం నుంచి వెళ్లే అవకాశమున్నా సామాన్య భక్తుడిలాగే దర్శించుకుంటా. అది నా నమ్మకం' అని సీఎం పేర్కొన్నారు. 'కలియుగ దైవంపై నమ్మకం లేకపోతే వదిలేయవచ్చు. అపచారం చేసి దాన్ని కూడా కప్పిపుచ్చుకోవడానికి తిరిగి దాడి చేయడం ఏంటో నాకు అర్థం కావడంలేదు. నా వ్యక్తిత్వాన్ని హననం చేయాలని చూస్తున్నారు. ఇది సరైంది కాదు' అని సీఎం తెలిపారు.

చెప్పినా వినని నాయకులను నమస్కారం పెట్టి సాగనంపుతా

- ఎమ్మెల్యేలు, మంత్రులకే కాదు.. నాకూ ఇదే వర్తిస్తుంది
- తెదేపా శ్రేణుల సమావేశంలో చంద్రబాబు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, చిత్తూరు: 'నాయకులెవరూ అనవసరంగా నా వద్దకు రావద్దు. మీరున్న వార్డు/గ్రామంలో తెలుగుదేశానికి మెజారిటీ వస్తే నేనే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి దండ వేస్తా. పార్టీ, ప్రభుత్వంలో పదవులు ఇస్తా' అని తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇప్పుడు పదవులు పొందిన వారి జాతకాలన్నీ చూస్తున్నానని తెలిపారు. నిర్మొహమాటంగా నాయకులకు మీ పనితీరుపై వాస్తవాలు చెబుతానని, ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయనని చంద్రబాబు పేర్కొన్నారు. దారి తప్పిన నేతలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నానని, అప్పటికీ వారి తీరులో మార్పు రాకపోతే నమస్కారం పెట్టి సాగనంపడం ఖాయమని హెచ్చరించారు. ఈ మాటలు ఎమ్మెల్యేలు, మంత్రులకే కాకుండా తనకూ వర్తిస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం తులసినాయనపల్లెలో సీఎం చంద్రబాబు ఆదివారం తెలుగుదేశం శ్రేణులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడి ఆ తర్వాత అబకలదొడ్డిలో సంజీవని ప్రాజెక్టు అమలు తీరుపై లబ్ధిదారులు, అధికారులతో ముఖాముఖీ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 72 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటామని తెలిపారు. మూడు రోజుల పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు వెళ్లారు.

నేతల వ్యవహార శైలిపై సమీక్ష

'గతంలో పార్టీలో పని చేసిన వ్యక్తులు తమ పనితీరు గురించి నాకు తెలియడంలేదని వాపోయారు. ఇప్పుడు మీరే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఎవరూ మధ్యవర్తులు ఉండరు. మీకూ, నాకూ ఎక్కడా కమ్యూనికేషన్ గ్యాప్ లేదు. నేతల వ్యవహార శైలిపై ప్రతి శని, ఆదివారాల్లో సమీక్షిస్తున్నా. ఏ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సరిగ్గా పని చేస్తున్నారు? జిల్లాలో పార్టీ పరిస్థితి ఏ విధంగా ఉందని చూస్తున్నా. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా అంతా పని చేయాలి' అని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలోని 175 మంది ఎమ్మెల్యేల పనితీరును పరిశీలిస్తే తాను 16వ స్థానంలో ఉన్నానని, రాబోయే రోజుల్లో కుప్పం ప్రజలతో మరింతగా మమేకమవుతానని చంద్రబాబు తెలిపారు. ◆ మంత్రి నారా లోకేశ్ చేసిన యువగళం పాదయాత్ర మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో 'నారా నరసింహ' పాటను ముఖ్యమంత్రి విడుదల చేశారు.

గ్రహం అనుగ్రహం

2–2–2026 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
పాడ్యమి: తె. 3-02 తదుపరి విదియ
ఆశ్లేష: రా. 12-09 తదుపరి మఖ
వర్జ్యం: మ. 1-15 నుంచి 2-49 వరకు
అమృత ఘడియలు: రా. 10-36 నుంచి 12-09 వరకు
దుర్ముహూర్తం: మ. 12-36 నుంచి 1-21 వరకు తిరిగి 2-51 నుంచి 3-36 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6.36; **సూర్యాస్తమయం:** సా.5.51

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	13.5	32.3
విజయనగరం	15.0	27.0
అనంతపురం	17.3	33.5
కర్నూలు	18.7	32.2
కడప	19.0	30.0
శ్రీకాకుళం	20.0	29.0
విజయవాడ	20.0	29.5
తాడేపల్లిగూడెం	20.0	31.0
రాజమహేంద్రవరం	20.0	32.5
విశాఖపట్నం	20.2	29.8
నరసాపురం	20.8	30.8
గుంటూరు	21.0	31.0
ఒంగోలు	21.4	30.1
నెల్లూరు	22.0	30.7



రాష్ట్రపతి భవన్‌లో బడ్జెట్ ట్యాబ్‌తో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగం వింటున్న ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్, సర్బానంద సోనోవాల్, ధర్మేంద్ర ప్రధాన్, జైశంకర్, పీయుష్ గోయల్, కిరణ్ రిజిజు, ప్రహ్లాద్ జోషి, అశ్వినీ వైష్ణవ్; కిషన్‌రెడ్డి, మన్‌సుక్ మాండవీయ, జితేంద్ర సింగ్, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ తదితరులు

వృద్ధి పథాన..

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో పొందుపరిచారు. దాదాపు 90 నిమిషాలపాటు ఆమె ప్రసంగించారు. ట్రంప్ సుంకాల బెదిరింపులతో ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతుండటం, సరఫరా గొలుసులకు అంతరాయాలు ఏర్పడుతుండటం, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనవుతుండటం వంటి పరిణామాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో నిర్మల కీలక ప్రకటనలు చేశారు. ఉపాధి కల్పన, ఉత్పాదకత పెంపు, సాంకేతిక ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ.. ఔషధాలు, సెమీకండక్టర్లు, రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లు, రసాయనాలు, క్యాపిటల్ గూడ్స్, జౌళి, క్రీడా సాధనాల ముడిసరుకు వంటి రంగాల్లో స్వదేశంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని భారీగా పెంచుతామన్నారు. దేశీయంగా ఐఫోన్ తయారీ విజయవంతమైన నేపథ్యంలో.. ఎలక్ట్రానిక్స్ తయారీకి కేటాయింపులను నిరుటితో పోలిస్తే ఈ బడ్జెట్‌లో రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు. మొత్తం రూ.40 వేల కోట్లను అందుకు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

రయ్‌రయ్ రైళ్లు: గత రెండేళ్లు రైళ్లకు ఒకే స్థాయిలో నిధులు కేటాయించిన నిర్మలమ్మ.. ఈసారి కేటాయింపులను 10 శాతానికి పైగా పెంచారు. దేశంలో ఏడు హైస్పీడ్ రైల్వే కారిడార్ల ఏర్పాటును సంకల్పించారు. వీటిలో మూడు హైదరాబాద్ నుంచి ఉంటాయి. పశ్చిమ బెంగాల్‌లోని డంకునీ, గుజరాత్‌లోని సూరత్ మధ్య నిర్మించే నడవాను సరకు రవాణాకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. మరోవైపు- కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వీబీ- జీ రామ్ జీ పథకానికి రూ.95,692 కోట్లు కేటాయించారు. చేపల పెంపకం, పాడి వంటి వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా ముఖ్యమైన పథకాలను ప్రకటించారు.

పటిష్ఠ 'రక్షణ': రక్షణ రంగంలో ఆధునికీకరణకు అగ్రతాంబూలమిస్తూ.. ఆ శాఖకు కేటాయింపులను నిరుటితో పోలిస్తే ఈసారి పద్దులో ఏకంగా 15% పెంచారు. స్టెమ్ కోర్సులను అభ్యసించే విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా నివారించేందుకు జిల్లాకో వసతిగృహం ఏర్పాటుచేస్తామని, స్వయంసహాయక సంఘాల సభ్యురాళ్లను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం కోసం 'షీమార్ట్'లను ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. మహిళా సంక్షేమంపై తమ చిత్తశుద్ధిని కేంద్రం చాటుకుంది.

- భారత్‌ను బయోఫార్మా తయారీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాబోయే ఐదేళ్లలో రూ.10 వేలకోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు.
- రోగులకు భారీ ఊరటనిస్తూ 17 క్యాన్సర్ ఔషధాలపై దిగుమతి సుంకాన్ని తొలగించింది.
- ఆహారం, ఇంధనం, ఎరువులపై రాయితీల కోసం చేయబోయే వ్యయంలో కేంద్రం నిరుటితో పోలిస్తే 4.47% కోత విధించింది.

బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ.కోట్లలో)

	2024-2025 వాస్తవ గణాంకాలు	2025-2026 బడ్జెట్ అంచనాలు	2025-2026 సవరించిన అంచనాలు	2026-2027 బడ్జెట్ అంచనాలు
1. రెవెన్యూ వసూళ్లు	30,36,619	34,20,409	33,42,323	35,33,150
2. పన్ను ఆదాయం	25,00,039	28,37,409	26,74,661	28,66,922
3. పన్నేతర ఆదాయం	5,36,580	5,83,000	6,67,662	6,66,228
4. మూలధన వసూళ్లు	16,16,249	16,44,936	16,22,519	18,14,165
5. రుణాల తిరిగి వసూళ్లు	24,617	29,000	30,190	38,397
6. ఇతర మూలధన వసూళ్లు	17,202	47,000	33,837	80,000
7. అప్పులు, ఇతర వసూళ్లు	15,74,431	15,68,936	15,58,492	16,95,768
8. మొత్తం వసూళ్లు	46,52,867	50,65,345	49,64,842	53,47,315
9. మొత్తం వ్యయం	46,52,867	50,65,345	49,64,842	53,47,315
10. రెవెన్యూ ఖాతా	36,00,914	39,44,255	38,69,087	41,25,494
11. వడ్డీ చెల్లింపులు	11,15,575	12,76,338	12,74,338	14,03,972
12. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంట్లు	2,72,656	4,27,192	3,08,151	4,92,702
13. మూలధన ఖాతా	10,51,953	11,21,090	10,95,755	12,21,821
14. రెవెన్యూ లోటు (10-1)	5,64,296 (1.7%)	5,23,846 (1.5%)	5,26,764 (1.5%)	5,92,344 (1.5%)
15. ప్రభావిత రెవెన్యూ లోటు (14-12)	2,91,640 (0.9%)	96,654 (0.3%)	2,18,613 (0.6%)	99,642 (0.3%)
16. ద్రవ్య లోటు 9-(1+5+6)	15,74,431 (4.8%)	15,68,936 (4.4%)	15,58,492 (4.4%)	16,95,768 (4.3%)
17. ప్రాథమిక లోటు (16-11)	4,58,856 (1.4%)	2,92,598 (0.8%)	2,84,154 (0.8%)	2,91,796 (0.7%)

తగ్గేవి.. పెరిగేవి

దిల్లీ: కేంద్ర బడ్జెట్లో క్యాన్సర్ ఔషధాలు సహా కొన్నింటిపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించారు. అదే సమయంలో కొన్ని రకాల వస్తువులపై పెంచాలని ప్రతిపాదించారు. ఆ వివరాలు..

కొంత చౌక అయ్యేవి ఇవి..









- వ్యక్తిగత వినియోగం నిమిత్తం దిగుమతి చేసుకునే ఔషధాలు
- 17 రకాల క్యాన్సర్ ఔషధాలు
- అత్యంత అరుదైన ఏడు రోగాల చికిత్సలో ఉపయోగించే ప్రత్యేక ఔషధాలు, ఆహారం
- మైక్రోవేవ్ ఓవెన్‌లో ఉపయోగించే కీలక విడిభాగాలు
- విమానాల తయారీలో ఉపయోగించే పరికరాలు (ఇంజిన్లు సహా)
- సోలార్ గ్లాస్ తయారీకి అవసరమయ్యే పదార్థాలు
- అణు విద్యుత్తు ప్రాజెక్టుల కోసం దిగుమతి చేసుకునే వస్తువులు
- కీలక ఖనిజాలకు సంబంధించిన భారీ యంత్ర పరికరాలు
- తోలు వస్తువులు (పాదరక్షలు)
- జౌళి వస్త్రాలు
- బయోగ్యాస్ కలిపిన సీఎన్‌జీ
- సముద్ర ఆహార ఉత్పత్తులు
- విదేశీ పర్యటన ప్యాకేజీలు
- విదేశీ విద్య

ఇవి మరింత ప్రియం..







- సిగరెట్లు
- దిగుమతి చేసుకున్న తక్కువ ధర గొడుగులు (కిలోకు రూ.60 పెంపు)
- పొటాషియం హైడ్రాక్సైడ్
- ఏటీఎం యంత్రాలు, వాటి విడి భాగాలు
- విదేశీ సిబ్బంది షిప్స్, బ్రాడ్‌కాస్టింగ్ పరికరాలు
- జూ కోసం దిగుమతి చేసుకునే జంతువులు,పక్షులు
- అమోనియం ఫాస్ఫేట్ / నైట్రో-ఫాస్ఫేట్ ఎరువులు, నాఫ్తా వంటి ఎరువుల ముడి పదార్థాలు
- కాఫీ రోస్టింగ్, బ్రూయింగ్, వెండింగ్ యంత్రాలు
- నూనె తీసిన ఆముదపు చెక్క (కాస్టర్ ఆయిల్ కేక్)
- ఖనిజాలు, ఇనుప ధాతువు, బొగ్గు

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహంతో ఉపాధికి దన్ను

బడ్జెట్‌పై సదస్సులో.. సీఐఐ ప్రతినిధుల అభిప్రాయం




మాట్లాడుతున్న శరణం నరేంద్ర కుమార్, పక్కనే నాగలక్ష్మి

ఈనాడు, అమరావతి: కేంద్ర బడ్జెట్ అన్ని రంగాలకూ ఊతమిచ్చేలా ఉందని సీఐఐ ఏపీ వైస్ ఛైర్మన్ శరణం నరేంద్రకుమార్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు సీఐఐ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. నరేంద్రకుమార్ మాట్లాడుతూ వ్యవసాయం నుంచి ఏరోస్పేస్ రంగం వరకు అన్నింటికీ ఈ బడ్జెట్‌తో మేలు జరగబోతోందని అన్నారు. అమరావతికి ప్రత్యేకంగా కేటాయింపులు లేకపోయినా, వివిధ రూపాల్లో ప్రోత్సాహకాలు రానున్నాయని తెలిపారు. ప్రధానంగా.. విశాఖపట్నం డిజిటల్ హబ్‌గా ఎదగబోతోందని వెల్లడించారు. సీఐఐ విజయవాడ జోన్ ఛైర్‌పర్సన్ వి.నాగలక్ష్మి మాట్లాడుతూ దేశీయ వస్తువుల తయారీ, ఉత్పత్తి సామర్థ్యం పెరిగేలా.. విదేశీ సరకుల దిగుమతులు తగ్గించుకునే విధానాలకు రూపకల్పన చేయడం గొప్ప పరిణామమని నాగలక్ష్మి పేర్కొన్నారు.

రాజకీయాల్ని నేరమయం చేయటమే వైకాపా సంస్కృతి

ముఖ్యమంత్రి చంద్రబాబు ట్వీట్..



ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో వారు విధ్వంసం చేసిన వ్యవస్థలను పునర్నిర్మిస్తుంటే.. అది చూసి ఓర్వలేక ఆ పార్టీ నాయకులు రగిలిపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజమెత్తారు. రాజకీయాల్ని నేరమయం చేయడం (క్రిమినలైజేషన్ ఆఫ్ పాలిటిక్స్) వైకాపా ప్రధాన సంస్కృతి అని, చట్టరహిత పరిపాలనకు వారి హయాం హాల్‌మార్క్ వంటిదని విమర్శించారు. '2024లో మేం అధికారం చేపట్టాక రాష్ట్రంలో చట్టబద్ధ పాలన పునరుద్ధరించాం. ప్రజలకు సేవ చేయడం, వారికి సాధికారత కల్పించడం మా సంస్కృతి. వైకాపా నిజస్వరూపం రోజురోజుకు బయట పడుతుండటంతో ఆ పార్టీ నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ నిరాశ, నిస్పృహలకు లోనై అసభ్య దూషణలకు తెగబడుతున్నారు. ఏదీ ఏమైనా శాంతిభద్రతలను కాపాడతాం. చట్టమే మాకు సుప్రీం. చట్టబద్ధ పాలనను (రూల్ ఆఫ్ లా) ఉల్లంఘించడానికి ఎవర్నీ అనుమతించం' అని హెచ్చరించారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఎక్స్‌లో ఆదివారం రాత్రి ఆయన ఈ ట్వీట్ చేశారు.

ఏపీ అభివృద్ధికి ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: 'వికసిత్ భారత్ లక్ష్యాలు సాధించేలా కేంద్ర బడ్జెట్ ఉంది. యువశక్తిని మేల్కొల్పి, ప్రతి అవకాశాన్నీ అందిపుచ్చుకుని మౌలిక ప్రగతికి బాటలు వేస్తూ 2047 నాటికి భారత్‌ను ప్రబల ఆర్థికశక్తిగా నిలపాలన్న ప్రధాని మోదీ సంకల్పం ఈ బడ్జెట్‌లో కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఇది ఊతం ఇచ్చేలా ఉంది' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆయన ఆదివారం రాత్రి ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'సంస్కరణలు, సంక్షోభ నివారణ, మౌలిక ప్రగతి, దేశ భద్రత, రైతు సంక్షేమం, వికసిత గ్రామీణ భారతం, ఆర్థిక స్వావలంబన తదితర అంశాలకు ఈ బడ్జెట్ పెద్దపీట వేసింది' అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 'పర్యాటక రంగంలో ఇస్తున్న ప్రోత్సాహకాలు అరకు వంటి పర్యాటక ప్రాంతాలకు ఊతం ఇస్తాయి. ఏడు హైస్పీడ్ కారిడార్లలో మూడు ఆంధ్రప్రదేశ్ మీదుగానే వెళతాయి. కేంద్రం ఎంపిక చేసిన రేర్ ఎర్త్ మినరల్స్ కారిడార్లలో ఆంధ్రప్రదేశ్ కూడా ఉండటం వల్ల విలువైన ఖనిజాల వెలికితీత, తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తుంది. ఉప్పాడ 100 రోజుల ప్రణాళికకు ఈ బడ్జెట్ ఊతం ఇస్తుంది. కొబ్బరి, జీడిపప్పు, కోకో రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు కోనసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల రైతులకు ఊరటనిస్తాయి' అని ఆయన అభిప్రాయపడ్డారు.

దీర్ఘకాలిక ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది

మంత్రి నారా లోకేశ్



ఈనాడు, అమరావతి: భారతదేశ వేగవంతమైన అభివృద్ధి, దీర్ఘకాలిక ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బడ్జెట్‌ను సమర్థంగా ఉపయోగించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాల కల్పన, పెట్టుబడుల సాధన, రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు.

వికసిత్ భారత్ లక్ష్యం చేరుకునేలా..

పీవీఎన్ మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు



ఈనాడు, అమరావతి: 'దేశాన్ని ఆత్మనిర్భర్, వికసిత్ భారత్-2047 దిశగా పరుగులు పెట్టించేలా బడ్జెట్ ఉంది. బయోఫార్మా రంగానికి రూ.10 వేల కోట్లు, ఏపీ, ఒడిశా, తమిళనాడు, కేరళలో గనుల కారిడార్, కంటెయినర్ నిర్మాణ రంగానికి రూ.10 వేల కోట్లు, కొత్తగా మూడు కెమికల్ రీసెర్చ్ పార్కులు, హైస్పీడ్ రైల్ కారిడార్ల నిర్మాణం. సెమీ కండక్టర్ మిషన్ కోసం రూ.40 వేల కోట్లు. ఖాదీ, చేనేత, హస్తకళల ప్రోత్సాహం.. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.10 వేల కోట్లు. . కొబ్బరి, కోకోకు ఊతమిచ్చే చర్యలు.. పర్యాటకంలో అరకు ట్రెక్కింగ్, పులికాట్‌లో పక్షుల వీక్షణకు నిధులు.. ప్రతి జిల్లాకు బాలికల వసతిగృహం. ఆయుర్వేద ఎయిమ్స్ ఏర్పాటు దేశం వేగవంతమైన అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాలు. బడ్జెట్‌లో ఏపీకి పెద్ద పీట వేశారు. బడ్జెట్ పూర్తి పాఠం వినకుండా వైకాపా నాయకులు విమర్శలు చేయడం తగదు' అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు.

రాష్ట్రాన్ని మోసం చేసిన మోదీ ప్రభుత్వం

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

ఈనాడు, అమరావతి: కేంద్రం ప్రకటించే ప్రతి బడ్జెట్‌లోనూ మోదీ ప్రభుత్వం రాష్ట్రాన్ని మోసమే చేస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. రూ.50 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో ఈసారి సైతం రాష్ట్రానికి మొండి చెయ్యే చూపారని ఆమె ఆదివారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు 'ఎన్డీయేలో సీఎం చంద్రబాబు కీలకంగా ఉన్నా రాష్ట్రానికి ప్రయోజనం గుండు సున్నా. ఆంధ్రుల ఆత్మగౌరవానికి, రాష్ట్ర ప్రయోజనాలకు బడ్జెట్‌లో పైసా విలువ లేదు. రూ.లక్ష కోట్లు ఖర్చు అయ్యే అమరావతికి ఏడీబీ, జపాన్ బ్యాంకుల నుంచి రూ.1,500 కోట్ల అప్పులు ఇప్పిస్తే రాజధాని పూర్తవుతుందా? విభజన చట్టం ప్రకారం అమరావతి నిర్మాణం కేంద్రానిదే బాధ్యత అని తెలియదా? ఇదేనా భాజపాకు రాష్ట్రంపై ఉన్న చిత్తశుద్ధి?' అని షర్మిల మండిపడ్డారు.

సమతుల.. ఆచరణాత్మక బడ్జెట్

ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రావు



సమావేశంలో ఆర్.వి.స్వామి, బి.రాజశేఖర్, పొట్లూరి భాస్కర్‌రావు

ఈనాడు, అమరావతి-పటమట, న్యూస్‌టుడే: సమతుల ఆచరణాత్మకంగా కేంద్ర బడ్జెట్‌ను రూపొందించారని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్‌రావు పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌పై విజయవాడలో ఆదివారం సమావేశం నిర్వహించారు. భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈలకు రూ.10 వేల కోట్లతో గ్రోత్ ఫండ్, సెల్ఫ్ రిలయంట్ ఇండియా ఫండ్‌కు అదనంగా మరో రూ.4 వేల కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. ఛాంబర్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు బి.రాజశేఖర్ మాట్లాడుతూ.. రేర్-ఎర్త్ కారిడార్ ఏర్పాటుతో.. రాష్ట్ర పారిశ్రామిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్‌ను.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీగా స్థాయి పెంచనున్నారని, దీనివల్ల ఏపీలోని హోటల్ రంగానికి అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం కలిగిన సిబ్బంది అందుబాటులోకి వస్తారని ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి. స్వామి అన్నారు. కేంద్ర బడ్జెట్ దేశ పురోగతికి ఆశాజనకంగానే ఉన్నా.. రాష్ట్రంలో సాగు, తాగునీరు, పోలవరం ప్రాజెక్టుకు.. అమరావతికి కేటాయింపులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించిందని పొట్లూరి భాస్కర్‌రావు సహా ఛాంబర్ సభ్యులంతా అభిప్రాయపడ్డారు.

కాణిపాకంలో అంతరాలయ దర్శనం ఆరంభం



మొదటి టికెట్ కొనుగోలు చేసి అంతరాలయ దర్శనానికి వెళ్తున్న ఈవో పెంచల కిశోర్

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీకాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి అంతరాలయ దర్శనాన్ని ఆదివారం పాలకమండలి, అధికారులు ప్రారంభించారు. ఇటీవల జరిగిన పాలకమండలి సమావేశంలో సామాన్యులకు ప్రాధాన్యమిస్తూ రూ.500 టికెట్‌తో అంతరాలయ దర్శనం కల్పించాలని తీసుకున్న నిర్ణయం మేరకు దీనిని ప్రారంభించారు. ఉదయం 10-11, సాయంత్రం 3-4 గంటల మధ్య అంతరాలయ దర్శనం ఉంటుంది. మొదటి రోజున 438 మంది స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఉచితంగా అభిషేకం, లడ్డూ అందించారు. మొదటి టికెట్‌ను ఆలయ ఈవో కొనుగోలు చేసి స్వామిని దర్శించుకున్నారు.

అభివృద్ధిలో.. 'బుల్లెట్' పరుగులే

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందం కుదిరింది. దీనితోపాటు రాబోయే ఏపీలో సెమీకండక్టర్ తయారీ చేపట్టే పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందే అవకాశం ఉంది. పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకాల ద్వారా రాష్ట్ర రైతులకు ప్రయోజనం లభించనుంది. కుసుమ్‌లో 3 లక్షల వ్యవసాయ కనెక్షన్లు, సూర్యఘర్‌లో 2లక్షల కనక్షన్లు అదనంగా వస్తాయని అంచనా.

పర్యాటకానికి ప్రోత్సాహమిచ్చేలా

రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రోత్సాహమిచ్చేలా.. అరకులో ట్రెక్కింగ్, హైకింగ్ మార్గాలు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి అభివృద్ధి చేయనున్నట్లు బడ్జెట్లో తెలిపింది. పులికాట్ సరస్సులో పక్షుల్ని మరింత దగ్గర్నుంచి వీక్షించేందుకు వీలుగా.. బర్డ్ వాచింగ్ ట్రైల్స్‌కు ప్రాధాన్యం కల్పించనుంది.

- గ్రామీణ రహదారుల ప్రాజెక్టుకు ఏఐబీ నుంచి రూ.500.99 కోట్లు.
- ఏపీ సహజ వ్యవసాయ సాగు ప్రాజెక్టు కోసం జీఓడీఈ నుంచి రూ.155.32 కోట్లు.
- రహదారులు, వంతెనల పునర్నిర్మాణ ప్రాజెక్టు కోసం ఎన్‌డీబీ నుంచి రూ.350 కోట్ల నిధులు రానున్నాయి.
- కేంద్ర నౌకాయాన శాఖ నుంచి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌కు రూ.450 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.250 కోట్లు అంతర్గత వనరుల నుంచి, రూ.200 కోట్లు ఇతర మార్గాల నుంచి సమకూరుస్తారు. గత ఏడాది కేటాయించిన రూ.730 కోట్లతో పోలిస్తే ఇది తక్కువే.
- వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు రూ.100 కోట్లు కేటాయించారు. గత ఏడాది కేటాయించిన రూ.545 కోట్లతో పోలిస్తే ఇది తక్కువే.
- రాష్ట్రంలోని స్వయం ప్రతిపత్తి సంస్థలకు ఆర్థిక సాయంలో భాగంగా అటామిక్ ఎనర్జీ డిపార్ట్‌మెంట్ నుంచి గీతం యూనివర్సిటీకి గ్రాంటు రూ.50 లక్షలు, స్పేస్ డిపార్ట్‌మెంట్ నుంచి వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీకి రూ.12 లక్షలు కేటాయించారు.
- క్లస్టర్ స్థాయిలో షీమార్ట్‌ల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో 670 పైగా మండలాల్లో ఒక్కోదానికి రూ.20 లక్షల మేర కేంద్ర గ్రాంట్ అందనుంది.
- అధిక విలువ కలిగిన పంటలకు ప్రోత్సాహంలో భాగంగా రాష్ట్రంలో సాగయ్యే కొబ్బరి, కోకో, జీడి మామిడి ఉద్యాన పంటల సాగుకు కేంద్ర సాయం లభించనుంది.
- దేశవ్యాప్తంగా మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటులో భాగంగా రాష్ట్రం నుంచి ప్రతిపాదించిన ధర్మవరం, పిఠాపురం, మంగళగిరి పార్కుల ఏర్పాటుకు కేంద్ర ప్రోత్సాహకాలు అందనున్నాయి.

విశాఖ పెట్రో యూనివర్సిటీకి రూ.302 కోట్లు

పెట్రోలియం శాఖ విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీకి రూ.302 కోట్లు కేటాయించింది. గత సంవత్సరం కేటాయించిన రూ.50 కోట్లకంటే ఇది అధికం.

తితిదే ఈవో సింఘాల్‌పై బదిలీ వేటు

(మొదటి పేజీ తరువాయి)

బాధ్యత అప్పగించింది. ఈలోగా సింఘాల్ నుంచి ఛార్జి తీసుకోవాలని ఆదేశించడంతో అదనపు ఈవో వెంకయ్యచౌదరి బాధ్యతలు స్వీకరించారు. కల్తీ నెయ్యి కుంభకోణంపై ఇటీవల అదనపు ఛార్జిషీట్ దాఖలు చేసిన సిట్.. సింఘాల్‌తో పాటు అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఫైనాన్షియల్ అడ్వైజర్, చీఫ్ ఎకౌంట్స్ ఆఫీసర్ (ఎఫ్ఏ అండ్ సీఏ) బాలాజీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తూ ప్రభుత్వానికి 14 పేజీల లేఖ రాసింది. వారు నెయ్యి సరఫరాలో నాణ్యత ప్రమాణాల్ని నీరుగార్చేలా వ్యవహరించారని, నిబంధనలు రూపొందించడంలో మనసు పెట్టకుండా పనిచేశారని పేర్కొంది. దానివల్లే నెయ్యి నాణ్యతలో రాజీ జరిగిందని తెలిపింది.

టెండర్ నిబంధనల్ని అడ్డగోలుగా మార్చేశారు

తెదేపా ప్రభుత్వ హయాంలో 2019 ఏప్రిల్‌లో నెయ్యి కొనుగోలు టెండర్లను కట్టుదిట్టం చేసేందుకు ఈవో సింఘాల్ నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు. నేషనల్ కేటగిరీ టెండర్లలో పాల్గొనే డెయిరీలకు అర్హత నిబంధనలపై ఆ కమిటీ పలు సిఫారసులు చేసింది. అంతవరకు రోజుకు ఆరు టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం ఉండాలన్న నిబంధనను 12 టన్నులకు, వార్షిక టర్నోవర్‌ను రూ.150 కోట్ల నుంచి రూ.250 కోట్లకు పెంచింది. రోజుకు 4 లక్షల లీటర్ల పాల సేకరణ సామర్థ్యం ఉండాలన్న నిబంధన పెట్టింది. 2019 ఆగస్టు నుంచి అవి అమల్లోకి వచ్చాయి. నాలుగు నెలలు గడవకముందే వైకాపా ప్రభుత్వం నియమించిన కొత్త పాలకమండలి నెయ్యి కొనుగోలు టెండర్ నిబంధనల్ని ప్రైవేటు సంస్థలకు అనుగుణంగా మార్చే ఉద్దేశంతో మరో కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పాలకమండలి అలాంటి ఆలోచన చేసినప్పుడు.. నాలుగు నెలల క్రితమే నిబంధనల్ని కట్టుదిట్టం చేశామని, వాటిని సడలిస్తే నెయ్యి నాణ్యత దెబ్బతింటుందని చెప్పాల్సిన బాధ్యత ఈవోకి ఉంది. కానీ ఆయన పాలకమండలి చెప్పినదానికి తలాడించారు. 2020 జనవరిలో మరో కమిటీ ఏర్పాటైంది. ఆ కమిటీ సూచన మేరకు టెండర్లలో పాల్గొనే డెయిరీ రోజుకు నాలుగు లక్షల లీటర్ల పాలు సేకరించాలన్న నిబంధనను పూర్తిగా తీసేశారు. కనీసం మూడేళ్ల అనుభవమున్న డెయిరీనే టెండర్లలో పాల్గొనాలన్న నిబంధన ఏడాదికి, 12 టన్నుల నెయ్యి ఉత్పత్తి సామర్థ్యాన్ని 8 టన్నులకు తగ్గించారు. వార్షిక టర్నోవర్‌ను రూ.250 కోట్ల నుంచి 150 కోట్లకు తగ్గించారు. 2020 ఫిబ్రవరి నెలాఖరు నుంచి ఈ నిబంధనలు అమల్లోకి తెచ్చారు.

ప్రైవేటు డెయిరీల అక్రమాలకు తలుపులు తెరిచేశారు

టెండర్ నిబంధనల్ని సడలిస్తూ సింఘాల్ హయాంలో తీసుకున్న నిర్ణయాన్ని ఆ తర్వాత వచ్చిన ఈవో, అదనపు ఈవోలూ కొనసాగించారు. ఆ నిర్ణయమే భోలేబాబా వంటి బురిడీ డెయిరీలు తితిదేలో చొరబడేందుకు దారిచ్చింది. ఆ కంపెనీ ఒక్క లీటరు కూడా పాలు సేకరించకుండా, కేవలం వెజిటబుల్ ఆయిల్స్, రసాయనాలతో తయారు చేసిన లక్షల లీటర్ల సింథటిక్ నెయ్యిని తితిదేకి సరఫరా చేసింది. అలా వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లలో 68.17 లక్షల లీటర్ల కల్తీ నెయ్యి సరఫరా అయింది. ఆ నెయ్యితోనే కోట్ల లడ్డూలు తయారయ్యాయి.

అంబటికి రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)



గుంటూరు జిల్లా కోర్టు వద్ద పోలీసుల బందోబస్తు

ఎలాంటి కల్తీ జరగలేదని సిట్ క్లీన్‌చిట్ ఇచ్చినా ప్రభుత్వం అప్పటి వైకాపా ప్రభుత్వంపై నిందను మోపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వమే సమాజంలో అలజడి సృష్టించడానికి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిందని బాధ్యత గల పౌరుడిగా అంబటి రాంబాబు వాటిని తొలగించాలని కోరారన్నారు. ఆయనపై నమోదయిన నేరాలన్నీ ఏడేళ్లలోపు శిక్ష పడే అవకాశం ఉన్నందున రాంబాబుకు రిమాండ్ విధించవద్దని కోరారు. అంబటి రాంబాబు కూడా తనకు 68 ఏళ్ల వయసు ఉందని, న్యాయవాదిగా, ఎమ్మెల్యే, మంత్రిగా విధులు నిర్వహించానని చెప్పారు. తనపై శనివారం అర్ధరాత్రి పోలీసులు దాడికి పాల్పడ్డారని, తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు ఇలా వ్యవహరించాల్సి వచ్చిందని ఇద్దరు సీఐలు చెప్పినట్లు న్యాయమూర్తికి వివరించారు.

16 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి

పొన్నవోలు వాదనలను పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తోసిపుచ్చారు. అంబటి రాంబాబుపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 16కుపైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయని, వాటిలో మూడొంతులు ఆయన పోలీసులను దుర్భాషలాడటం, వారి విధులకు ఆటంకం కలిగించడంపై నమోదైనవేనని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై కావాలనే వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని, దీనివెనుక ఉన్న కుట్రదారులను కూడా తేల్చాల్సి ఉందన్నారు. అంబటిని విడుదల చేస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తెలిపారు. ఆయనను పోలీసు కస్టడీకి తీసుకుంటామని, రిమాండ్ విధించాలని కోరారు. సీఎంపై ఆయన చేసిన వ్యాఖ్యలను పరిశీలించాలంటూ న్యాయమూర్తికి వీడియో చూపించారు. ఆ తర్వాత అంబటి రాంబాబును న్యాయమూర్తి తన కార్యాలయంలోకి పిలిచి ఆయన వాంగూల్మం నమోదు చేశారు. రాత్రి 11.25 గంటల సమయంలో రాంబాబుకు ఈ నెల 13 వరకు రిమాండ్ విధిస్తున్నట్లు న్యాయమూర్తి జి. స్రవంతి ప్రకటించారు. తనను రాజమహేంద్రవరం జైలుకు పంపాలని రాంబాబు కోరగా ఆ మేరకు న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు.

సీఎంను ఎందుకు దూషించారు?

ముఖ్యమంత్రి చంద్రబాబును ఎందుకు దూషించారు? దీని వెనుక ఎవరున్నారు? మీరు అలా మాట్లాడవచ్చా అన్న కోణంలో పోలీసులు శనివారం రాత్రి అంబటిని ప్రశ్నించినట్లు తెలిసింది. తాను అలా మాట్లాడాల్సింది కాదని ఆయన జవాబిచ్చినట్లు సమాచారం. తాను మాజీ మంత్రినని, ప్రత్యేక వసతి సమకూర్చాలని కోరగా పోలీసులు తిరస్కరించినట్లు తెలిసింది. తనకు అనారోగ్యం ఉందని, మందులు ఇంటి వద్ద ఉన్నాయని చెప్పడంతో వాటిని రప్పించి ఇచ్చారు. ఆదివారం ఉదయం అంబటి అనుచరుడు అల్పాహారం తీసుకురాగా అప్పటికే ఇచ్చామని పోలీసులు చెప్పారు. రాంబాబును కలిసేందుకు ఎవర్నీ అనుమతించలేదు. న్యాయవాది మాధవిని మాత్రం ఉన్నతాధికారుల అనుమతితో లోపలికి పంపించారు. ఆమె అంబటి రాంబాబుతో కొన్ని పత్రాలపై సంతకాలు తీసుకుని వచ్చిన అనంతరం మీడియాతో మాట్లాడారు. అంబటి ఇల్లు, కార్యాలయం, వాహనాలపై దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పసుపు చొక్కా ధరించిన ఓ వ్యక్తి ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో నల్లపాడు పోలీసుస్టేషన్ వద్దకు గడ్డపారతో వచ్చి అంబటి రాంబాబును పొడిచేస్తానని కేకలు వేసి హంగామా సృష్టించాడు. పోలీసులు అతణ్ని అక్కడి నుంచి పంపించేశారు.

బెడిసికొట్టిన అంబటి వ్యూహం

శనివారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర దూషణలు చేసిన అంబటి రాంబాబు ముందుజాగ్రత్తగా అధిక సంఖ్యలో వైకాపా నేతలు, కార్యకర్తలను తన ఇంటికి రప్పించుకున్నారు. సాయంత్రం మరోసారి విలేకర్ల సమావేశం పెట్టి, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన తెలుగు మహిళపై వైకాపా కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఇది తెలిసి ఎమ్మెల్యే గళ్లా మాధవితోపాటు తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున చేరుకున్నారు. దీంతో వైకాపా శ్రేణులు పరారయ్యారు. పోలీసులు అతికష్టం మీద తెదేపా శ్రేణులను కట్టడి చేసి బయటికి పంపినా రాత్రి 11 గంటల వరకు వారు అక్కడే ఉండి ఆందోళన కొనసాగించారు. రాంబాబును తీసుకెళ్తున్న పోలీసు వాహనంపై కూడా కోడిగుడ్లు విసిరి, నిరసన తెలిపారు.

ఈనాడు

ప్రగతి బాటలో స్థిరంగా...

దేశీయ వినియోగం, పెట్టుబడుల ఊతంతో భారత జీడీపీ వృద్ధిరేటు నేడు మెరుగ్గా కనిపిస్తోంది. అధికార వర్గాల సమాచారం మేరకు ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. ద్రవ్యలోటు క్రమంగా తగ్గుతోంది. 'అన్నీ మంచి శకునములే' అన్నట్లుగా ఉన్న ఇలాంటి అనుకూలతల నడుమ వరసగా తొమ్మిదోసారి నిన్న కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్- భారతావని ప్రగతి రథాన్ని అలాగే స్థిరంగా ముందుకు నడిపించడంపైనే దృష్టి కేంద్రీకరించారు. ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసే వ్యవస్థాగత సంస్కరణల కొనసాగింపునకు ప్రాధాన్యమిచ్చారు. 2020-25 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వ మొత్తం ఖర్చులో మూలధన వ్యయం 12.5శాతం నుంచి 22.6శాతానికి చేరింది. నిరుటి కంటే లక్ష కోట్ల రూపాయలు ఎక్కువగా ఈసారి రూ.12.2 లక్షల కోట్లను మూలధన వ్యయానికి ప్రత్యేకించడం- దీర్ఘకాలంలో దేశాదాయ పెంపునకు, ఉపాధి కల్పనకు మరింతగా ఉపయోగపడుతుంది. విదేశీ పెట్టుబడులకు ఆకర్షణీయ గమ్యస్థానంగా ఇండియా నిలవాలంటే ఎఫ్‌డీఐలపై ప్రభుత్వ నియంత్రణ ఛత్రాన్ని ఆధునికీకరించాలన్న సూచనలు ఎప్పటినుంచో వినవస్తున్నాయి. తాజాగా బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఫారిన్ ఎక్స్ఛేంజ్ నిర్వహణ నిబంధనల సమగ్ర సమీక్ష- కాలంచెల్లిన నియమాలను తొలగించి, స్వదేశీ ప్రాథమ్యాలకు అనుగుణంగా విదేశీ పెట్టుబడుల రాకను సులభతరం చేసేందుకు దోహదపడుతుంది!

దాదాపు 33కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్న సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు(ఎంఎస్ఎంఈలు)- జీడీపీలో 31శాతానికి పైబడిన వాటాతో భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. సుమారు 49శాతం దేశీయ ఎగుమతులకు జన్మస్థానాలైన ఎంఎస్ఎంఈలు అమెరికా సుంకాల ధాటికి తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. అధిక రుణ భారం, చెల్లింపుల్లో జాప్యం, ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో వెనకబాటుతనం వంటి సమస్యలను అవి ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో బడ్జెట్‌లో ప్రకటించిన రూ.10వేల కోట్ల ప్రత్యేక నిధి- చిన్న మధ్యతరహా పరిశ్రమల ప్రగతికి చేయూతనందించగలదు. ఆత్మనిర్భర భారత నిధికి రూ.2వేల కోట్లు కేటాయించడం- రుణ గ్యారెంటీ పథకాలు ఉన్నప్పటికీ మూలధన సమీకరణలో అనేక అగచాట్ల పాలవుతున్న సూక్ష్మ సంస్థలను ఆదుకునేందుకు అక్కరకురాగలదు. రూ.10వేల కోట్ల బయోఫార్మా శక్తి వ్యూహం, భారత సెమీకండక్టర్ మిషన్ 2.0 ప్రకటనలు సైతం వినసొంపుగా ఉన్నాయి. అనుకున్నట్లుగా పట్టాలకెక్కితే- కీలక రంగాల్లో ఇండియా స్వావలంబన సాధించేందుకు అవి అమితంగా సాయపడతాయి!

ఆధునిక ఆర్థిక వ్యవస్థకు ప్రాణాధారాల వంటి అరుదైన ఖనిజాలకోసం విదేశాల మీద ఆధారపడటం దేశానికి ఎప్పటికీ మంచిది కాదు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఒడిశాలలో రేర్‌ఎర్త్ కారిడార్ల ఏర్పాటుకు మద్దతునిస్తామన్న బడ్జెట్ ప్రతిపాదన సాకారమైతే స్థానికంగా అతివిలువైన ఖనిజాల తవ్వకాలు, అనుబంధ కార్యకలాపాల వృద్ధిని జోరెత్తించగలదు. పర్యావరణ హితకర పద్ధతుల్లో ప్రజారవాణా సదుపాయాలను విస్తృతం చేయాలన్న కేంద్రం తలంపు శ్రేయోదాయకమైనది. అందులో భాగంగా అభివృద్ధి చేయనున్న ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లలోని మూడింటిలో హైదరాబాద్‌కు చోటు దక్కడం సహర్షంగా స్వాగతనీయం. భారతదేశంలోని డేటా సెంటర్ల సాయంతో విశ్వవ్యాప్తంగా క్లౌడ్ సేవలందించే విదేశీ కంపెనీలకు 2047దాకా పన్ను విరామమివ్వడం నిర్మలమ్మ పద్దులో మరో విశేషాంశం. డేటా సెంటర్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్న తెలుగు రాష్ట్రాలకు ఇది శుభసూచికం. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతూ, భారత వికాసయాత్రలో వారిని బలమైన భాగస్వాములుగా మార్చాలన్న ప్రభుత్వ సంకల్పం సాకారం కావాలంటే- ఆర్థిక మంత్రి ఆశించినట్లుగా, వనరులూ సదుపాయాలూ అవకాశాలు అందరికీ సమంగా అందుబాటులోకి రావాలి!



నేను మంచి మనుషుల్ని నమ్ముతాను. అబద్ధం ఆడకుండా బతకాలన్న సిద్ధాంతాన్ని అనుసరించాను. ఒక్క అబద్ధం ఆడితే దాన్ని కప్పిపుచ్చుకోవడానికి జీవితాంతం ఇంకెన్నో అబద్ధాలు చెప్పాల్సి వస్తుంది. ఎవరినీ నొప్పించకూడదన్నది నేను నమ్మిన మతం.

– కుష్వంత్ సింగ్, రచయిత

జ్ఞానాయుధం

జ్ఞానం మనిషి వికాసానికి మూలాధారం. అది అంధకార మార్గంలో వెలుగులను ప్రకాశింపజేసే దివ్యజ్యోతి. వ్యక్తి ఉనికే జ్ఞానం... అంటాడు దక్షిణామూర్తి. అవివేకాన్ని తొలగించే జ్ఞానం సమాజంలో సత్ప్రవర్తనకు నాంది పలుకుతుంది. శరీరానికి ఆహారం ఎంత అవసరమో, జీవితానికి జ్ఞానం అంతే అవసరం. అది మనసుకు విస్తారతను, హృదయానికి విశాలతను, చేతలకు సృజనాత్మకతను అందిస్తుంది- అంటాడు కుమారస్వామి స్కందపురాణంలో.

రాక్షసులు పెట్టే బాధల నుంచి విముక్తి కోసం దేవతలు బ్రహ్మ, విష్ణువులను ఆశ్రయించారు. వారి ఆదేశంతో శివపార్వతుల అనుగ్రహం కోసం తీవ్ర తపస్సు చేశారు. ఫలితంగా, శివపార్వతుల శక్తి సంయోగంతో కుమారస్వామి(స్కందుడు) జన్మించాడు.



అంతర్యామి

లోకకల్యాణం కోసం పుట్టిన కుమారస్వామికి, పార్వతీదేవి తన ఘోర తపస్సు ఫలంగా పొందిన జ్ఞానరూప 'శక్తి ఆయుధాన్ని' దివ్యాస్త్రంగా ప్రసాదించిందట. దీన్ని 'వేల్' అని కూడా అంటారు. ఈ అద్భుతమైన శక్తి ఆయుధంతో కుమారస్వామి శూరపద్ముణ్ని సంహరించి, దేవతలకు విముక్తి కలిగించాడన్నది పురాణ గాథ. లోకాలను అజ్ఞానాంధకారంలో ముంచెత్తిన తారకాసురుణ్ని సైతం ఈ ఆయుధంతో సంహరించినప్పుడు యుద్ధభూమిలో ఆ శక్తి విరాజిల్లగానే, ఆ అసురుడి అజ్ఞానం భస్మమై, భూలోకమంతా వేదజ్యోతితో నిండిపోయిందట! అప్పటి నుంచి శక్తి ఆయుధాన్ని విజయానికి గుర్తుగా పూజిస్తున్నారు. అది జ్ఞానం, వివేకం, శక్తి, ధర్మం, సూక్ష్మబుద్ధికి ప్రతీక. ఇదే కుమారస్వామి చేతిలో ఉండే ప్రధాన జ్ఞానాయుధం. దాన్ని పూజించడం ద్వారా సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహం కలిగి ఆత్మజ్ఞానం, ఆరోగ్యం, కుటుంబ శాంతి లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. స్కందోపనిషత్‌లో కుమారస్వామి స్వయంగా ఆత్మ- బ్రహ్మ ఏకత్వాన్ని ఉపదేశిస్తాడు. శరీరం, ఇంద్రియాలు, మనసు అన్నీ అశాశ్వతమైనవని, అజ్ఞానం తొలగిపోయినప్పుడు మాత్రమే నిజమైన జ్ఞానం వస్తుందని అంటాడు. అలాంటి బలాన్ని మనకు ప్రసాదించేదే శక్తి ఆయుధం. దాని పదునైన అంచు- వివేకాన్ని కలుగజేస్తుంది. యజుర్వేదం తైత్తిరీయ సంహితలో కార్తికేయుణ్ని యుద్ధ సేనాధిపతిగా సూచిస్తూ- అగ్ని, తేజస్సు, శక్తి ఇవన్నీ శక్తి ఆయుధానికి ప్రతీకలుగా పేర్కొంటారు.

త్రికోణాకారంలో ఉండే శక్తి ఆయుధం త్రిగుణాలను (సత్త్వ, రజ, తమస్) ఛేదించి, జ్ఞానజ్యోతులను దేదీప్యమానం చేస్తుంది. 'నేనే సత్యరూపమైన కాంతిని, అన్ని కాంతుల లోకన్నా ఉన్నతమైన జ్యోతిని. నేనే పరమేశ్వరుడను, పరబ్రహ్మను' అంటాడు స్కందుడు. కేనోపనిషత్ ప్రకారం శక్తి ఆయుధం అన్ని కాంతుల మూలమైన పరమజ్ఞానానికి ప్రతీక. ఇది మన లోపలి అజ్ఞానాన్ని ఛేదించి ముక్తిని అనుగ్రహిస్తుందంటారు. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి అనే త్రిశక్తుల కలయిక. విజయాన్ని సూచిస్తూ, ధైర్యాన్నిస్తూ, ఆపదలను అధిగమించే సామర్థ్యాన్ని ప్రసాదిస్తుందని నమ్మకం. శక్తి ఆయుధం మానవాళిని అంధకారం నుంచి వెలుగులోకి నడిపించే జ్ఞాన ప్రదాయిని.

– డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్

సంస్కరణలకు... సంప్రదింపుల మార్గమే మేలు



పంజాబ్, మహారాష్ట్ర సహకార (పీఎంసీ) బ్యాంకు ఖాతాదారుల నిధులను ఓ దివాలా తీసిన స్థిరాస్తి కంపెనీకి మళ్లించిందనే ఆరోపణ వచ్చినప్పటి నుంచి సహకార బ్యాంకులపై రిజర్వు బ్యాంకు నియంత్రణ పెరిగింది. బ్యాంకుల నియంత్రణ చట్టానికి 2020లో చేసిన సవరణలతో సహకార బ్యాంకులపై రాష్ట్రాలకన్నా కేంద్రానిదే పైచేయిగా మారింది. రాజ్యాంగం సమాఖ్య వ్యవస్థకు అగ్రాసనం వేసిందని, తదనుగుణంగా సహకార సంఘాలను రాష్ట్రాల జాబితాలో చేర్చిందని సుప్రీంకోర్టు ఇటీవల పార్లమెంటుకు స్పష్టం చేసింది. దీంతో ఆర్థిక వ్యవహారాలపై కేంద్రానికే ఆధిక్యం ఉన్నా- సహకార సంఘాలు, బ్యాంకులు రాష్ట్రాల నియంత్రణలో ఉండటం ప్రజాస్వామ్య లక్షణమని తేలుతోంది. దీన్ని కాపాడుకోవడం చాలా అవసరం.

సహకార బ్యాంకులు- చిన్న పట్టణాలు, నగరాల పరిసరాల్లో పొదుపరులు, వ్యాపారులకు నమ్మకమైన నేస్తాలు. రాష్ట్ర స్థాయిలో సహకార చట్టాల ద్వారా ఏర్పడిన బ్యాంకులివి. ఇప్పుడు వీటి నియంత్రణపై పోటీ నెలకొనడం గమనార్హం.



రెండింటి అదుపులో...

రాజ్యాంగం ఏడో షెడ్యూలులోని 246వ అధికరణం శాసనాధికారాలను కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలుగా విభజించింది. కేంద్ర జాబితాలోని అంశాలపై చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉండగా, రాష్ట్రాల జాబితాలోని అంశాలపై శాసనసభలు శాసనాలు చేయవచ్చు. ఉమ్మడి జాబితాలోని అంశాలపై కేంద్ర, రాష్ట్రాలు రెండూ చట్టాలు చేయవచ్చు. బ్యాంకింగ్ కేంద్ర జాబితాలో ఉండటం వల్ల బ్యాంకులపై నియంత్రణాధికారం రిజర్వు బ్యాంకుకే ఉంటుందని 45వ ఎంట్రీ పేర్కొంటోంది. రాష్ట్రాల జాబితాలోని 32వ ఎంట్రీ సహకార సంఘాలపై నియంత్రణను పూర్తిగా రాష్ట్రాలకే దఖలు పరుస్తోంది. దీనివల్ల దశాబ్దాలుగా బ్యాంకింగ్, సహకార సంఘాల మధ్య సమతూకం నెలకొంది. కేంద్రం బ్యాంకింగ్ రంగ స్థిరత్వాన్ని కాపాడగా, రాష్ట్రాలు సహకార సంఘాల విశిష్ట గుర్తింపునకు భరోసా ఇచ్చాయి. పట్టణ సహకార బ్యాంకులపై మాత్రం కేంద్ర, రాష్ట్రాలు రెండింటికీ అదుపు ఉంటుంది. ఈ బ్యాంకులు ఆర్‌బీఐ పర్యవేక్షణలో బ్యాంకింగ్ నియంత్రణ చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలి. అదే సమయంలో వాటి సభ్యత్వం, ఎన్నికలు, విలీనాలు రాష్ట్రాల చట్టాలకు అనుగుణంగా జరుగుతాయి. 2011లో పార్లమెంటు ఆమోదించిన 97వ రాజ్యాంగ సవరణ సహకార సంఘాలను ఏర్పాటుచేసే హక్కును 19(1)సి అధికరణలో చేర్చింది. సహకార సంఘాలను స్వచ్ఛందంగా ఏర్పాటుచేయడం, వాటి స్వయంప్రతిపత్తి, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహణ వంటి అంశాలను పార్ట్ 9బీ ద్వారా చేర్చింది. కానీ 2021లో సుప్రీంకోర్టు దీన్ని కొట్టివేసింది. సగం రాష్ట్రాల అనుమతి లేకుండా సహకార సంఘాల అంశంపై పార్లమెంటు చట్టం చేయకూడదని సుప్రీం స్పష్టం చేసింది. కాబట్టి పార్ట్ 9బీ అనేక రాష్ట్రాల్లో విస్తరించిన సహకార సంఘాలకు మాత్రమే వర్తిస్తుంది. 2020 నాటి బ్యాంకింగ్ నియంత్రణ సవరణ చట్టం ప్రకారం సాధారణ బ్యాంకులతోపాటు సహకార బ్యాంకులూ రిజర్వు బ్యాంకు పరిధిలోకి వచ్చాయి. అవసరమైతే సహకార బ్యాంకుల బోర్డులను రద్దు చేసి పాలనాధికారులను నియమించడానికీ, సీఈవోలూ, డైరెక్టర్ల నియామకానికి అర్హతలు, నిబంధనలను రూపొందించి అమలు చేయడానికీ ఆర్‌బీఐకి అధికారం ఇచ్చారు.

సహకార బ్యాంకుల్లో సామాన్యులు తమ డబ్బు దాచుకుంటారని, కుంభకోణాల్లో ఆ సొమ్ము పోతే ప్రజలు నష్టపోతారు కాబట్టి, దాన్ని నివారించడానికే రిజర్వు బ్యాంకుకు నియంత్రణాధికారం ఇవ్వాలని కేంద్రం భావిస్తోంది. బ్యాంకుల మీద రిజర్వు బ్యాంకుకు, సహకార సంఘాల మీద రిజిస్ట్రార్లకూ నియంత్రణాధికారం ఉండటం వల్ల తేడాలు వస్తున్నాయనీ, తప్పును ఎదుటివారి మీదకు నెట్టడం జరుగుతోందనీ కేంద్రం పేర్కొంది. సహకార బ్యాంకుల్లో కుంభకోణాలు జరిగితే అందరూ కేంద్రాన్ని ప్రశ్నిస్తారు తప్ప రాష్ట్రాలను కాదని గుర్తుచేస్తోంది. కాబట్టి లోపాల నివారణకు రిజర్వు బ్యాంకుకు నియంత్రణాధికారం ఇవ్వడం ముఖ్యమని పేర్కొంది. కానీ, దీనంతటి వల్ల సహకార బ్యాంకులపై పర్యవేక్షణాధికారం రాష్ట్రాల నుంచి రిజర్వు బ్యాంకుకు బదిలీ అవుతుందనే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వాదవివాదాలతో సహకార సంఘాల స్థాపన వెనక ఉన్న మూల లక్ష్యం దెబ్బతింటోంది. సహకార సంఘాలు ప్రజల పొదుపు మొత్తాలకు సంరక్షకులుగా, జవాబుదారీగా వ్యవహరించాలనేది నిర్వివాదాంశం. ప్రజల నిధుల విషయంలో కేంద్ర-రాష్ట్ర భేదాలకు తావులేదు. అదే సమయంలో సహకార సంఘాలు, సహకార బ్యాంకులు రాష్ట్ర చట్టాల కింద ఏర్పడిన సంస్థలన్న సంగతిని గుర్తించాలి. సహకార ఎన్నికలు, బైలాల మీదా కేంద్రం వివిధ నిబంధనల పేరుతో ఆధిపత్యం సాధిస్తే, అది రాష్ట్రాల పరిధిలోకి అడుగుపెట్టడమే అవుతుంది. దీన్ని సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులు వ్యతిరేకిస్తున్నాయి.

అర్థం చేసుకోవాల్సిన విషయాలివి

సహకార సంఘాల సంస్కరణలకు కొన్ని నియమాలు పాటించడం మేలు. సహకార బ్యాంకుల్లో పెట్టుబడులు, వాటి ఆస్తులు, నష్టభయాల వంటి అంశాలపై రిజర్వు బ్యాంకు నియంత్రణ మంచిదే. ఎన్నికలు, సభ్యత్వం వంటివి రాష్ట్రాల చట్టాల ప్రకారం నడవాలి. ఏ సంస్కరణ అయినా రిజర్వు బ్యాంకును సంప్రదించిన తరవాత రాష్ట్రాల చట్టాల ద్వారా జరగాలి. సహకార బ్యాంకులలో ఏ సంస్కరణ చేయాలన్నా కేంద్ర రాష్ట్రాలు సంప్రదించుకోవాలి. అవసరమైతే రాజ్యాంగం ఏడో షెడ్యూలును సవరించాలి. దీనికి రాజకీయ పార్టీలన్నీ కలిసిరావాలి. సహకార సంఘాలపై రాష్ట్రాలకు అదుపు ఉందనీ, సహకార సంఘాలు, బ్యాంకులకు స్వయంపాలన అధికారం ఉందని కేంద్రం గుర్తించి గౌరవించాలి. ప్రజల పొదుపు మొత్తాలను ఉపయోగించే తీరును పరిశీలించే అధికారం రిజర్వు బ్యాంకుకు ఉందన్న సంగతిని రాష్ట్రాలూ, సహకార బ్యాంకులూ అర్థం చేసుకోవాలి. ఇరుపక్షాలూ కలిసి సమాఖ్య స్ఫూర్తిని కాపాడాలి.



సీఆర్ సుకుమార్

సీనియర్ పాత్రికేయులు, న్యాయవాది

ఒక యువతి రద్దీగా ఉన్న బస్సు ఎక్కింది. చోటుచేసుకుంటూ ముందుకు వెళ్తున్న క్రమంలో ఆమె బ్యాగు మరో మహిళకు గట్టిగానే తగిలింది. ఆమె ఎక్కడ పోట్లాడుతుందోనని భయపడింది ఆ అమ్మాయి. కానీ ఆమె ఏమీ అనలేదు. పైగా చిరునవ్వుతో చేయందించి నిలదొక్కుకోవడానికి సాయం చేసింది. దాంతో ధైర్యం తెచ్చుకున్న యువతి నవ్వుతూ ఆమెతో మాట కలిపి, 'మీరు తిడతారేమోనని భయపడ్డాను' అంది.

'ఇంత చిన్న విషయానికి కోపం తెచ్చుకోవాల్సిన అవసరం ఏముంది? నువ్వేమీ కావాలని తగిలించలేదు. పైగా మనం కలిసి చేసే ప్రయాణం చాలా చిన్నది. రెండు స్టాపుల తరవాత దిగిపోతాను. ఆ మాత్రానికే నీతో గొడవపడటం, కొత్త శత్రువును తయారుచేసుకోవడం, ఇద్దరి మూడ్‌లు పాడు చేసుకోవడం... అనవసరం కదా' అంది ఆ మహిళ.



ప్రయాణం చాలా చిన్నది!

ఆ సమాధానం యువతిని ఆలోచింపజేసింది. ఆమె పాజిటివ్ ఆటిట్యూడ్‌కి ముగ్ధురాలైంది. రోజూ ఆఫీసుకు వెళ్తూ, వస్తూ ఈ రద్దీ బస్సుల్లో, రోడ్లమీద ట్రాఫిక్‌లో ఎన్ని గొడవలు చూడటం లేదు. పొరపాటున తగిలినా కయ్యిమని అరిచేస్తారు చాలామంది. రద్దీలో వాహనానికి ఇంకో వాహనం తగిలితేనే కాలర్ పట్టుకుని కొట్టుకున్న మగవాళ్లను చూసింది. అందరూ ఈవిడలాగా అర్థం చేసుకుంటే ప్రపంచం ఎంత బాగుంటుంది..! అవును... ప్రయాణం చాలా చిన్నది. నిజంగా ఈ మాటల్ని ప్రతిచోటా రాసి పెట్టాలి... అనుకుంది.

రోజువారీ ప్రయాణాలే కాదు, అసలు జీవిత ప్రయాణానికే గ్యారంటీ లేదు. ఎవరికి ఎంత సమయం ఉందన్నది ఎవరూ చెప్పలేరు. అయినా ఎవరికి వారు ఇక్కడ శాశ్వతం అన్నట్లుగా ప్రవర్తిస్తుంటారు. ఆవేశం, కోపం, అసూయ, స్వార్థం, క్షమించలేనితనం... రకరకాల ప్రతికూల భావోద్వేగాలను ప్రదర్శిస్తుంటారు. కాస్త సర్దుకుపోతే సరిపోయే చోట కూడా అనవసర వాదనకు దిగుతారు. సమయాన్నీ శక్తినీ వృథా చేస్తుంటారు. మూడ్ పాడు చేసుకుని జీవితాన్ని నరకప్రాయం చేసుకుంటూ ఉంటారు. ఏ సంఘటన అయినా దాన్ని చూసే కోణంలో ఉంటుంది. కాస్త ఓర్పు, మరికాస్త సంయమనం... వహిస్తే సంఘటనను సరిగ్గా అర్థం చేసుకోవచ్చు. తొకతొక్కిన తాచులా లేవకుండా కాసేపు ప్రశాంతంగా ఉండాలి. ప్రయాణం చాలా చిన్నదని గుర్తుచేసుకుంటే సహజంగానే ఒత్తిడి తగ్గుతుంది. కూల్‌గా సమస్యను పరిష్కరించుకోగలుగుతాం. ఇంట్లో వాళ్లతో ఎన్నో గొడవలు పడతాం. వెంటనే అన్నీ మర్చిపోయి ప్రేమగా అక్కున చేర్చుకుంటాం. బయట వాళ్లమీద మాత్రం చిన్న పొరపాటుకే ఒంటి కాలిమీద లేవడం ఎందుకు? క్షమిస్తే పోతుందిగా. మరీ ఇబ్బంది పెడితే 'జాగ్రత్త' అంటూ ఒక హెచ్చరిక చేయొచ్చు. అంతేకానీ వాదనకు దిగడం, ఎడమొహం పెడమొహంగా ఉండటం, శాశ్వత శత్రువులుగా పరిగణించడంలాంటి వాటి వల్ల మనకే నష్టం. ప్రతికూల భావోద్వేగాలు ఆరోగ్యానికి హానిచేస్తాయి. సానుకూల దృక్పథాన్ని పెంచుకుంటే సగం సమస్యలు మాయం అయిపోతాయి. కావాలంటే మీరూ ప్రయత్నించి చూడండి. ప్రయాణం చాలా చిన్నది, సాధ్యమైనంత ఆహ్లాదంగా దాన్ని గడిపేద్దాం!

– జీఎల్ నారాయణ

మొబైల్ ఫోన్ల ఉత్పత్తిలో రయ్..

దేశం ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోవాలంటే తయారీ రంగం పుంజుకోవాలి. అందులో భాగంగానే కేంద్రం 'మేకిన్ ఇండియా' కార్యక్రమాన్ని భుజాలకెత్తుకుంది. ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి ఊతమివ్వడానికి ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) వంటివి తెచ్చింది. ఈ నేపథ్యంలో సెల్‌ఫోన్ల ఉత్పత్తిలో దేశం గణనీయ పురోగతి సాధించింది. ఇండియా నేడు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ ఫోన్ల తయారీదారు. భారత్‌లో అమ్ముడవుతున్న మొబైల్ హ్యాండ్‌సెట్లలో 99.2శాతానికి పైగా స్థానికంగానే తయారవుతున్నాయి. దశాబ్ద కాలంలో ఇండియాలో మొబైల్ ఫోన్ల ఉత్పత్తి, ఎగుమతులు తదితరాల్లో వచ్చిన మార్పులు...



	2014-15	2024-25
మొబైల్ తయారీ యూనిట్లు	2	300
ఫోన్ల ఉత్పత్తి విలువ (రూ.లక్షల కోట్లు)	0.18	5.5
ఫోన్ల ఎగుమతులు (రూ.లక్షల కోట్లు)	0.01	2
దిగుమతుల శాతం (దేశీయ డిమాండులో)	75	0.02

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

న్యాయపరిరక్షణలో అలుపెరగని కృషీవలుడు

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా ఆకులమైలారం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పలు కేసులను వాదించారు. 1988-90 నడుమ హైకోర్టులో ప్రభుత్వ ప్లీడర్‌గా, కేంద్ర ప్రభుత్వ అదనపు స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీకి 1992-95 మధ్య న్యాయసలహాదారుడిగా, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిగా పని చేశారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘానికి కొంతకాలం కార్యదర్శిగానూ, తరవాత అధ్యక్షుడిగానూ సేవలందించారు. 1995 నుంచి దశాబ్దకాలం పాటు ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించారు. 2005లో గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2007లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులై, 2011లో పదవీ విరమణ పొందారు. 2013లో నాటి గోవా సీఎం మనోహర్ పారికర్ అభ్యర్థన మేరకు ఆ రాష్ట్ర తొలి లోకాయుక్తగా వ్యవహరించారు.

ధర్మదృష్టితో చరిత్రాత్మక తీర్పులు

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి విద్యార్థి దశలోనే రామ్‌మనోహర్ లోహియా, జయప్రకాశ్ నారాయణ్‌ల సామ్యవాద చింతనతో ప్రభావితులయ్యారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, ప్రజలందరికీ సమన్యాయం లభించాలన్న లక్ష్యంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా చరిత్రాత్మక తీర్పులిచ్చారు. తన ఉత్తర్వుల్లో రాజనీతి, ఆర్థికశాస్త్రం, అంతర్జాతీయ వాణిజ్యం, 20వ శతాబ్దపు సాహిత్య గ్రంథాల నుంచి సందర్భోచిత ఉటంకింపులను ఉదాహరించేవారు. ఆయన తీర్పులు విద్యావేత్తలా, ఆలోచనాపరుడి వ్యాఖ్యానాలుగా ఉండేవి. ఉభయపక్షాల వాదనలను ఓపికగా వినడం, నోట్స్ రాసుకోవడం, నిజానిజాలను బేరీజు వేసుకుని ధర్మపక్షపాతంతో తుది తీర్పునివ్వడం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రత్యేకత. రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం కాదని, బలహీనవర్గాల అభ్యున్నతికి దారిదీపమని స్పష్టంచేశారు. దేశంలోని

జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆదర్శ న్యాయమూర్తి. భారత రాజ్యాంగాన్ని త్రికరణశుద్ధిగా విశ్వసించే వ్యక్తి. అంచెలంచెలుగా ఎదిగిన నిత్యకృషీవలుడు. ఈ న్యాయకోవిదుడికి నేడు తెలంగాణ సాయుధ పోరాట సేనాని 'రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కారం' ప్రదానం చేయనున్న సందర్భంగా...

సకల సామాజిక సమస్యలకూ, శాసనపరమైన విభేదాలకూ పరిష్కారం భారత రాజ్యాంగంలో దొరుకుతుందని త్రికరణశుద్ధిగా విశ్వసిస్తూ, ఆ స్ఫూర్తిని పదేపదే చాటిచెప్పారు. ప్రభుత్వ ఆస్తి ప్రజల ఆస్తేనని, ప్రభుత్వం కేవలం ధర్మకర్త మాత్రమేనని నిజాయతీగా తేల్చిచెప్పిన ధర్మదృష్టి ఆయనది. ప్రజావనరులు ప్రజలకే చెందుతాయంటూ బొగ్గు గనులు, అటవీ సంపద, సహజ వనరుల సంరక్షణ అంశంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి విస్పష్టంగా ప్రకటించారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూమిని కొంతకాలం తరవాత సమాజ అవసరాల కోసం తిరిగి స్వాధీనం చేసుకోవాల్సి వచ్చినప్పుడు, నిర్వాసితులకు మార్కెట్ ధరల ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని, దౌర్జన్యంగా లాక్కోవడానికి వీల్లేదంటూ తీర్పు చెప్పారు. బలహీన వర్గాలకు సరైన ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం ప్రభుత్వ బాధ్యత అనీ, ఇందులో మరో అభిప్రాయానికి తావులేదనీ నిర్ద్వంద్వంగా ప్రకటించారు. తరతరాలుగా భూమికీ, సమాజ సంపదకూ దూరమైన ప్రజాసమూహాలకు రాజ్యాంగం ప్రకారం దేశ సంపదలో దక్కాల్సిన వాటా లభించాలని వివరించారు. విద్యాసంస్థల్లో వెనకబడిన వర్గా



లకు సముచిత అవకాశాలు లభించాలని, బలహీన వర్గాలకు ఉన్నత విద్యను దూరం చేస్తే, సామాజిక అత్యవసర పరిస్థితికి దారితీస్తుందని హెచ్చరించిన సమ్యక్ దృష్టి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిది. నల్లధనాన్ని వెలికి తీయడంలో ప్రభుత్వ తాత్సారాన్ని నిశితంగా ఖండించారు. దేశ సంపద కొందరి చేతుల్లో కేంద్రీకృతమవడం, ఎక్కువ మంది ప్రజలు పేదరికంలో మగ్గిపోవడం అసమానతలకూ, సామాజిక అస్థిరత్వానికి కారణమవుతుందని స్పష్టం చేశారు. కొంత మందికే అధిక ప్రయోజనాలు చేకూరడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమన్నారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.హెచ్.కపాడియా సుప్రీంకోర్టులో ప్రత్యేక అదనపు ఫారెస్ట్ బెంచ్‌ను ఏర్పాటు చేసి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని అధ్యక్షుడిగా నియమించారు. పర్యావరణం, సహజ వనరులు, మైనింగ్ మొదలైన అంశాలపై కేసులను ఈ బెంచ్ విచారించింది. ప్రజలందరి విస్తృత ప్రయోజనాల కోసమే సహజ వనరులను వినియోగించాలని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి తేల్చిచెప్పారు.

మానవ హక్కులకు ప్రాధాన్యం

'సల్వాజుడుం' తీర్పు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి వెలువరించిన తీర్పుల్లో మైలురాయి. మానవ హక్కుల ప్రాధాన్యాన్ని నొక్కిచెబుతూ- 'స్పెషల్ పోలీస్ ఆఫీసర్స్ పేరుతో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆదివాసీ యువకులను నియమించడం, వారికి ఆయుధాలు ఇవ్వడం అనైతికం, రాజ్యాంగ విరుద్ధం' అన్న తీర్పు చర్చనీయాంశమైంది. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి జాతీయ, అంతర్జాతీయ న్యాయ సదస్సుల్లో కీలక ఉపన్యాసాలూ ఇచ్చారు. పదవీ విరమణ తరవాత అనేక విద్యాసంస్థలకు సలహాదారుగా మార్గనిర్దేశం చేస్తున్నారు. మొక్కవోని దేశభక్తి, నిక్కమైన రాజ్యాంగ స్ఫూర్తి, సామాజిక చింతనాదీప్తి కలిగిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని విపక్ష కూటమి తమ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలిపింది. ఉన్నత విద్యావేత్తగా, ఉత్తమ న్యాయమూర్తిగా, సామాజిక చింతనాపరుడిగా, లౌకిక విలువలకు పట్టం కట్టిన పౌరుడిగా, సామ్యవాద స్ఫూర్తికుడిగా పేరెన్నికగన్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి వ్యక్తిత్వం స్ఫూర్తిదాయకమైనది.



ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ

పూర్వ ఉపకులపతి, తెలుగు విశ్వవిద్యాలయం

మెతుకు విలువ

ఒక గ్రామంలో రామచంద్ర అనే మాస్టారు ఉండేవారు. ఆయన కొడుకు రవి. తనకు నాన్నంటే చాలా ఇష్టం. రోజూ తండ్రితో కలిసి భోజనం చేసేవాడు. నాన్న భోజనం చేసేటప్పుడు కంచంలో ఒక్క మెతుకు కూడా వదలకుండా తినడం రవి ఎప్పుడూ గమనిస్తుండేవాడు. తను కూడా అలాగే ఉండటానికి ప్రయత్నించేవాడు. ఒకరోజు ఆడుకోవాలనే తొందరలో రవి తన ప్లేటులో సగం అన్నం వదిలేసి లేవబోయాడు. అది చూసిన రామచంద్ర.. 'చూడు నాన్నా! ఇంత



అన్నం మన కంచంలోకి రావడానికి రైతులు ఎండావానా లెక్క చేయకుండా పొలంలో చాలా పని చేస్తారు. తరవాత పంటను మోసే కూలీలు.. చివరగా ఎంతో ఓపిగ్గా వండే మీ అమ్మ.. వీళ్లందరూ కష్టపడితేనే మన కంచంలోకి అన్నం వస్తుంది. అన్నాన్ని పారేస్తున్నామంటే.. ఇంతమంది కష్టాన్ని వృథా చేసినట్లే. జర్మనీ, చైనా, ఫ్రాన్స్ లాంటి దేశాల్లో అన్నం వృథా చేస్తే జరిమానా వేస్తారు తెలుసా! మనం అన్నాన్ని పారేస్తున్నామంటే.. ఆకలితో ఉన్న మరొకరికి అందకుండా ఆహారాన్ని వృథా చేస్తున్నట్లే. అందుకే మనకు ఎంత కావాలో అంతే వడ్డించుకోవాలి' అని చెప్పారు. నాన్న మాటలు రవిని బాగా ఆలోచింపజేశాయి. తన తప్పు తెలుసుకున్న రవి.. 'సారీ నాన్నా! నాకు ఇదంతా తెలియదు. ఇప్పుడు ఆహారం విలువ తెలిసొచ్చింది' అంటూ తన కంచంలో ఉన్న అన్నం మొత్తం తినేశాడు. తరవాత.. 'ఇక మీదట నాకు ఎంత కావాలో అంతే పెట్టుకుంటాను. ఒక్క మెతుకు కూడా వృథా చేయను' అని వాళ్ల నాన్నకు మాటిచ్చాడు. స్కూల్లో తన స్నేహితులకు కూడా ఇదే విషయాన్ని నేర్పించాడు. మరి మీరు కూడా ఆహారాన్ని వృథా చేయకూడదు ఫ్రెండ్స్ సరేనా!

హాయ్! బుజ్జీ!!

– కరణం హరికిషన్

ఆహారం, ఇంధనం, ఎరువుల రాయితీల్లో కోత


ఆహారం, ఇంధనం, ఎరువులపై కేంద్రం అందిస్తున్న రాయితీల్లో కోత పడింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఈ సబ్సిడీలపై కేంద్రం 4.47 శాతం రాయితీని తగ్గించింది. దీంతో ప్రభుత్వ వార్షిక సబ్సిడీ వ్యయం రూ.4,10,495 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.4,29,735 కోట్లుగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీ రూ.2,28,154 కోట్లుగా ఉండగా.. ఏప్రిల్‌లో మొదలు కానున్న కొత్త ఆర్థిక సంవత్సరంలో రూ.2,27,629 కోట్లకు తగ్గించనున్నట్లు అంచనా. ఎరువులకు అందించనున్న వార్షిక సబ్సిడీ వ్యయాన్ని రూ.1,70,805 కోట్లకు కుదించారు.



టెలికాంకు రూ.73,990 కోట్లు

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్‌కి మూలధన కేటాయింపులు గణనీయంగా పెంచడం వల్ల, టెలికాం మంత్రిత్వ శాఖకు బడ్జెట్ కేటాయింపులను రూ.73,990 కోట్లు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. పెరిగిన కేటాయింపులు.. భారత్ నెట్, బీఎస్ఎన్ఎల్ మూలధన అవసరాలు, స్పెక్ట్రమ్ వ్యయం, నెట్‌వర్క్ విస్తృతి, అంతర్గత అవసరాలను తీర్చడం వంటి వివిధ ప్రాజెక్టులకు నిధులు పెంచినట్లు టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.53,000 కోట్లతో పోలిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో టెలికాంకు కేటాయింపులు 40% పెరిగి రూ.73,990 కోట్లకు చేరాయని తెలిపారు.

ఎవరేమన్నారంటే?



'వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి మేలైన గమ్యస్థానంగా భారత్ సాధించిన కీర్తిని ఈ బడ్జెట్ బలోపేతం చేస్తుంది. ఆర్థిక రంగ పురోగమనానికి శక్తిని అందిస్తుంది. ఉత్పాదక రంగం నుంచి మౌలిక సదుపాయాల వరకూ, వైద్యం నుంచి పర్యాటకం వరకూ, గ్రామీణాభివృద్ధి నుంచి కృత్రిమ మేధ వరకూ, క్రీడలు వంటి అన్ని రంగాల్లో వికసిత భారత్ ఆశయం సాధించేందుకు ఉపయోగపడే బడ్జెట్ ఇది. ప్రతి గ్రామం, ప్రతి పట్టణం, ప్రతి నగరానికి చెందిన యువత, మహిళలు, రైతుల కల్ని సాకారం చేస్తుందీ బడ్జెట్. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను సాధించాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తోంది. ద్రవ్య లోటును 4.5 శాతం కంటే తక్కువగా ఉంచే లక్ష్యాన్ని నెరవేర్చేలా ఈ పద్దును ప్రవేశపెట్టారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్‌లు కేవలం నినాదాలు కాదని, అవి ప్రభుత్వ సంకల్పాలని ఈ బడ్జెట్ ద్వారా ప్రధాని మోదీ నిరూపించారు. మహాత్మాగాంధీ కల్ని సాకారం చేసేందుకు మహాత్మాగాంధీ గ్రామ్ స్వరాజ్ యోజన ప్రవేశ పెట్టాలని నిర్ణయించడం ముదావహం'.

– అమిత్ షా, కేంద్ర హోం మంత్రి



'మోదీ ప్రభుత్వం ఆలోచనా రాహిత్యంలో కొట్టుమిట్టాడుతోంది. ఈ బడ్జెట్‌లో విధాన దార్శనికత కానీ, రాజకీయ సంకల్పం కానీ లేవు. ప్రభుత్వానికి ఒక విధానమంటూ లేదన్న విషయాన్ని ఈ బడ్జెట్ బహిర్గతం చేసింది. దేశం ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక ఆర్థిక సమస్యలకు ఈ బడ్జెట్ ఎలాంటి పరిష్కారం చూపడం లేదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ వర్గాలకు, పేదలకు ఎలాంటి భరోసా ఇవ్వక పోగా వారి గురించి కనీసం ప్రస్తావించలేదు. రైతుల కోసం అర్థవంతమైన సంక్షేమ మద్దతు కానీ వారి ఆదాయ పెంపుదలకు భరోసా కానీ లేవు. యువతకు ఉపాధి, మహిళల భాగస్వామ్య పెంపుదలకు చర్యలు లేవు. ద్రవ్యోల్బణం నుంచి పేదలకు, మధ్యతరగతికి ఎలాంటి ఊరట లేదు. ఆర్థిక సంఘం సిఫార్సులను పక్కనపెట్టి, ఆర్థిక కష్టాల్లో ఉన్న రాష్ట్రాలకు మొండిచేయి చూపారు'


– కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



'ఈ బడ్జెట్ దేశం ఎదుర్కొంటున్న నిజమైన సంక్షోభాల వైపు దృష్టి సారించలేకపోయింది. దేశంలో యువతకు ఉద్యోగాలు లేవు. తయారీ రంగం పతనమవుతోంది. పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. కుటుంబ ఆదాయంలో ఏమీ మిగలడం లేదు. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ దేశాల నుంచి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఈ విషయాలన్నిటినీ పట్టించుకోకుండా వదిలేశారు. సంక్షోభంలో ఉన్న ప్రజలను ఆదుకునే చర్యలు ఇందులో శూన్యం'

– కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

పల్లె వెలుగు




- జీ రామ్ జీకి రూ.95,692 కోట్లు
- ఎండినవాటి స్థానంలో కొత్త కొబ్బరి మొక్కలు
- గ్రామీణ సడక్ యోజనకు మారని కేటాయింపులు
- సహకార సొసైటీలకు పన్ను రాయితీలు
- రాష్ట్రాలతో కలిసి గ్రామీణ పునరుత్తేజ కార్యక్రమం
- పప్పు ధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి

ఉపాధి హామీకి..

ఎంజీ నరేగా స్థానంలో తీసుకువచ్చిన వీబీ జీ రామ్ జీకి రూ.95,692 కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి శాఖకు కేటాయింపులను ప్రస్తుత సంవత్సరం కంటే 3.5% పెంచి రూ.1,94,368.81 కోట్లు చేశారు. గ్రామీణ సడక్ యోజనకు ప్రస్తుత సంవత్సరం మాదిరిగానే రూ.19,000 కోట్లు కేటాయించారు.

గ్రామీణ వికాసానికి, రైతుల ప్రోత్సాహానికి పెద్దపీట వేసేలా వివిధ ప్రతిపాదనల్ని కేంద్ర బడ్జెట్లో ఆవిష్కరించారు. కేవలం వ్యవసాయం పైనే కాకుండా చేపల పెంపకం, పాడి పరిశ్రమ వంటి ఇతర రంగాల ద్వారా కూడా ఆదాయం వచ్చేలా రాయితీలు ఇస్తామని ప్రకటించారు. కొత్త ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1,62,671 కోట్లు కేటాయించాలని ప్రతిపాదించారు. ఇది 2025-26 సంవత్సరానికి సవరించిన అంచనాల మొత్తమైన రూ.1,51,853 కోట్ల కంటే 7.12% ఎక్కువ. ఉత్పాదకత పెంపు ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడానికి లక్షిత ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా తెలిపారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు మించిన ఆదాయం వేర్వేరు రంగాల నుంచి వచ్చేలా చర్యలు చేపట్టామని చెప్పారు. ఆమె చెప్పిన ప్రకారం..



ఈఈజడ్‌లో మత్స్య సంపదకు సుంకం ఉండదు



సముద్రంలో 'ప్రత్యేక ఆర్థిక మండలి' (ఈఈజడ్) పరిధిలోని జలాల్లో భారతదేశ నౌకలు పట్టే మత్స్య సంపదపై ఎలాంటి సుంకం ఉండదు. ఈ మత్స్య సంపదను విదేశీ ఓడరేవులకు చేరిస్తే మాత్రం ఇది అక్కడికి ఎగుమతి అయిన సరకుగా పరిగణిస్తారు. మన ప్రాదేశిక జలాలకు వెలుపల పట్టే మత్స్య సంపదకు ఆర్థిక విలువను భారతీయ మత్స్యకారులు పొందేలా ఈ ఏర్పాటు చేశారు. ఇది దుర్వినియోగం కాకుండా తగిన రక్షణ చర్యలు ప్రతిపాదించారు.

- సముద్ర ఆహార ఉత్పత్తుల్ని ఎగుమతి చేసేవారికి 'సుంకాల్లేని దిగుమతుల విలువ'ను ప్రభుత్వం పెంచనుంది. మునుపటి ఆర్థిక సంవత్సరంలో చేసిన ఎగుమతుల్లో ఒక శాతం వరకు ఉన్నదాన్ని ఇప్పుడు 3% చేస్తున్నారు.

పశువైద్యానికి మరో 20 వేల మంది

పేద, బలహీనవర్గాలు సహా రైతుల ఆదాయంలో 16% వరకు పశుసంపద ద్వారా వస్తోంది. అందువల్ల మరో 20 వేల మంది పశుసంవర్ధక వృత్తి నిపుణులు అందుబాటులోకి వచ్చేలా రుణ ఆధారిత పెట్టుబడి రాయితీ పథకం కొత్తగా అమలు చేస్తారు. ఆ మేరకు వెటర్నరీ కళాశాలలు, పశువైద్య ఆసుపత్రులు, రోగ నిర్ధారణ కేంద్రాలు, సంతానోత్పత్తి సదుపాయాలు ప్రైవేటు రంగంలో వచ్చేందుకు పథకం తోడ్పాటు అందిస్తుంది.

- కొబ్బరి, గంధం, జీడి, బాదం, అక్రోటు, కోకో సాగుపై దృష్టి కేంద్రీకరిస్తారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెంచుతారు. పాత, దిగుబడినివ్వని కొబ్బరి చెట్ల స్థానే కొత్తరకం కొబ్బరి మొక్కల్ని నాటే పథకాన్ని చేపడతారు. గంధం చెట్ల పెంపకంలో మునుపటి వైభవాన్ని తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- బీడీల తయారీకి వాడే తునికాకుపై 'మూలం వద్ద పన్ను మినహాయింపు' (టీసీఎస్)ను 2 శాతానికి తగ్గిస్తారు.

సొసైటీలకు సహకారం

పశువుల దాణా, పత్తిగింజల సరఫరాలో ఉన్న సహకార సొసైటీలకు పన్ను రాయితీలు లభించనున్నాయి. ప్రస్తుతం పాలు, నూనెగింజలు, పళ్లు, కూరగాయలు వంటివి సరఫరా చేసే ప్రాథమిక సహకార సొసైటీలకే ఇలాంటి మినహాయింపులు ఉన్నాయి.

- అంతర్ సహకార సొసైటీ డివిడెండ్ ఆదాయంపై కొత్త ఐటీ చట్టం కిందపన్ను మినహాయింపు లభిస్తుంది.
- గుర్తింపు పొందిన జాతీయ సహకార సమాఖ్య ఈ ఏడాది జనవరి 31లోగా కంపెనీల్లో పెట్టే పెట్టుబడులపై వచ్చే ఆదాయానికి మూడేళ్లపాటు పన్ను మినహాయింపు ఉంటుంది. సభ్య సొసైటీలకు ఇచ్చే డివిడెండ్లకు ఇది వర్తిస్తుంది.
- సహకార సొసైటీలకు ఉన్న ఆదాయపు పన్ను శ్లాబుల్లో మార్పు లేదు.

రాష్ట్రాలతో కలిసి ధన ధాన్య కృషి యోజన

ఆకాంక్షిత జిల్లాల స్ఫూర్తితో రాష్ట్రాలతో కలిసి 'ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన'ను చేపట్టనున్నారు. తక్కువ దిగుబడులు వస్తున్న 100 జిల్లాల్లో ఇప్పుడున్న పథకాలను, ప్రత్యేక చర్యల్ని కలిపి దీనిని అమలు చేస్తారు. ఉత్పత్తి, పంటల వైవిధ్యం, కోతల తర్వాత నిల్వ, సాగునీటి సదుపాయాలు, రుణ పరపతి పెంచడం దీని లక్ష్యం. దాదాపు 1.7 కోట్ల మందికి ఇది ఉపయోగపడనుంది. వ్యవసాయానికి అండదండలిచ్చి, వలసల అవసరం తగ్గేలా చూస్తారు.


- పప్పు ధాన్యాలకు, ముఖ్యంగా- కంది పప్పు, మినపపప్పు, ఎర్ర కందిపప్పులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆరేళ్ల స్వయంసమృద్ధి సాధించడానికి 'పప్పుల్లో ఆత్మనిర్భరత' మిషన్‌ను ప్రారంభిస్తారు.
- ఆదాయం పెరగడంతో కూరగాయలు, పండ్లు, శ్రీ-వరి వినియోగం కూడా పెరుగుతోంది. వీటి ఉత్పత్తిని పెంచే సమగ్ర కార్యక్రమం చేపడతారు.
- బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటు
- పత్తిరైతుల కోసం ప్రత్యేక మిషన్
- 7.7 కోట్ల మంది రైతులు, మత్స్యకారులు, పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా ఇచ్చే స్వల్పకాలిక రుణాలు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంపు

500 జలాశయాల అభివృద్ధి

దేశీయంగా మత్స్య పరిశ్రమకు ఊతమివ్వడానికి 500 జలాశయాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తారు. అమృత్ సరోవర్లను తీర్చిదిద్దుతారు. అంకురాలు, మహిళా గ్రూపులు, చేపలసాగు రైతుల ఉత్పత్తుల సంస్థల ద్వారా విలువ పెంచే గొలుసుకట్టు వ్యవస్థను తీర ప్రాంతాల్లో బలోపేతం చేస్తారు.

బహుళ భాషల్లో భారత్-విస్తార్

రైతులకు కావాల్సిన సలహాలను వారివారి భాషల్లో ఇచ్చేందుకు వీలుగా ఏఐ ఆధారిత 'భారత్-విస్తార్' సాధనం అందుబాటులోకి వస్తుంది. ఉత్పాదకత పెంచడానికి, రైతులు మెరుగైన నిర్ణయాలు తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది.





ముఖ్య విశేషాలు

- ఆదాయపు పన్ను రేట్లు యథాతథం.
- ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 అమలు.
- ఫ్యూచర్స్‌పై సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) 0.02 శాతం నుంచి 0.05 శాతానికి; ఆప్షన్స్ ప్రీమియం, ఆప్షన్స్‌పై ఎస్‌టీటీ 0.01శాతం నుంచి వరుసగా 0.15 శాతం, 0.125శాతానికి పెంపు.
- విదేశీ టూర్ ప్యాకేజీలపై మూలం వద్ద పన్ను వసూలు(టీసీఎస్) 2శాతానికి తగ్గింపు.
- విదేశీ విద్యపై విధించే టీసీఎస్, లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ కింద వైద్య చికిత్సల వ్యయాలపై విధించే పన్నులు 2 శాతానికి కుదింపు.
- వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే పన్ను పరిధిలోని వస్తువులపై సుంకం 20శాతం నుంచి 10శాతానికి తగ్గింపు.
- క్యాన్సర్ రోగుల చికిత్సకు వినియోగించే 17 రకాల ఔషధాలపై కస్టమ్స్ సుంకం మినహాయింపు. ఏడు రకాల అరుదైన వ్యాధుల చికిత్సకు వినియోగించే ఔషధాలు, ఆహారాలపై దిగుమతి సుంకాల తొలగింపు.
- అరుదైన ఖనిజాల శుద్ధికి వినియోగించే వస్తువుల దిగుమతిపై సుంకాల తగ్గింపు.
- పౌర, శిక్షణ, ఇతర విమానాల తయారీకి వినియోగించే పరికరాలు, భాగాల దిగుమతులపై మౌలిక సుంకం మినహాయింపు.
- మైక్రోవేవ్ అవెన్స్ తయారీలో ఉపయోగించే కొన్ని రకాల విడి భాగాలకు మౌలిక సుంకాల నుంచి మినహాయింపు.
- ఆడిట్ చేయని వ్యాపారాలకు సంబంధించిన ఐటీఆర్ దాఖలు గడువు ఒక నెల పొడిగింపు. ఆగస్టు 31వరకు ఐటీఆర్ దాఖలుకు అవకాశం.
- భారత్‌లో నెలకొల్పిన డేటా సెంటర్ల నుంచి అంతర్జాతీయంగా సేవలు అందించే విదేశీ కంపెనీలకు 2047 సంవత్సరం వరకు పన్ను మినహాయింపు.
- కంపెనీలలో మైనారిటీ వాటాదారుల ప్రయోజనాల పరిరక్షణ నిమిత్తం... బైబ్యాక్ షేర్లపై క్యాపిటల్ గెయిన్స్ కింద కార్పొరేట్ ప్రమోటర్స్‌పై 22శాతం, నాన్‌కార్పొరేట్ ప్రమోటర్స్‌పై 30శాతం పన్ను విధింపు.
- 2027 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో ద్రవ్యలోటు 4.3శాతానికి కట్టడి. గత ఏడాది ద్రవ్యలోటు 4.4శాతం.
- మొత్తం బడ్జెట్ పరిమాణం రూ.53.5 లక్షల కోట్లు
- పన్ను రాబడుల అంచనా రూ.28.7 లక్షల కోట్లు
- మార్కెట్ల నుంచి తీసుకునే రుణాల అంచనా రూ.17.2 లక్షల కోట్లు. సెక్యూరిటీస్ రుణాల అంచనా రూ.11.7లక్షల కోట్లు
- పట్టాలపైకి సంస్కరణల ఎక్స్‌ప్రెస్. 350కి పైగా సంస్కరణలు.
- పన్నుల్లో రాష్ట్రాల వాటా కింద పంపిణీ చేయనున్న మొత్తం రూ.1.4 లక్షల కోట్లు
- 2026-27లో...జీడీపీలో మొత్తం రుణాల నిష్పత్తి 55.6శాతం. 2025-26లో అది 56.1శాతం
- మూడు కర్తవ్యాలపై బడ్జెట్ ప్రధాన దృష్టి. అవి..అభివృద్ధిని వేగిరపరిచి సుస్థిరం చేయడం. ప్రజల ఆకాంక్షల సాకారం..వారి సామర్థ్యాల పెంపు. అందరితో కలిసి-అందరి వికాసం.
- 2047నాటికి జీడీపీలో 10శాతం వాటా కలిగి ఉండేలా సేవల రంగాన్ని వృద్ధి చేయడానికి ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ.
- సరకు రవాణా కోసం తూర్పున డాంకునీ నుంచి పడమర సూరత్ వరకు ప్రత్యేక రైల్వే మార్గం.
- వచ్చే ఐదేళ్లలో కొత్తగా 20 జాతీయ జల మార్గాల నిర్మాణం.
- ముంబయి-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, దిల్లీ-వారణాశి, వారణాసి-సిలిగుడి మధ్య మొత్తం 7 హైస్పీడ్ రైల్ కారిడర్ల అభివృద్ధి.
- మన దేశాన్ని వైద్య పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ఐదు ప్రాంతీయ వైద్య కేంద్రాల ఏర్పాటు
- మూడు అఖిల భారత ఆయుర్వేద సంస్థల ఏర్పాటుకు ప్రతిపాదన.
- ప్రధాన పారిశ్రామిక, లాజిస్టిక్ కారిడర్ల సమీపంలో ఐదు విశ్వవిద్యాలయాల టౌన్‌షిప్పులు నెలకొల్పాలని నిర్ణయం
- వ్యవసాయదారుల ఆదాయాన్ని పెంచే కార్యక్రమాల్లో భాగంగా 500 రిజర్వాయర్లు, అమృత్ సరోవర్ల అభివృద్ధి
- దివ్యాంగజనుల కోసం దివ్యాంగజన్ కౌశల్ యోజన. ఐటీ, హాస్పిటాలిటీ, ఆహారపానీయాల రంగాలలో ఉపాధికల్పన.
- సమీకృత ఈస్ట్‌కోస్ట్ పారిశ్రామిక నడవా అభివృద్ధిలో భాగంగా ఐదు పూర్వోదయ రాష్ట్రాల్లో ఐదు పర్యాటక కేంద్రాల అభివృద్ధి. 4వేల ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు.
- బుద్ధిస్ట్ సర్క్యూట్స్ అభివృద్ధిలో భాగంగా అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపుర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల కోసం ప్రత్యేక పథకం.

ద్రవ్యలోటు భర్తీకి రూ.17 లక్షల కోట్ల అప్పు



జీడీపీలో 4.3 శాతంగా ఉన్న ద్రవ్య లోటును పూరించడానికి రానున్న ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం రూ.17.2 లక్షల కోట్లను అప్పుగా తీసుకునే అవకాశముంది. సెక్యూరిటీల నుంచి నికరంగా వచ్చే మార్కెట్ అప్పులు రూ.11.7 లక్షల కోట్లు కాగా మిగిలినవి చిన్న పొదుపు మొత్తాలు, ఇతర ఆదాయాల ద్వారా రానున్నాయి.

పీఎఫ్ ట్రస్టులకు యాజమాన్య చెల్లింపు నిబంధనల్లో మార్పు

ఉద్యోగుల భవిష్యనిధి అవసరాలు తీర్చేందుకు సంస్థలు ఏర్పాటు చేసుకునే పీఎఫ్ ట్రస్టులకు యాజమాన్యాలు చెల్లించే మొత్తాలకు సంబంధించిన నిబంధనల్ని హేతుబద్ధీకరించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం వెల్లడించారు. ఈ ట్రస్టులకు యాజమాన్యాలు జరిపే చెల్లింపులు సామ్యత, పర్సెంటేజీ ప్రాతిపదికన ఉండాలన్న నిబంధనను రద్దు చేయనున్నట్టు ఆమె ప్రకటించారు. వ్యాపార నిర్వహణలో సానుకూలత పెంపొందించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న కొన్ని పీఎఫ్ ట్రస్టులకు కేంద్ర ప్రభుత్వం సంస్థ అయిన ఈపీఎఫ్‌వో, ఆదాయపుపన్ను శాఖ గుర్తింపునిచ్చాయి. పీఎఫ్ ట్రస్టుల నిర్వహణ ఒకరి నియంత్రణలోనే సాగడానికి తాజా నిర్ణయం దోహద పడతుందని ఈపీఎఫ్‌వో అధికారి తెలిపారు.

కర్బన ఉద్గారాల నియంత్రణకు రూ.20 వేల కోట్ల పథకం

వివిధ రంగాల్లో కర్బన ఉద్గారాల నియంత్రణ కోసం రూ.20 వేల కోట్లతో 'కార్బన్ క్యాప్చర్ అండ్ యుటిలైజేషన్' పథకాన్ని ప్రవేశ పెడతామని నిర్మలా సీతారామన్ ప్రకటించారు. సముద్ర విమానాలు ఉత్పత్తిచేసే సంస్థలకు రాయితీ కల్పించి పర్యాటక రంగానికి ఊతమందిస్తామని ఆదివారం బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

ఆర్థికమంత్రి కర్తవ్యపథం..



దిల్లీ: భారతదేశ ఆర్థిక ప్రయాణం స్థిరంగా సాగుతోందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రజల ఆకాంక్షలను ఆచరణలోకి తీసుకొస్తున్నామని, రైతులు, దళిత, ఆదివాసీ సమూహాలకు అభివృద్ధి ఫలాలు చేరాలన్నారు. మూడు కర్తవ్యాల స్ఫూర్తిగా 2026-27 బడ్జెట్‌ను కర్తవ్యభవన్‌లో రూపొందించినట్లు పేర్కొన్నారు

మొదటి కర్తవ్యం

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దేశంలో ఉత్పాదకత, పోటీతత్వాన్ని పెంచి సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం. దీనిలో భాగంగా ఈ ఆరు రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి తెలిపారు.

1. ఏడు వ్యూహాత్మక, నిర్దేశిత రంగాల్లో ఉత్పాదకతను వేగవంతం చేయడం
2. పారిశ్రామిక రంగాన్ని పునరుజ్జీవింపజేయడం
3. 'ఛాంపియన్ ఎస్ఎంఎస్ఎంఈ'ల కోసం ప్రత్యేక కార్యాచరణ
4. మౌలిక సదుపాయాల కల్పనకు బలమైన ఊతం
5. దీర్ఘకాలిక ఇంధన భద్రత, స్థిరత్వం
6. నగర ప్రాంత ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి

వీటికి అనుబంధంగా మరికొన్ని ప్రతిపాదనలనూ, ఆర్థికమంత్రి చేశారు. అవి.. హైటెక్ టూల్ రూమ్స్ ఏర్పాటు, పరిశ్రమలకు విద్యాసంస్థల అనుసంధానం. మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటు. 5 సూత్రాలతో ప్రత్యేక కార్యక్రమం. టెక్స్‌టైల్ రంగం కోసం వచ్చే ఐదేళ్లకు రూ.10వేలకోట్లు. జౌళి ఉత్పత్తుల అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ. రూ.10వేల కోట్లతో వచ్చే ఐదేళ్లకు బయో ఫార్మా శక్తి పథకం. ఫార్మా విద్య, పరిశోధనకు జాతీయస్థాయిలో మూడు కొత్త విద్యాసంస్థల స్థాపన

రెండో కర్తవ్యం..

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, వారి శక్తి సామర్థ్యాలను పెంపొందించి సుసంపన్న భారత్ దిశగా అడుగులు వేసేలా చేయడం. గత పదేళ్ల కాలంలో దేశంలో స్థిరమైన ప్రభుత్వం, సంస్కరణల కారణంగా సుమారు 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించారు.

- ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో మెడికల్ టూరిజం సర్వీసులు
- ఐదు రీజినల్ మెడికల్ హబ్స్ ఏర్పాటు
- ఆయుష్ కేంద్రాల అప్‌గ్రెడేషన్, సంప్రదాయ వైద్య పరిశోధనకు జామ్‌నగర్‌లో పరిశోధన కేంద్రం ఏర్పాటు
- ప్రైవేటు రంగంలో పశువైద్య, డయాగ్నస్టిక్స్ ఏర్పాటుకు ప్రోత్సాహం
- యువత కోసం వైద్య రంగంలో కొత్త కోర్సుల ఏర్పాటు
- యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్ రంగాలకు చేయూత
- నేషనల్ డిజిటల్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు
- ఖేలో ఇండియా మిషన్‌లో భాగంగా క్రీడాభివృద్ధి

మూడో కర్తవ్యం

'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' విజన్‌తో దేశంలోని ప్రతి కుటుంబం, వర్గం, మతం, రంగానికి వనరులు, సదుపాయాలు, అవకాశాలను అందిస్తూ అభివృద్ధిలో అర్థవంతమైన భాగస్వాములుగా చేయడం.

- రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం
- దివ్యాంగుల కోసం దివ్యాంజన్ కౌశల్ యోజన, దివ్యాంగ్ సహకార యోజన
- మానసిక వ్యాధుల చికిత్సకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్(నిమ్‌హాన్స్)-2. రాంచీ, తేజ్‌పుర్‌లలో నేషనల్ మెంటల్ హెల్త్ ఇనిస్టిట్యూట్ అప్‌గ్రెడేషన్
- భారత్ విస్తార్ (వర్చువల్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సెస్ అగ్రికల్చర్ రిసోర్స్) వ్యవసాయ రంగానికి కృత్రిమ మేధను అనుసంధానం చేయడం ద్వారా ఉత్పత్తి పెంపు, మదింపు చేసి, రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకునేలా ప్రోత్సహించడం
- తూర్పు ప్రాంతంలోని 5 పూర్వోదయ రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి, ఇందు కోసం 4వేల ఇ-బస్‌లను అందించటం
- అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపూర్, మిజోరం, త్రిపుర రాష్ట్రాల్లో బుద్ధిస్ట్ సర్క్యూట్ అభివృద్ధి

మొదటి రెండు కర్తవ్యాలు దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తే, మూడో కర్తవ్యం ద్వారా 2047 నాటికి సమగ్రాభివృద్ధితో వికసిత్ భారత్‌గా మారడానికి మార్గాన్ని సుగమం చేస్తుందని బడ్జెట్ ప్రసంగం సందర్భంగా నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.



చరిత్ర సృష్టించిన నిర్మలమ్మ

వరసగా తొమ్మిదోసారి కేంద్ర బడ్జెట్టును ప్రవేశపెట్టిన కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ఆదివారం రికార్డు సృష్టించారు. వేర్వేరు పదవీకాలాల్లో పదిసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ రికార్డుకు ఆమె చేరువవుతున్నారు. 1959-64 మధ్య ఆరుసార్లు, 1967-69 మధ్య నాలుగుసార్లు మొరార్జీకి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం లభించింది. కేంద్ర మాజీ మంత్రుల్లో పి.చిదంబరం 9 సార్లు, ప్రణబ్ ముఖర్జీ 8 సార్లు వేర్వేరు ప్రభుత్వాల్లో బడ్జెట్లు సమర్పించారు. అందువల్ల వరసగా తొమ్మిదేళ్లు, అదీ ఒకే ప్రధాని (నరేంద్రమోదీ) హయాంలో కేంద్ర పద్దు సమర్పించిన ఘనత మాత్రం నిర్మలదే అవుతుంది.

రాష్ట్రపతితో భేటీ

పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రపతి భవన్‌కు తన బృందంతో నిర్మలా సీతారామన్ చేరుకుని ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్మును లాంఛనంగా కలిసి, బడ్జెట్ పత్రాలు అందజేశారు. మంత్రికి అభినందనలు తెలిపి, చక్కెర కలిపిన పెరుగు (దహీ చీనీ)ని శుభానికి సంకేతంగా రాష్ట్రపతి తినిపించారు. బడ్జెట్‌కు క్యాబినెట్ ఆమోదం తర్వాత ఉదయం 11 గంటలకు మంత్రి లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టారు.

కాంచీపురం చీరలో..

బడ్జెట్ సమర్పణ వేళ నిర్మలా సీతారామన్ ధరించే చీరలపైనా అందరి దృష్టి ఉంటుంది. చేనేత చీరలంటే మక్కువ చూపించే నిర్మలమ్మ ఈసారి కాంచీపురం చీరలో కనిపించారు.

జనగణనకు రూ.6 వేల కోట్లు


జనగణన సంబంధ కార్యక్రమాల కోసం కేంద్ర ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో రూ.6 వేల కోట్లు కేటాయించింది. 2025-26లో సవరించిన అంచనాల (రూ.1,040 కోట్లు) కన్నా ఇది దాదాపు ఆరు రెట్లు అధికం కావడం గమనార్హం. భారత రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీఐ), జనగణన కమిషనర్ కార్యాలయానికి సంబంధించిన ఖర్చులతో పాటు, జాతీయ జనాభా పట్టిక(ఎన్‌పీఆర్) సహా ఆర్‌జీఐ చేపట్టే వివిధ కార్యక్రమాలు, 2027లో నిర్వహించే జనగణన వ్యయాల కోసం వీటిని కేటాయించినట్లు బడ్జెట్ పత్రంలో పేర్కొంది. 2021లో చేపట్టాల్సిన జనగణన కొవిడ్ కారణంగా వాయిదా పడిన సంగతి తెలిసిందే.



జిల్లాకో బాలికల వసతిగృహం

బాలికా విద్యను ప్రోత్సహించేందుకు దేశంలోని ప్రతి జిల్లాలో బాలికల వసతిగృహం ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఉన్నత విద్యలో ముఖ్యంగా స్టెమ్ విద్యాసంస్థల్లో సుదీర్ఘమైన అధ్యయనాలు, ప్రయోగశాలల్లో ఉండే విద్యార్థినులకు ఇబ్బందులు తలెత్తకుండా హాస్టళ్ల ఏర్పాటు పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. దీని ప్రకారం దేశంలో 700కుపైగా ఉన్న జిల్లాల్లో వసతిగృహాలు ఏర్పాటు కానున్నాయి.

మహిళా స్వయం సహాయక సంఘాలలోని సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం కోసం కమ్యూనిటీ యాజమాన్యంలో రిటైల్ దుకాణాల(షీమార్ట్‌ల) ఏర్పాటుకు ప్రతిపాదించారు.



పరిశ్రమలతో విద్య అనుసంధానం

అభివృద్ధి చెందిన పలు దేశాల్లో ఎప్పటి నుంచో అమలులో ఉన్న విశ్వవిద్యాలయ పట్టణాలు (యూనివర్సిటీ టౌన్‌షిప్స్) మన దేశంలోనూ త్వరలో ఏర్పాటు కానున్నాయి. పరిశ్రమలు-విద్యారంగం మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి వాటి మధ్య వారధిగా ఇవి ఉపయోగపడనున్నాయి. 2026-27 కేంద్ర బడ్జెట్ ఇటువంటి ఐదు విశ్వవిద్యాలయ పట్టణాలను ప్రతిపాదించింది. ప్రధానమైన పరిశ్రమలు, లాజిస్టిక్స్ నడవాలకు సమీపంలో నెలకొల్పే వీటిని ప్రత్యేక విద్యా మండళ్లుగా వ్యవహరించవచ్చు. పలు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు, నైపుణ్య కేంద్రాలు, నివాస ప్రాంగణాలు అన్నీ ఒకేచోట కొలువుదీరేలా చేయడమే విశ్వవిద్యాలయ పట్టణాల లక్ష్యం. తద్వారా పరిశ్రమల అవసరాలకు తగిన విధంగా విద్యార్థులను తీర్చిదిద్ది ఉపాధి కల్పనకు ఇవి దోహదపడనున్నాయి. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ (ఐఐసీటీ-ముంబయి) ద్వారా 15 వేల ఉన్నత పాఠశాలలు, 500 కళాశాలల్లో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ (ఏవీజీసీ) కంటెంట్ క్రియేటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనుంది. మొత్తంగా విద్యారంగానికి 2026-27లో మొత్తం రూ.1.39 లక్షల కోట్లు కేటాయించగా రూ.55,727 కోట్లను ఉన్నత విద్య కోసం కేంద్రం ఖర్చు చేయనుంది.



- ఆస్ట్రోఫిజిక్స్, ఆస్ట్రానమీ రంగాలను ప్రోత్సహించడానికి 4 కొత్త టెలిస్కోప్ ఇన్‌ఫ్రా వసతులను ఏర్పాటు చేయడం.
- తూర్పు భారతంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడీ)ను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు.

సేవారంగంలో 10 శాతం వాటా లక్ష్యంగా..

2047 నాటికి స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో సేవా రంగం వాటా 10 శాతానికి చేరుకోవాలనే లక్ష్యంతో 'ఎడ్యుకేషన్ టు ఎంప్లాయ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రైజ్' పేరుతో అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు.



లోక్‌సభలో బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం రాష్ట్రపతిభవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో భేటీ అయ్యారు. సంప్రదాయం ప్రకారం.. నిర్మలకు రాష్ట్రపతి 'దహీ చీనీ' (చక్కెర కలిపిన పెరుగు) తినిపించారు.

గర్జించిన రక్షణ



- గత ఏడాదితో పోలిస్తే 15 శాతం పెరిగిన కేటాయింపులు
- సైనిక ఆధునికీకరణకు పెద్దపీట

ఆపరేషన్ సిందూర్ అనంతరం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులను కేంద్రం భారీగా పెంచింది. పాకిస్థాన్, చైనాలతో భద్రతా సవాళ్లు కొనసాగుతున్న తరుణంలో సైనిక పోరాట సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఈ చర్యను చేపట్టింది. 2026-27 బడ్జెట్‌లో రక్షణ రంగానికి రూ.7,84,678 కోట్లు కేటాయించింది. గత ఏడాది కేటాయింపుల (రూ.6.81 లక్షల కోట్ల)తో పోలిస్తే ఇది 15 శాతం అధికం. ఈ దఫా ప్రధానంగా ఆధునికీకరణకు పెద్దపీట వేశారు. ప్రభుత్వం 2026-27లో చేయదలిచిన వ్యయంలో రక్షణ వాటా 14.67 శాతంగా ఉంది. మంత్రిత్వ శాఖలన్నింటిలోకీ ఇదే అత్యధికం. మొత్తంమీద గత 26 ఏళ్లలో రక్షణ బడ్జెట్ 40 శాతం పెరిగింది.

- మొత్తం కేటాయింపుల్లో రూ.2,19,306 కోట్లను మూలధన వ్యయం కింద కేటాయించారు. ఈ సొమ్మును కొత్త ఆయుధాలు, యుద్ధవిమానాలు, యుద్ధనౌకలు, ఇతర సైనిక సాధన సంపత్తి కొనుగోలుకు వినియోగిస్తారు. గత ఏడాది బడ్జెట్‌లో ఈ పద్దు కింద రూ.1.80లక్షల కోట్లను కేటాయించగా సవరించిన అంచనాలను రూ.1,86,454 కోట్లకు పెంచారు. 2025-26 బడ్జెట్ అంచనాలతో పోలిస్తే తాజాగా కేటాయించిన మూలధన వ్యయం 21.84% అధికం.
- మూలధన వ్యయం కింద విమానాలు, ఏరో ఇంజిన్ల కొనుగోలుకు రూ.63,733 కోట్లు కేటాయించారు. నౌకాదళ ఆధునికీకరణ అవసరాల కోసం రూ.25,023 కోట్లు ప్రత్యేకించారు.
- రెవెన్యూ వ్యయం కింద రూ.5,53,668 కోట్లను కేటాయించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 17.24 శాతం అధికం. దళాల రోజువారీ కార్యకలాపాలు, వేతనాలు, ఇంధనం, రేషన్, ఆయుధాల నిర్వహణ, మందుగుండు వంటి అవసరాలకు ఈ సొమ్మును వెచ్చిస్తారు. ఇందులోనే పింఛన్ల కోసం రూ.1,71,338 కోట్లను కేటాయించారు.
- మూలధన వ్యయ కేటాయింపుల్లో 75 శాతాన్ని (రూ.1.39 లక్షల కోట్లు) దేశీయ పరిశ్రమల నుంచి చేసే కొనుగోళ్లకు మాత్రమే వెచ్చించాలని నిర్ణయించారు.


మరింత బలోపేతం


బడ్జెట్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పందించారు. "ఆపరేషన్ సిందూర్‌లో చరిత్రాత్మక విజయం తర్వాత రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించాం. భద్రత, అభివృద్ధి, ఆత్మనిర్భర్‌ను సమతౌల్యం చేస్తూ ఈ బడ్జెట్‌ను సిద్ధం చేశారు" అని అన్నారు.



తాజాగా త్రివిధ దళాల ఆధునికీకరణకు రూ.1.85 లక్షల కోట్లను కేటాయించారని, మునుపటి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 24 శాతం అధికమని పేర్కొన్నారు. దీనివల్ల మన సైనిక సామర్థ్యం మరింత బలోపేతమవుతుందన్నారు.

- పౌర, శిక్షణ, ఇతర అవసరాలకు ఉపయోగించే విమానాల తయారీకి అవసరమైన భాగాల దిగుమతులను బేసిక్ కస్టమ్స్ సుంకం నుంచి మినహాయించారు. అలాగే రక్షణ రంగంలో నిర్వహణ, మరమ్మతుల అవసరాలకు ఉపయోగపడే విమాన భాగాల తయారీకి దిగుమతి చేసుకునే ముడిపదార్థాలపైనా ఈ సుంకాన్ని తొలగించారు. ఈ రెండు నిర్ణయాల వల్ల రక్షణ ఏరోస్పేస్ రంగానికి ఊతం లభిస్తుందని భావిస్తున్నారు.
- సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. సరిహద్దు రహదారి సంస్థ (బీఆర్‌వో)కు రూ.7,394 కోట్లు కేటాయించారు.
- రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో)కు గత బడ్జెట్‌లో రూ.26,816.82 కోట్లు కేటాయించగా. . ఈ దఫా దాన్ని రూ.29,100 కోట్లకు పెంచారు. ఇందులో రూ.17,250.25 కోట్లను మూలధన వ్యయం కోసం ప్రత్యేకించారు.
- మాజీ సైనికోద్యోగుల కంట్రిబ్యూటరీ ఆరోగ్య పథకానికి గత ఏడాదితో పోలిస్తే 45.49 శాతం పెంచి, రూ.12,100 కోట్లను కేటాయించారు.





బయోఫార్మా శక్తి

దేశాన్ని బయోఫార్మా హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'బయోఫార్మా శక్తి' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకురానుంది. దీని కింద ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆర్థికమంత్రి పేర్కొన్నారు. 1,000 క్లినికల్ ట్రయల్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌ఓ)ను పటిష్ఠపరుస్తారు. వైద్య పర్యాటకాన్ని ప్రోత్సహించేలా దేశంలో 5 మెడికల్ హబ్‌లను ఏర్పాటు చేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వీటిని వైద్య చికిత్సలు, పరిశోధన, వైద్య విద్యలకు కేంద్రాలుగా తీర్చిదిద్దుతారు. ఈ హబ్‌లు ఏర్పాటు చేసే రాష్ట్రాలకు సహకారం అందించనున్నారు. మొత్తంగా కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖకు బడ్జెట్‌లో రూ.1.06 లక్షల కోట్లు కేటాయించగా.. గత ఏడాదితో పోలిస్తే ఇది 10 శాతం ఎక్కువ. ఈ శాఖలో ప్రధాన పథకాలైన జాతీయ ఆరోగ్య మిషన్‌కు రూ.39,390 కోట్లు, ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన (పీఎంఎస్ఎస్‌వై) పథకానికి రూ.11,307 కోట్లు, ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ పీఎంజేఏవై)కు రూ.9,500 కోట్లు, నేషనల్ టెలి మెంటల్ హెల్త్ మిషన్‌కు రూ.51 కోట్లు, నేషనల్ డిజిటల్ హెల్త్ మిషన్‌కు రూ.350 కోట్లు, హెల్త్ రీసెర్చ్ విభాగానికి రూ.4,821 కోట్లు అందుబాటులోకి రానున్నాయి. ఎయిమ్స్ దిల్లీ, ఐసీఎంఆర్ వంటి స్వతంత్ర సంస్థలకు రూ.22 వేల కోట్లు, ఆయుష్ శాఖకు రూ.4,408.93 కోట్లు కేటాయించారు.

- మూడు కొత్త 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' (నైపర్)లను ఏర్పాటు చేసి బయోఫార్మా పరిశోధనతో అనుసంధానం, ఇప్పటికే ఉన్న ఏడు నైపర్‌ల నవీకరణ.



- క్యాన్సర్‌తో బాధపడేవారికి ఉపశమనం కలిగించేలా 17 ఔషధాలపై బేసిక్ కస్టమ్స్ పన్నుల తొలగింపు
- ఔషధాలకు దిగుమతి సుంకాలను చెల్లించాల్సిన అవసరం లేని అరుదైన రోగాల జాబితాలోకి మరో ఏడింటిని చేర్చుతూ నిర్ణయం
- మూడు 'ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద'ల ఏర్పాటు..
- అలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ (ఏహెచ్‌పీ)లను తీర్చిదిద్దే సంస్థల నవీకరణ.
- రూ.1,000 కోట్లతో రానున్న ఐదేళ్లలో ప్రైవేట్ భాగస్వామ్యంతో లక్ష మందికి శిక్షణ ఇచ్చి ఏహెచ్‌పీలుగా తీర్చిదిద్దడం..
- ఆధార సహిత పరిశోధనల కోసం జాంనగర్‌లో ఉన్న డబ్ల్యూహెచ్‌ఓ గ్లోబల్ ట్రెడిషనల్ మెడిసిన్ కేంద్రం ఆధునికీకరణ.
- వృద్ధుల సంరక్షణకు సుదృఢమైన వ్యవస్థను అభివృద్ధి చేయడం, వచ్చే ఏడాది నాటికి 1.5 లక్షల మందికి వెల్‌నెస్, యోగా, వైద్య పరికరాల వినియోగంపై శిక్షణ ఇవ్వడం.
- జాతీయ ఎయిడ్స్, ఎస్‌టీడీ నియంత్రణ కార్యక్రమాలకు రూ.3,477 కోట్ల కేటాయింపు
- రక్త మార్పిడి సేవల్లో నాణ్యత ప్రమాణాల మెరుగునకు రూ.275 కోట్లు
- పశువైద్య కళాశాలలు, ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ కేంద్రాలకు రుణ సంబంధిత మూలధన రాయితీ పథకం.
- మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఉత్తర భారత దేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్)-2 ఏర్పాటుకు ప్రతిపాదన
- ఝార్ఖండ్‌లోని రాంచీ, అస్సాంలోని తేజ్‌పుర్‌లలో ఉన్న నేషనల్ మెంటల్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌ల నవీకరణ

దివ్యాంగుల సాధికారతే లక్ష్యం..

కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో కృత్రిమ అవయవ తయారీ కార్పొరేషన్ (ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యుఫాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)ను ప్రోత్సహించడం ద్వారా సహాయ పరికరాల ఉత్పత్తిని పెంచాల్సిన ఆవశ్యకతను ప్రతిపాదించారు. కృత్రిమ మేధస్సు, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో అధిక పెట్టుబడులు పెట్టాలని పిలుపునిచ్చారు.



దివ్యాంగజన్ కౌశల్ యోజన : కృత్రిమమేధ (ఏఐ) సాయంతో కృత్రిమ అవయవాల తయారీని ప్రోత్సహించడం 'దివ్యాంగజన్ కౌశల్ యోజన' లక్ష్యం. ఈ పథకం కింద వారికి అనుకూలంగా రూపొందిన పరికరాలు, సేవలను దివ్యాంగులు పొందుతారు. అలాగే దివ్యాంగ సమూహాల నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న దివ్యాంగులకు గౌరవప్రదమైన జీవనోపాధి అవకాశాలు కల్పించేందుకు దీనిని రూపొందించారు.

దివ్యాంగ్ సహారా యోజన : దివ్యాంగుల సహాయక పరికరాల ఉత్పత్తిని పెంచడంలో కృత్రిమ అవయవ తయారీ కార్పొరేషనుకు ఇది అండగా నిలుస్తుంది. కృత్రిమమేధ ఏకీకరణ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో పెట్టుబడులు పెడుతుంది. ఈ పథకం ప్రధానమంత్రి దివ్యాశా కేంద్రాలను బలోపేతం చేయడానికి, వికలాంగులకు సహాయ పరికరాలు సులభంగా అందుబాటులో ఉంచే టెక్నాలజీ మార్టులు, ఆధునిక రీటైల్ తరహా కేంద్రాలను ఏర్పాటు చేయడంలో దోహదపడుతుంది.

ఐబీకి అందలం.. హోంకు ప్రాధాన్యం

కేంద్ర బడ్జెట్‌లో హోంశాఖకు గణనీయ ప్రాధాన్యం లభించింది. ఈ శాఖకు 2025-26లో రూ.2.33 లక్షల కోట్లను కేటాయించగా.. ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.2.55 లక్షల కోట్లు ప్రతిపాదించారు. గత ఏడాదితో పోలిస్తే 9.44 శాతం అధికం.

- హోంశాఖకు చేసిన కేటాయింపుల్లో 'పోలీసు' పద్దు కింద రూ.1.73 లక్షల కోట్లను ప్రత్యేకించారు. మొత్తం హోంశాఖ బడ్జెట్‌లో ఇది 68 శాతం. దీనికింద ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ)తోపాటు సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్ఎఫ్ వంటి కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు, సరిహద్దుల్లో అభివృద్ధి కార్యక్రమాలు, దిల్లీ, జమ్మూకశ్మీర్‌లోని పోలీసు బలగాలకు నిధులు అందుతాయి. 'పోలీసు' పద్దు కింద మూలధన వ్యయాన్ని భారీగా రూ.4,693.28 కోట్లకు పెంచారు.



- అంతర్గత నిఘా కార్యక్రమాలను పర్యవేక్షించే ఐబీకి గత బడ్జెట్‌తో పోలిస్తే ఈ దఫా 63 శాతం మేర నిధులను పెంచి, రూ.6,782.43 కోట్లను కేటాయించారు. ఈ సంస్థ పెట్టుబడి వ్యయాన్ని 9 రెట్లు పెంచి, రూ.2,549.54 కోట్లను ఈ పద్దు కింద ప్రత్యేకించారు.
- సీఆర్పీఎఫ్‌కు 3.39 శాతం మేర కేటాయింపులను పెంచి రూ.38,517 కోట్లను ప్రతిపాదించారు. సరిహద్దు భద్రతా దళానికి రూ.29,567.64 కోట్లు, సశస్త్ర సీమా బల్‌కు రూ.10,984.51 కోట్లు, కేంద్ర పారిశ్రామిక భద్రతా దళానికి (సీఐఎస్ఎఫ్) రూ.15,973.85 కోట్లు, అస్సాం రైఫిల్స్‌కు రూ.8,796.68 కోట్లు కేటాయించారు. 2025-26కు సంబంధించిన సవరించిన అంచనాలతో పోలిస్తే ఈ విభాగాలకు నామమాత్రంగానే కేటాయింపులు పెంచారు.
- వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా సంబంధ వ్యయం, ప్రత్యేక మౌలిక వసతుల పథకానికి రూ.3,610.80 కోట్లను ప్రతిపాదించారు.



అమల్లోకి కొత్త చట్టం.. ట్యాక్స్ ఇయర్

ఆరు దశాబ్దాల నాటి సంక్లిష్ట ఆదాయపు పన్ను నిబంధనలకు కాలం చెల్లనుంది. ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో, ఆదాయపు పన్ను కొత్త చట్టం-2025, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుందని ఆర్థిక మంత్రి ప్రకటించారు. సామాన్య పౌరులూ సులభంగా అర్థం చేసుకుని, అమలు చేసేలా కొత్త నిబంధనలు, ఫారాలను రూపొందించినట్లు ఆమె తెలిపారు. కొత్త పన్ను చట్టంలో పన్ను రేట్లలో ఎలాంటి మార్పులు లేవు. పాత చట్టంలోని వందల సెక్షన్లను కుదించి, 536 సెక్షన్లకు పరిమితం చేశారు.

- గడువు ముగిశాక ఐటీ రిటర్నులు దాఖలు చేసినప్పటికీ, ఎలాంటి రుసుములు లేకుండా టీడీఎస్ రిఫండును క్లెయిం చేసుకునే వెసులుబాటును ఈ కొత్త చట్టం కల్పించనుంది.
- ఇకపై 'ఫైనాన్షియల్ ఇయర్' (ఎఫ్‌వై), అసెస్మెంట్ ఇయర్ (ఏవై) అనే గందరగోళానికి తావుండదు. దాని స్థానంలో నేరుగా 'ట్యాక్స్ ఇయర్' విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఆదాయం ఆర్జించిన ఆర్థిక సంవత్సరానికే పన్ను లెక్కలు ఉంటాయి.
- సామాన్యులూ సులభంగా ఐటీ రిటర్నులు దాఖలు చేసేందుకు వీలుగా, కొత్తగా రూపొందించిన ఇన్‌కంట్యాక్స్ రిటర్నుల ఫారాలను త్వరలోనే నోటిఫై చేయనున్నారు.

మినహాయింపు పెంచలేదు.. శ్లాబులు సవరించలేదు



ఈనాడు బిజినెస్ బ్యూరో: కేంద్ర బడ్జెట్‌లో పన్ను శ్లాబులలో మార్పులుంటాయని, మరో కొత్త పన్ను విధానం వస్తుందని ఊహాగానాలొచ్చాయి. వరసగా తొమ్మిదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్.. పన్ను రేట్లను సవరించకుండా, స్థిరంగా కొనసాగించేందుకే మొగ్గు చూపారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమల్లోకి వస్తుందన్నారు. కొత్త, పాత పన్ను విధానంలో కానీ, శ్లాబుల విషయం గురించి ప్రస్తావించలేదు. ప్రత్యక్ష పన్నులకు సంబంధించి కొన్ని మార్పులను తీసుకొచ్చారు.

విదేశీ ఆస్తుల వెల్లడికి 6 నెలల గడువు


పన్ను చెల్లింపుదారులు తమ విదేశీ ఆస్తులను వెల్లడించేందుకు వీలుగా కేంద్రం ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. విద్యార్థులు, టెక్ నిపుణులు, విదేశాల నుంచి తిరిగొచ్చిన ప్రవాస భారతీయుల కోసం 6 నెలల పాటు 'ఫారిన్ అసెట్ డిస్‌క్లోజర్ స్కీమ్' అందుబాటులో ఉంటుంది.

- ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలులో వెసులుబాటు కల్పిస్తూ గడువును పెంచారు. రివైజ్డ్, అప్‌డేటెడ్ ఐటీ రిటర్నుల దాఖలు గడువును డిసెంబరు 31 నుంచి మార్చి 31 వరకు పొడిగిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. ఐటీఆర్-1, ఐటీఆర్-2 దాఖలు చేసే వ్యక్తులు జులై 31 వరకూ తమ రిటర్నులు దాఖలు చేయొచ్చు.
- రీ-అసెస్మెంట్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాతా పన్ను చెల్లింపుదారులు అదనంగా 10 శాతం పన్ను చెల్లించి 'అప్‌డేటెడ్ రిటర్న్' దాఖలు చేయడానికి అనుమతినిచ్చారు. ఇలా చేసిన తర్వాత అప్‌డేటెడ్ రిటర్న్ ఆధారంగానే రీ-అసెస్మెంట్ జరుగుతుంది.

విదేశీ ప్రయాణాలు, చదువులకు టీసీఎస్ ఊరట



విదేశీ పర్యటనలకు వెళ్లేవారికి, ఇతర దేశాల్లో చదువుకునే పిల్లలకు నిధులు పంపే తల్లిదండ్రులకు కేంద్ర బడ్జెట్ ఊరటనిచ్చింది. విదేశీ ప్రయాణాలతో పాటు విద్య, వైద్య అవసరాల కోసం వినియోగించే మొత్తాలపై 'లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీం (ఎల్ఆర్ఎస్) కింద వసూలు చేసే మూలం వద్ద పన్ను (టీసీఎస్) శాతాన్ని తగ్గిస్తున్నట్లు ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు.



విద్య, వైద్యం: విదేశాల్లో చదువుకోవడానికి లేదా వైద్య చికిత్స కోసం రూ.10 లక్షలకు మించి పంపిస్తే, ప్రస్తుతం 5% టీసీఎస్ వసూలు చేస్తున్నారు. దీనిని 2 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది.

పర్యటనలు: విదేశీ పర్యటనలకు వెళ్లే వారు టూర్ ప్యాకేజీ మాట్లాడుకుంటే రూ.10 లక్షల వరకు 5%, అంతకు మించితే 20% టీసీఎస్ పడుతోంది. ఇకపై ప్యాకేజీ ఎంత అనే పరిమితితో సంబంధం లేకుండా, అన్ని విదేశీ టూర్ ప్యాకేజీలపై టీసీఎస్‌ను 2% చేశారు.

- విదేశీ నిధుల బదిలీలో విద్య, వైద్యం మినహా ఇతర అవసరాల కోసం పంపే నిధులపై పాత రేటు 20% టీసీఎస్ యథాతథంగా కొనసాగుతుంది.
- వ్యాపార లావాదేవీల్లోనూ టీసీఎస్‌ను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. మద్యం, తుక్కు, ఖనిజాల విక్రేతలపై టీసీఎస్ రేటును 2 శాతానికి తీసుకొచ్చింది. తునికాకుపై ప్రస్తుతం ఉన్న 5% టీసీఎస్‌ను 2 శాతానికి తగ్గించింది.

నైపుణ్యాభివృద్ధికి రూ.9,885 కోట్లు

యువతలో నైపుణ్యాభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేసింది. చదువు పూర్తిచేసుకున్న వారు ఉద్యోగం సాధించేందుకు అవసరమైన శిక్షణకు వెచ్చించే నిధులు భారీగా పెంచింది. ఈ మేరకు నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖకు 2026-27 సంవత్సరానికి రూ.9,885.80 కోట్లు కేటాయించింది. ఇది గత ఏడాది బడ్జెట్ అంచనాల కన్నా 62 శాతం ఎక్కువ. ఈ నిధుల్లో కేంద్ర ప్రాయోజిత కార్యక్రమమైన 'పీఎం సేతు'కు రూ.6,140.50 కోట్లు ప్రతిపాదించారు. గత బడ్జెట్‌లో నైపుణ్యాభివృద్ధికి రూ.6,100 కోట్లు కేటాయించగా తాజాగా సవరించిన అంచనాల ప్రకారం ఇది రూ.2,703.54 కోట్లకు చేరింది.



మునుపెన్నడూ లేనంతగా మూలధన వ్యయం

'వికసిత్ భారత్' సంకల్పంతో ముందుకెళ్తున్న మోదీ సర్కారు- మూలధన వ్యయం కోసం మునుపెన్నడూ లేనంత ఎక్కువగా ఈసారి రూ.12.22 లక్షల కోట్లు కేటాయించింది. నిరుటి బడ్జెట్‌లో కేటాయింపుతో పోలిస్తే ఇది 10% అధికం. ప్రస్తుత కేటాయింపు.. జీడీపీలో 4.4 శాతానికి సమానం. జీడీపీలో ఇంత ఎక్కువ శాతాన్ని మూలధన వ్యయం కోసం గతంలో ఎప్పుడూ కేటాయించలేదని నిర్మలా సీతారామన్ తెలిపారు.

అంతరిక్ష విభాగానికి రూ. 13,705 కోట్లు

మానవసహిత అంతరిక్ష యాత్రలు, భూకక్ష్యలో సొంతంగా రోదసి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు తాజా బడ్జెట్‌లో ఊతం లభించింది. అంతరిక్ష విభాగానికి ఈ దఫా రూ.13,705.60 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.13,416 కోట్లతో పోలిస్తే ఇది స్వల్ప పెరుగుదలే. అయితే 2025-26కు సంబంధించిన సవరించిన అంచనాల ప్రకారం అంతరిక్ష విభాగానికి వాస్తవానికి రూ.12,448.60 కోట్లే అందాయి.



- తాజా బడ్జెట్‌లో 'అంతరిక్ష పరిజ్ఞాన' పద్దు కింద రూ.10,397.06 కోట్లను కేటాయించారు. దీనికింద ఇస్రోలోని వివిధ కేంద్రాలకు, వాహకనౌక, ఉపగ్రహ ప్రాజెక్టులకు నిధులు అందుతాయి.
- అంతరిక్ష రంగ కేటాయింపుల్లో రూ.7,329.70 కోట్లను రెవెన్యూ వ్యయం కింద, రూ.6,375.90 కోట్లను పెట్టుబడి వ్యయం కింద ప్రత్యేకించారు.

ఇస్రోకు కేటాయింపులు పెంచడం ముఖ్యమైన సంకేతమని ఇండియన్ స్పేస్ అసోసియేషన్ డైరెక్టర్ జనరల్ ఎ.కె.భట్ పేర్కొన్నారు. ఇస్రో నేతృత్వంలోని ప్రాజెక్టుల్లో ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని మరింతగా ఇది ప్రోత్సహిస్తుందని తెలిపారు. అంతరిక్ష రంగంలోని తయారీ రంగానికి లక్షిత ప్రోత్సాహకాలు, జీఎస్టీ హేతుబద్ధీకరణ, అంతరిక్ష రంగానికి హైబ్రిడ్ పీఎల్ఐ (ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహకాలు), కీలక మౌలికవసతుల రంగంగా లాంఛన గుర్తింపు వంటి నిర్ణయాల అవసరమని శాట్‌కామ్ ఇండస్ట్రీ అసోసియేషన్- ఇండియా అధ్యక్షుడు సుబ్బారావు పావులూరి పేర్కొన్నారు.

దేశంలో 3 కెమికల్ పార్కులు

రసాయనాల రంగంలో దిగుమతులను తగ్గించడమే లక్ష్యంగా దేశంలో మూడు కెమికల్ పార్కులను ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. ప్లగ్ అండ్ ప్లే మోడల్‌లో వీటిని ఏర్పాటు చేయాలని, ముందుకొచ్చిన రాష్ట్రాలకు తగిన సహకారం అందిస్తామని చెప్పింది.

ఇంపోర్టెడ్ వస్తువులపై రూ.75 వేల వరకు సుంకం లేదు


విదేశాల నుంచి సుంకాల భారం లేకుండా రూ.75 వేల విలువైన ఇంపోర్టెడ్ వస్తువులను తీసుకురావచ్చని కేంద్రప్రభుత్వం పేర్కొంది. గతంలో ఇది రూ.50 వేలుగా ఉండేది. సుమారు దశాబ్దం తర్వాత బ్యాగేజ్ రూల్స్-2026ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇవి ఫిబ్రవరి 2 అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయి. దీని ప్రకారం ఇక నుంచి భారత్ లేదా భారత సంతతి వ్యక్తి విదేశాల నుంచి రూ.75 వేల విలువైన వస్తువులను తీసుకువచ్చినా సుంకం లేకుండా అనుమతిస్తారు. విదేశీ పర్యాటకులకు పాత నిబంధనల ప్రకారం.. సుంకాలు పడని వస్తువుల విలువ పరిమితి రూ.15 వేలుండగా దానిని రూ.25 వేలకు పెంచారు.

మంత్రుల జీతాలు, అతిథుల ఖర్చులకు రూ.1,102 కోట్లు

కేంద్ర బడ్జెట్‌లో మంత్రి మండలి, క్యాబినెట్ సచివాలయం, ప్రధాని కార్యాలయం (పీఎంవో), విదేశీ అతిథుల మర్యాదలకు రూ.1,102 కోట్లు కేటాయించారు. గతేడాది కేటాయించిన సవరించిన అంచనాల మొత్తం రూ.978.20 కోట్ల కంటే ఇది అధికం. ఇందులో మంత్రిమండలి ఖర్చులకు రూ.620 కోట్లు వెచ్చిస్తారు. 2025-26లో ఈ మొత్తం రూ.483.54 కోట్లు. మంత్రులు, మాజీ ప్రధానుల జీతభత్యాలు, ప్రయాణాలకు దీన్ని ఖర్చు చేస్తారు. ఇందులోనే వీవీఐపీల ప్రత్యేక విమాన ఖర్చులు కూడా ఉంటాయి.

- జాతీయ భద్రతా మండలి సచివాలయానికి రూ.256.19 కోట్లు కేటాయించారు. గతేడాది ఈ మొత్తం రూ.279.74 కోట్లు. ఈ కార్యాలయ పరిపాలన ఖర్చులు, అంతరిక్ష కార్యకలాపాలకు దీన్ని వెచ్చిస్తారు. ముఖ్య శాస్త్రీయ సలహాదారు కార్యాలయానికి రూ.65 కోట్లు కేటాయించారు.

రైల్వే బడ్జెట్ సమగ్ర స్వరూపం



రైల్వే హైస్పీడ్


- మూలధన వ్యయంగా రూ.2.77 లక్షల కోట్లు
- హైదరాబాద్ నుంచి మూడు కారిడార్లు



దిల్లీ: రైలు బండి వేగాన్ని పెంచడానికి నిర్మలమ్మ సంకల్పించారు. దేశంలో ఏడు అధిక వేగ నడవాలు (హైస్పీడ్ కారిడార్లు), సరకు రవాణాకు ఒక ప్రత్యేక కారిడార్ నిర్మించడానికి బడ్జెట్లో కేటాయింపులు చూపించారు. రైలుమార్గాల నిర్మాణం, ఇంజిన్లు/ వ్యాగన్లు/ కోచ్‌ల కొనుగోలు సహా మొత్తంగా రూ.2,77,830 కోట్లను రైల్వేకు మూలధన వ్యయం కింద కేటాయించాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. రైల్వేకు కేటాయింపుల్లో ఇదే అత్యధికం. మొత్తంగా రైల్వే ఆదాయం రూ.3,85,733 కోట్లు, వ్యయం రూ.3,82,186 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. అదనంగా బడ్జెటేతర నిధులుగా రూ.15,000 కోట్లు అందనున్నాయి. మొత్తంగా రూ.3,547 కోట్ల మిగులు సాధించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌తో పోలిస్తే కొత్త కేటాయింపులు 10.25% ఎక్కువ. ' 'ఆస్తులు సృష్టించడానికి, కొత్త పనులకు నిధులు ఇవ్వడానికి సరిపడినంత ఆదాయం రైల్వేకు సొంతంగా ఉండటం లేదు. అందుకే ప్రభుత్వం అదనంగా నిధులు ఇస్తుంది. ఆ ప్రకారం ఈసారి మూలధన వ్యయంగా రూ.2.77 లక్షల కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించారు" అని రైల్వే అధికారి ఒకరు వివరించారు. రైళ్లు ఢీకొనకుండా నిరోధించే కవచ్ వ్యవస్థ విస్తరణకు ప్రాధాన్యం లభించనుందని చెప్పారు.

పర్యావరణ హితంగా మారుతాయి: నిర్మల

దేశంలో రవాణాను వేగవంతం చేయడానికి ఏడు హైస్పీడ్ కారిడార్లను కొత్త బడ్జెట్లో ప్రతిపాదించారు. ముంబయి-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, దిల్లీ-వారణాసి, వారణాసి-సిలీగుడీ, డాంకునీ (పశ్చిమబెంగాల్)-సూరత్ మధ్య ఇవి రానున్నాయి. వీటిలో డాంకునీ-సూరత్ మధ్య నిర్మించేదానిని సరకు రవాణాకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. సుదూర ప్రయాణాల విషయంలో పర్యావరణహితమైన రవాణా వ్యవస్థగా ఈ కారిడార్లు మారుతాయని ఆర్థికమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



అధిక మొత్తం పింఛన్లకే

2024-25 ఆర్థిక ఆర్థిక సంవత్సరంలో రైల్వే వ్యయం రూ.3.32 లక్షల కోట్లు, ఆదాయం రూ.3.35లక్షల కోట్లుగా ఉంది. తద్వారా రూ.3,316.45 కోట్ల మిగులు సాధించింది. ఆ ఏడాది రైల్వే చేసిన ఖర్చులో అధిక మొత్తం (రూ.58,844.07 కోట్లు) ఉద్యోగుల పింఛన్లకే వెళ్లింది. ఇది 2026-27లో ఇది రూ.74,500 కోట్లకు చేరుతుందని అంచనా.

2026-27లో ప్రధాన ఖర్చులు ఇలా.. (రూ. కోట్లలో)


నూతన మార్గాల నిర్మాణం	36,721.55
గేజ్ మార్పిడి	4,600
జంటమార్గాల నిర్మాణం	37,750
ఇంజిన్లు, వ్యాగన్లు, కోచ్‌ల కొనుగోళ్లు	52,108.73
సిగ్నల్-టెలికం, కవచ్ తదితర పనులకు	7,500

జౌళి రంగానికి ఊతం..

- మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- ఖాదీ, చేనేత, హస్తకళల బలోపేతానికి 'మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్'

దేశంలో శ్రమ ఆధారిత జౌళి రంగానికి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సమగ్ర పథకాన్ని ఆదివారం ప్రకటించింది. మెగా టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటును ప్రతిపాదించింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయాలు వివరించారు. మంత్రి పేర్కొన్న 5 అంశాలతో కూడిన సమగ్ర పథకం ఇలా ఉంది..

1. పట్టు, ఉన్ని, జనపనార వంటి సహజ పోగుల విషయంలో స్వావలంబన సాధించేందుకు 'జాతీయ ఫైబర్ పథకం' చేపట్టడం.
2 సంప్రదాయిక జౌళి క్లస్టర్ల ఆధునికీకరణలో భాగంగా యంత్రాలకు పెట్టుబడి సాయం, సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి తోడ్పాటు, ఉత్పత్తుల సాధారణ పరీక్ష.. ధ్రువీకరణ కేంద్రాలు ఏర్పాటుచేయడం.



3. చేనేత పనివారికి, చేతివృత్తుల వారికి మద్దతు అందించి వారికి సంబంధించిన ప్రస్తుత పథకాలను బలోపేతం చేయడానికి జాతీయ చేనేత, హస్తకళల కార్యక్రమం.
4. అంతర్జాతీయ పోటీకి నిలవగలిగే సమగ్ర జౌళి, దుస్తుల ఉత్పాదకత అభివృద్ధికి 'టెక్స్ ఎకో ఇనీషియేటివ్' ప్రారంభించడం.
5. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయంతో వస్త్ర నైపుణ్య పర్యావరణ వ్యవస్థ ఆధునికీకరణ, స్థాయి పెంపునకు 'సమర్థ్ 2.0' పథకం.

- మరోవైపు ఖాదీ, చేనేత, హస్తకళల్ని బలోపేతం చేయడానికి మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్ పథకాన్ని కేంద్రం ప్రకటించింది. ఇది మన ఖాదీ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటు కల్పించేందుకు, బ్రాండ్ విలువ పెంచేందుకు సాయపడుతుంది. ఒక్కో జిల్లాకు ప్రత్యేకమైన ఒక్కో ఉత్పత్తి (వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్)ని ప్రోత్సహించడానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

తోలు ఎగుమతుల ప్రోత్సాహానికి..

దేశంలో తోలు ఎగుమతులను ప్రోత్సహించడానికి కొన్ని నిర్దిష్టమైన ఉత్పాదకాల సుంకం రహిత దిగుమతులను ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. అమెరికా విధించిన 50 శాతం అధిక సుంకాలతో ఇబ్బందులు పడుతున్న తోలు ఎగుమతిదారులకు ఈ చర్య ఊరట ఇవ్వనుంది. తోలు, వస్త్ర, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో నిర్బంధ కాల పరిమితిని ఆరు నెలల నుంచి ఏడాదికి పొడిగిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

15 పురావస్తు ప్రదేశాల అభివృద్ధి

గుజరాత్‌లోని లోథాల్, లద్దాఖ్‌లోని లేహ్ రాజభవనం సహా దేశంలోని 15 పురాతన, చారిత్రక కట్టడాలకు మళ్లీ పూర్వవైభవం పట్టనుంది. వీటిని 'సజీవ సాంస్కృతిక గమ్యస్థానాలు'గా తీర్చిదిద్దే కార్యక్రమానికి కేంద్ర బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. ఈ ప్రాంతాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక ప్రాశస్త్యం తెలియజేసేలా వివరాలన్నీ డిజిటల్‌గా భద్రపరచనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం నాటి బడ్జెట్‌లో ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా పర్యాటక రంగానికి రూ.2,438.40 కోట్లు, సాంస్కృతిక శాఖకు రూ.3,416.63 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఆర్థికమంత్రి మాట్లాడుతూ.. "లోథాల్, ధోలావీరా, రాఖీగఢీ, సారనాథ్, హస్తినాపుర్, లేహ్ రాజభవనం.. లాంటి పురాతత్వ ప్రదేశాల్లో సమగ్ర అభివృద్ధి పనులు చేపడతాం. ఈ ప్రాంతాల విశేషాలతో ఛాయాచిత్రాలను డిజిటలైజ్ చేస్తాం. దీనికోసం నేషనల్ డెస్టినేషన్ డిజిటల్ నాలెడ్జ్ గ్రిడ్ ఏర్పాటు చేస్తున్నాం" అని వివరించారు.

10వేల మంది యాత్రా గైడ్‌లకు శిక్షణ



భారత్‌లో ప్రపంచస్థాయి ట్రెక్కింగ్, హైకింగ్ కేంద్రాలు రూపుదిద్దుకునేలా ప్రోత్సహిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. "హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, అరకులోయ, పోధిగయిలలో పర్యావరణ హితమైన యాత్రా/ట్రెక్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. ఒడిశా, కర్ణాటక, కేరళలలోని తీరప్రాంతాల్లో తాబేళ్ల సంరక్షణ కేంద్రాలు.. పులికాట్ సరస్సులో పక్షుల వీక్షణ కేంద్రాలు.. నెలకొల్పుతున్నాం' ' అని ప్రకటించారు. దేశంలోని 20 ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో అక్కడి విశేషాలు క్షుణ్నంగా తెలియజెప్పేలా 10 వేల మంది యాత్రా గైడ్‌లను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఐఐఎంలతో ఒప్పందం కుదుర్చుకొని వారికి 12 వారాలపాటు సమగ్ర శిక్షణ ఇస్తామని మంత్రి తెలియజేశారు.

బౌద్ధ సర్క్యూట్‌గా ఈశాన్యం..



అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, అస్సాం, మణిపుర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాలతో 'బౌద్ధ సర్క్యూట్' ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించారు. ఈశాన్య రాష్ట్రాలను 'నాగరికతల సంగమం'గా పేర్కొన్నారు. ఈ గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజెప్పేలా, పర్యాటకులను ఆకట్టుకునేలా బౌద్ధ సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పథకంలో భాగంగా బౌద్ధ ఆలయాలు, మఠాల పరిరక్షణ, యాత్రికులకు సకల సదుపాయాలు, ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే యాత్రికుల కోసం భాషల తర్జుమా కేంద్రాల ఏర్పాటు.. తదితరాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు.

సహకార మంత్రిత్వ శాఖకు రూ.1,744 కోట్లు

పశు గ్రాసం, పత్తి విత్తనాల సరఫరాలో భాగస్వాములైన సహకార రంగ సంస్థలకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పలు పన్ను రాయితీలను ప్రకటించారు. ప్రస్తుతం పాల సరఫరా, నూనె గింజలు, పండ్లు, కూరగాయల సాగు చేసే ప్రాథమిక సహకార సంఘాల సభ్యులకు లాభాలు, ఆదాయంపై పన్ను మినహాయింపు ఉంది. దానిని ప్రస్తుతం పశుగ్రాసం, పత్తి విత్తనాల సరఫరాలో పాల్గొనే సభ్యులకూ వర్తింపజేశారు. సహకార మంత్రిత్వ శాఖకు బడ్జెట్‌లో రూ.1,744.74 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్ కంటే ఇది 78 శాతం అధికం.

నగరాల బలోపేతానికి
ప్రత్యేక ఆర్థిక మండళ్లు




- రూ.5 వేల కోట్ల చొప్పున కేటాయింపు
- విశాఖపట్నం సహా 7 నగరాల ఎంపిక
- తూర్పుతీర పారిశ్రామిక కారిడార్‌లో ఏపీ

దిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో పట్టణాభివృద్ధిని మరింత బలోపేతం చేసేలా ఏడు ప్రత్యేక నగర ఆర్థికమండళ్లు (సీఈఆర్) ప్రకటించారు. ఇందులో విశాఖపట్టణంతోపాటు బెంగళూరు, భువనేశ్వర్ - పురీ - కటక్, కోయంబత్తూరు - ఈరోడ్ - తిరుప్పూర్, పుణె, సూరత్, వారణాసిలకు చోటు కల్పించారు. ఈ నగరాల్లో ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యంలో వసతుల కల్పన కోసం అయిదేళ్లలో దశలవారీగా రూ.5 వేల కోట్ల చొప్పున కేటాయించనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ మిషన్‌ను సవాలుగా తీసుకొని నగరాల అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. 5 లక్షల జనాభా దాటిన ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలు వారణాసి, అయోధ్య, మథుర, సోమనాథ్, ద్వారక, గయా, బుద్ధగయా, మదురై, రామేశ్వరంలాంటి పుణ్యక్షేత్ర పట్టణాలను నయా అభివృద్ధి కేంద్రాలుగా మలిచేందుకు మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి పెడతామన్నారు.

హైవేల బడ్జెట్ రూ.3.09 లక్షల కోట్లు

రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖకు బడ్జెట్‌లో రూ.3.09 లక్షల కోట్లు కేటాయించారు. గత ఏడాది ఇచ్చిన రూ.2.87 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 8% అధికం. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నిధులను రూ.1.7 లక్షల కోట్ల నుంచి రూ.1.87 లక్షల కోట్లకు పెంచారు. సంస్థకు ఉన్న అప్పుల భారాన్ని ఈ ఏడాది రూ.2 లక్షల కోట్లలోపే పరిమితం చేయాలనే దృఢసంకల్పంతో పని చేయనున్నట్లు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.



'పూర్వోదయ రాష్ట్రాలు' పురోగమించేలా..

కేంద్రం ప్రభుత్వం 'తూర్పు తీర పారిశ్రామిక కారిడార్'ను ప్రకటించింది. బిహార్, ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లను పూర్వోదయ రాష్ట్రాలుగా పేర్కొంటూ.. వ్యవసాయం, ఆర్థికం, వైద్యం, ఉద్యోగ కల్పన, పరిశ్రమలు, పర్యాటకంలో ఈ రాష్ట్రాలు త్వరితగతిన అభివృద్ధి చెందేలా చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ రాష్ట్రాల్లో సత్వరం 4 వేల విద్యుత్తు బస్సులను ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.

ప్రైవేటు డెవలపర్ల కోసం ప్రత్యేక నిధి

ప్రైవేటు రంగ మౌలిక వసతుల కల్పన కంపెనీలకు ఆర్థికమంత్రి శుభవార్త చెప్పారు. భారీ నిర్మాణ ప్రాజెక్టుల కోసం ప్రైవేటు కంపెనీలు తీసుకునే రుణాలకు పాక్షిక పూచీకత్తును అందించేందుకు 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రిస్క్ గ్యారెంటీ ఫండ్' పేరుతో ప్రత్యేకనిధిని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తద్వారా ప్రైవేటు డెవలపర్లలో భరోసా పెరుగుతుందని, వారికి రుణాలిచ్చే ఆర్థిక సంస్థలకు నష్టభయం తగ్గుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మౌలిక వసతుల కల్పన, భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతూ ప్రైవేటు గుత్తేదారులు దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ఊహించని విపరిణామాలు, ఆటంకాలు ఎదురైతే ఒక్కోసారి వీరు ఆర్థికంగా కుదేలు అవుతుంటారు. వారికి ఆ పరిస్థితి రాకుండా.. ప్రైవేటు గుత్తేదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని నమ్మకం కలిగించేలా బడ్జెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. భారీ ప్రాజక్టులు చేపట్టేవారికి ఈ నిధి అండగా నిలుస్తుంది.

ఎన్నికల రాష్ట్రాలకు ఇలా..

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఊహించినంత భారీ స్థాయిలో బడ్జెట్ కేటాయింపుల్లేకపోయినా వాటికి ప్రయోజనం కల్పించే పలు ప్రతిపాదనలున్నాయి. ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అస్సాం, కేరళలు.. అరుదైన ఖనిజాలు, రైళ్లు, సరకు రవాణా కారిడార్ల ద్వారా ప్రయోజనం పొందనున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల పెంపునకు, పర్యాటకానికి ప్రోత్సాహం ద్వారా లబ్ధి కలగనుంది.

పశ్చిమ బెంగాల్



గత 3 సార్లుగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ గెలుస్తూ వస్తోంది. ఈసారి భాజపా ఈ రాష్ట్రంపై ఆశలు పెట్టుకుంది. అందుకే బడ్జెట్‌లో తూర్పు తీర పారిశ్రామిక కారిడార్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఇది దుర్గాపుర్‌ను అనుసంధానిస్తుంది. అంతేకాకుండా బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆంధ్ర ప్రదేశ్‌లలో 5 పర్యాటక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

- గుజరాత్‌లోని సూరత్ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని డాంకునీ వరకూ సరకు రవాణా కారిడార్‌ను మంత్రి ప్రకటించారు. ఇది రెండు రాష్ట్రాలను నేరుగా అనుసంధానం చేయనుంది.
- కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించిన 7 హైస్పీడ్ రైలు కారిడార్లలో ఒక దానిని ఉత్తర్ ప్రదేశ్‌లోని వారణాసి నుంచి పశ్చిమ బెంగాల్‌లోని సిలీగుడీకి మధ్య కేటాయించారు.

అస్సాం




బౌద్ధ సర్క్యూట్ అభివృద్ధిలో అస్సాంను కేంద్రం భాగస్వామిని చేసింది. ఈ పథకంలో భాగంగా ఆలయాలు, స్మారకాల వంటి వాటిని అభివృద్ధి చేయనుంది.

తమిళనాడు, కేరళ



బడ్జెట్‌లో అతి పెద్ద ప్రకటన అరుదైన ఖనిజాల కారిడార్లు. వీటిని తమిళనాడు, కేరళ, ఒడిశా, ఆంధ్ర ప్రదేశ్‌లకు కేటాయించారు. తమిళనాడు, కేరళల్లో ఉనికి కోసం భాజపా పోరాడుతోంది. తాజాగా ఈ రెండు రాష్ట్రాలకు కేంద్రం ప్రాధాన్యమిచ్చింది.

- హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు మధ్య రెండు హైస్పీడ్ కారిడార్లను కేంద్రం ప్రకటించింది.
- తమిళనాడు, ఆంధ్ర ప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న పులికాట్ సరస్సు వెంట పక్షుల విహార కేంద్రాన్ని, దాన్ని చూసేందుకు కారిడార్ ఏర్పాటు.
- తూత్తుకుడి జిల్లాలోని ఆదిచనల్లూర్‌లో పురాతత్వ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది.
- ప్రపంచ స్థాయి ట్రెక్కింగ్, హైకింగ్ కేంద్రంగా పొదిగై మలయ్ అభివృద్ధి.



డ్వాక్రా మహిళలకు షీ-మార్ట్ ఊతం


కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించిన 'షీ-మార్ట్' పథకం రాష్ట్రంలోని డ్వాక్రా మహిళల స్వయం ఉపాధికి ఊతమివ్వనుంది. క్లస్టర్ స్థాయి సమాఖ్య పరిధిలో వీటిని ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఆ మేరకు రాష్ట్రంలో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేసుకునే అవకాశముంది. ఒక్కో షీ-మార్ట్‌కు రూ.20 లక్షల చొప్పున గ్రాంటుగా ఎన్‌ఆర్‌ఎల్‌ఎం కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. ఇక్కడ డ్వాక్రా ఉత్పత్తులతో పాటు ఇతర రిటైల్ వస్తువుల్ని విక్రయించే వీలు కల్పించింది. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 86 లక్షల మంది డ్వాక్రా మహిళలున్నారు. వివిధ రకాల ఉత్పత్తులను తయారుచేస్తూ వ్యాపారం చేయగల సామర్థ్యం ఉన్న డ్వాక్రా మహిళలు చాలామంది ఉన్నారు.



అరకులో పర్వతారోహణం..

రాష్ట్ర పర్యాటక రంగం అభివృద్ధిలో ముందడుగు పడే నిర్ణయమిది. ఏపీకి కేంద్ర బడ్జెట్‌లో రెండు ఎకో టూరిజం ప్రాజెక్టులు ప్రకటించింది. అరకులో ప్రపంచ స్థాయి ట్రెక్కింగ్, హైకింగ్ కోసం మౌంటైన్ ట్రైల్స్ ప్రాజెక్టును కేటాయించింది. పులికాట్ సరస్సుకు వచ్చే వలస పక్షులను పర్యాటకులు సమీపం నుంచి వీక్షించే మరో ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి తూర్పు కనుమల్లో పర్వత మార్గాలను (ట్రెక్కింగ్, హైకింగ్) అభివృద్ధి చేసి పర్యాటకంగా అరకు లోయకు మరింత గుర్తింపు తీసుకురావాలని నిర్ణయించింది. ఈ దిశగా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ-కశ్మీర్‌తో పాటు అరకు లోయను ఎంపిక చేసింది.

రాజధాని అమరావతికి రూ.1,561 కోట్లు



ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో రూ.1,561 కోట్లు కేటాయించారు. ఇందులో ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) నుంచి రూ.1,128.91 కోట్లు, ప్రపంచ బ్యాంకు సంస్థ ఐబీఆర్‌డీ నుంచి రూ.432.09 కోట్లు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. 2024లో కూటమి అధికారంలోకి వచ్చి, రాజధాని నిర్మాణాన్ని పట్టాలెక్కించిన కొన్ని నెలలకే ఏడీబీ, ప్రపంచ బ్యాంకు సంయుక్తంగా రూ.15,000 కోట్ల రుణం మంజూరు చేశాయి. వాటిలో ఆ బ్యాంకులు ఇస్తున్నది రూ.13,500 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌గా రూ.1,500 కోట్లు సమకూరుస్తోంది. కేంద్రం ఇచ్చే రూ.1,500 కోట్లలో రూ.750 కోట్లు ఇప్పటికే విడుదలయ్యాయి. మిగతా నిధి మార్చి నెలాఖరులోగా ఇస్తుంది. ప్రపంచబ్యాంకు, ఏడీబీల నుంచి వచ్చే రూ.13,500 కోట్లను రాజధానిలో పనులు పురోగతిని బట్టి దశల వారీగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటోంది. ఇప్పటి వరకు సుమారు రూ.4,800 కోట్ల వరకు డ్రా చేసింది. ఆ నిధులు బ్యాంకుల నుంచే వస్తున్నా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో విధిగా చూపించాలి. ఇప్పటి వరకు తీసుకోగా మిగిలిన నిధుల్లో రూ.1,561 కోట్లు 2026-27 బడ్జెట్‌లో చూపించింది. దీనర్థం రూ.1,561 కోట్లు మాత్రమే ఇస్తారని కాదు, రాజధానిలో పనుల పురోగతిని బట్టి అవసరం మేరకు మిగతా నిధులు తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నమాట!

మత్స్యకారులకు మార్కెట్ లింకేజీ



మత్స్య సంపద పెంపు లక్ష్యంగా చేపల రైతుల ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా మత్స్యకార సంఘాలకు ప్రోత్సాహం ఇవ్వనున్నట్లు బడ్జెట్ సందర్భంగా కేంద్రం ప్రకటించింది. జలాశయాలతో పాటు అమృత్ సరోవర్ కింద అభివృద్ధి చేసిన చెరువుల్లోనూ మత్స్యసంపద పెంచేలా చర్యలు తీసుకుంటామని పేర్కొంది. మార్కెట్ లింకేజీ సులభతరం చేయడం ద్వారా రైతుల ఆదాయం పెంచాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. అమృత్ సరోవర్ పథకం కింద ఇప్పటికే పలు ప్రాంతాల్లో జలాశయాల్ని అభివృద్ధి చేశారు. వాటిలో మత్స్య సంపద పెంపునకు ఇప్పుడు ప్రోత్సాహం కల్పించనున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 10 వరకు మత్స్య రైతు ఉత్పత్తి సంఘాలున్నాయి.

రాష్ట్రం నలుదిక్కులా.. బుల్లెట్ రైళ్ల పరుగులు

హైదరాబాద్- అమరావతి- చెన్నై, హైదరాబాద్- బెంగళూరు, చెన్నై-బెంగళూరు మధ్య హైస్పీడ్ రైల్ కారిడార్లు

రాష్ట్రం నుంచి 3 ప్రధాన నగరాలకు కనెక్టివిటీ

- వీటిలో ఏపీలో 857 కి.మీ. నిర్మాణం
- 11 జిల్లాల మీదుగా మూడు కారిడార్లు



ఈనాడు-అమరావతి: మన రాష్ట్రంలో నలువైపులా బుల్లెట్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. పొరుగున ఉన్న హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలకు అత్యంత వేగంగా రాకపోకలు సాగించేలా మూడు కీలక బుల్లెట్ రైల్ కారిడార్లు నిర్మించనున్నారు. ఇవి రాష్ట్ర అభివృద్ధికి కీలక మైలురాళ్లుగా నిలవనున్నాయి. దేశంలోని వివిధ నగరాల మధ్య ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వాటిలో ఏపీ మీదుగా వెళ్లే హైదరాబాద్-అమరావతి-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు, చెన్నై-బెంగళూరు కారిడార్లు ఉన్నాయి. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలలో కలిపి మొత్తం 1,671 కి.మీ. మేర నిర్మించే ఈ కారిడార్లలో.. అత్యధికంగా ఏపీలోనే 857 కి.మీ. ఉంటుంది. దేశంలో మరే రాష్ట్రానికి ఈ స్థాయిలో హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ ప్రతిపాదన లేదు. ఇవి మన రాష్ట్రంలోని 11 జిల్లాల మీదుగా వెళ్తాయి. ఈ కారిడార్లతో విజయవాడ నుంచి విశాఖ వైపు మినహా.. మిగిలిన దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలకు హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్ వచ్చినట్లు అవుతుంది.

రాజధాని అమరావతి మీదుగా..

- హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్.. ఏపీ రాజధాని అమరావతి మీదుగా, కొత్తగా నిర్మించనున్న విమానాశ్రయానికి సమీపం నుంచి వెళ్లనుంది.
- దీనిని తెలంగాణ, ఏపీ, తమిళనాడుల్లో కలిపి మొత్తం 760 కి.మీ. మేర నిర్మించనుండగా, ఇందులో ఏపీలో 504 కి.మీ. ఉంటుంది.
- మన రాష్ట్రంలో పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా వెళ్తుంది.
- దాచేపల్లి, అమరావతి, గుంటూరు, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి వద్ద స్టేషన్లు నిర్మిస్తారు.
- ఈ ప్రాజెక్టుకు రూ.1.90 లక్షల కోట్లు వ్యయమవుతుందని అంచనా వేస్తున్నారు.
- ఈ కారిడార్, ఇందులోని స్టేషన్లకు కలిపి మొత్తం 1,873.7 హెక్టార్ల భూమి అవసరం అవుతుంది. మరో 90.31 హెక్టార్ల అటవీ భూమి సేకరించాల్సి ఉంటుంది.

సీమ జిల్లాల మీదుగా హైదరాబాద్-బెంగళూరు కారిడార్


- హైదరాబాద్-బెంగళూరు కారిడార్.. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళ్తుంది.
- ఇందులో కర్నూలు, డోన్, గుత్తి, అనంతపురం, కియా కార్ల పరిశ్రమకు సమీపంలోని దుద్దేబండ, హిందూపురంలలో స్టేషన్లు నిర్మిస్తారు.
- ఈ లైన్ తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో కలిపి మొత్తం 605 కి.మీ. మేర నిర్మించనుండగా, ఒక్క ఏపీలోనే 263 కి.మీ. ఉండనుంది.
- ఈ ప్రాజెక్టుకు రూ.1.51 లక్షల కోట్లు వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.
- దీనికోసం ఏపీలో 988.62 హెక్టార్ల భూమి, 4.21 హెక్టార్ల అటవీ భూమి సేకరించాల్సి ఉంటుంది.

చిత్తూరు మీదుగా చెన్నై-బెంగళూరు లైన్



- చెన్నై-బెంగళూరు మధ్య 306 కి.మీ. మేర హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మించనున్నారు.
- ఇందులో ఏపీలోని చిత్తూరు జిల్లాల్లో సుమారు 90 కి.మీ. ఉండనుంది.
- దీని ఎలైన్‌మెంట్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది.
- ప్రస్తుతానికి చిత్తూరులో రైల్వే స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదించారు. మరో స్టేషన్ కూడా వచ్చే అవకాశం ఉంది.
- ఈ కారిడార్ నిర్మాణానికి ఎంత వ్యయమవుతుంది? ఎంత భూమి అవసరం అనే వివరాలతో డీపీఆర్ తయారవుతోంది.
- ఈ కారిడార్‌ను తిరుపతి మీదుగా కూడా వెళ్లేలా చూడాలని సీఎం చంద్రబాబు రైల్వేను కోరారు. ఈ ప్రతిపాదన పరిశీలనలో ఉంది.


ఏ నగరానికైనా 1-2 గంటలే ప్రయాణం..



- హైస్పీడ్ రైల్ కారిడార్ పూర్తయితే.. వాటిపై బుల్లెట్ రైళ్లు గంటకు గరిష్ఠంగా 320 కి.మీ. వేగంతో పరుగులు పెడతాయి.
- అమరావతి నుంచి హైదరాబాద్‌కు గంటలోపే చేరుకోవచ్చు.
- అలాగే అమరావతి నుంచి తిరుపతి, చెన్నైలకు రెండు గంటల్లోపు చేరుకునే అవకాశం ఉంటుంది.
- హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌లో.. కర్నూలు, అనంతపురం నుంచి ఇటు హైదరాబాద్‌కు కానీ, అటు బెంగళూరుకు కానీ గంటలోపు ప్రయాణంతో చేరుకోవచ్చు.
- చెన్నై-బెంగళూరు కారిడార్‌లో.. చిత్తూరు నుంచి ఇటు చెన్నై కానీ, అటు బెంగళూరు కానీ అరగంటలో చేరుకునేందుకు అవకాశం కలుగుతుంది.

రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమలకు ప్రోత్సాహం

రూ.14,000 కోట్ల పెట్టుబడికి ఇండిచిప్ ప్రతిపాదన



ఈనాడు-అమరావతి: రాష్ట్రంలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ రంగంలో అసెంబ్లింగ్, టెస్టింగ్, తయారీ, ప్యాకేజింగ్ (ఏటీఎంపీ) యూనిట్ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు వీలుగా ప్రత్యేక పాలసీ (2024-29) తెచ్చింది. కర్నూలు, తిరుపతిలో సిలికాన్ కార్బైడ్ చిప్స్, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్ పరిశ్రమల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనికి కేంద్రం నుంచి సహకారం అందుతోంది. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) 2.0 కింద వార్షిక బడ్జెట్‌లో రూ.40,000 కోట్లు కేంద్రం ప్రతిపాదించింది. తిరుపతి జిల్లాలో ఇప్పటి ఉన్న ఎలక్ట్రానిక్స్ క్లస్టర్‌లో (డిక్సన్ టెక్నాలజీస్, సన్నీ ఒపోటెక్ వంటి కంపెనీలు) సెమీకండక్టర్ తయారీని చేపట్టాలని భావిస్తోంది. సిలికాన్ కార్బైడ్ తయారీకి ప్రధాన కేంద్రంగా కర్నూలు హబ్‌ను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

▼ కర్నూలు జిల్లా ఓర్వకల్లు హబ్‌లో జపాన్‌కు చెందిన ఇటోవా మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్ భాగస్వామ్యంతో ఇండిచిప్ సెమీకండక్టర్స్ దేశంలో మొదటి ప్రైవేట్ సిలికాన్ కార్బైడ్ సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీని ద్వారా రూ.14 వేల కోట్లు పెట్టుబడి సంస్థ పెట్టనుంది. ఐఎస్ఎం 2.0లో పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలు కేంద్రం నుంచి అందే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

▼ ఐఎస్ఎం 1.0 కింద గత ఏడాది ఆగస్టులో నాలుగు కొత్త సెమీకండక్టర్ తయారీ ప్రాజెక్టులను కేంద్రం ఆమోదించింది. అందులో ఒకటి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించింది. రాష్ట్రంలో దక్షిణ కొరియాకు చెందిన ఏపీపీ సీటీ కంపెనీ లిమిటెడ్ భాగస్వామ్యంతో అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ తయారీ పరిశ్రమ ఏర్పాటు ద్వారా రూ.468 కోట్లు పెట్టుబడి పెట్టనుంది.

ఇంటింటా సూర్యఘర్ వెలుగులు!



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో చేపట్టిన విద్యుత్ ప్రాజెక్టులకు కేంద్రం ప్రకటించిన బడ్జెట్ ద్వారా భారీగా లబ్ధి చేకూరనుంది. ఏడాదిగా పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాబోయే ఐదేళ్లలో 1.60 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ యోచన. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులతో రాష్ట్రానికి గరిష్ఠ ప్రయోజనం దక్కనుంది.

❖ పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన అమలుకు కేంద్రం రూ.22,000 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించింది. రాష్ట్రంలో నెలకు 200 యూనిట్లు, అంతకంటే తక్కువ విద్యుత్‌ను వినియోగించే బీసీ వర్గాలకు 27.59 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. వారికి రూఫ్‌టాప్ విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కేంద్రం ఇచ్చే సబ్సిడీతో పాటు అదనంగా మరో రూ.20 వేలు ప్రోత్సాహకంగా అందించాలని భావిస్తోంది.


❖ రాష్ట్రంలో 21 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు రూఫ్ టాప్ ప్రాజెక్టుల ద్వారా సౌర విద్యుత్‌ను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా 7.5 లక్షల రూఫ్ టాప్ ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి.. గుత్తేదారులకు పనులు అప్పగించింది.

❖ విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్‌డీఎస్ఎస్) కింద రూ.13 వేల కోట్లతో ఫీడర్ల విభజన పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. ఇందులో కేంద్రం గ్రాంటు కింద సుమారు రూ.6 వేల కోట్లు అందించాలి. ఈ పనులకు ఇప్పటి వరకు ఇచ్చింది పోనూ ఇంకా రూ.4 వేల కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.18,000 కోట్లు కేంద్రం ప్రతిపాదించింది. పవర్ సిస్టమ్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.1,103 కోట్లు బడ్జెట్‌లో కేంద్రం ప్రతిపాదించింది.

❖ పీఎం కుసుమ్ పథకం రెండో దశలో ఫీడర్ స్థాయిలో మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటును కేంద్రం ప్రోత్సహిస్తోంది. దీనికి కేంద్ర బడ్జెట్‌లో రూ.5,000 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో ఈ పథకం కింద 4 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అవసరమైన విద్యుత్ కోసం ఫీడర్ స్థాయిలో మినీ సౌర విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. వాటి ద్వారా సుమారు 2,000 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. పీఎం కుసుమ్ మొదటి దశలో 2.93 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్‌ను అందించేందుకు ఫీడర్ స్థాయిలో మినీ సౌర ప్రాజెక్టులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి.. గుత్తేదారులకు పనులు అప్పగించింది.

పోలవరానికి రూ.3,320 కోట్లు

- ప్రాజెక్టు తొలి దశకు దాదాపు నిధులిచ్చేసినట్లే
- ఎన్డీయే హయాంలో 3 బడ్జెట్లలో మొత్తం కేటాయింపు రూ.11,850 కోట్లు



పోలవరం జాతీయ ప్రాజెక్టుకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర బడ్జెట్‌లో రూ.3,320 కోట్లు కేటాయించారు. ఈ నిధులను కేంద్రం రాష్ట్రానికి అడ్వాన్సుగా ఇవ్వనుంది. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన మూడు కేంద్ర బడ్జెట్లలోనూ కలిపి పోలవరం ప్రాజెక్టుకు ఇచ్చిన నిధులు రూ.11,850 కోట్లు. ఈ నిధులన్నీ కేంద్రం ప్రాజెక్టుకు అడ్వాన్సుగా కేటాయించినవే. అంటే పనులు చేయక ముందే రాష్ట్ర సింగిల్ నోడల్ ఖాతాకు కేంద్రం నిధులు బదిలీ చేస్తోంది.

- 2024-25 బడ్జెట్‌లో పోలవరానికి కేంద్రం రూ.5,512 కోట్లు కేటాయించింది. వాటిని అదే ఆర్థిక సంవత్సరంలో అడ్వాన్సుగా ఇచ్చింది.
- 2025-26 (ప్రస్తుత ఆర్థిక సంవత్సరం)లో రూ.5,936 కోట్లు కేటాయించింది.
- ఇందులో 2024-25, 2025-26 ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్రం రూ.4,318.96 కోట్లు ఖర్చు చేసింది. అడ్వాన్సుగా ఇచ్చిన నిధుల్లో 80% ఖర్చు చేశాం కాబట్టి మూడో విడత అడ్వాన్సు నిధులు విడుదల చేయాలంటూ పోలవరం అధికారులు జనవరిలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. అవి ఈ నెలలో రానున్నాయి.
- 2024-25లో కేంద్రం అడ్వాన్సుగా ఇచ్చిన రూ.5,512.40 కోట్లనే రాష్ట్రం వినియోగించడంతో గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.5,936 కోట్ల అవసరం పడలేదు. దీంతో ఆ కేటాయింపును రూ.3,017.40 కోట్లకు కేంద్రం తాజాగా సవరించింది. దీనిలో ప్రస్తుతం రూ.1,500 కోట్లు ఇచ్చి, అవి ఖర్చు చేసిన వెంటనే మరో రూ.1,500 కోట్లు ఇస్తామని చెబుతోంది.
- 2026-27 బడ్జెట్‌లో రూ.3,320 కోట్లు కేటాయింపు చూపారు.

రూ.306 కోట్లు మినహా..

తాజా కేటాయింపులతో పోలవరం ప్రాజెక్టుకు తొలి దశలో +41.15 మీటర్ల ఎత్తుకు నీళ్లు నిలబెట్టేలా పునరావాసం, పూర్తి స్థాయి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు ఇచ్చినట్లవుతుంది. తొలిదశలో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అవసరమైన రూ.12,157 కోట్లు కేంద్రం 2024 జూన్ తర్వాత మంజూరు చేసింది. తాజా బడ్జెట్ కేటాయింపులు కూడా కలిపి ఇంతవరకు రూ.11,850 కోట్లు ఇచ్చినట్లవుతుంది. తొలి దశకు ఇక కేంద్రం కేటాయించాల్సింది కేవలం రూ.306 కోట్లే.

పోలవరానికి కేంద్ర సాయం ఇలా..

- జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించడానికి ముందు రాష్ట్రం చేసిన ఖర్చు: రూ.4,730.71 కోట్లు
- కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించాక వెచ్చించింది: రూ.21,505.47 కోట్లు
- ఇంత వరకు మొత్తం ఖర్చు: రూ.26,236.18 కోట్లు
- రాష్ట్రం ఖర్చు చేసిన తర్వాత కేంద్రం తిరిగి ఇచ్చినవి: రూ.15,605.96 కోట్లు
- కేంద్రం అడ్వాన్సుగా ఇచ్చిన నిధులు: రూ.5,052.71 కోట్లు
- ఈ అడ్వాన్సులో ఇంత వరకు ఖర్చు: రూ.4,318.96 కోట్లు

- ఈనాడు- అమరావతి

3 పారిశ్రామిక నోడ్‌లకు నిధులు!



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్న విశాఖ-చెన్నై (వీసీఐసీ), చెన్నై-బెంగళూరు (సీబీఐసీ), హైదరాబాద్-బెంగళూరు (హెచ్‌బీఐసీ) కారిడార్లకు కేంద్ర నిధులు అందనున్నాయి. దేశంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్ (నిక్‌డిక్ట్) భాగస్వామ్యంతో 14 పారిశ్రామిక కారిడార్లకు కేంద్రం అభివృద్ధి చేస్తోంది. వాటికి 2026-27 బడ్జెట్ కేటాయింపుల్లో రూ.3,000 కోట్లు ప్రతిపాదించింది.

- సీబీఐసీ పరిధిలోని నెల్లూరు క్రిస్ సిటీని రూ.621 కోట్లతో నిక్‌డిక్ట్ భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే రూ.531 కోట్లు కేంద్రం విడుదల చేసింది. మిగిలిన పనుల పూర్తికి రూ.90 కోట్లు బడ్జెట్ కేటాయింపుల నుంచి తీసుకునే అవకాశం ఉంది.
- ఓర్వకల్లు నోడ్‌ను (హెచ్‌బీఐసీ) నిక్‌డిక్ట్ భాగస్వామ్యంతో రూ.1,014 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే రూ.500 కోట్లు అధికారులు ఖర్చు చేశారు. పనులు పూర్తి చేసేందుకు ఇంకా రూ.514 కోట్లు అవసరం.
- వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి నోడ్ (వీసీఐసీ)ను రూ.872 కోట్లతో ప్రతిపాదించింది. ఇప్పటికే రూ.300 కోట్లు నిక్‌డిక్ట్ విడుదల చేసింది. పనులు కొనసాగించేందుకు రూ.572 కోట్లు అవసరం.

30 ప్లగ్ అండ్ ప్లే పార్కులకు ప్రతిపాదన

దేశవ్యాప్తంగా 100 ప్లగ్ అండ్ ప్లే ఇండస్ట్రియల్ పార్కులు అభివృద్ధి చేయాలని కేంద్రం నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటు చేసిన పథకం అమలుకు రూ.3,000 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద రాష్ట్రంలో కనీసం 30 పార్కులు అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు పొందేలా అధికారులు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. వాటి ఆమోదానికి ప్రయత్నిస్తున్నారు.

అరుదైన ఖనిజాల వెలికితీతకు తోడ్పాటు

ఏపీ సహా ఒడిశా, తమిళనాడు, కేరళలతో కలిపి కారిడార్ల ఏర్పాటు

పెట్టుబడుల రాకతో పెరగనున్న ఉపాధి అవకాశాలు



ఈనాడు, అమరావతి: కేవలం సముద్ర తీరాల్లో.. అదికూడా కొన్నిచోట్ల మాత్రమే లభించే.. బీచ్‌శాండ్ వంటి అరుదైన ఖనిజాల తవ్వకాలు, వాటి శుద్ధి తదితరాల్లో కీలక అధ్యాయానికి తెరలేచింది. వీటి తవ్వకాలకు పెద్దఎత్తున ప్రోత్సాహం అందించనున్నట్లు కేంద్రం ప్రకటించడంతో.. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు రానున్నాయి. అరుదైన ఖనిజాలు అధికంగా లభించే ఏపీ సహా ఒడిశా, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో కలిపి రేర్ ఎర్త్ కారిడార్లు ఏర్పాటుకు సహకారం అందించేందుకు కేంద్రం ముందుకొచ్చింది. దీనివల్ల వీటి తవ్వకాలకు అనేక ఔత్సాహిక కంపెనీలు ముందుకొస్తాయి. మైనింగ్ యాక్టివిటీ భారీగా పెరుగుతుంది. అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ప్రభుత్వానికి రాబడి కూడా గణనీయంగా పెరగనుంది.

ఏపీ అరుదైన ఖనిజాల గని..

◆ రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు సముద్ర తీరప్రాంతంలో 16,600 హెక్టార్ల పరిధిలో 211 మిలియన్ టన్నుల బీచ్‌శాండ్ నిల్వలు ఉంటాయని అంచనా.

◆ వీటిలో మోనజైట్, ఇలిమినైట్, రూటైల్, గార్నెట్, సిలిమనైట్, జిర్కాన్ వంటి అరుదైన ఖనిజాలు లభిస్తాయి.

◆ ఇలిమినైట్, రూటైల్ నుంచి టైటానియం ముడి ఖనిజ మెటీరియల్ వస్తుంది. దానిని శుద్ధిచేస్తే టైటానియం ఆక్సైడ్ పిగ్మెంట్లు వస్తాయి.

◆ మోనజైట్‌లో రేడియో ధార్మికత కలిగిన థోరియం కంటెంట్ ఉంటుంది. దీనినుంచి భూఅయస్కాంత ఖనిజం లభిస్తుంది.

◆ ఎలక్ట్రానిక్ వస్తువులు, సెన్సర్లు, రాకెట్లు తదితరాల్లో భూఅయస్కాంత ఖనిజాన్ని వినియోగిస్తారు.

◆ బీచ్‌శాండ్ తవ్వకాలు జరిపి, వాటి నుంచి ఆయా ఖనిజాలను వేరుచేసి, శుద్ధిచేసి విలువ జోడించే ప్రక్రియ చేపట్టడం ఎంతో ఖర్చుతో కూడుకున్నది.

◆ అరుదైన ఖనిజాలు లభించే లీజులను కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలకు మాత్రమే కేటాయిస్తారు. ఆ సంస్థలతో కలిసి ఔత్సాహిక ప్రైవేటు సంస్థలు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టి, ఖనిజ తవ్వకాలు, శుద్ధి వంటి వాటిలో భాగస్వామ్యం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది.

◆ ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని 909.85 హెక్టార్లలో రెండు లీజులు, విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో 90.15 హెక్టార్లలో ఒక లీజు కలిపి మొత్తం వెయ్యి హెక్టార్లలో మూడు లీజులు ఏపీఎండీసీకి గతంలో కేంద్రం మంజూరు చేసింది.

◆ ఇందులో ఏపీఎండీసీతో కలిసి అదానీ గ్రూప్‌నకు చెందిన అల్లువియల్ హెవీ మినరల్స్ లిమిటెడ్ సంస్థ ఖనిజ తవ్వకాలు, సెపరేషన్, ప్రాసెసింగ్ వంటి ప్రక్రియకు మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్‌గా ఎంపికైంది. త్వరలో తవ్వకాలు ఆరంభించనుంది.

◆ ఇకపై మిగిలిన బ్లాక్‌ల్లోని లీజులు పొంది, తవ్వకాలు చేపట్టే ప్రక్రియ వేగవంతం కానుంది.

ఏజెన్సీ ప్రాంతాలు.. సీమలోనూ.. ఖనిజాలు

- శ్రీకాకుళం నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వరకు ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లోనూ అరుదైన ఖనిజాలు ఉన్నాయి.
- ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో బాక్సైట్ నిల్వలు ఉన్నాయి.
- ఇదే ప్రాంతాల్లోని గ్రాఫైట్ నిల్వలు ఉన్నాయి. ఇందులో క్రిప్టాన్, జెనాన్, రెడాన్ వంటి అరుదైన ఖనిజాలు లభిస్తాయి.
- గ్రాఫైట్‌ను బ్యాటరీల తయారీలో వినియోగిస్తారు. వీటికి స్థిరత్వం ఎక్కువ. న్యూట్రల్ మినరల్స్‌గా వీటిని పిలుస్తారు.
- ఏజెన్సీలోని గ్రాఫైట్ కోసం అన్వేషణ జరుగుతోంది. నిల్వలు కనుగొన్నాక వాటిలో తవ్వకాలు, ప్రాసెసింగ్‌కు కేంద్రం ఏర్పాటుచేసిన రేర్ ఎర్త్ కారిడార్లు దోహదం చేస్తాయి.
- అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల పరిధిలో బంగారం ఖనిజ నిల్వలు ఉన్నాయి. వాటిలో తవ్వకాలు చేస్తే.. బంగారంతోపాటు బెనడియం, గాలియం వంటి ఖనిజాలు బయటకు వస్తాయి.
- ఇకపై ఇటువంటి ఖనిజాల తవ్వకాలకు ముందుకొచ్చే ఔత్సాహిక కంపెనీలకు కేంద్రం నుంచి మరింత ప్రోత్సాహం అందనుంది.

జనం ముంగిటకు రక్షిత జలం!

జల జీవన్ మిషన్ గడువు పెంపుతో రాష్ట్రానికి ఊరట




ఈనాడు, అమరావతి: జల జీవన్ మిషన్(జేజేఎం) కార్యక్రమం అమలు గడువు 2028 వరకు పొడిగించడంతో రాష్ట్రంలో వివిధ దశల్లో ఉన్న పెండింగ్ తాగునీటి ప్రాజెక్టుల పూర్తికి మార్గం సుగమం కానుంది. వీటికి కేంద్రం వాటా నిధులు రాబట్టే అవకాశం కలిగింది. జలాశయాలు, నదుల నుంచి నీరు సేకరించి ప్రజలకు అందించాలన్న ప్రయత్నాలు కూడా కొలిక్కి రానున్నాయి. వైకాపా ప్రభుత్వం జల జీవన్ మిషన్‌కు రాష్ట్ర వాటా నిధులు సమకూర్చకుండా కార్యక్రమాన్ని భ్రష్టుపట్టించింది. కేంద్రం అప్పట్లో రాష్ట్రంలో రూ.27 వేల కోట్ల పనులకు అనుమతులిచ్చినా.. ఐదేళ్ల వ్యవధిలో గత ప్రభుత్వం కేవలం రూ.4 వేల కోట్లే ఖర్చు చేయగలిగింది. రాష్ట్ర వాటా నిధులివ్వని కారణంగా మిగిలిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఫలితాలిచ్చిన సంప్రదింపులు

జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం గత 18 నెలలుగా యత్నిస్తోంది. బోర్ల నుంచి కాకుండా జలాశయాల నుంచి నీరు సేకరించి అన్ని సీజన్లలోనూ ప్రజలకు తాగునీరు అందించేలా రూ.84,500 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది. 2024-25తో ముగిసిన జేజేఎం గడువు పెంచాలని కూడా కోరింది. ఈలోగా కేంద్రం మొదట అనుమతించిన రూ.27 వేల కోట్ల ప్రాజెక్టుల పూర్తికి చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జేజేఎం గడువు 2028 వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ఆదివారం ప్రకటించడం రాష్ట్రానికి ఊరట కలిగించింది.

పనుల పూర్తికి ప్రణాళికలు....

■ పెండింగ్‌లోని రూ.23 వేల కోట్ల ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా కేంద్రం వాటా కింద రాష్ట్రానికి 50 శాతం నిధులు రానున్నాయి. రాష్ట్ర వాటా నిధుల కోసం జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు నుంచి ప్రభుత్వం రూ.10 వేల కోట్ల రుణం తీసుకుంటోంది. దానికి మరో రూ.3 వేల కోట్లు కలిపి మొత్తం రూ.13 వేల కోట్లు తీసుకోవాలని ఇటీవల నిర్ణయించింది. 2028లోగా పెండింగ్ పనులు పూర్తి చేయించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు అందించనున్నారు.



రూ.3.16 లక్షల కోట్ల డివిడెండు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), జాతీయ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల ద్వారా రూ.3.16 లక్షల కోట్ల డివిడెండు రావొచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనా అయిన రూ.3.05 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 3.75% ఎక్కువ. డివిడెండు, రిజర్వ్ బ్యాంకు నుంచి మిగులు ఆదాయ బదిలీ లాంటివి పన్నుయేతర ఆదాయ విభాగం కిందకు వస్తాయి. మొత్తం మీద వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి పన్నుయేతర ఆదాయం కింద రూ.6.66 లక్షల కోట్లు వచ్చే అవకాశం ఉంది. 2025-26లోని రూ.6.67 లక్షల కోట్లతో పోలిస్తే ఇది స్వల్పంగా తక్కువ.




బంగారం, వెండి మరింత కిందకు



బడ్జెట్ సందర్భంగా కమొడిటీ మార్కెట్లు ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు పనిచేశాయి. బంగారం, వెండి ధరల క్షీణత కొనసాగింది. ఎంసీఎక్స్‌లో కిలో వెండి మార్చి ఫ్యూచర్ కాంట్రాక్టు ధర 9% (రూ.26,273) తగ్గి రూ.2,65,652 వద్ద ముగిసింది. 10 గ్రాముల మేలిమి బంగారం ఫిబ్రవరి కాంట్రాక్టు ధర 4.45% తగ్గి రూ.1.43 లక్షలకు పరిమితమైంది. రెండు ట్రేడింగ్ రోజుల్లోనే కిలో వెండి ఫ్యూచర్స్ ధర రూ.1,34,241 (33.6%) క్షీణించింది. కమొడిటీ ఎక్స్ఛేంజీల ట్రేడింగ్ ధర కంటే 3% జీఎస్‌టీ, మరికొన్ని వ్యయాలు కలిపి, రిటెయిల్‌గా ఈ లోహాలను విక్రయిస్తుంటారు.

పన్ను పోటు



సెన్సెక్స్ ▼ 1547
80723

నిఫ్టీ ▼ 495
24825

రూ.9.40 లక్షల కోట్లు
తగ్గిన సంపద

డెరివేటివ్ కాంట్రాక్టులపై సెక్యూరిటీల లావాదేవీ పన్ను (ఎస్‌టీటీ) పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో ఆదివారం దేశీయ సూచీలు కుప్పకూలాయి. మదుపర్ల సెంటిమెంట్‌పై ఈ నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపడంతో సెన్సెక్స్, నిఫ్టీ 2% వరకు నష్టపోయాయి. ఆదివారం సెలవు అయినా, బడ్జెట్ కోసం స్టాక్ ఎక్స్ఛేంజీలు పనిచేశాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.9.40 లక్షల కోట్లు క్షీణించి, రూ.450.61 లక్షల కోట్ల (4.90 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 120 పాయింట్ల (క్రితం ముగింపు 82,269.78) లాభంతో 82,388.97 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అదే జోరు కొనసాగిస్తూ.. 82,726.65 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఎస్‌టీటీ పెంచుతున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించిన వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ, ఒకదశలో 2,370.36 పాయింట్లు పతనమై, 79,899.42 పాయింట్లకు చేరింది. చివరకు కాస్త కోలుకున్నా.. 1,546.84 పాయింట్ల నష్టంతో 80,722.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 495.20 పాయింట్లు కుదేలై 24,825.45 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,571.75- 25,440.90 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 26 క్షీణించాయి. ఎస్‌బీఐ 5.61%, అదానీ పోర్ట్స్ 5.53%, బీఈఎల్ 5.36%, ఐటీసీ 3.91% డీలాపడ్డాయి. టీసీఎస్, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా, టైటన్ 1.92% వరకు లాభపడ్డాయి.

మౌలిక షేర్ల లాభాల ర్యాలీ: బడ్జెట్‌లో మూలధన వ్యయాలను రూ.12.2 లక్షల కోట్లకు పెంచడంతో పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్ 7.79%, స్టెర్లింగ్ రెన్యూవబుల్ ఎనర్జీ 5.15%, పీవీవీ ఇన్‌ఫ్రా 4.83%, అఫ్కాన్స్ ఇన్‌ఫ్రా 4.65%, అశోకా బిల్డ్‌కాన్ 3.66%, జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా 3.51% పెరిగాయి.

✦ ఎలక్ట్రానిక్స్ తయారీకి రూ.40,000 కోట్ల కేటాయింపులు చేయడంతో.. సైరా ఎస్‌జీఎస్ 5.95%, డిక్సన్ 4.21%, కేన్స్ 3.82%, పీజీ ఎలక్ట్రోప్లాస్ట్ 2.59%, సైయెంట్ డీఎల్ఎం 1.04% లాభపడ్డాయి.

బ్రోకరేజీ షేర్లు ఢమాల్

డెరివేటివ్స్‌పై ఎస్‌టీటీ పెంపు నేపథ్యంలో బ్రోకరేజీ సంబంధిత కంపెనీల షేర్లు నేలచూపులు చూశాయి. ఎంసీఎక్స్ 11.60%, ఏంజెల్ వన్ 8.61%, ఐఐఎఫ్ఎల్ క్యాపిటల్ 8.06%, గ్రో 5.11%, ఆనంద్ రాఠీ 2.03% క్షీణించాయి.

డెరివేటివ్ ట్రేడర్లకు
ఎస్‌టీటీ పెంపు

ఫ్యూచర్స్, ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) డెరివేటివ్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) పెంచనున్నారు. ఫ్యూచర్స్ కాంట్రాక్టులకు ఎస్‌టీటీ ప్రస్తుత 0.02% నుంచి 0.05 శాతానికి పెరగనుంది. ఆప్షన్స్‌లో ప్రీమియం, కాంట్రాక్టు క్రయవిక్రయాలపై ఎస్‌టీటీ 0.15% కానుంది. ప్రస్తుతం ప్రీమియంపై 0.1%, క్రయవిక్రయాలపై 0.125% ఎస్‌టీటీని వసూలు చేస్తున్నారు. ఎఫ్అండ్ఓ విభాగంలో అధిక స్పెక్యులేషన్‌ను నియంత్రించేందుకు, చిన్న మదుపర్లను ఈ విభాగం నుంచి దూరం చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఫ్యూచర్స్‌పై ఎస్‌టీటీ 150%, ఆప్షన్స్‌పై 50% పెంచినట్లు అయ్యింది. 2026-27లో ఎస్‌టీటీ ద్వారా రూ.73,700 కోట్లు వసూలు కావొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 2025-26లో ఎస్‌టీటీ రూపేణా రూ.63,670 కోట్లు వచ్చే అవకాశం ఉంది.

ఎఫ్ఐఐలపై ప్రభావం..: స్టాక్ మార్కెట్ వ్యవస్థలో మరింత సమతుల్యత తీసుకొచ్చేందుకు ఈ చర్య తోడ్పడనున్నప్పటికీ.. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐ) నుంచి పెట్టుబడుల రాకపై కొంత ప్రతికూల ప్రభావం చూపించొచ్చని కొందరు విశ్లేషకులు అంటున్నారు. ఈ ఏడాది జనవరిలో రూ.41,000 కోట్లను మన ఈక్విటీ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్నారు. ఎస్‌టీటీ పెంపు వల్ల డెరివేటివ్ ట్రేడ్ చేసే విదేశీ మదుపర్లు, మరింతగా మన మార్కెట్‌కు దూరమయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.

షేర్ల బైబ్యాక్‌కు మూలధన లాభాల కింద పన్ను విధింపు: బైబ్యాక్ ప్రక్రియలో షేర్ల విక్రయం ద్వారా ఆర్జించిన లాభాలను.. ఇకపై మూలధన లాభాలుగా పరిగణించి పన్ను విధించనున్నారు. అన్ని విభాగాల వాటాదార్లకు ఇది వర్తించనుంది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. ఒక కంపెనీ తన వాటాదార్ల నుంచి బైబ్యాక్ పద్ధతిలో షేర్లు కొంటే.. ఈ విక్రయం ద్వారా వచ్చిన లాభాలపైన కాకుండా, విక్రయ లావాదేవీ మొత్తానికి డివిడెండు ఆదాయం కింద పన్ను విధిస్తున్నారు. సదరు మదుపరికి వర్తించే ఆదాయపు పన్ను శ్లాబ్ కింద ఈ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. గరిష్ఠంగా ఇది 30% అవుతోంది. తాజా మార్పులతో.. మూల ధన లాభాల పన్ను స్వల్పకాలం అయితే 20%, దీర్ఘకాలం అయితే 12.5 శాతమే అవుతుంది.

ప్రమోటర్లకు అదనపు పన్ను

బైబ్యాక్ మార్గాన్ని ప్రమోటర్లు దుర్వినియోగం చేయకుండా నియంత్రించేందుకు, ప్రమోటర్లకు అదనంగా బైబ్యాక్ పన్నును ప్రభుత్వం విధించనుంది. ఈ పన్ను రేటు కార్పొరేట్ ప్రమోటర్లకు 22 శాతంగా, నాన్- కార్పొరేట్ ప్రమోటర్లకు 30 శాతంగా ఉండనుంది. ఈ రూపేణ ప్రమోటర్లకు పన్ను భారం అధికమవుతుంది కనుక.. డివిడెండు, బైబ్యాక్ కోసం మూలధన కేటాయింపు వ్యూహాలను కంపెనీలు మార్చుకునే అవకాశముంది.

డిపాజిటరీలకు డిక్లరేషన్ ఇస్తే చాలు



షేర్లు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టేవారు..డివిడెండ్ ఆదాయంపై పన్ను మినహాయింపు (టీడీఎస్) కోసం సమర్పించే ఫారం-15జీ/15హెచ్ ప్రక్రియలో ప్రభుత్వం కొత్త మార్పులు ప్రతిపాదించింది. ఇకపై ప్రతి కంపెనీకి విడివిడిగా ఈ పత్రాలు పంపాల్సిన అవసరం లేకుండా, కేంద్రీకృత సమర్పణ విధానాన్ని అందుబాటులోకి తెస్తోంది. మదుపరులు డిక్లరేషన్లను నేరుగా తమ డిపాజిటరీ (ఎన్ఎస్‌డీఎల్ లేదా సీడీఎస్ఎల్)లకు ఒక్కసారి సమర్పిస్తే సరిపోతుంది. కంపెనీలు, మ్యూచువల్ ఫండ్ సంస్థలు, రిజిస్ట్రార్లకు డిపాజిటరీనే ఆ వివరాలు అందిస్తుంది.


క్రిప్టో వివరాలు సరిగా ఇవ్వకపోతే జరిమానా: క్రిప్టో కరెన్సీల లావాదేవీల వివరాలను అందించడంలో ఆలస్యం చేసినా, సరిగా నివేదించకపోయినా రోజుకు రూ.200 జరిమానా, తప్పుడు సమాచారానికి రూ.50,000 జరిమానా విధించాలని ఆర్థిక బిల్లు ప్రతిపాదించింది.

ఎన్ఆర్ఐలకు ఊరట 'టాన్' అవసరం లేదు



ప్రవాస భారతీయుల (ఎన్ఆర్ఐ) నుంచి స్థిరాస్తులు కొనుగోలు చేయాలనుకునే భారతీయులకు నిబంధనల పరంగా కొత్త బడ్జెట్ వెసులుబాటును కల్పించింది. ఇకపై మూలం వద్ద పన్ను మినహాయింపు (టీడీఎస్)ను చెల్లించేందుకు ప్రత్యేకంగా ట్యాక్స్ అకౌంట్ నంబర్ (టాన్) తీసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొంది. కొత్త నిబంధనల ప్రకారం ఈ లావాదేవీలకు కొనుగోలుదారుని 'పాన్' (శాశ్వత ఖాతా సంఖ్య) ఉంటే సరిపోతుంది. ఈ కొత్త నిబంధన 2026 అక్టోబరు 1 నుంచి అమల్లోకి రానుంది.

రీట్స్ ద్వారా సీపీఎస్ఈల స్థిరాస్తుల అమ్మకం




కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్ఈ)ల ఆధీనంలోని స్థిరాస్తుల విక్రయాన్ని ప్రభుత్వం వేగవంతం చేయనుంది. స్థిరాస్తి పెట్టుబడుల ట్రస్టుల (రీట్స్) ఏర్పాటు ద్వారా, సీపీఎస్ఈల ఆస్తుల నగదీకరణ ప్రక్రియ చేపట్టాలని ప్రతిపాదించింది. కొన్నేళ్లుగా ఆస్తుల నగదీకరణకు రీట్స్ విజయవంతమైన మార్గంగా అవతరించింది. ప్రస్తుతం మన దేశంలో 5 నమోదిత రీట్స్- బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్, నాలెడ్జ్ రియాల్టీ ట్రస్ట్ ఉన్నాయి.

కీలక ఖనిజాలకు పన్ను మినహాయింపు
ఏపీ సహా కొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక కారిడార్ల ఏర్పాటు



గనుల తవ్వకం, ప్రాసెసింగ్, పరిశోధన, తయారీకి ప్రోత్సాహం ఇచ్చేందుకు.. ఖనిజ నిక్షేపాలు ఎక్కువగా ఉన్న ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక కారిడార్లు ఏర్పాటు చేస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. కీలక ఖనిజాల ప్రాసెసింగ్‌కు ఉపయోగించే యంత్ర పరికరాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తున్నట్లు తెలిపారు. అరుదైన భూఅయస్కాంత/కీలక ఖనిజాల దిగుమతిని తగ్గించుకునేందుకు ఇది ఉపయోగ పడుతుంది.

పసిడి బాండ్ల నిబంధనల్లోనూ మార్పులు



పెట్టుబడి కోసం బంగారాన్ని లోహం రూపంలో కొనడానికి బదులు, సార్వభౌమ పసిడి బాండ్లు (ఎస్‌జీబీ)గా కొనుగోలు చేసుకోమని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. వీటి మెచ్యూరిటీపై వచ్చే మొత్తానికి పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు కూడా. అయితే ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ నిబంధనల్లో మార్పులొస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి నేరుగా కొనుగోలు చేసి, మెచ్యూరిటీ గడువు తీరే వరకు ఉంచుకునే వారికి మాత్రమే, మెచ్యూరిటీపై పన్ను మినహాయింపు లభిస్తుంది. 2026-27 పన్ను ఏడాది, తదుపరి కాలంలో ఇది వర్తిస్తుంది. అంటే ఈ బాండ్లను మధ్యలో కొనుగోలు చేసిన వారికి, మెచ్యూరిటీ సమయంలో పన్ను మినహాయింపు లభించదు. వారు కొనుగోలు చేసిన ధర, అమ్మిన ధర మధ్య వ్యత్యాసంపై మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి వస్తుంది.

కంటైనర్ల తయారీ పథకానికి రూ.10,000 కోట్లు



కంటైనర్ తయారీని దేశీయంగా ప్రోత్సహించడానికి అయిదేళ్ల కాలవ్యవధితో రూ.10,000 కోట్లు కేటాయిస్తున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. పర్యావరణ హితంగా సరకు తరలించడానికి వీలుగా.. నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల (సీఐఈ) మెరుగుదల కోసం ఒక పథకాన్ని ప్రవేశపెడతామని మంత్రి తెలిపారు. కంటైనర్ తయారీ సహాయ పథకం రాబోయే పదేళ్లలో 10 లక్షల టీఈయూ (20 అడుగుల సమాన యూనిట్)ల వార్షిక దేశీయ తయారీ సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం వల్ల రూ.80,000 కోట్ల విలువైన మార్కెట్ లభించి, ప్రత్యక్షంగా 3,000 మందికి, పరోక్షంగా 50,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఈ పథకంలో పాల్గొనడానికి ఎంఎస్‌సీ, టాటా, అదానీ, జేఎం బాక్సీ ఆసక్తి చూపుతున్నాయి.

✦ బొగ్గు, ఇనుపఖనిజం విక్రయం సమయంలో వసూలు చేసే పన్ను (టీసీఎస్)ను 1% నుంచి 2% చేయనున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు.

సీప్లేన్‌లు.. దూసుకెళతాయ్

● సంస్థల మనుగడకు ప్రత్యేక నిధి

● విమాన విడిభాగాలకు సుంకం మినహాయింపులు



దేశంలో విమాన అనుసంధానతను పెంచడం, విమాన తయారీకి ఊతమిచ్చేందుకు, సీప్లేన్ కార్యకలాపాలకు సహకారం అందించేందుకు బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు చేశారు.

❑ పౌర, శిక్షణ, ఇతర విమానాల తయారీలో వాడే విడిభాగాలు, సామగ్రిపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. ఎమ్ఆర్ఓ (నిర్వహణ, మరమ్మతు, ఓవరాల్) సామర్థ్యాన్ని ఇది బలోపేతం చేస్తుంది.

❑ మారుమూల ప్రాంతాలకు విమాన అనుసంధానతను విస్తరించేందుకు, పర్యాటకానికి ప్రోత్సాహం ఇచ్చేందు కోసం సీప్లేన్ కార్యకలాపాలకు 'సీప్లేన్ వయబులిటీ గ్యాప్ ఫండింగ్(వీజీఎఫ్) స్కీమ్'ను ప్రకటించారు.

❑ అంతర్జాతీయ ప్రయాణాల్లో బ్యాగేజీ క్లియరెన్స్‌కు ఉన్న నిబంధనలను సవరించనున్నట్లు తెలిపారు. ఈ నిబంధనల కింద డ్యూటీ ఫ్రీ అలవెన్సులు పెరుగుతాయి.

'ఛాంపియన్' ఎమ్ఎస్ఎమ్ఈలకు రూ.10,000 కోట్లు



సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి కంపెనీ (ఎమ్ఎస్ఎమ్ఈ)లను 'ఛాంపియన్'లుగా తయారు చేసే నిమిత్తం మూడు దశల వ్యూహాన్ని ప్రతిపాదించిన ఆర్థిక మంత్రి.. రూ.10,000 కోట్ల నిధినీ ప్రకటించారు. ఆర్థిక వృద్ధి కర్తవ్యంలో భాగంగా 'ఛాంపియన్ ఎమ్ఎస్ఎమ్ఈ'లను సృష్టించనున్నట్లు తెలిపారు. ఈక్విటీ - ద్రవ్య లభ్యత - వృత్తిపరంగా సహకారం ఇచ్చేందుకు రూ.10,000 కోట్ల ఎస్ఎమ్ఈ గ్రోత్ ఫండ్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు.

✦ 2021లో ఏర్పాటు చేసిన 'సెల్ఫ్ రిలయంట్ ఇండియా ఫండ్'కు రూ.2000 కోట్లు జత చేయడం ద్వారా సూక్ష్మ కంపెనీలకు రిస్క్ క్యాపిటల్ లభించేలా చూస్తారు.

✦ టీఆర్ఈడీఎస్ ద్వారా ఎమ్ఎస్ఎమ్ఈలకు రూ.7 లక్షల కోట్లకు పైగా అందుబాటులో ఉండేలా చేస్తారు. కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీ(సీపీఎస్ఈ)లు ఎమ్ఎస్ఎమ్ఈల నుంచి కొనుగోలు చేసే అన్ని లావాదేవీలకు, సెటిల్‌మెంట్ ప్లాట్‌ఫాంగా టీఆర్ఈడీఎస్‌ను తప్పనిసరి చేశారు. మానవ వనరుల సరఫరా కోసం సరళీకృత టీడీఎస్ నిబంధనలు అమలు చేస్తారు.

మోదీ హయాంలో బడ్జెట్ రోజున ఇదే భారీ పతనం

నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఇప్పటివరకు కేంద్ర బడ్జెట్ రోజుల్లో స్టాక్‌మార్కెట్ కదలికలను గమనిస్తే, ఈసారే అత్యధిక నష్టాన్ని మూటగట్టుకున్నాయి. కొవిడ్ పరిణామాల నాటి 2020-21 బడ్జెట్ కంటే కూడా, ఈసారే సెన్సెక్స్ అధికంగా నష్టపోయింది. మోదీ హయాంలో బడ్జెట్ రోజున సెన్సెక్స్ కదలికలు ఇలా..

బడ్జెట్ తేదీ	ప్రారంభం	ముగింపు	లాభం/నష్టం
01.02.2026	82,388.97	80,722.94	-1546.84
01.02.2025	77,637.01	77,505.96	746.15
23.07.2024	80,724.30	80,429.04	-73.04
01.02.2024*	71998.78	71645.3	-106.81
01.02.2023	60001.17	59708.08	158.18
01.02.2022	58,672.86	58862.57	848.4
01.02.2021	46617.95	48600.61	2314.84
01.02.2020	40753.18	39735.53	-987.96
05.07.2019	39908.06	39,513.39	-394.67
01.02.2019*	36256.69	36469.43	212.74
01.02.2018	35965.02	35906.66	-58.36
01.02.2017	27655.96	28141.64	485.68
29.02.2016	23154.3	23002	-152.3
8.02.2015	29220.12	29361.5	141.38
10.07.2014	25444.81	25372.75	-72.06

* మధ్యంతర బడ్జెట్

విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించేలా..



దేశీయ స్టాక్ మార్కెట్లలో ద్రవ్య లభ్యతను (లిక్విడిటీ) పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై భారత దేశం వెలుపల నివసించే వ్యక్తులు (పీఆర్ఓఐ) కూడా దేశీయ ఈక్విటీల్లో పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ పథకాల ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు అనుమతిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. పోర్ట్‌ఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్ ద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైన భారతీయ కంపెనీల షేర్లలో పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. సులభతర వాణిజ్య నిర్వహణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

✦ ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం విదేశాల్లో నివసించే ఒక వ్యక్తి (పీఆర్ఓఐ) భారత్‌లోని ఏదైనా ఒక లిస్టెడ్ కంపెనీ మొత్తం షేర్లలో 5% వరకు మాత్రమే కొనే అవకాశం ఉండేది. తాజాగా ఈ పరిమితిని 10 శాతానికి పెంచారు. అంటే, ఒక పీఆర్ఓఐ భారతీయ కంపెనీలో 10% వరకు వాటా కొనొచ్చు.

✦ కేవలం ఒక్క వ్యక్తికి మాత్రమే కాకుండా, విదేశాల్లో నివసించే వ్యక్తులందరూ, దేశీయంగా ఒక కంపెనీలో పెట్టే పెట్టుబడి మొత్తం పరిమితినీ ప్రభుత్వం పెంచింది. ఇది ఇప్పటి వరకు 10 శాతంగా ఉండగా, 24% చేయనున్నారు. ఈ నిర్ణయంతో దేశంలోకి విదేశీ పెట్టుబడులు పెరుగుతాయని, భారతీయ కరెన్సీ స్థిరీకరణకు దోహదం చేస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. పూర్తి విధివిధానాలు వెల్లడైన తర్వాతే దీని ప్రభావాన్ని అంచనా వేయగలమని, అప్పటి వరకు దీనిని సానుకూల అంశంగానే చూడాలని పేర్కొంటున్నారు.

'పునరుత్పాదక ఇంధనానికి' భారీ కేటాయింపులు



పర్యావరణ హిత - అణు విద్యుదుత్పత్తికి నూతన బడ్జెట్‌లో భారీ ప్రోత్సాహకాలను ఆర్థికమంత్రి ప్రకటించారు. కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) టెక్నాలజీస్ కోసం రూ.20,000 కోట్లు కేటాయించారు. అణు విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్(బీఈఎస్ఎస్), సోడియం యాంటిమోనేట్‌లో పెట్టుబడులను ప్రోత్సహించడం కోసం కస్టమ్స్ సుంకం మినహాయింపులను ప్రతిపాదించారు. 2030 కల్లా 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన లక్ష్యం దిశగా వేసిన అత్యంత ప్రాధాన్యమైన అడుగుగా దీనిని భావించొచ్చు.


సీసీయూఎస్‌తో ఇదీ ఉపయోగం: సీసీయూఎస్ సాంకేతికతల ద్వారా కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలోకి అడుపెట్టకుండా చూడొచ్చు. విద్యుత్, ఉక్కు, సిమెంటు, రిఫైనరీలు, రసాయనాల రంగాల్లో ఎండ్-యూజ్ అప్లికేషన్లలో వీటిని వినియోగిస్తారు. వచ్చే అయిదేళ్లకు సీసీయూఎస్ ఏర్పాటుకు రూ.20,000 కోట్లు కేటాయించారు.

'బ్యాటరీ'కి పన్ను మినహాయింపులు: బ్యాటరీల్లో వాడే లిథియం అయాన్ సెల్స్ తయారీలో వినియోగించే యంత్రపరికరాలకు ప్రాథమిక కస్టమ్స్ సుంకం మినహాయింపును కొనసాగించారు.

ఎలక్ట్రానిక్స్ తయారీకి రూ.40,000 కోట్లు

ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఈసీఎంఎస్)కు మంచి స్పందన రావడంతో, కేటాయింపులను రెట్టింపు చేసి, రూ.40,000 కోట్లకు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. 2025 ఏప్రిల్‌లో ఈ పథకాన్ని రూ.22,919 కోట్లతో ప్రారంభించారు. ఈ ఏడాది జనవరి వరకు ఈ పథకం కోసం ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖకు రూ.54,567 కోట్ల విలువైన 46 దరఖాస్తులు వచ్చాయి. వీటితో దాదాపు 51,000 ఉద్యోగాల సృష్టి జరగనుంది. శామ్‌సంగ్, టాటా ఎలక్ట్రానిక్స్, డిక్సన్, ఫాక్స్‌కాన్‌కు చెందిన యుజన్ టెక్నాలజీ, ఏటీఎల్ బ్యాటరీ, మదర్సన్ ఎలక్ట్రానిక్, కేన్స్, అంబర్ ఎలక్ట్రానిక్స్ వంటి సంస్థలు ఇందులో పాల్గొంటున్నాయి.

రూ.6.76 లక్షల కోట్ల మొబైళ్ల తయారీ: దేశంలో మొబైళ్ల తయారీ ఉత్పత్తి విలువ గత దశాబ్దంలో 30 రెట్లు అధికమైంది. 2014-15లో ఈ విలువ రూ.18,000 కోట్లు కాగా, 2024-25లో రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. భారత్ నుంచి ఐఫోన్ ఎగుమతులు 2024లో రూ.1.1 లక్షల కోట్లుగా ఉంటే, 2025లో రూ.2.03 లక్షల కోట్లకు పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేసరికి మొత్తం మొబైల్ ఫోన్ల ఉత్పత్తి విలువ రూ.6.76 లక్షల కోట్లకు చేరొచ్చని అంచనా. 2025 ఆగస్టు నాటికి ఆరు రాష్ట్రాల్లో దాదాపు రూ.1.6 లక్షల కోట్ల పెట్టుబడులతో 10 సెమీకండక్టర్ తయారీ, ప్యాకేజింగ్ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది.



ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0: దేశంలో చిప్ తయారీ వ్యవస్థలను ప్రోత్సహించే లక్ష్యంతో 'ఇండియా సెమీకండక్టర్ మిషన్' తదుపరి దశను ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో హై-టెక్ విడిభాగాలను ఉత్పత్తి చేయడానికి అవసరమైన పరికరాలు, మెటీరియల్స్, స్వదేశీ డిజైన్లు, ఇతర భాగాలు ఉంటాయి. పరిశోధన, శిక్షణ కేంద్రాల నుంచి టెక్నాలజీ, నైపుణ్యాల అభివృద్ధిపై ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0 దృష్టి పెడుతుందని ఆర్థిక మంత్రి తెలిపారు.

అదనపు ఎక్సైజ్ సుంకం.. సిగరెట్లు ప్రియం



అదనపు ఎక్సైజ్ సుంకం అమల్లోకి రావడంతో, ఆదివారం నుంచి సిగరెట్ల ధరలు పెరిగాయి. 10 చిన్న సిగరెట్ల ప్యాకెట్ ధర కనీసం రూ.22-25 పెరిగింది. అంటే ఒక్కో సిగరెట్‌పై రూ.2.20-2.50 అదనపు భారం పడింది. బ్రాండ్ ఆధారంగా 76 మి.మీ. పొడవున్న ప్రీమియం 10 సిగరెట్ల ప్యాకెట్ ధర రూ.50-55 మధ్య పెరిగింది. అంటే ఒక్కోటి రూ.5.50 వరకు భారమవుతుంది. సవరించిన ఎంఆర్‌పీ ధరలను తయారీదార్లు జారీ చేయనప్పటికీ, పంపిణీదార్లు పాత స్టాక్‌పైనా కొత్త ధరలతో బిల్లింగ్ చేయడం మొదలుపెట్టారు.

✦ పాన్ మసాలా తయారీపై విధించిన ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్‌తో వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో రూ.14,000 కోట్లు ఖజానాకు సమకూరుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

2026-27 ద్రవ్య లోటు లక్ష్యం 4.3%




వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో ద్రవ్య లోటు లక్ష్యాన్ని, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 4.3 శాతానికి పరిమితం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లక్ష్యం నిర్దేశించుకున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇది 4.4 శాతంగా ఉంది. జీడీపీలో రుణాల నిష్పత్తి 2026-27 బడ్జెట్ అంచనాల్లో 55.6 శాతంగా ఉండొచ్చని అంచనా. 2025-26 సవరించిన అంచనాల్లో ఇది 56.1%. రుణ-జీడీపీ నిష్పత్తి తగ్గితే, వడ్డీ చెల్లింపులపై వ్యయాలను తగ్గించడం ద్వారా ప్రాధాన్యత రంగ వ్యయాలకు వనరులు సమకూర్చుకునేందుకు అవకాశం ఉంటుందని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం బడ్జెట్‌లో వడ్డీలకే 20% కేటాయిస్తుండటం గమనార్హం. 2021-22లో ప్రతిపాదించిన ప్రకారం 2025-26లో ద్రవ్య లోటును జీడీపీలో 4.5% దిగువకు తీసుకురాగలగడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

2047 వరకు విదేశీ క్లౌడ్ కంపెనీలకు 'ట్యాక్స్ హాలీడే'



మన దేశంలో ఉన్న డేటా కేంద్రాలను ఉపయోగించి, స్థానికంగా - ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారులకు క్లౌడ్ సేవలను అందించే విదేశీ కంపెనీలకు 2047 వరకు 'ట్యాక్స్ హాలీడే' (పన్ను విరామం) ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. నిర్దేశిత సమయం వరకు కంపెనీలకు పన్ను మినహాయింపులు ఇచ్చే విధాన సౌలభ్యాన్ని 'ట్యాక్స్ హాలీడే'గా పరిగణిస్తారు. డేటా కేంద్రాలపై మన దేశం దూకుడుగా ముందుకెళ్తున్న సమయంలో ఈ ప్రకటన వెలువడింది. కీలకమైన మౌలిక సదుపాయాలను ప్రారంభించడం, డేటా కేంద్రాల్లో పెట్టుబడులకు ఊతమివ్వాల్సిన అవసరాన్ని గుర్తించి, క్లౌడ్ సేవలు అందించే విదేశీ కంపెనీలకు ట్యాక్స్ హాలీడే ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. భారత్ నుంచి డేటా కేంద్రం సేవలను అందించే కంపెనీ, అనుబంధ సంస్థ అయితే ఖర్చుపై 15% సేఫ్ హార్బర్ (పన్ను తగ్గింపు)ను అందించనున్నాం' అని తెలిపారు.

ప్రభుత్వరంగ విద్యుత్తు సంస్థలకు 19% అధిక నిధులు



ప్రభుత్వరంగంలోని 9 విద్యుత్తు సంస్థలకు 2026-27 బడ్జెట్ కేటాయింపులు 19% పెంచి, రూ.1.01 లక్షల కోట్లు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ.85,828.93 కోట్లుగా ఉన్నాయి. ఎన్‌టీపీసీకి రూ.31,000 కోట్లు, పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు రూ.37,000 కోట్లు, ఎస్‌జేవీఎన్‌కు రూ.9416 కోట్లు, ఎన్‌హెచ్‌పీసీకి రూ.14,323.49 కోట్లు, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్‌కు రూ.5553 కోట్లు కేటాయించారు.

కోడి గుడ్డు
2న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	485	తూ/ప గోదావరి	467
వరంగల్	487	విశాఖపట్నం	490
విజయవాడ	500	చిత్తూరు	573

ఛాంపియన్

ప్రపంచకప్‌లో భారత్, పాక్ మ్యాచ్ లేదు



టీమ్‌ఇండియాతో ఆడమన్న దాయాది

లాహోర్: టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో లీగ్ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. అనిశ్చితికి తెరదించుతూ టోర్నీలో పోటీపడడానికి పాకిస్థాన్ జట్టుకు ఆ దేశ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ భారత్‌తో మాత్రం మ్యాచ్ ఆడబోమంటూ తమ నిర్ణయాన్ని ఎక్స్‌లో వెల్లడించింది. "2026 టీ20 ప్రపంచకప్‌లో ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ జట్టుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ ఫిబ్రవరి 15న భారత్‌తో మ్యాచ్‌లో మాత్రం పాక్ ఆడదు" అని పాకిస్థాన్ ప్రభుత్వం పేర్కొంది. టీమ్‌ఇండియాతో మ్యాచ్‌ను బహిష్కరించడానికి కారణాన్ని మాత్రం పాక్ చెప్పలేదు. కానీ బంగ్లాదేశ్‌కు మద్దతుగానే పాక్ ఈ నిర్ణయం తీసుకుందని అర్థమవుతోంది. భద్రత కారణాలతో ప్రపంచకప్‌లో తమ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలన్న తమ డిమాండ్‌ను ఐసీసీ అంగీకరించకపోవడంతో బంగ్లాదేశ్.. టోర్నీ నుంచి వైదొలగిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పాక్ బంగ్లాకు మద్దతుగా మాట్లాడుతోంది. టోర్నీని బహిష్కరిస్తామని కవ్విస్తూ, భారత్‌లో మ్యాచ్‌లు ఆడమని ఇంకొన్నిసార్లు బెదిరించింది. టీ20 ప్రపంచకప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న సంగతి తెలిసిందే. పాక్ తన మ్యాచ్‌లన్నింటిని శ్రీలంకలోనే ఆడనుంది. ఐసీసీ ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ స్థానాన్ని స్కాట్లాండ్‌తో భర్తీ చేసింది. టోర్నీ ఈ నెల 7న మొదలు కానుంది.

నాకౌట్లో తలపడాల్సివస్తే..

భారత్‌తో మ్యాచ్ (గ్రూప్-ఎ)ను పాకిస్థాన్ బహిష్కరించడంపై ఐసీసీ ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరం. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై ఆర్థికపరమైన జరిమానాలు విధించడం మాత్రం ఖాయం. ఏ ఐసీసీ టోర్నీలో అయినా ఈ చిరకాల ప్రత్యర్థుల మధ్య పోరుపై ఎంతో ఆసక్తి ఉంటుంది. అత్యధిక మంది వీక్షించే మ్యాచ్ అదే అవుతుంది. అందుకే ఐసీసీ ఎప్పుడూ.. రెండు జట్లూ ఒకే గ్రూప్‌లో ఉండేలా చూస్తుంది. ఇప్పుడు పాకిస్థాన్ వాకోవర్‌తో భారత్‌కు పూర్తి పాయింట్లు లభిస్తాయి. పాక్ నెట్‌రన్‌రేట్ బాగా దెబ్బతింటుంది. కానీ రెండు జట్లు ఒకవేళ నాకౌట్లో ఎదురైతే ఏం జరుగుతుందన్న ప్రశ్నకు మాత్రం ప్రస్తుతానికి జవాబు లేదు. భారత్, పాక్‌తో పాటు నమీబియా, నెదర్లాండ్స్, అమెరికా గ్రూప్-ఎలో ఉన్నాయి. ఈ నెల 7న అమెరికాతో పోరుతో టీమ్‌ఇండియా ప్రపంచకప్ వేటను ఆరంభిస్తుంది. పాకిస్థాన్ కూడా అదే రోజు నెదర్లాండ్స్‌తో తన మొదటి మ్యాచ్ ఆడుతుంది.

విజేత హైదరాబాద్ హీరోస్

ఈనాడు స్పోర్ట్స్ లీగ్ క్రికెట్

జూనియర్స్‌తో పాటు సీనియర్స్‌లోనూ టైటిల్



సీనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన హైదరాబాద్ హీరోస్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న రాజమౌళి, పచ్చల శివశంకరరావు, భరణి, డాక్టర్ సలీం, విక్రం అజయ్‌బాబు, మల్లవరపు బాలలత, విక్రం నారాయణరావు, వై.వి.ఆంజనేయులు తదితరులు



జూనియర్స్ విభాగంలో విజేతగా నిలిచిన హైదరాబాద్ హీరోస్ జట్టు



జూనియర్స్‌లో 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచి, బైక్ బహుమతిగా అందుకున్న ఆదిత్య

గుంటూరు క్రీడలు - న్యూస్‌టుడే

రెండు తెలుగు రాష్ట్రాల యువ క్రికెటర్ల ప్రతిభను చాటుకోవడానికి గొప్ప వేదికగా నిలిచిన 'ధనిక్ భారత్' ప్రెజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్) క్రికెట్ టోర్నమెంట్లో 'హైదరాబాద్ హీరోస్' రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌గా నిలిచింది. జూనియర్స్, సీనియర్స్ రెండు విభాగాల్లోనూ హైదరాబాద్ హీరోస్ జట్లే టైటిళ్లు గెలిచాయి. గుంటూరు జిల్లా నంబూరులోని ఎం.ఎస్.కె.ప్రసాద్ క్రికెట్ అకాడమీ మైదానంలో ఆదివారం జరిగిన జూనియర్స్ ఫైనల్లో హైదరాబాద్ హీరోస్ 9 వికెట్ల తేడాతో సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ 15.4 ఓవర్లలో 59 పరుగులకు ఆలౌటైంది. రామ్‌చరణ్ (15) టాప్‌స్కోరర్. హనీ 3.4 ఓవర్లలో 9 పరుగులే ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. 60 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 7 ఓవర్లలో ఒక్క వికెట్టే కోల్పోయి ఛేదించింది. ఆదిత్య 29 బంతుల్లోనే 50 పరుగులు చేసి జట్టుకు విజయాన్నందించాడు. అతను 4 ఫోర్లు, 4 సిక్సర్లు కొట్టాడు. 'ఈనాడు' క్రికెట్ టోర్నమెంట్లో హైదరాబాద్ హీరోస్ జట్టు వరుసగా ఆరుసార్లు ఫైనల్స్‌లో నెగ్గి, డబుల్ హ్యాట్రిక్ సాధించడం విశేషం.

సీనియర్స్ ఫైనల్లో వాకోవర్: మరోవైపు సీనియర్స్ విభాగంలో రాయలసీమ రాకర్స్ జట్టు వాకోవర్ ఇవ్వడంతో హైదరాబాద్ హీరోస్‌కు ట్రోఫీ దక్కింది. టోర్నీలో తెలుగు రాష్ట్రాల నుంచి సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో 1047 జట్లు పోటీ పడ్డాయి. విజేతలకు సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎ.రాజమౌళి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఎస్.భరణి, ధనిక్ భారత్ విద్యా సంస్థల ఛైర్మన్ విక్రం నారాయణరావు, డైరెక్టర్లు మల్లవరపు బాలలత, విక్రం అజయ్‌బాబు, సలీం, చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు, ఎస్‌ఈసీసీ ఛైర్మన్ శివశంకరరావు, 'ఈనాడు' ఏపీ బ్యూరో ఇన్‌ఛార్జి కనపర్తి శ్రీనివాస్, గుంటూరు యూనిట్ ఇన్‌ఛార్జి వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు. విజేత జట్లకు రూ.లక్ష చొప్పున నగదు బహుమతి దక్కింది. జూనియర్స్‌లో ఆదిత్య (హైదరాబాద్ హీరోస్-283 పరుగులు), సీనియర్స్‌లో శశాంక్ (రాయలసీమ రాకర్స్-108 పరుగులు, 3 వికెట్లు) 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికై, హీరో బైక్‌లు గెలుచుకున్నారు.

కొట్టేశాడు కెరీర్‌స్లామ్

అల్కరాస్‌దే ఆస్ట్రేలియన్ ఓపెన్



అల్కరాస్

- 4 గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన పిన్న వయస్కుడిగా రికార్డు

జకోవిచ్‌కు నిరాశే



జకోవిచ్

జకోవిచ్‌కు ఆశాభంగం. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కోసం అతడి నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. మెల్‌బోర్న్ పార్క్‌లో అల్కరాస్‌దే పైచేయి. ఫైనల్లో జకోవిచ్‌ను ఓడించి ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను గెలుచుకున్న ఈ ప్రపంచ నంబర్‌వన్.. అతిపిన్నవయసులో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.

మెల్‌బోర్న్

స్పెయిన్ వీరుడు కార్లోస్ అల్కరాస్ తన ఖాతాలో లేని ఆ ఒక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ప్రపంచ టెన్నిస్‌పై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో అల్కరాస్ 2-6, 6-2, 6-3, 7-5తో పదిసార్లు ఛాంపియన్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా)పై విజయం సాధించాడు. తొలి సెట్‌ను కోల్పోయాక అల్కరాస్ బలంగా పుంజుకున్నాడు. పదునైన సర్వీసులు చేసిన అతడు మ్యాచ్‌లో 9 ఏస్‌లు సంధించాడు. 36 విన్నర్లు కొట్టాడు. అల్కరాస్ అయిదుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేశాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఓడడం మాజీ నంబర్‌వన్ జకోవిచ్‌కు ఇదే తొలిసారి. ఇంతకుముందు ఫైనల్ చేరిన పదిసార్లూ అతడు విజేతగా నిలిచాడు. ఈసారి ఫైనల్లో అతడు 46 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. అల్కరాస్ 27 అనవసర తప్పిదాలు మాత్రమే చేశాడు. "ఈ ట్రోఫీ కోసం నేను ఎంత కష్టపడ్డానో ఎవరికీ తెలియదు. ఈ క్షణం కోసం ఎంతో తపించాను" అని ఫైనల్ అనంతరం అల్కరాస్ వ్యాఖ్యానించాడు.

అల్కరాస్ అదరహో..: ఆటగాళ్లిద్దరూ కూడా సెమీఫైనల్స్‌లో అయిదు సెట్ల పాటు హోరాహోరీగా సాగిన సమరాల్లో గెలిచారు. మూడు గంటలకు పైగా ఆడినా వాళ్లు తమ ఫిట్‌నెస్‌ను చాటుకున్నారు. ఈ నేపథ్యంలో ఫైనల్ ఎంతో ఆసక్తి రేపింది. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను ఆశించిన జకోవిచ్.. టైటిల్ పోరును ఆత్మవిశ్వాసంతో మొదలెట్టాడు. ఎలాంటి పొరపాట్లకు అవకాశమివ్వకుండా తొలి సెట్లో ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. నాలుగో గేమ్‌లో బ్రేక్‌తో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన అతడు.. ఆ తర్వాత పట్టు సడలించలేదు. కచ్చితత్వంతో కూడిన షాట్లతో కడవరకూ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుని సెట్‌ను చేజిక్కించుకున్నాడు. ఈ సెట్లో అతడి సర్వీసు అద్భుతం. 93 శాతం పాయింట్లను తొలి సర్వీసులోనే గెలిచాడు. కానీ తొలి సెట్ చేజారాక అల్కరాస్ అద్భుతంగా పుంజుకున్నాడు. రెండో సెట్ మూడో గేమ్‌లో బ్రేక్ సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. అక్కడి నుంచి సర్వీసులో జకోవిచ్ తడబాటు మొదలైంది. తిరిగి ఏడో గేమ్‌లోనూ ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసిన అల్కరాస్ సెట్‌ను గెలుచుకుని స్కోరు సమం చేశాడు. అతడు మూడో సెట్లోనూ అదే జోరు కొనసాగించాడు. అయిదు, తొమ్మిదో గేముల్లో బ్రేకులతో ఆ సెట్‌ను గెలిచాడు. అయితే నాలుగో సెట్ హోరాహోరీగా సాగింది. పట్టుదలగా ఆడిన నొవాక్ రెండో గేమ్‌లో ఆరు బ్రేక్ పాయింట్లు కాచుకున్నాడు. ఇద్దరూ సర్వీసులు నిలబెట్టుకోవడంతో 4-4తో సమమయ్యారు. తొమ్మిదో గేమ్‌లో జకోవిచ్ ఓ బ్రేక్ పాయింట్ సంపాదించినా.. దాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఇవ్వలేదు అల్కరాస్. ఇద్దరూ నువ్వానేనా అన్నట్లు తలపడడంతో మ్యాచ్ టైబ్రేక్‌కు వెళ్తుందేమో అనిపించింది. కానీ కీలక సమయంలో జకోవిచ్ తడబడ్డాడు. 11వ గేమ్‌లో సర్వీసు నిలబెట్టుకుని 6-5తో నిలిచిన అల్కరాస్.. 12వ గేమ్‌లో నొవాక్ సర్వీస్‌ను బ్రేక్ చేసి సెట్‌ను, టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

22 ఏళ్ల వయసులో..

తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను చేజిక్కించుకున్న అల్కరాస్.. కెరీర్ గ్రాండ్‌స్లామ్‌ను పూర్తి చేశాడు. పురుషుల టెన్నిస్‌లో ఈ ఘనత సాధించిన అతి పిన్నవయస్కుడిగా అతడు రికార్డు సృష్టించాడు. 88 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టాడు. ఇప్పటివరకు ఈ రికార్డు అమెరికాకు చెందిన డాన్ బడ్జ్ పేరిట ఉంది. 1938లో 22 ఏళ్ల 363 రోజుల వయసులో అతడు కెరీర్‌స్లామ్ సాధించాడు. ఇప్పుడు 22 ఏళ్ల 272 రోజుల వయసులో అల్కరాస్ ఆ రికార్డును సొంతం చేసుకున్నాడు. అతడి ఖాతాలో ప్రస్తుతం ఏడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు ఉన్నాయి. అల్కరాస్ ఇంతకుముందు రెండేసి వింబుల్డన్, ఫ్రెంచ్ ఓపెన్, యుఎస్ ఓపెన్ టైటిళ్లు చేజిక్కించుకున్నాడు. మొత్తం నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లూ గెలవడాన్ని 'కెరీర్ గ్రాండ్‌స్లామ్' అంటారు. ఈ ఘనత సాధించిన తొమ్మిదో ఆటగాడు అల్కరాస్. ఈ జాబితాలో జకోవిచ్, ఫెదరర్, నాదల్ కూడా ఉన్నారు.

రాజమార్గంలో సెమీస్‌కు

- పాక్‌పై యువ భారత్ ఘనవిజయం
- అండర్-19 వన్డే ప్రపంచకప్

బులవాయో

అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌తో యువ భారత్‌కు కీలక పోరు. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ 47 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయింది. రెండు నెలల కిందట ఆసియా కప్ ఫైనల్లో ఎదురైన ఫలితమే పునరావృతం కాబోతోందా అని అభిమానుల్లో సందేహాలు! కానీ ఆయుష్ మాత్రే బృందం.. ఆరంభ తడబాటును అధిగమించి అద్భుత విజయాన్నందుకుంది. తాను సెమీస్ చేరడమే కాక, పాక్‌ను ఇంటిముఖం పట్టించి ఆసియా కప్ ఓటమికి ఘనంగా ప్రతీకారం తీర్చుకుంది. ఈ మ్యాచ్ ఓడినా, ఓటమి తేడా తక్కువ ఉంటే భారత్ ముందంజ వేసేదే. కానీ కుర్రాళ్లు విజయంతో రాజమార్గంలోనే సెమీస్ చేరారు. ఈ గెలుపుతో సూపర్‌సిక్సెస్ గ్రూప్-2లో భారత్‌కు అగ్రస్థానం దక్కింది. ఇంగ్లాండ్ రెండో స్థానంలో నిలిచింది. బుధవారం రెండో సెమీస్‌లో భారత్.. అఫ్గానిస్థాన్‌ను ఢీకొంటుంది. మంగళవారం తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ తలపడతాయి.

ఆదివారం సూపర్ సిక్సెస్ చివరి మ్యాచ్‌లో భారత్ 58 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. మొదట భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. వైభవ్ సూర్యవంశీ (30; 22 బంతుల్లో 5×4, 1×6) జట్టుకు శుభారంభాన్నే అందించినప్పటికీ.. అబ్దుల్ సుభాన్ (3/33), మహ్మద్ సయ్యమ్ (2/69)ల ధాటికి తడబడ్డ భారత్ 47 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే డకౌటయ్యాడు. ఆరోన్ జార్జ్ (16) కూడా విఫలమయ్యాడు. అయితే వేదాంత్ త్రివేది (68; 98 బంతుల్లో 2×4, 1×6) గొప్ప పట్టుదలతో బ్యాటింగ్ చేసి జట్టును ఆదుకున్నాడు. అంబ్రిష్ (29), కనిష్క్ (35) కూడా విలువైన పరుగులు సాధించడంతో భారత్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది. 33.3 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదిస్తే సెమీస్ చేరే స్థితిలో పాక్ బాగానే పోరాడినప్పటికీ.. మధ్య ఓవర్లలో తడబడి కనీసం మ్యాచ్ కూడా గెలవలేకపోయింది. ఆ జట్టు 46.2 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌటైంది. హంజా జహూర్ (42), ఉస్మాన్‌ఖాన్ (66), ఫర్హాన్ యూసఫ్ (38) రాణించడంతో పాక్.. ఒక దశలో 151/3తో గెలుపు దిశగా సాగింది. అయితే బ్యాటింగ్‌లో విఫలమైన కెప్టెన్ ఆయుష్ మాత్రే (3/21).. బౌలింగ్‌లో విజృంభించి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అతను చకచకా 3 వికెట్లు తీసి పాక్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. ఖిలాన్ పటేల్ (3/35) కూడా విజృంభించడంతో పాక్‌కు ఓటమి తప్పలేదు.



వేదాంత్ త్రివేది

భారత్ ఇన్నింగ్స్: ఆరోన్ (బి) అబ్దుల్ 16; వైభవ్ (సి) జహూర్ (బి) సయ్యమ్ 30; ఆయుష్ (సి) జహూర్ (బి) సయ్యమ్ 0; వేదాంత్ (సి) ఫర్హాన్ (బి) ఖమర్ 68; విహాన్ (సి) అండ్ (బి) అహ్మద్ 21; కుండు (సి) అబ్దుల్ (బి) అలీ హసన్ 16; అంబ్రిష్ (సి) జహూర్ (బి) అలీ రాజా 29; కనిష్క్ (సి) సమీర్ (బి) అబ్దుల్ 35; ఖిలాన్ (బి) అబ్దుల్ 21; దీపేశ్ రనౌట్ 1; హెనిల్ నాటౌట్ 1 ఎక్స్‌ట్రాలు 14 **మొత్తం:** (49.5 ఓవర్లలో ఆలౌట్) **252;** **వికెట్ల పతనం:** 1-47, 2-47, 3-47, 4-109, 5-147, 6-182, 7-200, 8-250, 9-251; **బౌలింగ్:** అలీ రాజా 10-0-56-1; సయ్యమ్ 10-1-69-2; అబ్దుల్ 9.5-1-33-3; అహ్మద్ 7-0-33-1; మోమిన్ 9-0-41-1; అలీ హసన్ 4-0-19-1


పాకిస్థాన్ ఇన్నింగ్స్: జహూర్ (బి) కనిష్క్ 42; మిన్హాస్ ఎల్బీ (బి) హెనిల్ 9; ఉస్మాన్ ఎల్బీ (బి) ఆయుష్ 66; ఫర్హాన్ (సి) ఖిలాన్ (బి) అంబ్రిష్ 38; అహ్మద్ (బి) కుండు (బి) ఆయుష్ 2; అలీ హసన్ (సి) దీపేశ్ (బి) విహాన్ 3; హుజైఫా (బి) ఖిలాన్ 14; అబ్దుల్ (సి) కనిష్క్ (బి) ఖిలాన్ 7; ఖమర్ (సి) విహాన్ (బి) ఆయుష్ 0; సయ్యమ్ (సి) కుండు (బి) ఖిలాన్ 3; అలీ రాజా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (46.2 ఓవర్లలో ఆలౌట్) **194;** **వికెట్ల పతనం:** 1-23, 2-88, 3-151, 4-159, 5-168, 6-172, 7-183, 8-184, 9-191; **బౌలింగ్:** అంబ్రిష్ 5-0-26-1; హెనిల్ 5-0-30-1; దీపేశ్ 5-0-33-0; ఖిలాన్ 9.2-1-35-3; కనిష్క్ 10-1-30-1 విహాన్ 4-0-15-1; ఆయుష్ 8-0-21-3

ఎలిమినేటర్‌కు దిల్లీ

యూపీపై విజయం

ముంబయి ఔట్

వడోదర: దిల్లీ క్యాపిటల్స్ జట్టు డబ్ల్యూపీఎల్ సీజన్-4లో ఎలిమినేటర్‌కు అర్హత సాధించింది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించిన ఆ జట్టు మొత్తం 8 పాయింట్లతో పట్టికలో మూడో స్థానంలో నిలిచి, ముందంజ వేసింది. ముంబయి (6), యూపీ (4) జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించాయి. ఆదివారం మొదట యూపీ 8 వికెట్లకు 122 పరుగులే చేయగలిగింది. మరిజేన్ కాప్ (3/30), శ్రీచరణి (2/22), షినెలి హెన్రీ (2/25) ఆ జట్టును దెబ్బ తీశారు. 24 పరుగులు చేసిన దీప్తి శర్మ టాప్‌స్కోరర్. స్వల్ప ఛేదనలో దిల్లీ కూడా చెమటోడ్చింది. 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి కష్టంగా లక్ష్యాన్ని అందుకుంది. లారా వోల్వార్ట్ (47; 36 బంతుల్లో 7×4), జెమీమా (34 నాటౌట్; 18 బంతుల్లో 5×4) షెఫాలి వర్మ (29; 33 బంతుల్లో 2×4) రాణించారు. దిల్లీ ఓడిపోయి ఉంటే ముంబయి ముందంజ వేయగలిగేది. పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన బెంగళూరు (12) నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించిన సంగతి తెలిసిందే. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన గుజరాత్, దిల్లీ మంగళవారం ఎలిమినేటర్‌లో తలపడతాయి. ఇందులో గెలిచిన జట్టు గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది.



సంక్షిప్త స్కోర్లు... యూపీ వారియర్స్: 122/8 (దీప్తి శర్మ 24, శిఖ పాండే 23 నాటౌట్, సిమ్రన్ 22; మరిజేన్ కాప్ 3/30, శ్రీచరణి 2/22, షినెలి హెన్రీ 2/25); **దిల్లీ క్యాపిటల్స్:** 18.4 ఓవర్లలో 126/5 (వోల్వార్ట్ 47, షెఫాలి వర్మ 29, జెమీమా 34 నాటౌట్; దీప్తి శర్మ (2/27), శిఖ పాండే (1/17), సోఫీ ఎకిల్‌స్టోన్ (1/20)

క్వార్టర్స్‌లో ఆంధ్ర



ఆంధ్ర జట్టు

దీమాపుర్: రంజీ ట్రోఫీలో ఆంధ్ర క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. నాగాలాండ్‌తో ఎలీట్ గ్రూపు-ఎ చివరి లీగ్ మ్యాచ్‌ను డ్రాగా ముగించిన ఆంధ్ర.. తొలి ఇన్నింగ్స్ ఆధారంగా 3 పాయింట్లు ఖాతాలో వేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 85/4తో ఆదివారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ 104 ఓవర్లలో 342 పరుగులకు ఆలౌటైంది. చేతన్ బిష్ట్ (100), నగాహో చిషి (79) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో త్రిపురణ విజయ్ (5/104), సౌరభ్ కుమార్ (4/116) మెరిశారు. అనంతరం 173 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఆంధ్ర.. ఆట నిలిచే సమయానికి 4 వికెట్లకు 64 పరుగులు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో నాగాలాండ్ 366 పరుగులకు ఆలౌటవగా.. 536/9 స్కోరు వద్ద ఆంధ్ర డిక్లేర్ చేసింది. ఏడు మ్యాచ్‌ల్లో 4 విజయాలు, 3 డ్రాలతో 31 పాయింట్లు సాధించిన ఆంధ్ర... పట్టికలో ఝార్ఖండ్ (31) తర్వాత, రెండో స్థానంలో నిలిచింది. తొలి రెండు మ్యాచ్‌లను డ్రా చేసుకున్న ఆంధ్ర.. వరుసగా ఒడిషా, తమిళనాడు, ఝార్ఖండ్, విదర్భలపై విజయాలతో క్వార్టర్స్ బెర్తును దక్కించుకుంది. గ్రూప్-ఎలోనే ఉన్న డిఫెండింగ్ ఛాంపియన్ విదర్భ.. క్వార్టర్స్ కూడా చేరకుండానే టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ నెల 6 నుంచి జరిగే క్వార్టర్స్‌లో బెంగాల్‌తో ఆంధ్ర తలపడనుంది.

హైదరాబాద్ ఔట్: రంజీ ట్రోఫీలో హైదరాబాద్ పోరాటం ముగిసింది. ఛత్తీస్‌గఢ్‌తో ఎలీట్ గ్రూప్-డి చివరి లీగ్ మ్యాచ్‌ను ఆ జట్టు డ్రా చేసుకుంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా హైదరాబాద్‌కు 3 పాయింట్లు దక్కాయి. ఓవర్‌నైట్ స్కోరు 100/2తో ఆదివారం ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఛత్తీస్‌గఢ్.. మ్యాచ్ ముగిసే సమయానికి 8 వికెట్లకు 411 పరుగులు సాధించింది. కెప్టెన్ అమన్‌దీప్ ఖరే (176 నాటౌట్) సెంచరీ చేశాడు. తనయ్ త్యాగరాజన్, అనికేత్ తలో మూడు వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌ల్లో ఛత్తీస్‌గఢ్ 283.. హైదరాబాద్ 631 పరుగులు చేశాయి. 7 మ్యాచ్‌ల్లో ఒక విజయం, రెండు ఓటములు, నాలుగు డ్రాలతో 16 పాయింట్లు సాధించిన హైదరాబాద్.. పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. గ్రూప్-డి నుంచి ముంబయి (33), జమ్ముకశ్మీర్ (24) క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి.

దేవికకు టైటిల్



బ్యాంకాక్: భారత యువ షట్లర్ దేవిక సిహాగ్ కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టైటిల్ గెలిచింది. ఆదివారం ఆమె థాయ్‌లాండ్ మాస్టర్స్ మహిళల సింగిల్స్ ఫైనల్లో విజయం సాధించింది. దీపిక 21-8, 6-3తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి గాహ్ జిన్ వెయ్ (మలేసియా) గాయంతో తప్పుకొంది. ఆట ఆరంభం నుంచి ప్రత్యర్థిపై విరుచుకుపడిన దేవిక.. ఏ దశలోనూ ఆధిక్యాన్ని కోల్పోలేదు.

పాక్ క్లీన్‌స్వీప్

ఆస్ట్రేలియాతో మూడో టీ20లోనూ ఘనవిజయం

లాహోర్: పొట్టి ప్రపంచకప్ ముంగిట పాకిస్థాన్ ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకుంది. ఆస్ట్రేలియాతో మూడు టీ20ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' మొహ్మద్ నవాజ్ (5/18) విజృంభించడంతో మూడో టీ20లో పాక్.. కంగారూలను 111 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మొదట పాక్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగులు చేసింది. సయీమ్ అయూబ్ (56), బాబర్ ఆజామ్ (50 నాటౌట్) అర్ధ సెంచరీలు సాధించారు. చివర్లో షాదాబ్ ఖాన్ (46; 19 బంతుల్లో 2×4, 5×6) మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టు స్కోరును 200 దాటించాడు. బెన్ డ్వార్షుయిస్ రెండు వికెట్లు తీశాడు. ఛేదనలో ఆస్ట్రేలియా ఘోరంగా విఫలమైంది. నవాజ్ దెబ్బకు 16.5 ఓవర్లలో 96 పరుగులకే చాప చుట్టేసింది. కామెరూన్ గ్రీన్ (22), మార్కస్ స్టాయినిస్ (23), జోష్ ఫిలిప్ (14) మినహా ఎవ్వరూ రెండంకెల స్కోరు కూడా చేయలేదు. షహీన్ అఫ్రిది రెండు వికెట్లు పడగొట్టాడు.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
సోమవారం ఫిబ్రవరి 2, 2026

‘ప్రజాసమస్యల పరిష్కార వేదిక’ నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 2వ తేదీ సోమవారం ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాలు స్వీకరించనున్నట్టు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్ అందుబాటులో ఉంటుందని వివరించారు. అలాగే అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు నేరుగా ఫోన్ చేయవచ్చని కలెక్టర్ వివరించారు.



చైతన్యమే రక్ష

“చైతన్యంతో అడుగేద్దాం.. క్యాన్సర్‌ను తరిమేద్దాం” అని నగర ప్రజలు నినదించారు. ప్రపంచ క్యాన్సర్ డే పురస్కరించుకొని.. ఆదివారం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం వద్ద నిర్వహించిన ‘మణిపాల్ రన్ ఫర్ మ్యూర్-2026’కు ప్రజలు భారీగా తరలివచ్చారు. 5 కి.మీ, 10 కి.మీ విభాగాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. – విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే

విలక్షణ పద్దు.. వికసిత పొద్దు



బడ్జెట్ 2026-27



ఉపాధి అవకాశాలు పెంచే దిశగా రూపకల్పన

సీఐఐ, ఏపీ ఛాంబర్‌సహా అన్ని వర్గాల హర్షం

ఈనాడు, అమరావతి - న్యూస్‌టుడే, భవానీపురం, పటమట, విజయవాడ సిటీ

తాత్కాలిక ప్రయోజనాలకు కాకుండా.. దీర్ఘకాలంలో దేశ పురోగతికి తోడ్పాటు అందించే కీలకమైన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చేలా.. తాజా కేంద్ర బడ్జెట్‌ను రూపొందించినట్లు.. ఆయా రంగాల్లోని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని అభివృద్ధి ప్రాజెక్టులకు నేరుగా లబ్ధి చేకూర్చేలా కేటాయింపులు లేకపోయినా.. పరోక్షంగా ఇక్కడి ఎంఎస్‌ఎంఈలు, పరిశ్రమలు, పర్యాటకం, పుణ్యక్షేత్రాలకు ప్రాధాన్యం లభించబోతోంది. నిర్మాణ రంగానికి సైతం తోడ్పాటు అందించేలా బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామం అని విశ్లేషిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి క్రీడలకూ పెద్దపీట వేయడంతో.. కోచ్‌లు, మౌలిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. సీఐఐ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ సహా పలు పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు బడ్జెట్‌పై తమ మనోగతాన్ని ఆవిష్కరించారు.

★ **అన్నదాతకు ఏఐ తోడు:** ఉమ్మడి కృష్ణాలో నాలుగు లక్షల మందిపైగా రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఆధునిక సాంకేతికత దరిచేరనుంది. బహుభాషా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ప్రతిపాదించారు. ప్రస్తుత వ్యవసాయ పోర్టల్స్‌ను దీనికి అనుసంధానించి.. ప్రాంతీయ భాషల్లోనే సలహాలు అందిస్తారు. రైతులు, మత్స్యకారులకూ మేలు చేకూరనుంది. అగ్రిటెక్ స్టార్టప్‌లతో పంటల నిల్వ, ప్యాకేజింగ్ రంగాల్లో విలువ ఆధారిత మార్పులు తేనున్నట్లు ప్రకటించడమూ పుష్కల ప్రయోజనాలు చేకూర్చనుంది.

నిర్మాణ రంగానికి ప్రాధాన్యం



నిర్మాణ రంగానికి కేంద్రం ప్రాధాన్యం ఇచ్చింది. రూ.12.2 లక్షల కోట్ల మూలధన వ్యయాన్ని కేటాయించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే సుమారు రూ.లక్ష కోట్లు ఎక్కువ. నిర్మాణ ప్రాజెక్టుల్లో ప్రైవేట్ పెట్టుబడులు పెంచేందుకు రిస్క్ గ్యారెంటీ ఫండ్‌ను ప్రకటించడం హర్షణీయం. దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెరుగుతాయి. **- ఎ.నాగమల్లేశ్వరరావు, బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ మాజీ అధ్యక్షుడు**

ఆపన్న హస్తం..

క్యాన్సర్ రోగుల మందులపై సుంకం తగ్గించడంతో.. ఉమ్మడి జిల్లాలో వెయ్యి మందికి పైగా బాధితులకు ప్రయోజనం చేకూరబోతోంది. మధుమేహం, రక్తపోటు మందుల ధరలు తగ్గడంతో... ఉమ్మడి జిల్లాలో వేల మందికి పైగా ప్రయోజనం చేకూరబోతోంది.

చేనేతకు చేయూత: పెడన, మచిలీపట్నం, ఘంటశాల, మొవ్వ మండలాల పరిధిలో 15 వేల మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరబోతోంది. ఖాదీ, హ్యాండ్లూమ్, హస్తకళల ప్రోత్సాహకానికి కొత్త పథకం పెడుతున్నట్లు చెప్పడం, 200 పారిశ్రామిక క్లస్టర్స్ ఆధునికీకరణకు చేయూత ఇస్తామనడంతో చేనేత రంగానికి తోడ్పాటుకానుంది.

పుణ్యక్షేత్రాలకు గుర్తింపు..

ఏపీ, తమిళనాడు సరిహద్దుల్లోని పులికాట్ సరస్సు వద్ద పక్షుల సందర్శన కోసం ప్రత్యేక రైలును ప్రకటించారు. ఇది నెల్లూరు పరిసర ప్రాంతాలను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చబోతోంది. దేశంలో అన్ని సాంస్కృతిక ప్రాంతాలను డిజిటలైజ్ చేస్తామన్నారు. ఏపీలోని విజయవాడ సహా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు వస్తుంది. **- ఆర్.వి.స్వామి, ఏపీ స్టార్ హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు**



పెట్టుబడులు పెరగనున్నాయి



పరిశ్రమలను ప్రోత్సహించేలా రూపకల్పన చేశారు. దేశంలో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందేలా రూపొందించారు. పన్ను విధానాలను సరళీకరించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిర్ణయించారు. రైతులను ప్రోత్సహించే వివిధ పథకాలను ప్రవేశపెట్టడంతో మనకూ చాలా ప్రయోజనం కలగబోతోంది. **- లక్ష్మీప్రసాద్, సీఐఐ పూర్వ అధ్యక్షుడు**

క్రీడల్లో మరింత రాణించేలా...

క్రీడలు, పర్యాటక రంగానికి ప్రోత్సాహకాలు అధికంగా ఇచ్చారు. విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కోచ్‌ల నియామకం, వసతి గృహాల నిర్మాణం చేపట్టనున్నారు. క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేందుకు వీలు కలుగుతుంది. గైడ్‌లను అత్యధిక సంఖ్యలో తయారుచేయాలని నిర్ణయించడంతో.. పర్యాటకానికి కూడా తోడ్పాటు లభిస్తుంది. **- వి.వెంకటేశ్వరరావు, సీఐఐ పూర్వ అధ్యక్షుడు**



అన్ని రంగాలు అభివృద్ధి

అన్ని రంగాలను ప్రోత్సహించేలా బడ్జెట్ రూపకల్పన జరిగింది. దేశంలో ఏ రంగం అభివృద్ధి చెందినా స్థిరాస్తి రంగం పుంజుకునే వీలుంది. ప్రస్తుత బడ్జెట్ కారణంగా స్థిరాస్తి రంగం అభివృద్ధి చెందేందుకు వీలుంది. హైస్పీడ్ రైల్ కారిడార్‌లుగా హైదరాబాద్, చెన్నైలను ప్రకటించారు. అలాగే డేటా సెంటర్లకు 2047 వరకు పన్ను రాయితీలు ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. దీంతో స్థిరాస్తి రంగానికి ఊతం లభిస్తుంది. **- పర్చూరి కిరణ్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ఏపీ నరెడ్కో**



కొబ్బరి రైతుల్లో ఆశలు: కృష్ణాలో 1,100 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లాలో 200 హెక్టార్లలో కొబ్బరి తోటలున్నాయి. రెండు జిల్లాల్లో 400 మంది రైతులు ఉన్నారు. కొబ్బరిసాగులో భారత్ స్వయం సమృద్ధి సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడంతో.. ఈ రైతులకు మేలు జరగబోతోంది.

పర్యాటక వైభవమే: సాంస్కృతిక ప్రాంతాలను డిజిటలైజ్‌తో ప్రధాన పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు విస్తృత డిజిటల్ ప్రచారం లభిస్తుంది. విజయవాడ దుర్గగుడి, కృష్ణా నది పరివాహకంలో చారిత్రక ఆలయాలు, ప్రదేశాలను ఈ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తే.. పర్యాటకంగా ప్రయోజనాలు చేకూరుతాయి.

మౌలికానికి నిధులు: ఏపీ పట్టణ తాగు, మురుగునీటి పారుదల నిర్వహణకు రూ.800 కోట్లు.. ఏపీలో రహదారులు, పునర్నిర్మాణానికి రూ.350 కోట్లు చొప్పున కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. విజయవాడ, బందరుకు వీటిలో కొన్ని నిధులు వచ్చే వీలుంది.

పర్యాటకానికి మరింత జవసత్వాలు



పర్యాటక అభివృద్ధి, ప్రచారం కోసం రూ.2,581 కోట్లు కేటాయించడం ఆనందంగా ఉంది. అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించేలా విదేశాల్లో ప్రచార కార్యాలయాలను స్థాపించనున్నారు. వీటితో మరింత మంది విదేశీయులు భారతదేశానికి వస్తారు. యువతకు ఎక్కువ ఉపాధి అవకాశాలు వస్తాయి. అమరావతి, నాగార్జున కొండలతో సహా దేశంలోనిఅన్ని ప్రాంతాల్లో 12 బౌద్ధ సర్క్యూట్‌లను అభివృద్ధి చేయనున్నారు. **- తరుణ్ కాకాని, ఆంధ్రప్రదేశ్ టూరిజం అసోసియేషన్ అధ్యక్షుడు**

దీర్ఘకాలిక ప్రయోజనాలతో బడ్జెట్..



దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని.. దార్శనికతతో రూపొందించిన బడ్జెట్ ఇది. యువత ఆధారంగా, అభివృద్ధి సంకల్పంతో, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, క్వాంటం టెక్నాలజీస్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యతలకు పెద్దపీట వేసేలా.. నైపుణ్యాలను పెంచడం ద్వారా ఉపాధికి బలమైన పునాదులు పడేలా ఈ బడ్జెట్ దోహదం కానుంది. ఆరెంజ్ ఎకానమీ గొడుగు కింద.. భారతదేశ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాల్లో 2030కి నైపుణ్యాలు, ఉపాధి పెంచేలా ప్రాధాన్యాలను కల్పించడం శుభపరిణామం. **- డాక్టర్ పి.వి.రాధిక, విద్యా, మనస్తత్వవేత్త**

ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి..



దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడం ద్వారా.. ఉత్పత్తి పెరిగి.. ఉద్యోగ అవకాశాలు కల్పించేలా తాజా బడ్జెట్‌ను రూపొందించారు. ప్రధానంగా మన రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఎంఎస్‌ఎంఈ రంగం బలోపేతం కాబోతోంది. స్మాల్ అండ్ మైక్రో ఇండస్ట్రీ సెక్టార్ క్షీణదశలో ఉండగా.. ప్రస్తుతం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించి ఆదుకోవడం అందరికీ శుభపరిణామం. **- బి.రాజశేఖర్, ఏపీ ఛాంబర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్**

కారుకూతలే.. కొంప ముంచాయ్!

వైకాపా నాయకుడు జోగి రమేష్... జగన్ పాలనలో ప్రతిపక్షాలపై తిట్ల దండకం చదువుతూ మంత్రి కుర్చీ ఎక్కారు. ఇప్పుడు అధికారం లేకున్నా.. అధినేత దగ్గర మార్కులు కొట్టేసేందుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. నోటికి వచ్చినట్లు తరచూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై వ్యక్తిగత దూషణలు చేస్తూ రెచ్చిపోతున్నారు. తాజాగా లోకేశ్‌పై తీవ్ర వ్యాఖ్యలతో చిందులేశారు. ఇన్నాళ్లు జోగి బూతు పురాణాన్ని పంటి బిగువున భరించిన కూటమి కార్యకర్తల్లో ఆవేశం కట్టలు తెంచుకుంది. ఆదివారం జోగి ఇంటిని ముట్టడించి ఆందోళనబాట పట్టారు.

– ఈనాడు, అమరావతి,
– ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

నోటి దురుసుతో.. జోగి తరచూ యాగీ



ఆది నుంచీ అదే వైఖరి..

☛ **2021 సెప్టెంబరు 17:** జోగి రమేశ్ తెదేపా అధినేత చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లారు. అసభ్య పదజాలంతో చంద్రబాబు కుటుంబాన్ని దూషించినందుకు జగన్ అప్పట్లో జోగికి మంత్రి పదవి కట్టబెట్టారు.

☛ **2024 మే 13:** పోరంకి జడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో జోగి రమేశ్ తన అనుచరులతో కలిసి అరాచకం సృష్టించారు. తెదేపా నాయకులపై రాళ్లు రువ్వి, కర్రలు పట్టుకొని ప్రధాన రహదారిపై హడావుడి చేశారు.

☛ **2026 జనవరి 23:** కల్తీ మద్యం కేసులో 83 రోజులు జైలుకెళ్లి.. బయటకు రాగానే.. ‘లోకేశ్.. దమ్ముంటే దుర్గ గుడికి రా.. తిరుమల రా.. లేదూ కాదూ.. కూడదంటే... నేనే మళ్లీ చంద్రబాబు ఇంటికి వెళ్తా. చంద్రబాబు, లోకేశ్‌లకు ఛాలెంజ్ చేస్తున్నా.. మీ కేసులకు భయపడం.. మీ రెడ్‌బుక్‌ను మడిచి జేబులో పెట్టుకో’ అని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు.

☛ **2026 జనవరి 31:** ఇబ్రహీంపట్నం ఆంజనేయ స్వామి గుడి వద్ద జోగి మరోసారి రెచ్చిపోయారు ‘ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై తీవ్ర పదజాలంతో నోరు జారి తన జుగుప్సాకర వైఖరిని తేటతెల్లం చేశారు.



ఇబ్రహీంపట్నం: ఆందోళనకారుల అడ్డగింపు

అధినేత కళ్లలో ఆనందానికే...

☛ వైకాపా అధినేత జగన్ కళ్లలో ఆనందం కోసం అత్యంత దిగజారుడు వ్యాఖ్యలు చేయడానికి కూడా జోగి వెనుకాడరు. తనకు ఎదురొచ్చినా, అడ్డుకునేందుకు ప్రయత్నించినా.. వారి అంతు చూస్తానని బహిరంగంగానే బెదిరింపులకు దిగడం ఆయన నైజం.

☛ రాజకీయాల్లో హుందాతనంతో వ్యవహరించాల్సింది పోయి వివాదాస్పద వ్యాఖ్యలు.. చేష్టలతో తరచూ వివాదాల్లో ఉంటున్నారు. అధికారం ఉన్నప్పుడు తన వర్గంతో ప్రతిపక్ష నాయకులపై దాడులకు తెగబడడం.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రభుత్వ లోపాలపై మాట్లాడకుండా.. అధికార పార్టీ నేతలపై వ్యక్తిగత దూషణలకు దిగడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. శాంతి భద్రతలు కాపాడే పోలీసులను కించపరిచేలా మాట్లాడడమే పనిగా పెట్టుకున్నారు.



ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద జోగి రమేష్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కూటమి శ్రేణులు



తలంబ్రాలు చూపిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య దంపతులు



కళ్యాణాన్ని వీక్షిస్తున్న అశేష భక్తజనం

తిరుపతమ్మ కల్యాణం.. పులకించె భక్తజనం





తిరుముడులతో దీక్షాధారులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే; పెనుగంచిప్రోలు శ్రీ గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. వేలాదిమంది భక్తుల సమక్షంలో వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి గోపయ్య, తిరుపతమ్మ అమ్మవార్ల ఉత్సవ మూర్తులను భారీ ఊరేగింపుతో కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ఉత్సవమూర్తులను వేదికపై ఉంచి కల్యాణోత్సవాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, శ్రీదేవి(అమ్మాజీ) దంపతులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను అమ్మవారికి సమర్పించారు. కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం, స్వర్ణకుమారి దంపతులు, మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు, కాకాని వంశీకుల తరపున కాకాని రవిబాబు, త్రివేణి దంపతులు, కొల్లా వంశీకుల తరపున కొల్లా హరికృష్ణ, భవ్యశ్రీ దంపతులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు సుంచు రమేష్ బాబు, సుజాత దంపతులు, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ దంపతులు, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు పీటల మీద కూర్చొని కల్యాణంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపి బాబు, పూజారి అంజి శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించారు. రాత్రి 9.05 గంటలకు గోపయ్య, తిరుపతమ్మ అమ్మవార్లకు జీలకర్ర బెల్లం పెట్టి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లాతోపాటు కృష్ణా, గుంటూరు, ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి వచ్చిన వేలాది మంది భక్తులు అమ్మవారి కల్యాణాన్ని తిలకించి పరవశించారు.

మాఘ శుద్ధ పౌర్ణమి..పురస్కరించుకుని అమ్మవారి తిరునాళ్లకు శ్రీకారం చుట్టారు. ఉదయం 6:04 గంటలకు ఆఖండ జ్యోతి స్థాపన, హోమగుండం వెలిగించడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దీక్షను స్వీకరించిన సుమారు 30 వేల మంది స్వాములు అమ్మవారికి తిరుముడి సమర్పించి దీక్షను విరమించారు.

నమ్మకంగా పంచన.. నమ్మేలోపే వంచన!

★ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల కార్మికులు
★ వీరిలో పలువురికి నేరచరిత్ర.. ఆరా తీయకుండానే పనుల్లోకి

విజయవాడ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లోని కర్మాగారాలు, దుకాణాల్లో పనిచేసే ఇతర రాష్ట్రాల వారిపై నిఘా కొరవడింది. వీరిలో పలువురికి నేర చరిత్ర ఉంది. సరైన విచారణ చేయకుండానే వీరిని పనుల్లోకి తీసుకుంటున్నారు. ఫలితంగా వీరిలో కొందరు నేరాలు చేసి తేలికగా తప్పించుకుంటున్నారు. తర్వాత వీరిని పట్టుకోవడం సవాలుగా మారుతోంది. వీరి వివరాలు యజమానుల వద్ద కానీ.. పోలీసుల వద్ద కానీ లేవు.

ఆధారాలు తీసుకోకుండానే పనుల్లోకి..

నగర పరిసరాల్లో నిర్మాణ రంగంలో పెద్దఎత్తున పనులు జరుగుతున్నాయి. వీటిలో అత్యధికులు యూపీ, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల వారే. కొండపల్లిలో పలు పరిశ్రమల్లోనూ బిహార్, ఒడిశా, పశ్చిమ్ బెంగాల్ రాష్ట్రాల వారున్నారు. నగరంలో బంగారు నగల తయారీ, ఫ్యాన్సీ దుకాణాలు, విద్యుత్తు ఉపకరణాలు, హోటళ్లు, ఆటోమొబైల్ వృత్తుల్లోనూ స్థానికేతరులే ఎక్కువ. వివిధ పనులు చేస్తున్న వారిలో ఎక్కువ మంది నేరాలకు పాల్పడుతున్నారు. పగటివేళ పనులు చేస్తూ రాత్రుళ్లు చోరీలు చేస్తున్నారు. మహిళల మెడల్లో గొలుసులు తెంచుకెళ్లడం, తాళం వేసిన ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వీరు ఎక్కువగా మురికివాడల్లో ఉంటున్నారు. వీరి ఆధార్, ఓటరు కార్డులు తీసుకోకుండానే పనిలో పెట్టుకుంటున్నారు.

పోలీసుల వద్దా వివరాల్లేవు...

నేర చరిత్ర ఉండి పనుల్లోకి వస్తున్న వారి సమాచారాన్ని సేకరించి ఉపాధి కల్పిస్తున్న వారు భద్రపరచడం లేదు. వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలన్న ప్రతిపాదన అమలుకు నోచడంలేదు. వారి ఓటరు, ఆధార్ కార్డులనూ తీసుకోవడం లేదు. సంబంధిత స్టేషన్లలో వీరి డేటాబేస్ నిర్వహించడం లేదు. నేరాలు జరిగాక మేల్కొనే సరికి.. అప్పటికే నిందితులు సరిహద్దులు దాటేస్తున్నారు.

- ఈనాడు, అమరావతి

☛ కొండపల్లి పారిశ్రామికవాడలో రెండు నెలల కిందట మణి హత్యకు గురైంది. ఆమె ఓ పరిశ్రమలో పనిచేస్తోంది. తన కోరిక తీర్చలేదని అక్కడే పని చేస్తున్న ఉత్తరప్రదేశ్‌వాసి విమల్ నిసాద్.. చీర కొంగును ఆమె మెడకు బిగించి చంపాడు. తర్వాత స్వస్థలానికి పరారయ్యాడు. చివరకు ఉత్తరప్రదేశ్‌కు పోలీసుల బృందం వెళ్లి అతడిని అరెస్టు చేసింది.

☛ రాజస్థాన్‌కు చెందిన రాజ్‌సింగ్, ప్రభాత్‌సింగ్‌లకు వన్‌టౌన్‌లో దుకాణం ఉంది. నష్టాలు రావడంతో కోదాడలోని ఓ బంగారు దుకాణంలో చోరీ చేసేందుకు గ్యాస్ కట్టర్‌లతో వెళ్తూ ఆరునెలల కిందట అర్ధరాత్రి వేళ భవానీపురం పోలీసులకు దొరికారు.

ధర వరలు

వంకాయలు-22/24, టమాటా-13, బెండ-28, పచ్చిమిర్చి-34 కాకర-38, బీర-26/34, క్యాలీ ఫ్లవర్-15/20, క్యాబేజీ-16, క్యారెట్-28, దొండ-46, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-32, దోస-26/36, సొర-10, పొట్ల-30, అరటికాయ-7/6, బీట్ రూట్-24, కీరదోస-40, బీన్స్-56, క్యాప్సి కమ్-54 (నిన్న టివి).

- విజయవాడ రైతుబజారు

నమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.

జోనల్ ఆఫీస్ : డి నెం.29-37-141, 2వ అంతస్తు, రామమందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 13(2) అనుసరించి డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

మెసర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బ్రాంచ్-II చెన్నై, తేది **9-11-2022** యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీనాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టరై ఉన్నాము. **రిజిష్టర్డ్ కార్యాలయం** శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద మరియు **మా జోనల్ కార్యాలయం చిరునామా,** డి నెం. 29-37-141, 2వ అంతస్తు, రామమందిరం దగ్గర, ఏలూరు రోడ్డు, విజయవాడ-520002 వద్ద మరియు **మా బ్రాంచ్ ఆఫీస్ విజయవాడ-II** వద్ద కలిగి ఉన్న మేము ఈ దిగువ నోటీసును జారీచేయడమైనది. **(ఇక పై కంపెనీ/ఋణదాతగా పిలువబడుతుంది).**

దిగువ తెలిపిన రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/గ్యారంటార్లు/శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్న సదరు రుణగ్రహీతలు/గ్యారంటర్లు గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 3తో చదువకోవల్సిన సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్ధక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లింపు తేదీ వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటు వంతున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, చార్జీలు వగైరాను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలు/గ్యారంటర్లు తనఖారుణగ్రస్తులను కోరుతూ SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీ చేశారు.

వారి చివరిగా తెలిసిన చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన ద్వారా వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్- సెక్షన్ (8) లోని నిబంధనలను చూడవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

పైన తెలిపిన పరిస్థితుల దృష్ట్యా, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతోపాటు పైన తెలిపిన బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీతలు మరియు/లేదా వారి హామీదారులకు (వర్తింపును బట్టి) ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద రుణగ్రహీతలు మరియు తనఖా రుణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో సహా సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన తమ సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని ఇతర విధంగా ఏ ఋణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.

తేది: 20.01.2026, ప్రదేశం : విజయవాడ — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్



జూనియర్స్ విభాగంలో సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ జట్టుకు రన్నర్స్ ట్రోఫీని అందజేస్తున్న సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ రాజమౌళి, శాప్ ఎండీ భరణి, ధనిక్ భారత్ విద్యాసంస్థల ఛైర్మన్ విక్రం నారాయణరావు, డైరెక్టర్లు



జూనియర్స్: జయకేతనం ఎగురవేసిన హైదరాబాద్ హీరోస్ జట్టు సభ్యుల కేరింతలు



సీనియర్స్ విభాగంలో రాయలసీమ రాకర్స్ జట్టుకు రన్నరప్ ట్రోఫీ అందజేస్తున్న సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ రాజమౌళి

అంబరాన్నంటిన ఈనాడు క్రికెట్ సంబరం

రన్నర్స్ సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్.. రాయలసీమ రాకర్స్..



మాట్లాడుతున్న సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.రాజమౌళి, శాప్ ఎండీ భరణి, ధనిక్ భారత్ విద్యాసంస్థల ఛైర్మన్ విక్రం నారాయణరావు, డైరెక్టర్లు సలీం, విక్రం అజయ్‌బాబు, బాలలత, నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ శివశంకరరావు, చలపతి కళాశాల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు తదితరులు

EENADU SPORTS LEAGUE 2025



ఈనాడు క్రికెట్ కప్ ట్రోఫీలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: ఆద్యంతం ఉత్కంఠంగా సాగిన 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు జరిగాయి. జిల్లా స్థాయి పోటీలు గత ఏడాది డిసెంబరు 22 నుంచి 30వ తేదీ వరకు, ప్రాంతీయ స్థాయి పోటీలు జనవరి 19 నుంచి 21వ తేదీ వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగాయి. పలు కళాశాలలకు చెందిన జట్లు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విజయం కోసం చెమటోడ్చాయి. గుంటూరుకు సమీపంలో నంబూరులోని ఎమ్మెస్కే ప్రసాద్ క్రికెట్ అకాడమీ మైదానంలో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి ఫైనల్స్ జరిగాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో హైదరాబాద్ హీరోస్ గెలుపొందగా.. జూనియర్స్‌లో సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్, సీనియర్స్‌లో రాయలసీమ రాకర్స్ రన్నర్స్‌గా నిలిచాయి. ఈ జట్లకు సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎ.రాజమౌళి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఎస్.భరణి, ధనిక్ భారత్ విద్యా సంస్థల ఛైర్మన్ విక్రం నారాయణరావు, డైరెక్టర్లు మల్లవరపు బాలలత, విక్రం అజయ్‌బాబు, సలీం, రామ్, చలపతి విద్యా సంస్థల ఛైర్మన్ వై.వి.ఆంజనేయులు, ఎన్ఈసీసీ ఛైర్మన్ వచ్చల శివశంకర రావు, 'ఈనాడు' ఏపీ బ్యూరో ఇన్‌ఛార్జి కనపర్తి శ్రీనివాస్, గుంటూరు యూనిట్ ఇన్‌ఛార్జి మన్నిపల్లి వెంకటేశ్వర్లు రూ.50,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీలు, పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



జూనియర్ సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్, హైదరాబాద్ హీరోస్ మధ్య మ్యాచ్

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎ.రాజమౌళి తెలిపారు. 'ఈనాడు' క్రికెట్ రాష్ట్ర స్థాయి ఫైనల్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఒకరికొకరు ప్రోత్సహించుకుంటూ అందరూ కలిసిమెలిసి ఆడే క్రీడ క్రికెట్ అన్నారు. జీవితం కూడా ఒక ఆటేనని, దానిలో ఎవరైనా గెలిచి నిలదొక్కుకోవాలంటే మంచి సుగుణాలు అవసరమని చెప్పారు. దీనికి దారుఢ్యం, నైపుణ్యం, కుశలత, విశ్వసనీయత, నమ్మకం అలవర్చుకోవాలన్నారు. అధిక శాతం మంది సెల్‌ఫోన్లకు పరిమితమవుతున్న ఈ రోజుల్లో ఇంత మందిని ఇక్కడకు చేర్చి 'ఈనాడు' క్రీడల్ని ప్రోత్సహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ● రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ భరణి మాట్లాడుతూ అందరికీ క్రికెట్ అంటే ఆసక్తి ఉంటుందని, ముఖ్యంగా పిల్లలు, యువత క్రికెట్ ఆడేందుకు ఉత్సాహం చూపుతారన్నారు. ఈ క్రీడ వల్ల క్రమశిక్షణ, స్వయం ప్రేరణ అలవడుతుందన్నారు. ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల్ని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. ● ధనిక్ భారత్ విద్యా సంస్థల ఛైర్మన్ విక్రం నారాయణరావు మాట్లాడుతూ 'ఈనాడు' టోర్నమెంట్ నిర్వహించడంలో అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ● డైరెక్టర్ బాలలత మాట్లాడుతూ భారత్ అంటే క్రికెట్.. క్రికెట్ అంటే భారత్‌లా మారిందన్నారు. కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ తాము విద్యార్థుల్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. గెలుపు, ఓటములు ముఖ్యం కాదని, పోరాటం ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఆటలో ఒక స్ఫూర్తి ఉంటుందన్నారు. ఒక ఎలక్ట్రీషియన్ కుమారుడు తిలక్‌వర్మ అని, ఆయన కష్టపడి జాతీయ జట్టులో స్థానం సంపాదించి జట్టును జగజ్జేతగా నిలిపి పేరు, ప్రతిష్ఠలు ఇనుమడింపజేశాడన్నారు. మీలో నుంచి కూడా భారత్ జట్టుకు ఆడాలని ఆకాంక్షించారు.

పేదలు, యువతకు ప్రాధాన్యం: ఎంపీ శివనాథ్



పటమట, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌లో పేదలు, మహిళలు, యువత పెద్ద పీట వేశారని, ఇది అభివృద్ధికి కేంద్ర బిందువుగా ఉందని సమగ్ర బడ్జెట్ అని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రత్యేక ప్రోత్సాహకాలు కల్పించడం విశేషమని తెలిపారు. చిన్న సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం లభించేలా పలు చర్యలు ప్రకటించారని, ముఖ్యంగా బయో ఔషధాలు, కంటైనర్, వస్త్ర యంత్రాల తయారీ రంగాలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా దేశీయ పరిశ్రమలు బలపడతాయని పేర్కొన్నారు.

రాష్ట్రానికి కొత్త ఊపిరి: అనురాధ



పటమట, న్యూస్‌టుడే: కేంద్రం ప్రకటించిన బడ్జెట్ దేశ పేదలు, మహిళలు, యువత అభివృద్ధిని కేంద్ర బిందువుగా ఉంచిన సమగ్ర, సమతుల్య బడ్జెట్ అని ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమాల మధ్య సరైన సమన్వయంతో రూపొందిన బడ్జెట్ దేశ ఆర్థిక భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. ఈ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు ఆశాజనక దిశను చూపిందన్నారు. కేంద్ర బడ్జెట్‌ను రాష్ట్రాభివృద్ధికి సమర్థంగా మలచగలిగే సామర్థ్యం సీఎం చంద్రబాబుకు ఉందని పేర్కొన్నారు.

విలువలు నేర్పే విద్యాలయం రామకృష్ణ మిషన్

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: రామకృష్ణ మిషన్ విలువలు నేర్పే ఒక విశ్వవిద్యాలయమని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. రామకృష్ణ మిషన్ నిర్మించిన వివేకానంద మానవ వికాస కేంద్రం శిలాసదృశ నిలయమని అభివర్ణించారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు, శ్రీనివాస్, గౌతమానంద మహరాజ్, శశికాంతానంద స్వామి, వినిశ్చలానంద స్వామి

యువత భవితకు ఒక విజ్ఞాన దీపికలా వెలుగులు పంచుతుందని పేర్కొన్నారు. విజయవాడ గాంధీనగర్‌లో రూ.8.5 కోట్లతో నిర్మించిన వివేకానంద మానవ వికాస కేంద్రాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రామకృష్ణ మిషన్ సర్వాధ్యక్షులు గౌతమానంద మహరాజ్ సహా స్వామీజీల సమక్షంలో.. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజుతో కలిసి భవన నిర్మాణ ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దివిసీమ ఉప్పెన వంటి విపత్తుల సమయంలో రామకృష్ణ మిషన్ అందించిన సేవలను కొనియాడారు. గౌతమానంద మహరాజ్ ప్రసంగిస్తూ ప్రస్తుత సమాజంలో సంస్కారం లేని చదువులు ఎక్కువగా కనిపిస్తున్నాయని.. అన్యాయాన్ని ప్రశ్నించే చదువులు అవసరమని అన్నారు. రామకృష్ణ మిషన్ కార్యదర్శి వినిశ్చలానంద స్వామి మాట్లాడుతూ వచ్చే జూన్ నుంచి సివిల్ సర్వీసెస్, ధ్యానం తదితరాల్లో శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు.

భక్తితో నవదిన ప్రార్థనలు



దివ్యసత్ప్రసాదంతో కొండపైకి వెళ్తున్న గురువులు, విశ్వాసులు


గుణదల(పటమట), న్యూస్‌టుడే: గుణదల మేరీమత నవదిన ప్రార్థనలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం కొండపై జరిగిన ప్రార్థనలకు విజయవాడ కథోలిక పీఠం గురువులు చింతా రాకేష్ ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు సందేశమిచ్చారు. విజయవాడ కథోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి పాల్గొనడానికి వస్తున్న భక్తులు విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం పుణ్యక్షేత్రం ప్రధాన చర్చి నుంచి దివ్యసత్ప్రసాద మందసంతో కొండపై లూర్ధుమాత స్వరూపం వద్దకు చేరుకుని సమష్టి దివ్యపూజాబలి సమర్పించారు. ఫాదర్లు మరియన్న, సునీల్ రాజు, సంఘ పెద్దల ప్రెసిడెంట్ విజయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో / కె రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 162, 171, 182 చికెన్ విత్ స్కిన్ - 314 చికెన్ స్కిన్‌లెస్ - 324.

'ముఖ్యమంత్రిపై అంబటి వ్యాఖ్యలు దారుణం'



మాట్లాడుతున్న వసంత

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు దారుణంగా ఉన్నాయని మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఐతవరంలోని తన స్వగృహంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజకీయాలంటేనే విరక్తి కలిగేలా మాట్లాడారని అన్నారు. అంబటిని సమర్థిస్తూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడం చూస్తే ఆయన ఈ భాషను ప్రోత్సహిస్తున్నట్టుగా ఉందని తెలిపారు. రాంబాబు మతిలేకుండా సీఎంపై వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తాను ప్రజాప్రతినిధిగా ఉన్న సమయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు హుందాగా వ్యవహరించాయని అన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి దుర్మరణం



నరేంద్ర (పాత చిత్రం)

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కోటుమల్ల నాగవీరనరేంద్ర(36) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతరాజరాజేశ్వరీపేటకు చెందిన అతను బెంజిసర్కిల్ వద్ద ఓ జిమ్‌లో శిక్షకుడిగా కూడా చేస్తున్నారు. గత నెల 31న సాయంత్రం ఫంక్షన్ ఉందని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో పశ్చిమ బైపాస్ నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నారు. పాముల కాల్వ వద్ద వేగ నిరోధకం వద్ద ప్రమాదవశాత్తు వాహనం పడిపోయింది. ఈ ప్రమాదంలో నరేంద్ర తలకు బలమైన గాయమైంది. భార్య చంద్రిక భర్త ఇంటికి రాలేదని ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. కొంత సమయం తర్వాత ఓ వ్యక్తి నరేంద్రను గమనించి తన చరవాణి నుంచి మిస్డ్ కాల్ నంబర్‌కు ఫోన్ చేస్తే చంద్రిక లిఫ్ట్ చేసింది. జరిగిన ప్రమాద ఘటన ఆమెకు వివరించాడు. ఆమె తన మామయ్య దుర్గారావుతో కలిసి ఘటనా ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే భర్త విగతజీవుడిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు శవ పంచనామా అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చంద్రిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆనందించేలోపు విషాదం..: నరేంద్ర భార్య చంద్రిక పవర్ లిఫ్టర్. 2025 డిసెంబరు 6 నుంచి 12 వరకు టర్కీలో జరిగిన ఓపెన్ ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నాలుగు మెడల్స్ సాధించింది. భర్త మరణించడంతో ఆమె విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. విషయం తెలుసుకున్న జిమ్ శిక్షకులు, వెయిట్ లిఫ్టర్లు, శిక్షణ పొందే విద్యార్థులు నివాళులర్పించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

వైష్ణవి విజయం.. స్ఫూర్తిదాయకం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన అంగజాల వైష్ణవి గ్రూప్-1 పరీక్షల్లో ప్రతిభ చూపి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ఆదివారం ఆమె తండ్రి రవీంద్ర బాబు, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీరాం తాతయ్య దంపతులు వైష్ణవిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఆమె విజయం యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో గింజుపల్లి రమేష్, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ✤ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఎంపికైన వైష్ణవి ఆదివారం కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాంను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు నెట్టెం ఆమెను శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అభినందించారు.

ఇంద్రకీలాద్రిపై ఆధ్యాత్మిక సందడి


అంతరాలయంలో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : మాఘపూర్ణిమను పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఆర్జితసేవలు, దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఆదివారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సెలవు దినం కావడంతో తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి రావడంతో ఉదయం నుంచే క్యూలైన్లు రద్దీగా మారాయి. 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: తిరువూరు 3వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికుడు బ్రహ్మం 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ పారిశుద్ధ్య కార్మికులను పంపించి డ్రెయిన్లను శుభ్రం చేయించారు. ★ తిరువూరు 5వ వార్డులోని వీధుల్లో చెత్తను తొలగించడం లేదని స్థానికుడు అరుణ్‌కుమార్ 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా సమస్యను అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి పారిశుద్ధ్య కార్మికులను పంపి వాటిని తీయించి ఆ ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు**

ముగిసిన మైనింగ్ పరిరక్షణ దినోత్సవం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ విజయవాడ రీజియన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన మైన్స్ ఎన్విరాన్‌మెంట్, మినరల్ కన్జర్వేషన్ చివరి రోజు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమాన్ని కేసీపీ లిమిటెడ్ యూనిట్-2 వారు నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ కంట్రోలర్ జనరల్ పంకజ్ కల్ శ్రేష్ఠ, ఐబీఎం గనుల కంట్రోలర్ శైలేంద్రకుమార్, విజయవాడ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ మైన్స్ ఇన్‌చార్జి దర్శన్‌దీప్ భరద్వాజ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

చేయూత.. లబ్ధిదారులకు భరోసా

మూగజీవాలకు సమకూరుతున్న వసతి

రెడ్డిగూడెం, మైలవరం, న్యూస్‌టుడే

మూగజీవాలకు వసతి సమకూరుతోంది. రైతులతో పాటు పశుపోషణ జీవనాధారంగా ఉన్న పేదలకూ కూటమి ప్రభుత్వం చేయూత ఇస్తోంది. అందులో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. కొద్ది మొత్తం సొంత ఖర్చుతో మేలు కలుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పశువులు, మేకలు, గొర్రెలు వంటి వాటికి వసతి నిమిత్తం పెంపకందారులకు ఉపాధి హామీ పథకంతో భరోసా కల్పిస్తున్నారు. సొంత స్థలం ఉంటే 90 శాతం రాయితీతో నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం వచ్చాక రెండు విడతలుగా నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది. అందులో భాగంగా ఒక్కో షెడ్డు నిర్మించుకునేందుకు రూ.2.30 లక్షలు వ్యయం అవుతోంది. మొత్తం ఖర్చులో లబ్ధిదారులు రూ.23 వేలు చెల్లిస్తే, ప్రభుత్వం వీబీ జీ రామ్‌జీ ద్వారా మరో రూ.2.07 లక్షలకు సంబంధించి అధికారులు వివిధ మార్గాల్లో నిధులు విడుదల చేస్తున్నారు.


నిర్మాణం పూర్తి అయిన పశువుల షెడ్

నిర్మాణాలు వేగవంతం

జిల్లాలో పాడి పశువులు, జీవాల పెంపకం అధికంగా ఉంటుంది. దాంతో గ్రామీణ ప్రాంతాల్లోని పశువుల యజమానులు షెడ్ల నిర్మాణాలను పూర్తి చేసి సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లాలో మొదటి విడతలో మంజూరైన వాటిలో దాదాపు 90 శాతం వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. జిల్లాలో పెనుగంచిప్రోలు 59 నిర్మాణం చేసి మొదటి స్థానం, వత్సవాయి 56 నిర్మాణం చేసి రెండో స్థానంలో ఉన్నాయి.

జిల్లాలో మొత్తం మంజూరు	- 700
నిర్మాణాలు ప్రారంభించింది	- 694
పూర్తి అయినవి	- 642
చివరి దశలో ఉన్నవి	- 18
బేస్‌మెంట్ దశలో	- 32

మండలాల వారీగా ఇలా..

ఎ.కొండూరు 38, చందర్లపాడు 27, జి.కొండూరు 39, గంపలగూడెం 43, ఇబ్రహీంపట్నం 21, జగ్గయ్యపేట 47, కంచికచర్ల 42, మైలవరం 37, నందిగామ 44, పెనుగంచిప్రోలు 59, రెడ్డిగూడెం 37, తిరువూరు 48, వత్సవాయి 56, వీరులపాడు 36, విజయవాడ రూరల్ 35, విస్సన్నపేట 33.

బాధిత కుటుంబానికి సాయం

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని చింతల కాలనీలో కుటుంబ పెద్ద నాయకుల.వేంకటేశ్వరావును కోల్పోయిన పేద కుటుంబానికి తిరువూరు ఐడియాస్ సేవా సంస్థ డైరెక్టర్ ఆవ్వారి.శౌరి తన వంతు సాయంగా రూ.13,000 నగదును తన మిత్ర బృందంతో కలిసి ఆదివారం అందించారు. బుజ్జి, బిజిలి కుమారి, చమన్ కృష్ణ పాల్గొన్నారు.

నేత్రదానానికి అంగీకారం

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన, మండలంలోని అనంతవరానికి చెందిన బూదేటి నాగ సత్యనారాయణ నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు దానం చేశారు. విజయవాడకు చెందిన అగర్వాల్ కంటి ఆసుపత్రి నిపుణులు వచ్చి సత్యనారాయణ కళ్లపై ఉన్న రెటీనాను సేకరించారు. మృతుని కుటుంబ సభ్యులకు ధ్రువపత్రం అందజేశారు.

గొడవలకు దిగితే కఠిన చర్యలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ మోహనరావు

నందిగామ, న్యూస్‌టుడే: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు, వివాదాల కేసుల్లో ఉన్న నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్‌ఐ మోహనరావు మాట్లాడుతూ మద్యంతాగి గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని కోరారు. మంచి ప్రవర్తన కలిగి ఉన్న వారిపై రౌడీషీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అనంతరం ఇకపై ఎటువంటి వివాదాలకు వెళ్లకుండా జీవిస్తామని ప్రమాణం చేశారు. సీఐ వైవీవీఎల్ నాయుడు, ఎస్సైలు సూర్యశంకర్, మహాత్మ తదితరులు పాల్గొన్నారు.

దట్టంగా మంచు.. పంటలకు ముప్పు



మండల పరిధిలోని మామిడి, మిరప రైతులను దట్టమైన మంచు ఆందోళనకు గురి చేస్తోంది. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి గ్రామాలను మంచు దుప్పటి కప్పేసింది. ప్రస్తుతం రెండు పంటలు పూత, పిందెపై ఉన్నాయి. మంచు అధికమైతే ఆయా పంటల్లో రాలిపోయి దిగుబడి రాదని అన్నదాతలు వాపోతున్నారు. రహదారులపై సమీప వాహనాలు కూడా కనిపించనంతగా మంచు కురవడంతో వాహనదారులు ఉదయం 10 గంటల వరకు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. **- న్యూస్‌టుడే, గంపలగూడెం**

ధర్మపరిరక్షణే.. వీహెచ్‌పీ లక్ష్యం

మేడూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని మేడూరు వీరాంజనేయ స్వామి గుడి వద్ద ఆదివారం శ్రీరామ సేవకులు, వీరాంజనేయ స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో వీహెచ్‌పీ మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కొడుమూరి సూర్యప్రకాశ్‌(బుజ్జి)ని సత్కరించారు. గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు వీరాంజనేయ స్వామి గుడి వరకు పాదయాత్ర నిర్వహించిన భక్తులు సన్మాన కార్యక్రమంలో పాల్గొని వారిని అభినందించారు.


వెంకటేశ్వరరావు, సూర్యప్రకాశ్‌ను సన్మానిస్తున్న శ్రీరామ సేవకులు

పంటల సాగుకు పోషకాలు అవసరం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రైతులందరూ మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు సూచించారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌లో భాగంగా కుదప గ్రామంలో ఆదివారం మట్టి నమూనా పరీక్షల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనా పరీక్షలు చేయడం ద్వారా పలు విషయాలు తెలుస్తాయన్నారు. సాగు చేయబోయే పంటకు అవసరమయ్యే పోషకాలను సేంద్రియ పద్ధతుల ద్వారా భూమిలో పెంచుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో టీం లీడర్ మహేష్ రెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జి పవన్, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసరావు

వెలగలేరు.. దారి చూస్తే వెళ్లలేరు..!



వెలగలేరులో ఆర్‌అండ్‌బీ రహదారిపై వాహనాల రద్దీతో రాకపోకలకు నరకయాతన పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి కారణం గ్రామంలో నుంచి వెళ్లే ప్రధాన రోడ్డు విజయవాడ- విస్సన్నపేట రహదారిలో భాగంగా ఉండటమేనని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు విజయవాడ వెళ్తుంటాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ చేరుకునే వాహనాలు సైతం ఇబ్రహీంపట్నం రింగు సెంటర్ వద్ద ట్రాఫిక్ మళ్లిస్తే అవి కూడా వెలగలేరు రహదారి గుండా విజయవాడ చేరుకుంటాయి. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండటంతో గ్రామంలో రద్దీ ఎక్కువవుతోందని, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి విస్తరణ చేపడితే మేలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**

స్టడీ మెటీరియల్ అందజేత

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రెడ్డిగూడెంలోని ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ కేంద్రంలో గురుకుల ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఈ మేరకు కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు ఆదివారం ఎంపీఎస్ఎస్ సంఘం నాయకులు, ఎన్.సూరిరాజు, ధనరాజు సహకారంతో స్టడీ మెటీరియల్ కొనుగోలు చేసి అందజేసినట్లు సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్.విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందుకున్న వారితో నిర్వాహకులు

'కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం'

గంపలగూడెం, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మరోసారి అన్యాయం జరిగిందని ఏపీసీసీ సభ్యుడు, ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గంపలగూడెం మండలం మిట్టగూడెనికి చెందిన మేడా సురేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు అండతో ప్రధానిగా ఉన్న మోదీ రాష్ట్రానికి బడ్జెట్ కేటాయింపులో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. రాష్ట్ర రాజధానికి మళ్లీ అప్పులే తప్ప కేంద్రం నుంచి ఆర్థికంగా ఆపన్నహస్తం అందించలేదన్నారు. విభజన చట్టం మేరకు అమరావతి నిర్మాణ బాధ్యత కేంద్రానిదేనన్నారు.

అవార్డు అందుకోవడం అభినందనీయం


శివ సత్యనారాయణను సన్మానిస్తున్న గ్రామస్థులు

తిరువూరు, న్యూస్‌టుడే : విస్సన్నపేట మండలం కొండపర్వకు చెందిన బొట్ల.శివ సత్యనారాయణ జనవరి 26న జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా స్థాయిలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రగతిశీల యువజన అధ్యక్షుడు పామర్తి మారుతీరావు ఆధ్వర్యంలో గ్రామస్థులు శివ సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. సర్పంచి రమేష్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైకాపా నేతలు తీరు మార్చుకోకుంటే గుణపాఠం తప్పదు


మైలవరంలో అంబటి, జోగి దిష్టిబొమ్మలు దహనం


ఎ.కొండూరు పోలీస్ స్టేషన్‌లో రాంబాబుపై ఫిర్యాదు చేస్తూ..


జి.కొండూరులో సమావేశమైన నాయకులు


రెడ్డిగూడెం తెదేపా కార్యాలయంలో..

మైలవరం, న్యూస్‌టుడే : ప్రజల బాగోగుల కంటే మురికి వ్యాఖ్యలే ముఖ్యమనుకునే వైకాపా నాయకులు తీరు మార్చుకోవాలని, లేకుంటే తగిన గుణపాఠం తప్పదని తెదేపా నేతలు హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై అంబటి రాంబాబు, మంత్రి నారా లోకేశ్‌పై జోగి రమేష్ వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం తెదేపా నాయకులు స్థానిక పంచాయతీ కార్యాలయ కూడలిలో వారి దిష్టిబొమ్మలను దహనం చేశారు. లీలాప్రసాద్, శోభన్‌బాబు, లితీష్, గోపాలస్వామి, కరీం, వెంకట నారాయణ, ప్రసాద్, షహనబేగం, అంకరాజు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మాజీ మంత్రి అంబటి రాంబాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెదేపా జిల్లా అధికార ప్రతినిధి ఎ.రమేష్ రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.పీక్లానాయక్, జి.రామ్‌ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు.

జి.కొండూరు, న్యూస్‌టుడే : ప్రజా దోహులుగా మారిన అంబటి రాంబాబు, జోగి రమేష్‌లను తరిమికొట్టాలని తెదేపా మండల నాయకులు మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం రాంబాబు, రమేష్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై వైకాపా నాయకుల అసభ్య వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని తెదేపా రాష్ట్ర నాయకుడు కోమటి సుధాకరరావు అన్నారు. వెల్వడంలో నిర్వహించిన సమావేశంలో అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల వ్యాఖ్యలను ఆయన ఖండించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : తోటమూలలో నిర్వహించిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు తదితరులు మాట్లాడారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండడం ఓర్వలేక వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి కుట్ర పన్ని అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. నాయకులు వీరారెడ్డి, నారాయణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : స్థానిక తెదేపా కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు విలేకరులతో మాట్లాడారు. అంబటి రాంబాబు తన వైఖరి మార్చుకోవాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి, నాయకులు ఎం.నాగేశ్వరరెడ్డి, సీహెచ్.చందా, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.సాంబశివరావు, ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెదేపా నాయకులు నిరసన తెలిపారు. మందా మురళీ, సాధనాల ప్రసాద్, గూడపాటి పద్మశేఖర్, శ్రీను నాయక్ పాల్గొన్నారు.


గొల్లపూడిలో నిరసన తెలుపుతూ...

వైభవంగా నెమలి కృష్ణుని మాస కల్యాణం


నెమలి: కార్యక్రమంలో పాలకవర్గం, అధికారులు, అర్చకులు


బొర్రగుడి: క్రతువులో దంపతులు


మైలవరంలో వేద పండితుల ఆధ్వర్యంలో తిరు కల్యాణం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని నెమలి కృష్ణాలయంలో ఆదివారం స్వామి వారి మాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఉత్సవమూర్తులను మేళతాళాలతో యాగశాలకు తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. వివిధ గ్రామాలకు చెందిన 26 మంది దంపతులు కన్యాదాన క్రతువులో పాల్గొన్నారు. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, ట్రాఫిక్ డీఎస్పీ రామచంద్రరావు, ఆలయ మాజీ అధ్యక్షుడు బి.మధుసూదనరావు, మాజీ సభ్యుడు వి.చినబాబు పాల్గొన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరు కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం రాత్రి నిర్వహించారు. ద్వారకా తిరుమల దేవస్థాన ఛైర్మన్ ఎస్.వి.సుధాకర్‌రావు ఆధ్వర్యంలో, ఆయన తనయుడు ఎస్.వి.నివృతరావు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మైలవరం తిరునాళ్లుగా పిలుచుకునే ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు, చుట్టు పక్కల గ్రామస్థులు హాజరయ్యారు.

కంభంపాడు(ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని కంభంపాడు శివాలయంలో విజయదుర్గాంబ అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో మాఘ పూర్ణిమ పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు.

తిరుపతమ్మ, గోపయ్య స్వామి..

మైలవరం, న్యూస్‌టుడే : మండల పరిధి బొర్రగుడిలో ప్రసిద్ధ తిరుపతమ్మ, గోపయ్య స్వామి కల్యాణ వేడుకలను ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త చెలికాని సత్యవరప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తిరునాళ్లు ప్రారంభం

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలో శ్రీవెంకటాచల స్వామి తిరునాళ్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. వీటిని ఈ నెల 5వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ఛైర్మన్. పర్వతం శ్రీనివాసరావు తెలిపారు.


తిరువూరు వెంకటాచల స్వామి

ప్రత్యేక అభిషేకం

మైలవరం, న్యూస్‌టుడే : మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన స్థానిక భ్రమరాంబిక సమేత మల్లేశ్వర స్వామి(శివాలయం) ఆలయంలో 108 చీరలతో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఒక్కొక్క నామానికి ఒక చీర చొప్పున అష్టోత్తర, కుంకుమ పూజలు నిర్వహించారు.


మైలవరం శివాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

అవినాష్, జగన్మోహనరావు అరెస్టు

గొల్లపూడి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఇబ్రహీంపట్నంలోని మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి వెళ్తున్న వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావులను పోలీసులు అడ్డుకున్నారు. ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి భారీ సంఖ్యలో జోగి రమేష్ ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో జూపూడి వద్ద పోలీసులు వారిని ఆపారు. దీంతో పోలీసులకు, నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది. తమను ఎందుకు పంపించరంటూ పోలీసులపై నాయకులు ఎదురుదాడికి దిగి ఘర్షణ పడగా వారిద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అవినాష్‌ను సత్యనారాయణపురం పోలీసు స్టేషన్‌కు తరలించారు. జగన్మోహనరావును మొదట భవానీపురం పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ నుంచి సత్యనారాయణపురం స్టేషన్‌కు పంపించారు. మార్గమధ్యలో వైకాపా కార్యకర్తలు అడ్డు తగిలి పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.


సత్యనారాయణపురం స్టేషన్ వద్ద వైకాపా శ్రేణులు

ప్రమాదాల రోడ్డుపై మరో ప్రాణం పోయింది..

✤ జాతీయ రహదారిపై ఢీకొన్న రెండు ద్విచక్ర వాహనాలు

మైలవరం, న్యూస్‌టుడే : జాతీయ రహదారి-30పై ప్రమాదాల పరంపరలో మరొకరు మృతి చెందారు. సేకరించిన, ఎస్సై కె.సుధాకర్ వివరాల మేరకు.. మండలంలోని అనంతవరానికి చెందిన బూదేటి నాగసత్యనారాయణ(56) కుటుంబం కొన్నేళ్లుగా మైలవరంలో నివసిస్తున్నారు. వ్యవసాయంతో పాటు స్థిరాస్తి వ్యాపారం చేసే అతను ఆదివారం ఉదయం జి.కొండూరు మండలం గుర్రాజుపాలెం వెళ్లేందుకు తన బైక్‌పై బయలుదేరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎదురు రోడ్డులోకెళ్లేందుకు జాతీయ రహదారిపై కుడివైపునకు తిరిగినపుడు వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. రోడ్డుపై పడిపోయిన సత్యనారాయణ తలకు తీవ్ర గాయాలవగా, మరో వాహనదారుడు ఆముదాల రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని 108లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సత్యనారాయణను విజయవాడ తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మరణించాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గాయాలపాలైన రమేష్‌ను మెరుగైన చికిత్సకు విజయవాడ తీసుకెళ్లారు.


నాగ సత్యనారాయణ (పాత చిత్రం)

✤ శిరస్త్రాణం లేక గాయాలు.. సత్యనారాయణ బయటకు వెళ్లేటపుడు శిరస్త్రాణం ధరిస్తారని, ఆదివారం ధరించక పోవడంతో, రహదారిపై పడడంతోనే తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెనుక నుంచి ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు శిరస్త్రాణం ధరించడంతో గాయాలతో బయటపడ్డారని ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులను తెదేపా నాయకులు ప్రసాద్, శోభన్‌బాబు, గంగాధరరావు తదితరులు పరామర్శించారు.

పెరుగుతున్న ఆక్రమణలు.. రాకపోకలకు అవస్థలు

తిరువూరు, న్యూస్‌టుడే

తిరువూరు పట్టణంలోని ప్రధాన రహదారిపై ఆక్రమణలు రోజురోజుకు పెరిగి పోతున్నాయి. స్థానిక ఫ్యాక్టరీ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా దుకాణాల ముందు ఉన్న ఫుట్‌పాత్‌లను దాటి రహదారిపైకి తమ వ్యాపారాలను విస్తరిస్తున్నారు. పలువురు తమ దుకాణాల ముందు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను గంటల తరబడి నిలపడంతో ఆ మార్గం ఇరుకుగా మారుతోంది. ఫలితంగా ఈ దారిలో పాఠశాల బస్సులు, అంబులెన్స్‌లు పయనించడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయి. ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న సంఘటనలు ఉన్నాయని స్థానికులు తెలుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడు వచ్చి హెచ్చరికలు చేస్తున్నప్పటికీ, శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ శాఖ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూసిన దాఖలాలే లేవని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్ల ఆక్రమణలు, వాహనాల నిలుపుదలపై కఠిన చర్యలు తీసుకుని, నోపార్కింగ్ జోన్లను స్పష్టంగా గుర్తించి అమలు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.


బోసుబొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ఇదే పరిస్థితి

రెవెన్యూ, రాష్ట్రం, రంగాలవారీ
గ్రాంట్ల విధానం రద్దు

• 16వ ఆర్థిక సంఘం సిఫార్సు • కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 41% వాటా

• నికరంగా రాష్ట్రాలకు రూ.37,168 కోట్ల నష్టం



ఈనాడు - దిల్లీ, హైదరాబాద్: కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంపిణీ చేసే వాటాను 15వ ఆర్థిక సంఘం తరహాలోనే 41 శాతంగా 16వ ఆర్థిక సంఘం ఖరారు చేసింది. అయితే ఇతర గ్రాంట్లలో కోతపెట్టి బయటికి కనిపించని వాత పెట్టింది. రెవెన్యూ లోటును ఎదుర్కొంటున్న రాష్ట్రాల ఆర్థిక భారాన్ని పూడ్చేందుకు 15వ ఆర్థిక సంఘం ఇచ్చిన గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కనపెట్టింది. దీనికితోడు రంగాలవారీ, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకూ తిలోదకాలిచ్చింది. దీని వల్ల గత ఐదేళ్లతో పోలిస్తే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రాలు నికరంగా రూ.4,66,150 కోట్ల ఆదాయం కోల్పోనున్నట్లు తేలింది. రెవెన్యూ లోటు గ్రాంట్ల కింద 15వ ఆర్థిక సంఘం ఏపీ, అస్సాం, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, కేరళ, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌లకు కలిపి ఐదేళ్ల కాలానికి రూ.2,94,514 కోట్లు సిఫార్సు చేసింది. ఇందులో ఏపీ వాటా రూ.30,497 కోట్లుంది. ఇప్పుడు ఆ నిధులన్నీ పూర్తిగా రద్దు కావడంవల్ల రాష్ట్రాలకు కోత పడనుంది. రంగాలవారీ, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్ల కోత కారణంగా ఆంధ్రప్రదేశ్ రూ.8,294 కోట్లు, తెలంగాణ రూ.5,386 కోట్లు నష్టపోనున్నాయి. దీని కింద మొత్తంగా అన్ని రాష్ట్రాలూ కలిపిరూ.1,71,636 కోట్లు కోల్పోనున్నాయి. మొత్తంగా 15వ ఆర్థిక సంఘంతో పోలిస్తే 16వ ఆర్థిక సంఘం హయాంలో రాష్ట్రాలు రూ.4,66,150 కోట్లు నష్టపోనున్నాయి.

స్థానిక సంస్థలకు పెరగనున్న గ్రాంట్లు

16వ ఆర్థిక సంఘం సిఫార్సుల కారణంగా స్థానిక సంస్థలకు ఐదేళ్లలో రూ.7,91,493 కోట్ల గ్రాంట్లు రానున్నాయి. దీనికి తోడు ఎస్‌డీఆర్ఎఫ్ కింద రూ.1,63,521 కోట్లు, ఎస్‌డీఎంఎఫ్ కింద రూ.40,880 కోట్లు కేటాయించింది. ఈ రెండు పద్దుల కింద రాష్ట్రాలకు రూ.9,95,894 కోట్లు రానున్నాయి. 15వ ఆర్థిక సంఘం హయాంలో స్థానిక సంస్థలకు రూ.5,58,962 కోట్లే వచ్చాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు రూ.4,36,932 కోట్లు పెరగనున్నాయి. 15వ ఆర్థిక సంఘం అన్ని గ్రాంట్లు కలిపి రూ.10,33,062 కోట్లు రాష్ట్రాలకు కేటాయించగా ఇప్పుడు అది రూ.9,95,894 కోట్లకు తగ్గిపోనుంది. అంటే రాష్ట్రాలు నికరంగా రూ.37,168 కోట్లు నష్టపోనున్నాయి.

వెయిటేజీలో కొంత మేలు

16వ ఆర్థిక సంఘం సిఫార్సులతో దక్షిణాది రాష్ట్రాలకు వెయిటేజీలో కొంత మేలు జరిగింది. 15వ ఆర్థిక సంఘం దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ కలిపి 15.8% వెయిటేజీ ఇవ్వగా 16వ ఆర్థిక సంఘం దాన్ని 17.001%కి పెంచింది. దీనివల్ల కేంద్ర పన్నుల్లో ఈ రాష్ట్రాలకు నికరంగా 1.201% వాటా పెరిగింది. లెక్కల ప్రకారం చూస్తే ఈ రాష్ట్రాలు రూ.18,330.31 కోట్ల నికర ప్రయోజనం పొందాయి. జనాభాను ప్రాతిపదికగా తీసుకుని వెయిటేజీ ఇస్తే తాము నష్టపోతామని, క్రమశిక్షణతో అమలు చేసిన కుటుంబ నియంత్రణను పరిగణనలోకి తీసుకుని ప్రోత్సాహం ఇవ్వాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులంతా 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. ఇతర సామాజిక, ఆర్థిక కోణాలనూ పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సంఘం ఇదివరకున్న వెయిటేజీని సవరించింది. వెయిటేజీని మార్చడంవల్ల మొత్తం 28 రాష్ట్రాల్లో 14 లబ్ధి పొందుతుండగా, మరో 14 నష్టపోనున్నాయి. వెయిటేజీ తగ్గిన రాష్ట్రాల్లో యూపీ, బిహార్, మధ్య ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, మేఘాలయ, మణిపుర్, నాగాలాండ్, గోవా, సిక్కింలు ఉన్నాయి. ప్రస్తుత లెక్కల ప్రకారం కేంద్ర వనరుల్లో వాటా అందుకునే రాష్ట్రాల్లో ఏపీ 8వ స్థానంలో (వెయిటేజీ 4.047 నుంచి 4.217 శాతానికి పెరిగింది), తెలంగాణ 16వ స్థానంలో(వెయిటేజీ 2.102 నుంచి 2.174 శాతానికి పెరిగింది) ఉన్నాయి.

వెయిటేజీ విషయంలో రెండు కమిషన్ల మధ్య తేడాలివీ..

వివరం	16వ కమిషన్	15వ కమిషన్
జనాభా (2011)	17.5	15
డెమొగ్రాఫిక్ పనితీరు	10	12.5
ఏరియా	10	15
అడవులు	10	10
తలసరి జీఎస్‌డీపీ తేడా	42.5	45
జీడీపీలో వాటా	10	-
ట్యాక్స్ అండ్ ఫిస్కల్ ఎఫర్ట్	-	2.5
మొత్తం	100%	100%

జనాభాకే ప్రాధాన్యం

16వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు వెయిటేజీ ఇవ్వడంలో జనాభాకే ఎక్కువ మార్కులు కేటాయించింది. అదే సమయంలో డెమొగ్రాఫిక్ పని తీరు, రాష్ట్ర విస్తీర్ణం, తలసరి ఆదాయ తేడాలకు మార్కులు తగ్గించింది. అయితే దేశ జీడీపీకి రాష్ట్రాలు అందించే వాటాకు 10 మార్కులు కేటాయించింది. 15వ ఆర్థిక సంఘం పరిగణనలోకి తీసుకోని ఈ కొత్తకోణాన్ని 16వ ఆర్థిక సంఘం తీసుకుని కొత్త వెయిటేజీ ఇచ్చింది. అలాగే పన్ను వసూళ్లు, ఆర్థిక క్రమశిక్షణ కోసం రాష్ట్రాలు చేసే ప్రయత్నాలను పూర్తిగా పక్కనపెట్టింది. దీనివల్ల రాష్ట్రాల వెయిటేజీలో తేడాలొచ్చాయి.

కేంద్ర వనరుల పంపిణీ కోసం ఆర్థిక సంఘాలు రాష్ట్రాలకు ఇచ్చిన వెయిటేజీలో మార్పులు www.eenadu.net లో..

ఫోన్ ట్యాపింగ్ కేసులో
కేసీఆర్‌ను విచారించిన సిట్



సిట్ విచారణ అనంతరం.. భారాస కార్యకర్తలకు అభివాదం చేస్తున్న కేసీఆర్. చిత్రంలో ఆ పార్టీ నాయకులు

ఈనాడు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌ను సిట్ విచారించింది. ప్రశ్నల విచారణ ఆదివారం ఉత్కంఠ పరిణామాల మధ్య కొనసాగింది. భారాస శ్రేణుల ఆందోళనల నడుమ.. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసంలోనే ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఆయన్ని విచారించింది. మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన విచారణ నాలుగున్నర గంటల సేపు సాగింది. విచారణ క్రమంలో సిట్ పలు ప్రశ్నలు అడిగి కేసీఆర్ వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ముఖ్యంగా ఈ కేసులో నిందితులు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావుల పునర్నియామకాలతోపాటు ప్రణీత్‌రావు పదోన్నతి గురించి కేసీఆర్‌ను అడిగినట్లు తెలిసింది. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ప్రభాకర్‌రావును కొనసాగించాల్సిన అవసరంపై ప్రశ్నించినట్లు సమాచారం. ఎవరినైనా పునర్నియమిస్తే సాధారణంగా రెండేళ్లకే అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ప్రభాకర్‌రావుకు మాత్రం మూడేళ్లు పొడిగింపు ఇవ్వడం వెనక మతలబేంటి..? అంతటితో ఆగకుండా అసాధారణరీతిలో ఆయనను ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించాల్సిన అవసరమేంటి.. అత్యంత లేదా ఆయనతో చట్టబద్ధమైన ఇంటర్‌సెప్షన్(ఎల్ఐఏ)కు డిజిగ్నేటెడ్ అథారిటీగా నియమించడానికి కారణమేంటి.. లాంటి ప్రశ్నలు అడిగినట్లు తెలుస్తోంది. ఫోన్ అక్రమట్యాపింగ్‌లో ప్రభాకర్‌రావే ప్రధాన నిందితుడు కావడంతో ఈ కారణాలన్నీ కుతూహలాన్ని సూచిస్తున్నాయి కదా..! అని ఆరా తీసినట్లు సమాచారం. అలాగే 2007 ఎస్సై బ్యాచ్‌లో మరెవరికీ లేకుండా ఒక్క ప్రణీత్‌రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించాల్సిన అవసరమేమొచ్చింది..? అని అడిగినట్లు సమాచారం. ఈ క్రమంలో వాటికి సంబంధించి పోలీసుశాఖ నుంచే ప్రతిపాదన వచ్చిందని కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే భారాసకు కోట్ల రూపాయల విరాళాలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వచ్చాయని.. అలా ఇచ్చిన వారి ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు వివరాలు బయటపడటంతో మతలబేమిటని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మరోవైపు 'ఎమ్మెల్యేలకు ఎర' కేసులో కీలకంగా మారిన ఆడియో టేపులు మీకు ఎవరిచ్చారని సిట్ కేసీఆర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం.

రాష్ట్ర విభజన నాటి నుంచి ఏపీ ఆర్థికంగా సతమతం

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్నట్లు 16వ ఆర్థికసంఘం పేర్కొంది. 2014-15లో రాష్ట్రం ఏర్పడిన సంవత్సరంలోనే రాష్ట్ర రుణ-జీఎస్‌డీపీ నిష్పత్తి 26.1% ఉందని, ఇది అదే ఏడాది తెలంగాణలో నమోదైన 18.7% కంటే అధికమని తెలిపింది. రాష్ట్ర విభజనకు ముందు 2013-14లో ఆంధ్రప్రదేశ్ రుణ-జీఎస్‌డీపీ నిష్పత్తి 20.7%గా ఉన్నట్లు గుర్తుచేసింది. ఆంధ్రప్రదేశ్ విభజన నాటినుంచి ఆర్థిక, ద్రవ్యలోటును నియంత్రణలో ఉంచుకోలేకపోతోందని తెలిపింది. విభజన నాటి నుంచి ఆదాయ నిల్వలు నెగెటివ్‌లోనే ఉన్నాయని పేర్కొంది. రాష్ట్ర రుణ-జీఎస్‌డీపీ నిష్పత్తి 2020-21లో గరిష్ఠంగా 36 శాతానికి చేరిందని, 2023-24లో కూడా 34.6%మేర ఉందని పేర్కొంది.



జీవితంలో నిజమైన విలాసాలివే..

✦ ఇరుగుపొరుగుతో సఖ్యత కలిగిఉండటం
✦ ఆరోగ్యకర, దారుఢ్య శరీరంతో ఉండటం
✦ ప్రశాంతంగా భోజనం చేయగలగడం
✦ చీకూచింతా లేకుండా నిద్రపోగలగడం
✦ స్నేహితులతో సంతోషంగా గడపడం
✦ ఏటా పర్యటనలు చేయగలగడం
✦ ఎటువంటి అలారం లేకుండా నిద్రలేవడం
✦ మనం ప్రేమించేవారితో కలిసి రోజూ ఇంటిభోజనం చేయడం ✦ మంచి పుస్తకాలు చదివేందుకు సమయం ఉండటం

– అభిజిత్ భోస్లే, ఇన్వెస్టర్

తెలుగు రాష్ట్రాల వెయిటేజీ పెంపు

• 15వ ఆర్థికసంఘంతో పోలిస్తే ఏపీకి రూ.2,594 కోట్ల ప్రయోజనం

ఈనాడు, దిల్లీ: పదహారో ఆర్థిక సంఘం నిధుల పంపిణీ కోసం రాష్ట్రాలకు ఇచ్చిన వెయిటేజీలో ఏపీకి 0.17%, తెలంగాణకు 0.072% మేర వెయిటేజీ పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు ఇది వరకు ఉన్న 4.047% వెయిటేజీని ఈసారి 4.217%కి, తెలంగాణకున్న 2.102% వెయిటేజీని 2.174%కి పెంచారు. దీనివల్ల కేంద్ర పన్నుల్లో వాటా, ఇతర గ్రాంట్ల విడుదలలో తెలుగు రాష్ట్రాలకు కాస్త మెరుగుదల కనిపించే అవకాశం ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రాబోయే 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం 4.217% వాటా కింద ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర పన్నుల్లో రూ.64,362.16 కోట్లు రానున్నట్లు కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో అంచనావేసింది. ఇది 2025-26 బడ్జెట్‌లో వచ్చిన రూ.56,741.18 కోట్లకంటే రూ.7,620.98 కోట్లు అధికం. ఇదే సమయంలో తెలంగాణ వాటా రూ.29,471.19 కోట్ల నుంచి రూ.33,180.78 కోట్లకు చేరనుంది. ఇది గత ఏడాది కంటే రూ.3,709.59 కోట్లు అధికం. కేంద్ర ప్రభుత్వం 2026-27లో అన్ని రాష్ట్రాలకు కలిపి పన్ను వాటా కింద రూ.15,26,254.58 కోట్లు పంపిణీ చేయనుంది. ఇది 2025-26లో పంపిణీ చేసిన రూ14,02,054.90 కోట్ల కంటే రూ.1,24,199.68 కోట్లు అధికం. 15వ ఆర్థిక సంఘం వెయిటేజీ ప్రకారమైతే ఇందులో ఏపీకి రూ.61,767.52 కోట్లు, తెలంగాణకు, రూ.32,081.87 కోట్లు వస్తుంది. అయితే 16వ ఆర్థిక సంఘం కాస్త వెయిటేజీ పెంచినందున ఏపీకి రూ.2,594.64 కోట్లు, తెలంగాణకు రూ.1,098.91 కోట్ల అదనపు ప్రయోజనం కలుగుతోంది. 15వ ఆర్థిక సంఘం 2020-21 సంవత్సరానికి చేసిన తాత్కాలిక సిఫార్సుల్లో ఏపీకి 4.111%, తెలంగాణకు 2.133% వెయిటేజీ ఇచ్చి 2021-26 మధ్య ఐదేళ్ల కాలానికి చేసిన సిఫార్సుల్లో దాన్ని 4.047%, 2.102%కి తగ్గించింది. అంతకు ముందు 14వ ఆర్థిక సంఘం ఏపీకి 4.305%, తెలంగాణకు 2.147% వాటాను సిఫార్సు చేసింది. ఇప్పుడు 16వ ఆర్థిక సంఘం 15వ ఆర్థిక సంఘం కంటే కొంత ఎక్కువ, 14వ ఆర్థిక సంఘం కంటే కొంత తక్కువ వెయిటేజీని తెలుగు రాష్ట్రాలకు ఇచ్చింది.

వావ్.. ఇదేం ఐడియా 'బాస్'!



కంప్యూటర్‌కు అమర్చిన ఏఐ పవర్డ్ కెమెరా.. (పక్క చిత్రంలో) బాస్‌ను గుర్తించిన కెమెరా

ఈనాడు, బెంగళూరు: ఐటీ కంపెనీల్లో పని చేసే టెకీలు తమ బాస్‌ల కళ్లుగప్పి కంప్యూటర్లలో వీడియోగేమ్‌లు ఆడటం, సినిమాలు చూడటం షరామామూలే. ఒక్కోసారి బాస్‌ల కంటపడి చీవాట్లు కూడా తింటుంటారు. అలా బెంగళూరుకు చెందిన టెకీ పంకజ్ కూడా ఓటీటీలో సినిమా చూస్తూ బాస్ కంటపడ్డారు. తప్పు తనదే కాబట్టి ఆయన మందలించినా భరించారు. ఆ సమయంలో ఆ టెకీ బుర్రకు ఓ ఆలోచన తట్టింది. తనకు ఇష్టమైన 'స్ట్రేంజర్ థింగ్స్ ఇన్ ఏ వీక్' సీజన్‌ను ఎలాగైనా చూడాలని తన కంప్యూటర్‌కు ఏఐ పవర్డ్ కెమెరా డివైజ్ అమర్చారు. ఆ కెమెరా పంకజ్ కూర్చున్న టేబుల్ పరిధిలోకి ఎవరు వచ్చినా గుర్తించడమే తరువాయి.. కంప్యూటర్ స్క్రీన్ ఇన్‌స్టంట్‌గా కోడ్ ఎడిటర్‌గా మారిపోతుంది. ఏఐ, ఆటోమేషన్, రియల్‌టైమ్ ఫేస్ డిటెక్షన్ సాంకేతికతలతో ఈ హార్డ్‌వేర్‌ను తయారు చేశారు. ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఈ హార్డ్‌వేర్, రియల్‌టైమ్ బాస్ చిత్రాలకు లక్షల కొద్దీ వ్యూస్ దక్కాయి. మాబాస్ కోసం ఈ హార్డ్‌వేర్ తయారు చేసినా.. కార్యాలయాల్లో గోప్యతను కాపాడుకునేందుకు ఇదో స్మార్ట్ సొల్యూషన్‌గా ఉపయోగపడుతుందని పంకజ్ చెబుతున్నారు. ఈ ఆలోచన తెలుసుకున్న వారంతా వావ్.. ఏం ఐడియా బాస్ అంటున్నారు.

దేశాభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా బడ్జెట్

– రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి

ఈనాడు, అమరావతి: దేశాభివృద్ధికి దిశానిర్దేశం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర బడ్జెట్ రూపొందింది. ఉద్యోగాల సృష్టి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు పెరగడం యువతకు ఎంతో ఉపయోగం. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం కోసం తీసుకొచ్చిన ప్రతిపాదనలు ప్రశంసనీయం.

పర్యాటకానికి పెద్దపీట: మంత్రి దుర్గేశ్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర పర్యాటక రంగానికి నిధులు కేటాయించడం హర్షణీయం. ఇప్పటికే కేంద్రం సుమారు రూ.450 కోట్లు పర్యాటక రంగం అభివృద్ధికి కేటాయించింది. ఆ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

41% వాటా సిఫార్సు చేయడం ప్రశంసనీయం కాదు

– తెదేపా నేత యనమల రామకృష్ణుడు

15వ ఆర్థిక సంఘం లాగానే 16వ ఆర్థిక సంఘం కూడా రాష్ట్రాలకు 41 శాతం వాటా సిఫార్సు చేయడం ప్రశంసనీయం కాదు. జీరామ్‌జీ పథకం గురించి బడ్జెట్‌లో స్పష్టత లేదు.

కొబ్బరి.. కొత్తగా నాటుకోవచ్చు

కోకో, జీడి ఉత్పత్తిలో స్వయం సమృద్ధి లక్ష్యం

కేంద్ర బడ్జెట్లో ఈ పంటలకు ప్రోత్సాహకాలు



ఈనాడు-అమరావతి: కొబ్బరి, కోకో పంటల్లో ఉత్పత్తి పెంచడం ద్వారా.. రైతుల ఆదాయాన్ని పెంచాలని కేంద్రం నిర్ణయించింది. అధిక విలువ కలిగిన పంటలకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు బడ్జెట్లో ప్రకటించింది. కొబ్బరి సాగులో కేరళ, కర్ణాటక, తమిళనాడు తర్వాత నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలుస్తుంది. రాష్ట్రంలో సుమారు 2.80 లక్షల ఎకరాల్లో కొబ్బరి తోటలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విజయనగరం, కాకినాడ తదితర జిల్లాల్లో సాగు అధికం. ఒకప్పుడు కొబ్బరి తోటలతో కళకళలాడుతుండే కోనసీమ ప్రాంతమంతా ఇప్పుడు వెలవెలబోతోంది. దశాబ్ద కాలంలో లక్షల సంఖ్యలో కొబ్బరి చెట్లు తొలగించారు.

● రాష్ట్రంలో ఉన్నవన్నీ దశాబ్దాల కిందటి తోటలు కావడంలో దిగుబడి తగ్గుతోంది. రొయ్యల చెరువుల ప్రభావంతో ఉప్పు నీటి సమస్య పెరిగి చెట్లు చనిపోతున్నాయి. కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. చీడపీడల తాకిడి అధికమైంది. పెట్టుబడి పెరుగుతోంది.

కేంద్రం ఏం చేస్తుంది?: కొబ్బరి ప్రోత్సాహక పథకం కింద ఉత్పత్తి, ఉత్పాదకత పెంపు కోసం వివిధ కార్యక్రమాలు అమలు చేయనుంది. ముఖ్యంగా దిగుబడి తగ్గుతున్న చెట్లను తొలగించి, వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటేందుకు ప్రోత్సాహం అందిస్తుంది.

కోకో, జీడిమామిడికి..గ్లోబల్ బ్రాండ్

జీడి, కోకో ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడంతో పాటు ఎగుమతులు, ప్రాసెసింగ్‌లో పోటీతత్వాన్ని పెంచాలని, 2030 నాటికి జీడి, కోకో ఉత్పత్తులను ప్రీమియం గ్లోబల్ బ్రాండ్లుగా తయారు చేయడమే లక్ష్యంగా ప్రోత్సాహకాలు ప్రకటించింది.

● రాష్ట్రంలో సుమారు 4.30 లక్షల ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, కాకినాడ, తూర్పుగోదావరి, విజయనగరం జిల్లాల్లో సాగు అధికం. కొన్నేళ్లుగా తుపాన్లు, ఇతర ప్రకృతి విపత్తుల కారణంగా తీర ప్రాంత జిల్లాల్లో సాగు తగ్గిపోతోంది.

● కోకో సాగు అత్యధికంగా ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల్లో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 73 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆయిల్‌పామ్, కొబ్బరిలో అంతర పంటలుగా వేస్తున్నారు. గతేడాది ధరలు తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.50 అదనపు ప్రోత్సాహకంగా ఇచ్చింది. కేంద్ర ప్రోత్సాహంతో రాష్ట్రంలో కోకో సాగు విస్తరించే అవకాశం ఉంది.

ఖేలో ఇండియా నిధులు రాబట్టుకుంటే రాష్ట్రంలో క్రీడా వికాసం

మిషన్ పదేళ్ల పొడిగింపుతో ఏపీకి మేలు జరిగే అవకాశం

ఈనాడు, అమరావతి: కేంద్ర ప్రభుత్వం 'ఖేలో ఇండియా మిషన్'ను మరో పదేళ్లు పొడిగిస్తూ బడ్జెట్‌లో నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రంలో క్రీడా వికాసానికి మార్గం సుగమమైంది. ఇప్పటికే క్రీడా మౌలిక సదుపాయాల కల్పన, స్టేడియాల అభివృద్ధి కోసం శాప్ అధికారులు ఖేలో ఇండియాకు రూ.600 కోట్ల విలువైన 47 ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. వీటిలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్టేడియాలు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణాల్లో మౌలిక వసతుల కల్పన, సింథటిక్ ట్రాక్‌ల అభివృద్ధి, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాలు, వాలీబాల్, ఫుట్‌బాల్ కోర్టులు తదితర ప్రాజెక్టులు ఉన్నాయి. అలాగే కాకినాడ/గుంటూరుల్లో నేషనల్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటు, తిరుపతిలో ఖేలో ఇండియా రీజినల్ ట్రైనింగ్ సెంటర్, స్టేట్ లెవెల్ ఖేలో ఇండియా ఎక్సలెన్స్ సెంటర్, ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ లెవెల్ ఖేలో ఇండియా రెసిడెంట్ సెంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అధికారులు వేగంగా స్పందించి వీటి ఏర్పాటుకు చొరవ తీసుకుంటే క్రీడా రంగానికి ఊతం లభించనుంది.

దేశ ప్రగతికి దోహదం చేసే విధానపత్రం

సత్యకుమార్ యాదవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

'దేశ ప్రగతికి దోహదం చేసే విధాన పత్రంలా బడ్జెట్ ఉంది. ప్రస్తుత ప్రపంచ రాజకీయ, ఆర్థిక అస్థిరత, ఇతర సవాళ్ల నేపథ్యంలో అత్యుత్తమ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. క్యాన్సర్‌తోపాటు 17 ప్రాణాంతక ఔషధాలపై దిగుమతి సుంకం తగ్గించడం...ఆర్థిక స్థోమతలేని వారికి మానసిక వైద్యసేవలు, ట్రామా కేర్‌సేవలు అందుబాటులోకి తేవడం స్వాగతించాల్సిన అంశం' అని మంత్రి సత్యకుమార్ అభిప్రాయపడ్డారు.

స్వదేశీ స్ఫూర్తితో రూపొందించారు

లంకా దినకర్, 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ ఛైర్మన్

'బడ్జెట్‌లో ఏపీ అభివృద్ధికి ఊతమిచ్చే అంశాలు ఉన్నాయి. డేటా సెంటర్, ఏఐ ఆధారిత పరిశ్రమలకు 2047 వరకు ట్యాక్స్ హాలిడే ప్రకటించడం వల్ల. . విశాఖలో గూగుల్ డేటా సెంటర్, అమరావతిలో ఏర్పాటుకానున్న ఏఐ ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహం దక్కుతుంది. ఏపీలో మరిన్ని పెట్టుబడులకు అవకాశం ఉంది. అరకు- పులికాట్ సరస్సుల పర్యాటక అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించడంతో పర్యాటకం అభివృద్ధి చెంది, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా రాష్ట్రంలో కనీసం రూ.11 వేల కోట్ల నుంచి రూ.13 వేల కోట్ల వరకు కేంద్ర-రాష్ట్ర వాటాతో ఉపాధి కల్పనతో గ్రామీణ ఆస్తుల అభివృద్ధికి వీలుంది. అరుదైన ఖనిజాల ప్రాజెక్టు వృద్ధికి ప్రకటించిన ఐదు రాష్ట్రాల్లో ఏపీకి చోటు దక్కింది' అని లంకా దినకర్ పేర్కొన్నారు.

రాష్ట్రానికి మొండిచేయి.. కార్పొరేట్లకు వరాలు: సీపీఎం

ఈనాడు, అమరావతి: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రానికి నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపిందని, కేంద్రం నిధులు కేటాయించేలా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. 'విశాఖ ఉక్కు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. కొత్తగా ఒక్క ప్రాజెక్టు సైతం రాష్ట్రానికి ఇవ్వలేదు. అప్పులు ఇప్పించి దాన్నే సహాయంగా ప్రకటించుకోవడం దారుణం. ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టుకు గతం కన్నా నిధులు తగ్గించి రూ.3 వేల కోట్లకు కుదించారు. ఈ నిధులతో ఎలా పూర్తి చేస్తారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. అమరావతికి గ్రాంటు ఇవ్వడానికి బదులుగా అప్పులు ఇప్పించడం రాష్ట్రానికి భారమవుతుంది. ఉపాధి హామీ పథకానికి కోత పెట్టారు' అని తెలిపారు.

పశుగణాభివృద్ధికి ప్రోత్సాహకరంగా సమీకృత విధానం

ఈనాడు, అమరావతి: పశు సంపద, డెయిరీ, కోళ్ల పరిశ్రమల అభివృద్ధి కేంద్రీకృతంగా వాటికి అదనపు విలువను జోడించేలా ఎండ్ టు ఎండ్ విధానంలో ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకేజీ, మార్కెటింగ్ వరకు సమీకృత విధానాన్ని అమలు చేయనున్నట్లు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. దాంతో రాష్ట్రంలోని పశు సంవర్ధక రంగంలో ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. మరోవైపు రాష్ట్రంలో ముందుకు కదలని 'లైవ్ స్టాక్ ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్స్' ఏర్పాటుకు ఈ ప్రతిపాదన ఊతమివ్వనుంది. దీనివల్ల పశుగణ ఉత్పాదకత పెరిగే అవకాశం ఉంది. అలాగే వెటర్నరీ ప్రొఫెషనల్స్‌ను 20 వేల మందికి పైగా అందుబాటులోకి తెచ్చేందుకు పశువైద్య కళాశాలలు, పారా వెటర్నరీ కళాశాలలు, పశు వైద్యశాలలు, ల్యాబ్‌లు వంటి వాటిని ప్రైవేట్ రంగంలో ఏర్పాటు చేసుకునేందుకు మూలధన రాయితీతో కూడిన రుణాల కల్పనకు బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనతో రాష్ట్రంలో పశువైద్య సేవలకు వసతులు మెరుగయ్యేందుకు అవకాశం ఉంది.

ఆర్థిక వ్యవస్థను దిగజార్చేలా ఉంది: సీపీఐ

ఈనాడు, అమరావతి: కేంద్ర బడ్జెట్ ఆర్థిక వ్యవస్థను మరింత దిగజార్చేలా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. 'ఈ బడ్జెట్ వల్ల రూపాయి పతనం మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఇది దిశానిర్దేశం లేని బడ్జెట్. పెద్ద పెద్ద ప్రకటనలు చేశారే తప్ప ప్రభుత్వం విధించిన కోతలు చెప్పలేదు. గ్రామీణ భారతానికి ఊతం కలిగించే ఒక్క చర్య కూడా బడ్జెట్‌లో లేదు. వరి, గోధుమ, ఇతర వ్యవసాయ, వాణిజ్య పంటలు పండించే 75 శాతం మంది రైతులకు చేసిందేమీ లేదు. వారికి ఎలాంటి ప్రోత్సాహకాలు లేవు' అని పేర్కొన్నారు.

వేగంగా స్పందిస్తే రాష్ట్రానికి మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్లు

• ధర్మవరం, పిఠాపురం, మంగళగిరి చేనేతలకు ఉపయుక్తం
• అమరావతిలో చేనేత మ్యూజియం ఏర్పాటుకు అడుగులు

ఈనాడు, అమరావతి: జాతీయ చేనేత అభివృద్ధి పథకం కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దాని స్థానంలో కొత్తగా జాతీయ చేనేత, హస్తకళల కార్యక్రమాన్ని 2026-27 బడ్జెట్‌లో ప్రకటించింది. దీంతోపాటు దేశవ్యాప్తంగా మెగా టెక్స్‌టైల్స్ పార్కుల ఏర్పాటుకు మొగ్గుచూపిన నేపథ్యంలో ఆ దిశగా రాష్ట్ర అధికారులు వేగంగా స్పందిస్తే చేనేత, జౌళి రంగానికి ఊతం లభించనుంది. ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో ఉన్న చేనేత, జౌళి కార్మికుల కోరిక తీరనుంది. ఇప్పటికే రాష్ట్ర అధికారులు రూ.38 కోట్లతో ధర్మవరం మెగా హ్యాండ్లూమ్ పార్కు, రూ.15 కోట్లతో పిఠాపురం హ్యాండ్లూమ్ పార్కు, రూ.23 కోట్లతో మంగళగిరి మెగా హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటుకుగానూ ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రానికి నివేదించారు. ధర్మవరం మెగా టెక్స్‌టైల్ పార్కుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించింది. నిధులు విడుదల కావాల్సి ఉంది. మిగతా రెండింటికీ గ్రీన్ సిగ్నల్ లభించాల్సి ఉంది. దీంతో పాటు అమరావతిలో రూ.15 కోట్లతో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి కూడా నిధులు రాబట్టుకుని 2026-27లోనే పూర్తి చేయొచ్చు. ఇవి కాకుండా చేనేతలు ఎక్కువగా ఉన్న ఎమ్మిగనూరు, వెంకటగిరి, మదనపల్లె, పొందూరు, ఉప్పాడ, తదితర చోట్ల హ్యాండ్లూమ్ పార్కుల ఏర్పాటుకు డిమాండ్ ఉంది. ఎమ్మిగనూరు, జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం, తదితర ప్రాంతాల్లో టెక్స్‌టైల్ పార్కుల ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వం స్థలం కేటాయించింది. వీటిని కూడా సాకారం చేసుకోవచ్చు.

'వీబీ జీ రాం జీ' కింద రాష్ట్రానికి రూ.5,782 కోట్లు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్, అజీవిక మిషన్ (వీబీ జీ రాం జీ) కార్యక్రమానికి కేంద్రం రూ.5,742 కోట్లు కేటాయించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వాటా (40%)గా మరో రూ.2,280 కోట్లు సమకూర్చనుంది. మొత్తంగా రూ.8,022 కోట్లతో 2026-27లో కార్యక్రమం అమలు చేయనున్నారు. దీని ద్వారా శ్రామికులకు 19 కోట్ల నుంచి 20 కోట్ల పని దినాలు కల్పించవచ్చని అంచనా. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రాంజీ చట్టం అమలుకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయించిన రూ.95,692 కోట్లలో జనాభా ప్రాతిపదికన రాష్ట్రానికి 6% నిధులు (రూ.5,742 కోట్లు) రావొచ్చని భావిస్తున్నారు. దీనికి రాష్ట్ర వాటాగా మరో 40% నిధులు కేటాయింపు తప్పితే కార్యక్రమం ద్వారా శ్రామికులకు ఉపాధి కల్పన యథావిధిగానే కొనసాగనుంది. మెటీరియల్, పరిపాలన ఖర్చుల్లో 40% వాటాతో కలిపితే రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.2,500 నుంచి రూ.3,000 కోట్ల వరకు సమకూర్చాలి.

ఆ మూడు రైళ్లను నిడదవోలులో ఆపాలి: ఎంపీ పురందేశ్వరి

దేవీచౌక్, న్యూస్‌టుడే: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని నిడదవోలు రైల్వేస్టేషన్‌లో లోకమాన్య తిలక్, కోకనాడ, జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లను నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. విజయవాడ-విశాఖపట్నం, విజయవాడ-నరసాపురం ప్రధాన మార్గాలను అనుసంధానించే కీలక కేంద్రంగా నిడదవోలు రైల్వేస్టేషన్ ఉందని పురందేశ్వరి తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని రైళ్ల నిలుపుదలను సానుకూలంగా పరిశీలించాలని కోరారు.

వికసిత్‌భారత్‌కు బలమైన పునాది: రామ్మోహన్‌నాయుడు

ఈనాడు, దిల్లీ: 'కేంద్ర బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు బలమైన పునాది వేసింది. మౌలిక సదుపాయాల కల్పన కోసం మూలధన వ్యయం కింద రూ.12.2 లక్షల కోట్లు కేటాయించడం చరిత్రాత్మకం. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 7% వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది. ఆ వృద్ధిని సుస్థిరం చేయడంతో పాటు మరింత వేగం పెంచడానికి బడ్జెట్ దోహదం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌కు రేర్ ఎర్త్ మినరల్ కారిడార్ కేటాయించడం శ్రీకాకుళం ప్రాంతానికి మేలు జరుగుతుంది. సీప్లేన్ తయారీకి కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటించడం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో డిఫెన్స్, ఏరోస్పేస్ పెట్టుబడులకు మరిన్ని అవకాశాలు వస్తాయి' అని కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

మహిళా మేలుకో... చట్టాల గురించి తెలుసుకో!

గృహహింస, లైంగిక వేధింపులు, ఆస్తి హక్కు.. మొదలైన అంశాలలో మహిళలకు అండగా నిలిచే చట్టాలు, అందే న్యాయ సహాయం.. వీటి గురించి అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో.. ఈనాడు వసుంధర కుటుంబం- తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించాయి.



ప్రముఖ న్యాయ నిపుణులు ఎస్. ప్రణతి, బి. షాలినీ సక్సేనా, షీ టీమ్స్ డీసీపీ డాక్టర్ లావణ్య.. ఈ వెబినార్‌లో వక్తలుగా పాల్గొన్నారు. వారందించిన సలహాలు, సూచనలు.. మీ కోసం!

దుర్వినియోగం చేయొద్దు

వైవాహిక జీవితంలో ఎవరైనా వేధింపులు ఎదుర్కొంటే సమీపంలోని ప్రొటెక్షన్ ఆఫీసర్స్, న్యాయసేవల అథారిటీని సంప్రదించాలి. వాళ్లు కౌన్సెలింగ్ చేస్తారు. సమస్య తీవ్రతనుబట్టి ఎలా వెళ్లాలో చెప్పడమే కాకుండా, ఆ మహిళకు రక్షణ కల్పిస్తారు. ఇంటి నుంచి బయటకు పంపేసిన పరిస్థితి ఉంటే ఆమెను అదే ఇంట్లో ఉండేలా చూస్తారు. పిల్లల్ని దూరం చేస్తే, తిరిగి తల్లి దగ్గరకు చేర్చే ప్రయత్నం చేస్తారు. ఎన్ఆర్ఐ కేసుల్లో బాధిత మహిళలు అక్కడి భారతీయ రాయబార కార్యాలయాన్నీ ఇండియాలో ఉంటే ఇక్కడి న్యాయస్థానాలను సంప్రదించాలి.



శారీరకంగా బాధించడమే కాదు, దెప్పి పొడవడం, కించపరచడంద్వారా మానసిక క్షోభ పెట్టినా అది హింసే. చట్టం అన్ని రకాల హింసలకూ పరిష్కారాల్ని చూపిస్తుంది. ఏ అంశాన్నైనా ఎంతవరకూ భరించాలి, దేన్ని హింసగా చూడాలి... వంటివి ప్రతి మహిళా తెలుసుకోవాలి. బలవంతపు శృంగారం కూడా హింసే. జాతీయ మహిళా కమిషన్ తెచ్చిన 'హర్ లీగల్ గైడ్' యాప్ మహిళలకు సంబంధించిన అన్ని సమస్యలకు న్యాయపరమైన సలహాలూ, సూచనలూ అందిస్తోంది. న్యాయస్థానానికి సాక్ష్యాలు ముఖ్యం. ఇప్పుడు డిజిటల్ సాక్ష్యాలు దొరుకుతున్నాయి. అదే సమయంలో సర్కమ్‌స్టేన్షియల్(పరిస్థితుల్ని అనుసరించి) సాక్ష్యాలనూ పరిగణనలోకి తీసుకుంటారు. కొందరు మహిళలు చట్టాలను దుర్వినియోగం చేయడంవల్ల నిజంగా అవసరమైనవాళ్లకు న్యాయం జరగదు. నిజమైన కేసులు గెలవాలంటే, దురుద్దేశపూర్వకంగా పెట్టే కేసులు తగ్గాలి.

– **ఎస్. ప్రణతి,** ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది, ఆంధ్రప్రదేశ్

విడాకుల తర్వాతా అడగొచ్చు

మనదేశంలో వరకట్న వేధింపుల చట్టం, గృహహింస నిరోధక చట్టం పోష్, పూర్వికుల ఆస్తిలో హక్కు, సమాన పనికి సమాన వేతనం... ఇలా స్త్రీ హక్కులకు రక్షణనిచ్చే చట్టాలు పదుల సంఖ్యలో ఉన్నాయి. 2005లో సుప్రీంకోర్టు మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించింది. అంటే పుట్టుకతోనే అన్నదమ్ములతో పాటు సమానంగా స్త్రీలకూ హక్కు ఉంటుంది. దాంతో పాటు తల్లిదండ్రులను చూడాల్సిన బాధ్యతా ఉంటుంది.

ఇటీవలి కాలంలో విడాకులు తీసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. దీనివల్ల స్త్రీలు ఆర్థిక సమస్యల్లో చిక్కుకోకుండా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. విడాకుల పిటిషన్ వేశాక మెయింటెనెన్స్ కోసం కేసు ఫైల్ చేయాలి. ఒకవేళ దాంట్లో మెయింటెనెన్స్ రాకపోతే 125ఎ ప్రకారం పిల్లల కోసం అడగొచ్చు. శాశ్వత భరణాన్ని దంపతులిద్దరూ కలిసి నిర్ణయించుకోవచ్చు. విడాకులయ్యాక కూడా మహిళలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే... తర్వాత కూడా మెయింటెనెన్స్ అడగొచ్చు.



గృహహింస, విడాకులు, ఆస్తి వివాదాల్లో కోర్టు కేసుల్లో ఫలితాలు రావడానికి సమయం పడుతుంది. అలాకాకుండా ప్రతి కోర్టులోనూ మీడియేషన్, కౌన్సెలింగ్ సెంటర్లు ఉన్నాయి. వాటిని సంప్రదిస్తే త్వరగా పరిష్కారమవుతాయి. ఒకవేళ ప్రతివాది తనకు నోటీసులు అందట్లేదనే కారణం చూపించి కోర్టుకి హాజరు కావట్లేదా? ఏం కాదు. ఇప్పుడు మెయిల్, వాట్సాప్ వంటి మాధ్యమాల ద్వారానూ నోటీసులు పంపించొచ్చు. అప్పుడు వారు దాన్ని సాకుగా చూపించలేరు.

ఈ రోజుల్లో మహిళల్ని వేధిస్తోన్న మరో సమస్య... సాంకేతికత దుర్వినియోగం. డీప్ ఫేక్ వీడియోలు, చిత్రాలు మహిళల జీవితాల్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నారు. అలాకాకూడదంటే... అమ్మాయిలకు ఈ విషయంపై అవగాహన అవసరం. అలానే తమ ఫొటోలను పబ్లిక్ చేయడం, అసభ్యకరంగా చిత్రాలు తీసుకోవడం, వాటిని ఇతరులకు ఇవ్వడం వంటివి చేయొద్దు. దీనికంటే ముందు... మీకేదైనా సమస్య ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు చేయండి. అలాగని పోలీస్ స్టేషన్‌కో కోర్టుకో వెళ్లడానికో ఇష్టపడకపోతే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. పోలీస్ సంబంధిత ఫిర్యాదులైతే పోలీస్ వెబ్‌సైట్‌లోనే చేయాలి. కోర్టుకు కూడా ప్రైవేట్ ఫిర్యాదుతో నేరుగా వెళ్లవచ్చు.

– **షాలినీ సక్సేనా,** న్యాయ నిపుణురాలు, తెలంగాణ

మహిళల భద్రతకు...

ప్రతి మహిళా సులభంగా న్యాయ సహాయం పొందేలా తెలంగాణ ప్రభుత్వం షీ టీమ్స్, భరోసా సెంటర్లు, మహిళాభివృద్ధి - సాధికారత కేంద్రాలు.. మొదలైన వాటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. లైంగిక వేధింపులకు గురైన మహిళలు, చిన్నారులకు అండగా నిలిచేవే 'భరోసా' సెంటర్లు. ఈ వేదికగా బాధితులకు కౌన్సెలింగ్ ఇవ్వడం, పోలీస్ స్టేట్‌మెంట్ రికార్డు చేయడం, వైద్య పరీక్షలు నిర్వహించడం.. ఇలా బాధితులకు అవసరమైన సహాయాన్ని అందిస్తున్నాయి. ఆయా కేసుల్ని పరిష్కరించే క్రమంలో బాధితుల వ్యక్తిగత వివరాలన్నీ గోప్యంగా ఉంచుతాం. అలాగే లైంగిక వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి షీటీమ్స్ కూడా నిరంతరం పనిచేస్తున్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని స్థానిక పోలీస్ స్టేషన్‌కి అప్పగించి.. చర్యలు తీసుకుంటాం. సాక్ష్యాధారాలతో నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చేస్తాం. ఇక రద్దీ ప్రాంతాల్లో, క్యాబుల్లో తమను వేధిస్తున్నారంటూ వచ్చే ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడానికి 'డెకాయ్ ఆపరేషన్స్' చేపడుతున్నాయి షీటీమ్స్. ఇందులో భాగంగా సీక్రెట్ కెమెరాల ద్వారా సాక్ష్యాల్ని సేకరించి నేరస్థులకు జైలు శిక్ష, జరిమానా వంటివి విధిస్తాం. పని ప్రదేశంలో లైంగిక వేధింపులు ఎదుర్కొనే వారు.. మొదట తమ ఆఫీస్ పరిధిలో ఉన్న 'అంతర్గత ఫిర్యాదుల కమిటీ'కి కంప్లైంట్ చేయాలి.



క్రిమినల్ యాక్షన్ తీసుకోవాలనుకుంటే.. నేరుగా పోలీస్ స్టేషన్‌ని లేదా షీటీమ్స్‌ని సంప్రదించవచ్చు. 'షీబాక్స్ పోర్టల్'లోనూ ఫిర్యాదు చేయవచ్చు. అదేవిధంగా గృహహింసను ఎదుర్కొనే మహిళలు పోలీస్ స్టేషన్లో లేదా సీడీఈడబ్ల్యూ సెంటర్స్‌కి వెళ్లి ఫిర్యాదు చేయవచ్చు. ఈ క్రమంలో వాళ్ల సమస్యను గుర్తించి.. కౌన్సెలింగ్ ఇస్తారు. అయినా భాగస్వామి మారకపోతే బాధితురాలి నుంచి ఫిర్యాదు తీసుకొని.. దాన్ని మహిళా పోలీస్ స్టేషన్‌కి పంపించి.. ఆపై సాక్ష్యాల్ని బట్టి ఆ కేసును రిజిస్టర్ చేస్తాం. సైబర్ నేరాలు, పిల్లలపై లైంగిక వేధింపులు.. ఈ రోజుల్లో ప్రబలంగా ఉన్నాయి. మేం తరచూ చేపట్టే భరోసా, షీటీమ్స్ అవగాహన కార్యక్రమాల్లోనూ వీటి గురించి అవగాహన కల్పిస్తున్నాం. అలాగే డిజిటల్ బ్లాక్‌మెయిలింగ్.. మహిళల పాలిట శాపంగా మారుతోంది. ఈ తరహా కేసుల్ని పరిష్కరించడానికి సైతం షీటీమ్స్ పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో బాధిత అమ్మాయి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి.. ఆమె సమ్మతి మేరకు సదరు వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదంటే దీని అవసరం లేకుండా ఆ డేటాను పూర్తిగా తొలగించడం.. వంటి చర్యలు చేపడుతున్నాం. అయితే సమస్య వచ్చాక పరిష్కరించుకోవడం కంటే.. ఈ డిజిటల్ ఉచ్చులో పడకముందే జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఈ క్రమంలోనే ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలి. అలాగే ప్రతి మహిళా తమ హక్కుల గురించి తెలుసుకునేందుకు 'లీగల్లీ యువర్స్' అనే పుస్తకం చదవాలి. ఆన్‌లైన్ పరిచయాలు మానుకోవాలి. అవతలి వ్యక్తిని గుడ్డిగా నమ్మడమూ సరికాదు. ఎందుకంటే దీనివల్ల కలిగే ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువ. కాబట్టి మీ కెరియర్‌పై దృష్టి పెట్టండి. తద్వారా మీ ఆత్మగౌరవాన్ని కాపాడుకోండి.

– **డాక్టర్ లావణ్య నాయక్ జాదవ్,** డీసీపీ, షీ టీమ్స్



ప్రైవేట్ సంస్థలకు పెట్టుబడులు అందిస్తూ...

భారత ఆర్థిక రంగంలో రాణించే మహిళల సంఖ్య తక్కువ. అందులోనూ ప్రైవేట్ ఈక్విటీ విభాగంలో మరీ అరుదు. కానీ, రేణుకా రామ్‌నాథ్ ఇందుకు భిన్నం. మల్టిపుల్స్ ఆల్టర్నేట్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థను స్థాపించి వేల కోట్ల రూపాయల పెట్టుబడితో వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేశారు. 'ప్రైవేట్ ఈక్విటీ మదర్'గా పేరొందిన ఆవిడ ప్రయాణాన్ని తెలుసుకుందామా!

ప్రైవేట్ ఈక్విటీ రంగంలో రేణుకా రామ్‌నాథ్ మూడు దశాబ్దాలకు పైగా ఉన్నారు. ఈ ప్రయాణంలో ఆమె డజన్ల కొద్దీ కంపెనీల ఎదుగుదలకు అవసరమైన పెట్టుబడులను సమకూర్చారు. ముంబయిలో జన్మించిన రేణుక చిన్నప్పటి నుంచీ ధైర్యవంతురాలే. చెంబూర్‌లోని సరస్వతీ విద్యాలయంలో చదివారు. వీరమాత జీజాబాయి టెక్నలాజికల్ ఇన్‌స్టిట్యూట్‌లో టెక్స్‌టైల్ ఇంజినీరింగ్, ఆ తర్వాత ముంబయి యూనివర్సిటీ నుంచి మేనేజ్‌మెంట్ సైన్స్‌లో మాస్టర్స్ చేశారు. ఆపై హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్ కూడా పూర్తి చేశారు.

కెరియర్ ప్రారంభంలో...

మేనేజ్‌మెంట్ ట్రైనీగా క్రాంప్టన్ గ్రీవ్స్‌లో కెరియర్ ప్రారంభించారు రేణుక. తర్వాత ఐసీఐసీఐ బ్యాంక్‌లో చేరి... ఈక్విటీస్ హెడ్‌గా, ఐసీఐసీఐ వెంచర్ ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, సీఈవోగా వివిధ హోదాల్లో రాణించారు. రూ.1800 కోట్ల వరకూ ఉన్న సంస్థ ఆస్తులను రూ.22 వేల కోట్లకు పెంచారు. ఎయిర్ డెక్కన్, టాటా ఇన్ఫోమీడియా, వీఏ టెక్ వాబాగ్ వంటి వెంచర్లలో పెట్టుబడులూ పెట్టారు. ఈ పనులే రేణుకను ప్రైవేట్ ఈక్విటీ మదర్‌గా పిలిచేలా చేశాయి.

> ఇంటిని శుభ్రంగా ఉంచడాన్ని థెరపీగా భావిస్తారు రేణుక. ఇలాంటి సాధారణ అలవాట్లే ఆమె వ్యక్తిత్వాన్ని మరింత అందంగా చూపిస్తాయి. పార్లే-జీ బిస్కెట్లు, దక్షిణాది ఫిల్టర్ కాఫీ రుచి చూడటం, పట్టు చీరలు కట్టడం తనకు ఎంతో ఇష్టమైన పనులు అంటారామె.

శక్తిమంతమైన వ్యాపారవేత్తగా...

రేణుక 2009లో ఐసీఐసీఐ వదిలి 'మల్టిపుల్స్ ఆల్టర్నేట్ అసెట్ మేనేజ్‌మెంట్'ను స్థాపించారు. భారత్‌లో ఏర్పాటైన తొలి దేశీ ప్రైవేట్ ఈక్విటీ సంస్థల్లో ఇదీ ఒకటి. మధ్యస్థ కంపెనీలపై దృష్టి పెట్టి... రూ.1.5 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకూ పెట్టుబడులుగా పెడుతున్నారు. పీవీఆర్ సినిమాస్, డెల్లీవరీ, లీషియస్, డ్రీమ్11, చోళమండలం... వంటి సంస్థలెన్నింటిలోనో రేణుక ఇన్వెస్ట్ చేశారు. త్వరిత లాభాల కంటే... దీర్ఘకాలిక విలువను పెంచడంపై దృష్టి పెట్టడం, మానవ సామర్థ్యంపై నమ్మకం ఉంచడం... వంటివే తన బలం అంటారామె. బిజినెస్ టుడే, ఎకనామిక్ టైమ్స్‌తో పాటు ఫోర్బ్స్ పవర్‌ఫుల్ బిజినెస్ విమెన్ జాబితాలోనూ స్థానం సంపాదించుకున్నారు.

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా...

జీవితంలో ఎదురైన కష్టనష్టాలే తనని రాటుదేల్చాయని చెబుతారు రేణుక. '1995లో మావారిని ఒక ప్రమాదంలో కోల్పోయా. ఆయనతో పోలిస్తే... నాది చీమ మెదడు అనుకునేదాన్ని. చాలా రోజులు పాటు... నా భర్త లేకుండా నేనెలా ముందుకు సాగగలను అనే భయం ఉండేది. కానీ, ఆ తర్వాతే తెలిసింది... సంక్షోభాల సమయంలోనే నేను రెండింతల శక్తితో పనిచేయగలనని' అంటారామె. ఈక్విటీ వ్యాపారంలో నిలదొక్కుకోగలగడం అంత సులువేం కాదు. ఎంతో దూరదృష్టి, సమయస్ఫూర్తి ఉండాలి. కేవలం గణాంకాల ఆధారంగా కాకుండా ఎన్నో అంశాలను పరిశీలించాలి. మేం పెట్టే ప్రతి పెట్టుబడినీ సునిశితంగా విశ్లేషిస్తాం. సంస్థకు పొంచి ఉన్న ప్రమాదాలేంటి? కో-ఫౌండర్స్ మధ్య సయోధ్య, వినియోగదారుడు కోరుకునే వైవిధ్యం... వంటి ఎన్నో అంశాలపై దృష్టి సారిస్తాం. ఇందుకు 'క్వాంటిఫై' ఉదంతమే ఉదాహరణ. ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థలో 3 కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టాలనుకున్నాం. దానికి నలుగురు కో- సీఈఓలు ఉన్నారు. నియమ నిబంధనల్లో వారి మధ్య విభేదాలు రాకుండా చూసుకోవడమూ ముఖ్యమని స్పష్టమని చెప్పా. దాని ఫలితంగానే ఆ పెట్టుబడి ఇప్పుడు పది రెట్లు లాభం తెచ్చిపెట్టింది' అంటారామె. జీవితం, కెరియర్‌లలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా... ఆ రెండింటినీ సమర్థంగా సమన్వయం చేసుకోగలిగారు రేణుక.

ఫోన్ అడిగితే తిట్లు!

నాకు 18 ఏళ్లు. ఇప్పటివరకూ ఫోన్ లేదు. నేను చదివేది ఇంజినీరింగ్. గతంలో అంటే చదువు మీద నుంచి దృష్టి మళ్లుతుందని ఫోన్ కొనివ్వలేదని అర్థం చేసుకున్నా. ఇప్పుడు ప్రాజెక్టులు, సందేహాలు ఎన్నుంటాయి? వాటికోసం ల్యాప్ టాప్ పట్టుకున్నా, ఫోన్ అడిగినా అమ్మానాన్నలు తిట్లు మొదలు. ఇలాగైతే పాడవుతావ్ అంటారు. చదివేది టెక్నికల్ చదువు అయినప్పుడు కేవలం పుస్తకాలతోనే ఎలా చదివేది? **- ఓ సోదరి**

డియర్ వసుంధర



డా. స్వాతి పైడిపాటి
మానసిక నిపుణురాలు

ఈ రోజుల్లో చేతిలో ఫోన్ చాలా ముఖ్యమైన అవసరం అయిపోయింది. మాట్లాడటం కోసమే కాదు, ఎన్నో పనులకీ ఇది తప్పనిసరి. అంతలా మన జీవితాల్లో భాగమైంది. చదువుకునే పిల్లలు కూడా చదువు, కొత్త సమాచారం, ప్రాజెక్టులు... ఇలా ఎన్నో అవసరాలకు సాంకేతికత మీదే ఆధారపడుతున్నారు. కాబట్టే, వాళ్ల చేతుల్లోనూ ఫోన్, ట్యాబ్, ల్యాప్‌టాప్‌లు వంటివి దర్శనమిస్తున్నాయి. నువ్వు చెప్పినట్టుగా ఈ పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలంటే వీటి వాడకం తప్పనిసరే. కాకపోతే చాలామంది తల్లిదండ్రులకు ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాడ్జెట్ల మీద ఎక్కువ సమయం గడిపితే పిల్లలు అనవసర విషయాలపై ఆసక్తి పెంచుకుంటారని భయం. ఈ క్రమంలో చదువునీ పక్కన పెడతారేమోనన్న ఆందోళనతోనే వాటిని పట్టుకోగానే కోప్పడుతుంటారు. అలాగని నీ అవసరాన్నీ కాదనలేం. కాబట్టి, కొంచెం ఓపికతో నీకు ఫోన్, ల్యాప్‌టాప్ వంటివి చదువుకోవడానికి ఎలా అవసరమో అమ్మానాన్నలకి అర్థమయ్యేలా చెప్పు. చదువుపరంగానూ నువ్వు రాణిస్తూ వెళ్లు. అప్పుడు వాళ్లకీ నీ మీద నమ్మకం కలుగుతుంది. నీ మాటల్లోని వాస్తవాన్ని అర్థం చేసుకుంటారు. కాస్త ఓపికగా ప్రయత్నించు.

వేళ్లు విరిచేయండిలా...



దాడి చేసే వ్యక్తి చేతిని పైపైపు మెలి తిప్పి గాయం చేయొచ్చు. చూపుడు, మధ్య వేళ్లను ఒకచేత్తోనూ ఉంగరపు, చిటికెన వేళ్లను మరో చేత్తోనూ పట్టుకుని... కిందకు గట్టిగా వంచితే కండరాలు, మణికట్టు దగ్గర ఎముకలూ విరుగుతాయి. భరించలేని నొప్పి ఉంటుంది. అవతల వ్యక్తి ఎంత బరువున్నా కూడా ఈ టెక్నిక్ ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఆపదను గుర్తించగానే బెరుకు లేకుండా ఇలా ఎదురుదాడి చేస్తే... ఆ వ్యక్తి భయపడి వెనక్కి తగ్గాల్సిందే.





– ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు



చిత్రకళల్లో రాణించడానికి ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటారు. కృష్ణ దేవి దంపతులు ఎంచుకున్నది తంజావూరు పెయింటింగ్. అంతేకాదు, కోవిడ్ సమయంలో ఉద్యోగాలు కోల్పోయి ఇబ్బంది పడుతున్నప్పుడు ఈ కళే వాళ్ల ఆర్థిక కష్టాల్ని తీర్చిందట.

పెయింటింగ్‌తో... రూ.లక్షల ఆదాయం..!

కృష్ణ దేవి దంపతులది బిహార్‌లోని షేఖ్‌పురా జిల్లా, గున్నేసా గ్రామం. ఉద్యోగరీత్యా 2014లో తమిళనాడుకి వలస వెళ్లారు. భర్త ఉద్యోగానికి వెళ్లాక తీరిక సమయంలో తంజావూరు పెయింటింగ్ నేర్చుకున్నారు కృష్ణ దేవి. కరోనాలో ఉపాధి పోవడంతో ఆ దంపతులిద్దరూ ఆర్థిక ఇబ్బందులతో బిహార్‌కు తిరిగి వచ్చేశారు. 'తమిళనాడులో నేర్చుకున్న తంజావూరు చిత్రలేఖనాన్నే వ్యాపారంగా మార్చుకోవాలనుకున్నాం. మా దగ్గర సరిపడా డబ్బుల్లేవు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జీవికలో చేరి లోన్ తీసుకున్నా. జీవికని బిహార్ ప్రభుత్వం 2007లో మొదలుపెట్టింది. ఇందులో స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు శిక్షణ, రుణాలు, ఉద్యోగాలు కల్పిస్తోంది. పెయింటింగ్‌కి కావాల్సిన ముడిసరకు మాత్రం తమిళనాడు వెళ్లి తెచ్చుకోవాలి. ఇప్పటికీ ఇదే కొనసాగిస్తున్నాం. మొదటి మూడేళ్లు బిహార్‌లో ఈ కళ గురించి ఎవరికీ తెలీదు. కానీ జీవిక సాయంతో ప్రభుత్వ కార్యక్రమాలు, ఉత్సవాల్లో స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా వీటికి మంచి ఆదరణ లభించింది. ప్రజలు దీని గురించి తెలుసుకునే కొద్దీ అమ్మకాలు పెరిగాయి. ఇప్పుడు ఆర్థిక పరిస్థితి మెరుగుపడింది. మేం వేసిన పెయింటింగ్స్‌లో ఒకటి ఏకంగా రూ.3.3లక్షలకు అమ్ముడయింది. ఇటీవల పట్నా గాంధీ మైదానంలో జరిగిన సరస్‌మేళాలో రూ.6లక్షల విలువైన ఆర్డర్ వచ్చింది. మా కెరియర్‌లో అతిపెద్ద ఆర్డరు కూడా ఇదే. 2×3 అడుగుల పెయింటింగ్ పూర్తి కావడానికి దాదాపు 4-6 నెలలు పడుతుంది. చిన్నవాటికి 15రోజులు టైమ్ పడుతుంది. ప్రతిరోజూ ఇద్దరం 10గం.మొదలుపెట్టి ఐదు గంటలకి ముగిస్తాం' అంటారు కృష్ణ దేవి.

తంజావూరు పెయింటింగ్ ఎలా వేస్తారంటే...

తంజావూరులో పుట్టిందీ పెయింటింగ్. ఇది ప్రాచీన దక్షిణ భారతదేశ చిత్రకళా శైలి. ఎంబోజ్ చేసిన బొమ్మలు, మెరిసే బంగారు రేకులు, వివిధ రంగులతో వీటిని తీర్చిదిద్దుతారు. ముఖ్యంగా కృష్ణుడు, రాముడు, విష్ణు మూర్తి దేవతల రూపాలను తయారుచేస్తారు. పెయింటింగ్ వేయడానికి చెక్క బోర్డుపై సున్నం, జిగురు, బంకమట్టి ఉపయోగించి ఈ ఎంబోజ్డ్ బొమ్మల్ని చేస్తారు. తరవాత వాటికి రంగులు వేస్తారు. ఆపై బంగారు రేకుతో చిత్రాలకు తుదిమెరుగులు దిద్దుతారు. మొదట్లో రాజభవనాలకు మాత్రమే పరిమితం అయిన ఈ కళ ప్రస్తుతం విదేశాల్లోనూ ప్రాచుర్యం పొందుతుంది.

ఎక్కడైనా ఉతికేస్తుంది..!

ఇంట్లో ఎంతపెద్ద వాషింగ్ మెషీన్ ఉన్నా కొన్ని బట్టల్ని చేతితోనే ఉతుకుతాం. హ్యాండ్ కర్చీఫ్‌లు, లోదుస్తులు, చిన్నపిల్లల బట్టలు, సాక్స్‌లు, కిచెన్‌లో తరచూ ఉపయోగించే టవల్స్, అవెన్ గ్లవుజులు... వంటివి ఆ జాబితాలో తప్పక ఉంటాయి. కానీ, చాలాసార్లు వాటినలా చేత్తో ఉతకడానికీ బద్ధకిస్తుంటాం. అలాంటి ఇబ్బంది లేకుండా వచ్చిందే ఈ 'మినీ పోర్టబుల్ వాషింగ్ మెషీన్'. తక్కువ నీటితోనే పనిచేస్తూ, విద్యుత్ వినియోగాన్నీ తగ్గిస్తుందీ మెషీన్. అరచేతి పరిమాణంలో ఉండే దీన్ని బయటకు ఎక్కడికి వెళ్లినా వెంటతీసుకెళ్లొచ్చు. హాస్టల్లో ఉండే అమ్మాయిలకీ చక్కగా ఉపయోగపడుతుంది. ఇది బట్టల్ని ఉతకడంతోపాటు ఆరబెట్టేస్తుంది కూడా. 1.5లీ. పరిమాణంతో ఉన్న దీనిలో ఒకసారి డిటర్జెంట్ లిక్విడ్, నీటిని వేసి, మనకు కావాల్సిన టైమ్‌ని సెట్ చేసి ఆన్‌చేస్తే సరిపోతుంది. ఛార్జింగ్‌తో నడుస్తుంది కాబట్టి మధ్యలో ఆగిపోతుందనే భయమూ ఉండదు.



స్వీట్ హోమ్



మనసు దోచే మక్రామె..!

కొత్తగా ఇల్లు కట్టుకుని ఇంటీరియర్ కోసం బడ్జెట్‌లో ప్లాన్ చేసుకోవాలా? ప్లాస్టిక్ అలంకరణలకు దూరంగా పర్యావరణహితంగా ఇంటిని అలంకరించుకోవాలి అనుకుంటున్నారా? అయితే ఈ మక్రామె వాల్ ఆర్ట్‌లు మీకు నచ్చితీరతాయి. కాటన్, ఊలు, జ్యూట్, లినెన్ దారాలతో చేతితో తయారుచేసిన ఈ అలంకరణలు ఇంటికి మినిమలిస్ట్ లుక్‌ని అందిస్తాయి. అంతేకాదు, ఇంటికి పాజిటివ్ వైబ్‌ని తెచ్చి మనలో ఒత్తిడినీ తగ్గిస్తాయట. అందుకే వీటిని కాన్వాస్‌లు, వాల్ హ్యాంగింగ్స్, పాట్ హ్యాంగింగ్స్, కర్టెన్లు, టేబుల్ రన్నర్స్ రూపంలో తీసుకొచ్చారు తయారీదారులు. బెడ్‌రూమ్, లివింగ్ రూమ్, పిల్లల గది, కార్నర్ డెకార్‌గానూ అలంకరించుకోవచ్చు. అంతేకాదు, కొందరికి గోడలమీద జిగేల్‌మనిపించే రంగులు నచ్చకపోవచ్చు. అలాగని డబ్బులు పెట్టి వాల్ డెకార్లు చేయించుకోలేకపోవచ్చు. అలాంటి వాళ్లు ఈ సహజ మక్రామె వాల్ ఆర్ట్‌లు అమర్చి చూడండి.



పోషకాలతోనే జ్ఞాపకశక్తి!

పరీక్షల సమయం వచ్చేసింది. పిల్లలు ఇప్పటికే అన్ని విధాలా సిద్ధమవుతూ ఉంటారు. ఈ సమయంలో వారికి పోషకాహారం కీలకం. అందుకోసం నిపుణులు ఏం సూచిస్తున్నారంటే...



ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు... మెదడు, నాడీ వ్యవస్థ ఆరోగ్యకరమైన పనితీరుకు చాలా అవసరం. ఇవి జ్ఞాపకశక్తిని పెంచుతాయి. సాల్మన్, ట్యూనా వంటి చేపల్లోనూ, చియా, పొద్దుతిరుగుడు విత్తనాలు, అవిసె, పుచ్చకాయ గింజల్లోనూ ఇవి ఉంటాయి.

- ఓట్స్... నిరంతర శక్తిని అందిస్తాయి. పరీక్షల సమయంలో అల్పాహారంగా ఇవ్వొచ్చు. ఓట్ మీల్ నెమ్మదిగా విడుదల చేసే కార్బోహైడ్రేట్లను అందిస్తుంది. దాంతో సుదీర్ఘకాలంపాటు మెదడుకు ఇంధనం అందిస్తుంది. విటమిన్ ఇ, బి, పొటాషియం, జింక్ పుష్కలంగా ఉంటాయి.
- తృణ ధాన్యాలలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. రోజంతా పిల్లలకు స్థిరమైన శక్తిని అందిస్తాయి. చిరుధాన్యాలు, దంపుడు బియ్యం, హోల్ వీట్... వీటిలో గ్లూకోజ్ పుష్కలంగా ఉంటుంది.
- పిల్లల శారీరక, అభిజ్ఞా నైపుణ్యాల అభివృద్ధికి తోడ్పడే అత్యంత విలువైన పోషకాలు గుడ్డు నుంచి లభిస్తాయి. దీన్లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. పచ్చసొనలో ఉండే కోలిన్... జ్ఞాపకశక్తికి మేలు చేస్తుంది. ఐరన్‌తో పాటు ఎ, డి, ఇ, బి12 వంటి ముఖ్యమైన విటమిన్లనూ అందిస్తాయి. పరీక్షల సమయంలో మంచి ఆహారంగా నిలుస్తుంది.

ఇది ముందుచూపు బడ్జెట్

- అన్ని ప్రాంతాలు, వర్గాల ప్రజల అభివృద్ధికి దోహదం
- రాష్ట్రాభివృద్ధికి ఊతమిస్తుంది
- రైలు, మైన్, టూరిజం కారిడార్లతో ఏపీకి లబ్ధి
- ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికమంత్రిని అభినందిస్తున్నా
- ఈ నెల 14 లేదా 15న అమరావతికి బిల్‌గేట్స్
- బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు



ఈనాడు,చిత్తూరు: కేంద్ర బడ్జెట్ సమతుల, ముందు చూపుతో కూడినదని ముఖ్యమంత్రి చంద్రబాబు కితాబిచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది ఫ్యూచరిస్టిక్ బడ్జెట్ అని అన్నారు. భారతదేశానికి ఉన్న అనుకూలతలను తర్వాత స్థాయికి తీసుకెళ్లడానికి ఇది దోహదం చేస్తుందన్నారు. మన దేశం సొంత కాళ్లపై నిలబడేలా బడ్జెట్‌ను రూపొందించారన్నారు. అన్ని ప్రాంతాలు, వర్గాల అభివృద్ధికి ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. భారత్ అభివృద్ధి చెందే ఏకానమీగా మారడంలో ప్రస్తుత బడ్జెట్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంస్కరణలను మరో దశకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈయూతో ఇటీవల మన దేశం చారిత్రాత్మకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఎఫ్‌టీఏ) కుదుర్చుకుందని.. అందులోని లక్ష్యాలనూ సాధించేందుకు ఇది ఉపకరిస్తుందన్నారు. ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. వారు స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక సుస్థిరాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌ను తయారు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిన అంశాల్లో మరింత దూకుడుగా వెళ్లడానికి ఈ బడ్జెట్ సహకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాలోని సొంత నియోజకవర్గం కుప్పంలో మూడు రోజుల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు చివరి రోజైన ఆదివారం శాంతిపురం మండలం తులసినాయనపల్లెలో విలేకరుల సమావేశం నిర్వహించి బడ్జెట్‌పై తన అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రపంచంలోనే డైనమిక్ జోన్ అవుతుంది

'మన రాష్ట్రం మీదుగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు వెళ్తాయి. చెన్నై-బెంగళూరు కారిడార్‌లో తిరుపతినీ అనుసంధానించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతా. ఈ మూడు కారిడార్‌లలో హైదరాబాద్, అమరావతి, చెన్నై, బెంగళూరు నగరాలు ఉంటాయి. ఈ కారిడార్లు అందుబాటులోకి వస్తే ఎక్కడికైనా సులభంగా వెళ్లవచ్చు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇది డైనమిక్ జోన్ అవుతుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించడం, బలోపేతం చేయడానికి బడ్జెట్ ఉపకరిస్తుంది. పేదరిక నిర్మూలనకు దోహదం చేసేలా నేను తొలిసారిగా తీసుకొచ్చిన విధానం పీ-4. రెండోది వన్ ఫ్యామిలీ-వన్ ఆంత్రప్రెన్యూర్. ప్రతి ఒక్కరూ ఎంఎస్‌ఎంఈ స్థాపించాలి. ఇందుకోసం బడ్జెట్‌లో ఎస్‌ఎంఈ గ్రోత్ ఫండ్ కింద రూ.10 వేల కోట్లు ప్రకటించారు. కార్పొరేట్ మిత్ర వ్యవస్థకు శ్రీకారం చుడుతున్నారు. ఎంఎస్‌ఎంఈలకు బ్యాంకులు ఇచ్చే రుణంలో 70 శాతం కేంద్రం, 25 శాతం రాష్ట్రం హామీగా ఉంటుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అవసరమైన జీఎస్టీ, కార్మిక సంస్కరణలు తీసుకొచ్చాం. నాలాను రద్దు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి చేస్తున్న అన్ని ప్రయత్నాలకు వెసులుబాటు కల్పించేలా బడ్జెట్ ఉంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

రేర్ ఎర్త్ కారిడార్‌లో ఏపీ

'మన దేశం బాగా అభివృద్ధి చెందుతోంది. ఏఐలో మనం నంబర్ వన్‌గా ఉన్నాం. విద్యుత్తు రంగంలోనూ పురోగమిస్తున్నాం. ఈ రెండింటికీ తోడు ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా మనకు యువ జనాభా ఉంది. ఈ మూడింటినీ సద్వినియోగం చేసుకునేలా బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. రేర్ ఎర్త్ కారిడార్‌లో ఆంధ్రప్రదేశ్‌నూ చేర్చారు. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0కు శ్రీకారం చుట్టారు. రూ.40 వేల కోట్లు కేటాయించారు. 2047 వరకు పన్ను మినహాయింపు కల్పించారు. భారతదేశం డేటా సెంటర్ హబ్‌గా తయారవుతుంది.

అరకు కాఫీని కూడా కలుపుతా..

'బడ్జెట్‌లో పర్యాటక, ఆతిథ్య రంగాలకూ ప్రాధాన్యం ఇచ్చారు. భవిష్యత్తులో ఈ రంగాల ద్వారానే ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆతిథ్యానికి భారత్ పెట్టిన పేరు. అందులో ఏపీ అగ్రస్థానంలో ఉంది. అరకు రీజియన్‌లో పర్యాటక హబ్ తీసుకొస్తున్నారు. తిరుపతి జిల్లాలో పులికాట్ సరస్సును ఆధారంగా చేసుకుని ఏటా ఫ్లెమింగో వేడుకలు జరుపుతున్నాం. పులికాట్‌లో పక్షులను వీక్షించడానికి వచ్చేవారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తామని చెప్పడం అభినందనీయం. జీడి, కొబ్బరి, కోకో, చందనం పంటలకు ప్రోత్సాహం ఇచ్చేలా ప్రకటన చేశారు. ఇందులో అరకు కాఫీని కూడా కలుపుతాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యాన క్లస్టర్‌గా రాయలసీమ జిల్లాలు మారబోతున్నాయి. డీపీ వరల్డ్ లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు ఇక్కడికి వస్తున్నాయి. పూర్వోదయ ద్వారా నిధులు ఇస్తామని బడ్జెట్‌లో పెట్టారు. బయోఫార్మాకు రూ.10 వేల కోట్లు కేటాయించారు. ఈ ఏడాదిలో సంజీవని గేమ్‌ఛేంజర్ అవుతుంది' అని సీఎం చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

మూడు నగరాలను ఉన్నత దశకు తీసుకెళ్తాం

'బడ్జెట్‌లో లాజిస్టిక్స్ హబ్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. మనం ఎప్పుడో దీన్ని ప్రారంభించాం. ఇప్పుడు డబ్బులు కూడా సమీకరిస్తున్నాం. కంటెయినర్ల తయారీకి చేయూతనివ్వాలని నిర్ణయించారు. కోస్టల్ కార్గో, అంతర్గత జల రవాణా, ఫ్రైట్ కారిడార్‌లకు పెద్దపీట వేశారు. మనకు ఇచ్ఛాపురం నుంచి చెన్నై వరకు ఉత్తర-దక్షిణ కారిడార్ ఉంది. దీన్ని కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశాతో మన నౌకాశ్రయాలను అనుసంధానించాలి. అప్పుడు ఈస్ట్ కోస్ట్ హబ్‌గా తయారవుతుంది. దాంతో లాజిస్టిక్స్ పరంగా గణనీయమైన వృద్ధి నమోదవుతుంది. వెయ్యి కిలోమీటర్ల మన కారిడార్‌లో ప్రతి 50 కి.మీలకు ఒక పోర్టు నిర్మిస్తున్నాం. అంతర్గత జల రవాణాకు కూడా ఊతమిచ్చేలా బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. పట్టణాల అభివృద్ధి, గ్రోత్ సెంటర్లకు నిధులు కేటాయించారు. రాష్ట్రంలో విశాఖ గ్రోత్ రీజియన్, తిరుపతి, అమరావతి ఎకనామిక్ రీజియన్లుగా మారుతాయి. ఈ మూడు నగరాలను ఉన్నత దశకు తీసుకెళ్తాం. రేణిగుంటను ప్రత్యేక రైల్వేజోన్‌గా కాదు కానీ హబ్‌గా తయారు చేయాలని ప్రణాళిక రూపొందించాం. తిరుపతి- రేణిగుంట మధ్యలో ఇది వస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

విశాఖలో 10 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు స్థాపించడానికి పలు సంస్థలు ముందుకొచ్చాయి. డేటా సెంటర్ వస్తే ఏఐ వస్తుంది. త్వరలో ఏఐ విశ్వవిద్యాలయం ప్రారంభిస్తాం. ఎన్విడియా, ఇతర కంపెనీలతో కలిసి హైదరాబాద్‌లోని ఐబీఎం తరహాలో స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా మారుస్తాం. ఏఐ లివింగ్ ల్యాబ్‌లు అందుబాటులోకి తెస్తాం. ఈ నెల 14న లేదా 15న అమరావతికి బిల్‌గేట్స్ వస్తున్నారు. ప్రపంచంలోని అన్ని పెద్ద కంపెనీలు మన దగ్గరకు వస్తున్నాయి. ఏఐ, క్వాంటమ్, డేటా సెంటర్లు, తర్వాత దశ సాంకేతికతలకు ఏపీ చిరునామా అవుతోంది. కుప్పంలో ఏడో తరగతి విద్యార్థి ఒకరు ఏఐ సాయంతో నా బీపీ, మధుమేహం, గుండె ఆరోగ్యాన్ని వివరించడం చూసి ఆశ్చర్యం కలిగింది. టెక్స్‌టైల్‌కు బడ్జెట్‌లో ఊతమివ్వడం ద్వారా ఎక్కువ మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినట్లవుతుంది' అని చంద్రబాబు తెలిపారు.

అంబటి వ్యాఖ్యలు అత్యంత అసహ్యకరం

కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ లావు





ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైకాపా మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత అసహ్యకరమని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. ఆదివారం వారిక్కడ ఈ అంశంపై వేర్వేరుగా విలేకర్లతో మాట్లాడారు. వైకాపా నాయకులు గతంలో బూతులు మాట్లాడినందుకే ప్రజలు వారికి బుద్ధి చెప్పారన్న విషయం గుర్తుంచుకుంటే బాగుంటుందని హితవుపలికారు. 'వైకాపా నాయకులకు నేరపూరిత కార్యకలాపాలు తప్పితే ఇంకేమీ తెలియదు. ఆ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జగన్ అసెంబ్లీకి రాకుండా ఇలాంటి పనులకు పార్టీ నేతలను ఉసిగొల్పుతున్నారు. చంద్రబాబు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉన్న నేత. ఆయనపై అంబటి లాంటి వారు అవాకులు చెవాకులు పేలితే మూల్యం చెల్లించుకోక తప్పదు' అని రామ్మోహన్‌నాయుడు హెచ్చరించారు. సీఎంపై అసహ్యకరమైన భాష వాడిన రాంబాబు బహిరంగ క్షమాపణలు చెప్పాలని శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. 'అంబటి వ్యాఖ్యలు బట్టి వైకాపా సంస్కృతి ఎలాంటిదో అందరూ అర్థం చేసుకోవచ్చు. తిడితేనో, జైలుకెళ్తేనో గుర్తింపు, సానుభూతి వస్తుందన్న నాయకులు ఇలాంటి చౌకబారు కార్యకలాపాలకు దిగుతున్నారు' అని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న చర్యలపై పార్లమెంటులో ప్రస్తావిస్తామన్న వైకాపా ఎంపీల వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నట్లు రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ పేర్కొన్నారు. అంబటి రాంబాబు వ్యాఖ్యలను తెదేపా ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, బైరెడ్డి శబరి తదితరులు కూడా తీవ్రంగా ఖండించారు.

రాంబాబు, జోగి అసభ్య వ్యాఖ్యలు క్షమించరానివి

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: తెదేపా నాయకులు, కార్యకర్తలపై వైకాపా నాయకులు అంబటి రాంబాబు, జోగి రమేష్ చేసిన అసభ్యకర వ్యాఖ్యలు క్షమించరానివని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. రాజకీయాల్లో దిగజారుడు భాషకు చోటు లేదని, ఇలాంటి వ్యాఖ్యలు చేసినవారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యంలో దాడులకు తావులేదు. చట్టమే అందరికీ మార్గదర్శకం. ఇలాంటి సందర్భాల్లో ఓపిక, సంయమనం పాటిస్తూ చట్టబద్ధ మార్గంలోనే పోరాటం కొనసాగించాలి' అని చెప్పారు.

అంబటి బూతులకు.. కాపులకు సంబంధమేంటి?

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆగ్రహం



ఈనాడు, అమరావతి: ప్రతిపక్ష హోదా కూడా లేకుండా వైకాపాను ప్రజలు ఓడించినా ఆ పార్టీ నేతలకు బుద్ధి రాలేదని తెదేపా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ధ్వజమెత్తారు. ఆదివారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుపై వాడిన దిగజారుడు భాష దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబటి పేరు పలకడానికీ తనకు సిగ్గేస్తోందన్నారు. 'మైండ్‌గేమ్ ఆడి బెదిరిద్దామనుకుంటే భ్రమే. అది మానుకోండి. జగన్‌కు అధికారం కేవలం సంపాదన కోసమే. జనం కోసం కాదు. వంగవీటి రంగాతో అంబటి రాంబాబును పోలుస్తారా? రంగా ప్రజా నాయకుడు. అంబటి రాంబాబు మాట్లాడిన బూతులకు కాపు కులానికి సంబంధం ఏంటి? చంద్రబాబును తిట్టాలని కాపులు ఏమైనా అంబటికి చెప్పారా? జగన్ నేర్పిన విద్య అది' అని కన్నా లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కల్తీ నెయ్యి అపచారాన్ని పక్కదారి పట్టించేందుకే అంబటి దూషణలు

ఎమ్మెల్సీ సోము వీర్రాజు ధ్వజం



కాకినాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూకు వినియోగించిన నెయ్యిలో కల్తీ జరగలేదని వైకాపా నాయకులు చెబుతున్నారని, కిలో రూ.1,000 ఉండే నెయ్యిని రూ.420కి కొన్నారని అంటే వైకాపా ఎలాంటి పార్టీయో అర్థమైందని ఎమ్మెల్సీ, భాజపా జాతీయ కమిటీ సభ్యుడు సోము వీర్రాజు ధ్వజమెత్తారు. కాకినాడలో ఆదివారం ఆయన భాజపా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 'కల్తీ నెయ్యిపై సిట్ ఇచ్చిన నివేదికను పక్కదారి పట్టించాలని గొడవలు సృష్టించేందుకు అంబటి రాంబాబు.. ముఖ్యమంత్రి చంద్రబాబుపై దూషణలకు దిగారు. అంబటి ఉపయోగించిన భాష అత్యంత దారుణం. నెయ్యి కొనుగోలులో వైకాపా నాయకులంతా దోషులే. అసలు రూ.420కి కిలో నెయ్యి ఎక్కడొస్తుందో సుబ్బారెడ్డి, జగన్, అంబటి రాంబాబులు సమాధానం చెప్పాలి. అంబటి వివాదాన్ని కులానికి ఆపాదించడం తగదు' అని పేర్కొన్నారు.

మీరు పెట్టిన నిప్పు మీ ప్రభుత్వాన్నే దహించేస్తుంది

'ఎక్స్' వేదికగా జగన్ వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: 'మీ తప్పులను ప్రశ్నిస్తే జీర్ణించుకోలేక అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల ఇళ్లకు మీరు నిప్పు పెట్టి, ఇలాంటి దుశ్చర్యలతో భయాన్ని కలిగించామని మీరనుకుంటే అది మీ భ్రమే. ఆ నిప్పు మీ ప్రభుత్వానికి మీరే పెట్టుకున్నారని గుర్తుంచుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబును వైకాపా అధినేత జగన్ ఆదివారం 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. 'అంబటి రాంబాబు, జోగి రమేష్‌ల ఇళ్లకు పెట్టిన నిప్పు అరాచకానికి, ఆటవిక పాలనకు ప్రతీక.. ఆ మంటలతో పుట్టిన వేడి మీ సర్కారును దహించివేయక మానదు' అని జగన్ పేర్కొన్నారు.

దాడులతో భయపెట్టలేరు: జోగి రమేష్

ఈనాడు డిజిటల్, తిరుపతి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులే లక్ష్యంగా దాడులకు పాల్పడుతోందని మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్ విమర్శించారు. ఇలాంటి దాడులతో తమను భయపెట్టలేరన్నారు. తిరుపతి సమీపంలోని తుమ్మలగుంటలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు: చెవిరెడ్డి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని చెవిరెడ్డి భాస్కరరెడ్డి విమర్శించారు. 'తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని అడ్డగోలుగా ఆరోపణలు చేశారు. ఐసీఏఆర్ నివేదికలో ఎక్కడా కల్తీ జరగలేదని తేలింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. అంబటి రాంబాబు, జోగి రమేష్ వంటి మాజీ మంత్రుల ఇళ్లకే రక్షణ లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయి' అని ధ్వజమెత్తారు.



జిమ్‌కు వెళ్లే సమయం లేదా?

ప్రతిరోజూ ఉదయం మీకు జిమ్‌కు వెళ్లే సమయం లేకపోతే ఇలా ప్రయత్నించండి. వేగంగా 20 స్క్వాట్స్, 15 సిటప్స్, 15 పుషప్స్, 20 లంగెస్, కొద్ది సమయం యోగా చేయండి. దీంతో మీ రోజు ఉత్సాహంగా మొదలవుతుంది.
– క్రిస్టీనా జాకోబిట్జ్, ఫిట్‌నెస్ కోచ్

బాకా ఊదడమే బొప్పరాజు పని

రెవెన్యూ ఉద్యోగుల సంఘం జేఏసీ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వరరావు పట్టించుకోవడం లేదని.. ఆయన సొంత లాభం కోసమే పనిచేస్తున్నారని రెవెన్యూ ఉద్యోగుల జేఏసీ నేతలు భూపతిరాజు రవీంద్రరాజు, బి.మధుబాబు, సుగుణ, పద్దయ్య తదితరులు ఓ ప్రకటనలో విమర్శించారు. 'ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారికి భజన చేయడమే ఆయన నైజం. ఎన్నికల సమయంలో వైకాపా ప్రభుత్వం 105 సీట్లతో అధికారంలోకి వస్తుందని ప్రచారం చేశారు. ప్రభుత్వం మారాక కూటమి ప్రభుత్వానికి భజన చేస్తున్నారు' అని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు వర్క్ టు రూల్

తమ సమస్యలు పరిష్కరించే వరకు వర్క్ టు రూల్ అమలు చేయాలని తీర్మానించినట్లు జేఏసీ తెలిపింది. ఆదివారం విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ ఎన్నిక జరిగింది. ఛైర్మన్‌గా భూపతిరాజు రవీంద్రరాజు, కార్యదర్శి జనరల్‌గా బి.మధుబాబు, కన్వీనర్‌గా సుగుణ, కో ఛైర్మన్‌గా పెద్దయ్య, ట్రెజరర్‌గా చంద్రమౌళి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు.

రాజకీయ నాయకులు అసభ్యంగా మాట్లాడొద్దు

- సీఎం చంద్రబాబుపై అంబటి దూషణల నేపథ్యంలో హైకోర్టు వ్యాఖ్యలు
- అంబటి సతీమణి వ్యాజ్యంపై ఆదివారం అత్యవసర విచారణ
- 15 మంది పోలీసులతో ఆయన ఇంటి వద్ద పికెట్
- పరిస్థితి అదుపులో ఉందన్న ప్రభుత్వం



ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర అసభ్య పదజాలంతో దూషించిన నేపథ్యంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. రాజకీయ నాయకులు అలా మాట్లాడటానికి వీల్లేదంది. ప్రజాజీవితంలో ఉండే రాజకీయ నాయకులు మరింత జాగ్రత్త వహించాలని, ఎవరినీ బాధపెట్టకుండా, హుందాగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అంబటి రాంబాబు ఇంటి వద్ద 15 మంది పోలీసులతో ఇప్పటికే పికెట్ ఏర్పాటు చేశామని, ఆయన సతీమణిని పరామర్శించడానికి వైకాపా నేతలు మాత్రమే వచ్చి వెళుతున్నారని, ఇతరులెవరూ లేరని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు నివేదించిన వివరాలను కోర్టు నమోదు చేసింది. భద్రతపై పోలీసులు తగిన చర్యలు తీసుకునేలా సూచించాలని ప్రభుత్వ న్యాయవాదులకు నిర్దేశిస్తూ.. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు ఆదివారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును అంబటి రాంబాబు తీవ్ర అసభ్య పదజాలంతో దూషించిన నేపథ్యంలో గుంటూరు సిద్ధార్థనగర్‌లోని ఆయన ఇల్లు, కార్యాలయంపై శనివారం దాడి జరిగింది. ఈ నేపథ్యంలో తమకు, ఇంటికి పోలీసు భద్రత కల్పించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి హౌజ్‌మోషన్‌లో ఆదివారం అత్యవసరంగా పిటిషన్ వేశారు. ఆమె తరఫున న్యాయవాది రామ్‌లక్ష్మణ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'తెదేపా నాయకులు శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 9.30 వరకు అంబటి రాంబాబు ఇంటిపై దాడికి పాల్పడ్డారు. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. కుటుంబసభ్యులను బెదిరించారు. రాత్రి 9.30 గంటలకు పోలీసులు రాంబాబును అరెస్ట్ చేశారు. అరెస్ట్ తర్వాత పలువురు పెట్రోల్ బాంబులు విసిరారు. కారును తగలబెట్టారు. దాడులకు పాల్పడ్డ వారిపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఇప్పటికీ ఇంటి వద్ద పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. గుంపులుగుంపులుగా వస్తున్నారు. పోలీసు భద్రత కల్పించేలా ఆదేశించండి' అని కోరారు. పోలీసుల తరఫున హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది(జీపీ) అడుసుమిల్లి జయంతి, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి, ఏజీపీ అజయ్ వాదనలు వినిపిస్తూ.. అంబటి రాంబాబు ముఖ్యమంత్రిని ఉద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేయడంతో ఈ ఉద్రిక్తత ఏర్పడిందన్నారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని చెప్పారు.

శాంతి, సామరస్యాల పరిరక్షణ బాధ్యత పోలీసులదే

న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు స్పందిస్తూ.. రాజకీయ నాయకులు ఆ విధంగా మాట్లాడటానికి వీల్లేదన్నారు. మరోవైపు శాంతిభద్రతలను కాపాడటంతోపాటు సమాజంలో శాంతి, సామరస్యాలను సక్రమంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని వ్యాఖ్యానించారు. రాత్రి వేళ మళ్లీ దాడులు జరిగే ప్రమాదం ఉందని పిటిషనర్ ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఇంటి వద్ద కొంతమంది పోలీసులను మోహరించాలన్నారు. గుంటూరు ఎస్పీ నుంచి దీనిపై సమాచారం సేకరించి చెప్పాలంటూ కొద్దిసేపు వాయిదా వేశారు. విరామం అనంతరం విచారణలో.. రాంబాబు ఇంటి వద్ద గుంపులు లేవని, 15 మంది పోలీసులతో అక్కడ పికెట్ ఏర్పాటు చేశారని హోం శాఖ జీపీ జయంతి, ఎస్‌జీపీ ప్రణతి కోర్టుకు తెలిపారు. ఈ వివరాలను నమోదు చేసిన న్యాయమూర్తి.. భద్రత విషయంలో తగిన చర్యలు తీసుకునేలా గుంటూరు ఎస్పీకి సమాచారం ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాదులకు సూచిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించారు.

జోగి నోటి దురుసుపై భగ్గుమన్న తెదేపా శ్రేణులు

- చంద్రబాబు, లోకేశ్‌లపై వ్యాఖ్యలకు ఆగ్రహం
- ఇబ్రహీంపట్నంలోని ఆయన ఇంటిపై దాడి
- అడ్డుకున్న పోలీసులు.. తీవ్ర ఉద్రిక్తత





జోగి ఇంటి మొదటి అంతస్తులో మంటలు ★ జోగి ఇంటి ముందుకు దూసుకొచ్చిన కార్యకర్తలు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే – ఇబ్రహీంపట్నం: వైకాపా నేత, మాజీమంత్రి జోగి రమేష్ తన నోటి దురుసుతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడంతో తెదేపా శ్రేణులు భగ్గుమన్నాయి. 'లోకేశ్‌కు కొవ్వు తగ్గింది కానీ చిప్ దెబ్బతింది. చంద్రబాబు కల్తీ పార్టీని నడుపుతున్నాడు' అంటూ శనివారం జోగి చేసిన వ్యాఖ్యలకు తెదేపా నేతలు, కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు. ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని జోగి ఇంటిని ముట్టడించారు. ఇంటి ముందున్న ఫ్లెక్సీలను చింపేసి రాళ్లు రువ్వారు. ఇదే సమయంలో కొందరు యువకులు పెట్రోలు సీసాలు విసరడంతో అవి ఇంటి పోర్టికోలో పడి కొద్దిసేపు మంటలు చెలరేగాయి. పోర్టికోకు బిగించిన అద్దాలు పగిలిపోయాయి. తెదేపా శ్రేణులు జోగి ఇంటిపైకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆ సమయంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

తిరుపతిలో ఉన్న జోగి రమేష్..

జోగి వ్యాఖ్యలను ఖండిస్తూ మొదట తెదేపా నేతలు, కార్యకర్తలు ఆదివారం నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నం రింగ్ కూడలిలో జోగి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ర్యాలీగా బయలుదేరారు. మధ్యలో జోగి ఇంటి వద్దకు చేరుకోగానే వారిలో ఆవేశం కట్టలు తెచ్చుకుంది. ఆగ్రహంతో ఇంటిపై దాడికి దిగారు. ఆ సమయంలో రమేష్, ఆయన పెద్ద కుమారుడు తిరుపతిలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇంట్లో ఉన్నారు. జోగి భార్య, చిన్న కుమారుడు వేరేచోట ఉన్నారు. జోగి తండ్రి మోహనరావు లోపల ఉన్నారని కుటుంబసభ్యులు చెబుతున్నారు. కానీ.. ఆయన బయటకు రాలేదు. ఇంటికి సెక్యూరిటీగా కొంతమంది సిబ్బంది ఉన్నారు. పోర్టికోలో మంటలు వ్యాపించగానే వారు అప్రమత్తమై ఆర్పేశారు. తెదేపా శ్రేణులను పోలీసులు ఇంటి దగ్గర నుంచి పంపించేయడంతో అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి.. ఇబ్రహీంపట్నం కూడలిలో జోగి రమేష్ దిష్టిబొమ్మ దహనం చేసి ఆందోళన చేపట్టారు.

వైకాపా నేతల వాగ్వాదం

ఆందోళన నేపథ్యంలో జోగి ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. అగ్నిమాపక సిబ్బంది కూడా చేరుకున్నారు. తెదేపా కార్యకర్తలను పోలీసులు అక్కడి నుంచి పంపించేయగా.. అంతలో వైకాపా కార్యకర్తలు జోగి ఇంటికి చేరుకున్నారు. పోలీసులు వెళ్లిపోవాలని చెప్పినా వినకుండా వాగ్వాదానికి దిగారు. 'మీరు పసుపు చొక్కాలు వేసుకుని విధులు నిర్వహిస్తున్నారు. బాధితులపై ఆంక్షలు పెడుతున్నారు. వారు దాడి చేస్తున్నప్పుడు అడ్డుకోకుండా చోద్యం చూశారు' అంటూ గొడవకు దిగారు. రెండు గంటలకుపైగా వైకాపా నేతలు, కార్యకర్తలు అక్కడే ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడి విషయం తెలిసి వైకాపా నాయకులు దేవినేని అవినాష్, మొండితోక జగన్మోహన్‌రావు తదితర నేతలు ఇబ్రహీంపట్నం బయలుదేరారు. వారిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భవానీపురం, సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్లకు తరలించారు.

వైకాపా నేతలే రెచ్చగొట్టారంటున్న తెదేపా నేతలు..

తాము శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తుంటే.. వైకాపా కార్యకర్తలే తమను రెచ్చగొట్టారని తెదేపా నేతలు పేర్కొంటున్నారు. జోగి ఇంటిపైకి వారే రాళ్లు రువ్వి, పెట్రోలు సీసాలు విసిరి మంటలు వ్యాపించేలా చేశారని, ఆ సమయంలోనే అక్కడికి ర్యాలీగా వచ్చిన తమపైకి నెపం నెట్టేసి.. సానుభూతి డ్రామాలు ఆడుతున్నారని కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, నారాయణ తదితరులు ఆరోపించారు.

సుమోటోగా కేసు నమోదు చేసిన పోలీసులు

జోగి రమేష్ ఇంటిపై దాడి ఘటనలో పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్సై సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పబ్లిక్ న్యూసెన్స్, ఇంటిపై దాడి, చట్టవిరుద్ధంగా గుమిగూడటం తదితర కారణాలపై తెదేపా నేతలపై కేసు నమోదు చేశారు.

జోగి రమేష్‌పైనా..

మంత్రి లోకేశ్‌పై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తూ దూషించినందుకు జోగి రమేష్‌పైనా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు పెట్టారు. మూలపాడుకు చెందిన తెదేపా నేత కాకి నాగరాజు ఫిర్యాదు మేరకు.. కులాలు, వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా, భయాందోళనకు గురిచేసేలా మాట్లాడినందుకు ఈ కేసు నమోదైంది.

డిజిటల్ డైరీలో ఎక్కిస్తున్నాం.. ఎవ్వరినీ వదలం

- వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల హెచ్చరిక
- అలా అనకుండా ఉండాల్సిందని అంబటి అన్నారని వ్యాఖ్య



మీడియాతో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో వైకాపా నేతలు విడదల రజిని, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, పోతిన మహేష్, మురుగుడు హనుమంతరావు తదితరులు

గుంటూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: గతంలో తెదేపా కార్యాలయంపై దాడి ఘటనలో తెదేపా నేత పట్టాభి పదే పదే అసభ్య వ్యాఖ్యలు చేశారని, అయితే అంబటి రాంబాబు తర్వాత మీడియాతో తాను ఆ మాటలు అనకుండా ఉండాల్సిందని సంస్కారయుతంగా చెప్పారని వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న వ్యవహారాలపై తమ పార్టీ అధ్యక్షుడు ఇప్పటికే దృష్టి సారించారన్నారు. అందరి గురించీ డిజిటల్ డైరీలో ఎక్కిస్తున్నాం.. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు అధికారులు, రాజకీయ నాయకులను అందరినీ బయటకు లాగుతామని, ఎవరూ తప్పించుకోలేరని ఆయన హెచ్చరించారు. గుంటూరు సిద్ధార్థనగర్‌లోని మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబసభ్యులను సజ్జల రామకృష్ణారెడ్డి ఆదివారం మధ్యాహ్నం పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అంబటి చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ బద్ధమేనన్నారు 'వ్యవస్థను కాపాడాల్సినవారు.. పాలకుల అడుగులకు మడుగులొత్తుతున్నారు. చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వారిని ఎదుర్కొంటాం. శనివారం నాటి ఘటనకు తిరుమల లడ్డూ విషయంపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు తొలగించకపోవడమే కారణం. కర్రలతో వచ్చిన వారిని నిలువరించాల్సిన పోలీసులు అంబటి రాంబాబును అక్కడి నుంచి పంపించారు. కానీ దాడి జరుగుతుంటే ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారు. లోపల ఉన్నవారికి ఏదైనా జరిగితే ఎవరిది పూచీ? మాకు ఆ మాత్రం బలం లేదా? మేం రమ్మంటే రారా' అని వ్యాఖ్యానించారు. పథకం ప్రకారమే దాడి చేశారని, దీనిపై గవర్నర్‌ను, దిల్లీలో ఎన్‌హెచ్ఆర్‌సీని కలుస్తామని చెప్పారు. ప్రైవేటుగా కేసులు పెడతామన్నారు. సజ్జల వెంట ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మురుగుడు హనుమంతరావు, మాజీ మంత్రి విడదల రజిని, తదితర నేతలు ఉన్నారు.

పోలీసులతో వైకాపా నాయకుల వాగ్వాదం

అంబటి రాంబాబు నివాసం ఉన్న వీధి ప్రవేశమార్గం వద్ద పోలీసులు బారికేడ్లు పెట్టి, వైకాపా ముఖ్య నేతలను మాత్రమే లోపలికి అనుమతించారు. తమను ఎందుకు ఆపుతున్నారంటూ మిగిలిన నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మరికొందరు దౌర్జన్యంగా లోపలికి దూసుకెళ్లారు.

EENADU Vol: 52, Issue: 173 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ప్రవాసులకు మ్యాట్ మినహాయింపు

అంచనా ప్రాతిపదికన పన్ను చెల్లించే ప్రవాసులకు కేంద్రం ఊరటనిచ్చింది. వీరికి కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్) నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు ■ బడ్జెట్ 2026-27 ప్రతిపాదనల ప్రకారం కార్పొరేట్ పన్ను నిర్మాణాన్ని సరళీకృతం చేసేందుకు మ్యాట్ రేటును ప్రస్తుత 15% నుంచి 14 శాతానికి తగ్గించారు. దీన్ని 2026 ఏప్రిల్ 1 నుంచి తుది పన్నుగా మార్చనున్నారు. దీంతో భవిష్యత్తులో కొత్తగా క్రెడిట్ జమ కాదు. కొత్త పన్ను విధానాన్ని ప్రోత్సహించేలా, కేవలం కొత్త విధానానికి మారే కంపెనీలకు మాత్రమే పాత మ్యాట్ క్రెడిట్‌ను వారి పన్ను బాధ్యతలో 25% వరకు వాడుకునే అవకాశం కల్పించారు.



రోడ్డు ప్రమాద బాధితులకు ఊరట

రోడ్డు ప్రమాద బాధితులకు ఊరట కల్పిస్తూ.. మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రైబ్యునల్ ద్వారా అందించే అవార్డులపై వచ్చే వడ్డీకి పన్ను మినహాయింపును ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. మోటార్ వాహనాల చట్టం-1988 ప్రకారం వాహన ప్రమాదంలో మరణం, శాశ్వత వైకల్యం, గాయాలయినప్పుడు బాధిత వ్యక్తి లేదా వారసులకు నిబంధనల మేరకు ట్రైబ్యునల్ పరిహారం అందిస్తుంది. అది ఆలస్యమైతే.. వడ్డీ ఇస్తారు. ఇలా రూ.50 వేలకు మించి వడ్డీ వస్తే, సంబంధిత సంస్థలు మూలం వద్ద పన్ను (టీడీఎస్) విధించేవి. ఇప్పుడు వడ్డీ మొత్తంతో నిమిత్తం లేకుండా, ఈ పన్ను కోత నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే?



ఆర్థిక వ్యూహం, రాజనీతిజ్ఞత కేంద్ర బడ్జెట్‌లో లోపించాయి. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక సర్వేను పూర్తిగా విస్మరించి ఇతరులపై అభాండాలు వేయడానికే పరిమితమయ్యారు. వివేకవంతమైన ద్రవ్య విధానం కానీ, ఆర్థికాన్ని బలోపేతం చేసే యోచన కానీ ఇందులో లేవు. అప్పులు చేసి ఖర్చు చేయడంలో తప్పు లేదు. కానీ అదే సమయంలో ప్రభుత్వం వేగంగా ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రయత్నించాలి. ఈ ప్రభుత్వం వేగవంతమైన ఆర్థిక పునరుద్ధరణకు చర్యలు చేపట్టలేదు.

- కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం



నిర్మలా సీతారామన్ బంతిని మిస్ అయి స్టంప్ అయిపోయారు. ఈ బడ్జెట్‌లో అనేక ఉపశీర్షికలు ఉన్నాయి కానీ సత్తా లోపించింది. బడ్జెట్‌లో ఆనందించాల్సిన అంశమేదీ లేదు. ఉపాధి అవకాశాలు ఎలా కల్పిస్తారన్నది సమాధానంలేని ప్రశ్నగానే మిగిలిపోయింది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల గురించి ప్రస్తావన లేదు. రాష్ట్రాలకు నిధులు కేటాయించలేదు. ద్రవ్య వికేంద్రీకరణ 41 శాతానికే పరిమితమైంది. కేరళలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఏర్పాటు కోసం 15 ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. దానిపై ఎటువంటి ప్రకటన రాలేదు. ఈ బడ్జెట్ నిరాశాజనకం'

- కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్



బడ్జెట్ దిశా విహీనంగా ఉంది. దార్శనికత లేమి స్పష్టంగా కనిపిస్తోంది. సామాన్యులకు, మా రాష్ట్రానికి ఈ బడ్జెట్ ఏమీ ఇవ్వలేదు. ఈ పద్దు మహిళా విరోధి, యువ వ్యతిరేకి, రైతు ద్రోహి, విద్యా వ్యతిరేకి. ఎస్సీ, ఎస్టీ ఓబీసీలకు కూడా ఇది వ్యతిరేకి.

- పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ



కేంద్ర బడ్జెట్ వాస్తవాలకు దూరంగా ఉంది. విద్యారంగానికి నిధులు కేటాయించలేదు. విద్య లేకుండా నవ భారతాన్ని ఎలా నిర్మిస్తారు.

- సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్

నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువత, రైతులు, ఉపాధి అవకాశాల కల్పనను గురించి ప్రస్తావించలేదు. మునుపటి పథకాలు మాత్రమే పునరావృతమయ్యాయి. బడ్జెట్‌లో ఏ రాష్ట్రానికీ సరైన కేటాయింపులు లేవు.

-టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ

ఇది ప్రజా వ్యతిరేక, సమాఖ్య విరోధి బడ్జెట్. సామాన్యులను బలిపెట్టి ధనిక వర్గాలకు ప్రయోజనం కలిగించేలా ఉంది. గత బడ్జెట్‌తో పోలిస్తే పలు కేంద్ర పథకాలకు, కేంద్ర ప్రాయోజిత పథకాలకు కేటాయింపులు తగ్గించారు. కొన్ని బడా సంస్థల సంకుచిత ప్రయోజన సాధనకే తాను కట్టుబడి ఉన్నానని మోదీ ప్రభుత్వం ఈ బడ్జెట్ ద్వారా నిరూపించింది. **- సీపీఎం**

పార్లమెంటుకు రూ.1,492 కోట్ల నిధులు

పార్లమెంటు ఉభయ సభల నిర్వహణకు గాను 2026-27 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.1,492 కోట్లు కేటాయించింది. ఈ మొత్తంలో లోక్‌సభ స్పీకర్, ఉపసభాపతి వేతనాలు, భత్యాలకు రూ.1.56కోట్లు, పార్లమెంటు సభ్యుల జీతభత్యాలు, ఇతర సదుపాయాల కోసం రూ.416.45 కోట్లు, సంసద్ టీవీకి నిధులు, లోక్‌సభ సచివాలయం ఖర్చులు, అధికారులు, సిబ్బంది జీతాలకు రూ.586.03 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. రాజ్యసభ నిర్వహణతో పాటు సిబ్బంది, అధికారుల జీతాలు, భత్యాలకు రూ.482.99 కోట్ల వ్యయాన్ని అంచనా వేసింది. రాజ్యసభ ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ జీతభత్యాలకు రూ.2.55 కోట్లు, విపక్షనేత జీతభత్యాలు, ఆయన కార్యాలయ నిర్వహణకు రూ.3.36కోట్ల వ్యయాన్ని బడ్జెట్ పద్దుల్లో ప్రభుత్వం పేర్కొంది.



మైనారిటీ వ్యవహారాల శాఖకు రూ.3,400 కోట్లు

2026-27 కేంద్ర బడ్జెట్‌లో మైనారిటీ వ్యవహారాల శాఖకు రూ.3,400 కోట్లను ఆర్థిక మంత్రి కేటాయించారు. 2025-26 బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ.3,350 కోట్లు కాగా సవరించిన అంచనాల తర్వాత అది రూ.2,160.45 కోట్లకే పరిమితమైంది. దీని ప్రకారం చూస్తే కొత్త బడ్జెట్‌లో రూ.1,240 కోట్లు అధికంగా కేటాయించినట్లయ్యింది.

ఇంతింతై..

రూ.197 కోట్ల నుంచి మొదలైన దేశ బడ్జెట్ ప్రయాణం

రూ.53 లక్షల కోట్లై!

ఇంటర్నెట్ డెస్క్: ప్రస్తుత కేంద్ర బడ్జెట్ రూ.50.65 లక్షల కోట్లు కాగా 2026-27 ఏడాది పద్దు రూ.53.47 లక్షల కోట్లు. దేశ బడ్జెట్ ఇన్ని రూ.లక్షల కోట్ల సామర్థ్యానికి రాత్రికి రాత్రే ఎదగలేదు. దీని వెనుక దశాబ్దాల శ్రమ, ఆర్థిక ప్రణాళికలు, వ్యూహాలు దాగి ఉన్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 3 నెలల తర్వాత 1947 నవంబరు 26న తొలి ఆర్థిక మంత్రి ఆర్‌కే షణ్ముగం చెట్టి ప్రవేశపెట్టినప్పుడు బడ్జెట్ రూ.197 కోట్లు. 1971 వరకు పాక్, చైనాలతో యుద్ధాలు, దేశ అంతర్గత భద్రతతో ముడిపడిన కేటాయింపులకే బడ్జెట్‌లు సరిపోయాయి. జనరంజక బడ్జెట్‌లు 1971 తర్వాతే దేశ ప్రజల ముంగిటకు వచ్చాయి. పరిస్థితులకు అనుగుణంగా దేశ నిర్మాణంలో అన్ని బడ్జెట్లూ తమ వంతు పాత్ర పోషించాయి. ఆదివారం లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 80వ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన వేళ కేంద్ర బడ్జెట్ల చరిత్రలోని కీలక మైలురాళ్లపై ఓ పరిశీలన..



1950లో ప్రణాళికా సంఘం

1950 బడ్జెట్‌లో చేసిన ప్రకటన ప్రకారం, ఆ ఏడాది మార్చి 15న భారత ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేశారు. పంచ వర్ష ప్రణాళికలను తయారుచేసి ఇవ్వడం దీని పని. అనంతరం మోదీ సర్కారు 2015లో ప్రణాళికా సంఘం బదులు నీతి ఆయోగ్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. మొత్తంగా 1947 నుంచి 1971 వరకు కేంద్ర బడ్జెట్‌లను యుద్ధాల నుంచి విడదీసి చూడలేం. ఎందుకంటే ఈ వ్యవధిలో భారత్ వరుస సైనిక పోరాటాలు చేయాల్సి వచ్చింది.

రూపాయి విలువను తగ్గించిన ఇందిరాగాంధీ

1962 నుంచి 1971 మధ్యకాలంలో పాక్, చైనాలతో వరుస యుద్ధాల వల్ల బడ్జెట్ భారీ లోటును ఎదుర్కొంది. దీన్ని అదనుగా చేసుకున్న అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయం, ఆహార సరకుల పంపిణీ చేసే విషయంలో రకరకాల కొర్రీలు పెట్టాయి. ఆర్థిక సరళీకరణలు చేసి, రూపాయి విలువను తగ్గిస్తేనే సాయం చేస్తామని తేల్చి చెప్పాయి. ఈ పరిస్థితుల్లో 1966లో తొలిసారి అప్పటి దేశ ప్రధాని ఇందిరాగాంధీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఒక అమెరికా డాలరుకు భారత రూపాయి విలువను రూ.4.76 నుంచి రూ.7.50కి సవరించారు. దీనివల్ల ఆ ఏడాది జూన్ 6న రూపాయి విలువ ఒక్కసారిగా 57.5 శాతం మేర పడిపోయింది. 1959-66 మధ్య రూపాయితో ముడిచమురు లావాదేవీలను జరిపిన అరబ్ దేశాలు సొంత కరెన్సీలను రంగంలోకి దింపాయి. దీంతో భారత్‌లో అధిక ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడ్డాయి. నిత్యావసరాలు, ఇంధనాల రేట్లు చుక్కలనంటాయి.

తొలి బడ్జెట్.. తీవ్ర సవాళ్లు

భారత్‌కు 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. ఆ సమయానికి ఆర్థిక సంవత్సరం ప్రారంభమై 4 నెలలు గడిచిపోయాయి. దీంతో అప్పటి ఆర్థికమంత్రి షణ్ముఖం చెట్టి మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ సమయానికి మన దగ్గర ఆర్థిక వనరులు లేవు. భారత్, పాక్ విభజన వేళ సరిహద్దు రాష్ట్రాల్లో మతఘర్షణలు రాజుకున్నాయి. ఈ పరిస్థితుల్లో దేశ అంతర్గత, సరిహద్దు భద్రత, సైనిక అవసరాలకే పెద్దపీట వేశారు. అనంతరం తొలిసారిగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను 1948-49 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టారు. 1950 వరకు కశ్మీర్ ప్రాంతంలో సైనిక మోహరింపులు పెంచేందుకు, దేశ రక్షణకే మెజారిటీ బడ్జెట్‌ను కేటాయించారు.

పెరిగిన ఆదాయపు పన్ను

ఇందిరాగాంధీ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆదాయపు పన్ను రేట్లను గరిష్ఠంగా 97.75% దాకా పెంచారు. వరుస యుద్ధాల వల్ల దేశ ఖజానాలో ఏర్పడిన భారీ లోటును పూడ్చడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు.

మోదీ సర్కారు కీలక నిర్ణయాలు

- జీఎస్టీ (2017)
- ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టీ కోడ్ (ఐబీసీ)- 2016
- మేక్ ఇన్ ఇండియా
- ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాలు
- డిజిటల్ ఇండియా
- ఆత్మనిర్భర్ భారత్
- జన్ ధన్/యూపీఐ
- విప్లవం, ఆదాయపు పన్ను కోతలు
- కార్పొరేట్ పన్ను కోత
- పీఎం కిసాన్, జీఎస్టీ సంస్కరణలు
- కొత్త కార్మిక కోడ్‌లు

మొత్తం మీద 1947 నుంచి ఇప్పటి వరకు ఎన్నో సంక్షోభాలు, రాజకీయ మార్పులను ఎదుర్కొని, దార్శనిక సంస్కరణల ఫలితంగా సుమారుగా రూ.53.47 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టుకునే ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. అందుకే దేశ బడ్జెట్ అంటే గణాంకాలే కాదు. అది ఎన్నో ప్రణాళికలు, భవిష్యత్ వ్యూహాల సమాహారమని నిపుణులు అంటుంటారు.

1975-77 మధ్య 9 శాతం వార్షిక వృద్ధి

1975-77 మధ్యకాలంలో ఇందిరాగాంధీ విధించిన 21 నెలల ఎమర్జెన్సీతో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత చితికిపోయింది. సరిగ్గా ఇదే సమయంలో మన దేశానికి హరిత విప్లవ ఫలితాలు అందాయి. 20 పాయింట్ల కార్యక్రమంతో జన సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయి. వెరసి, 1975-77 వ్యవధిలో 9 శాతం వార్షిక వృద్ధిని భారత్ సాధించింది.

బడ్జెట్‌లలోని కీలక మైలురాళ్లు..

1968: 10 కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్ ఎక్సైజ్ సుంకాలను సరళీకృతం చేశారు. తయారీ సంస్థల కోసం స్వీయ అంచనా పద్ధతిని ప్రవేశపెట్టారు. ఫ్యాక్టరీ గేట్ స్టాంపింగ్‌ను రద్దు చేశారు. బ్యూరోక్రసీ అవినీతిని అరికట్టడానికి యత్నించారు.

1984-1989: అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ 1987-88లో దేశ ఆధునికీకరణ, కంప్యూటర్లు/ఇంటర్నెట్, సాంకేతికతలు, కనీస ప్రత్యామ్నాయ పన్నుపై దృష్టి సారించారు.

1991-92: నాటి ప్రధాని పీవీ నరసింహారావు నేతృత్వంలో అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్‌సింగ్ ఆర్థిక సంస్కరణలకు బాటలు వేశారు. లైసెన్స్ రాజ్‌ను రద్దు చేశారు. ఎఫ్‌డీఐలు వచ్చే మార్గాలను సరళీకరించారు. ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ సంస్కరణలను ప్రారంభించారు. ఇవి దేశం దివాలా తీయకుండా కాపాడాయి.

1999-2004: ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం మౌలిక సదుపాయాల ఆధారిత వృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ, ప్రైవేట్ రంగ పునరుజ్జీవనాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. స్వర్ణ చతుర్భుజి రహదారి ప్రాజెక్టు, టెలికం సంస్కరణలు, ప్రైవేటీకరణ చొరవలను ఆరంభించింది. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణను మొదలుపెట్టింది. ఆర్థిక లోటు తగ్గింపు లక్ష్యంగా ఎఫ్ఆర్‌బీఎం చట్టం 1999లోనే అమల్లోకి వచ్చింది.

2004-2014: ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం (2008-09) నడుమ సంక్షేమ పథకాల ద్వారా సమ్మిళిత వృద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యా హక్కు, ఆహార భద్రతా చట్టం, సమాచార హక్కు చట్టాలను అమలు చేసింది.

2014-2025: ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 2047 వికసిత భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందుకోసం నిర్మాణాత్మక సంస్కరణలు, డిజిటలైజేషన్, మౌలిక సదుపాయాలపై ప్రధానంగా దృష్టి పెడుతోంది.

సామాన్యుడికి పరోక్ష సాయమే!

నేరుగా దక్కని ఊరట • పలు విభాగాల్లో మినహాయింపులు



కేంద్ర బడ్జెట్‌లో సామాన్యులకు నేరుగా ప్రయోజనం కల్పించే చర్యలు పెద్దగా లేవు. గత ఏడాదిలో ఆదాయ పన్ను, జీఎస్టీల్లో భారీ కోతలతో ఉపశమనం కల్పించిన ప్రభుత్వం ఈసారి వాటి జోలికి వెళ్లలేదు. అయితే పలు విభాగాల్లో మినహాయింపులను ఇవ్వడం ద్వారా పరోక్షంగా సాయం చేసేందుకు ప్రయత్నించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో.. మధ్య తరగతి వారు, చిన్న ఇన్వెస్టర్లకు పలు అంశాల్లో మినహాయింపులను ప్రకటించారు. వ్యవసాయం, విద్య, చిన్న పరిశ్రమలు, ఆరోగ్య రంగం, ఫైనాన్షియల్ మార్కెట్లు, ఐటీ రంగం, రవాణా మౌలిక వసతులు, పర్యాటకం, క్రీడా రంగాల ద్వారా సామాన్యులకు పరోక్షంగా ప్రయోజనం కల్పించే చర్యలను మంత్రి వెల్లడించారు.

- ■ ఉద్యోగులను నేరుగా పన్ను మినహాయింపులను ప్రకటించలేదు. గత ఏడాది మాదిరిగానే రూ.12 లక్షల వరకూ ఆదాయ పన్ను మినహాయింపు కొనసాగనుంది. దానిపై రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్ యథాతథంగా ఉంది.
- ■ మధ్య తరగతికి ఊరట కలిగించడానికి విదేశీ చెల్లింపులపై, కస్టమ్స్ రేట్లపై కొంత ఉపశమనం కల్పించారు. దీర్ఘకాలిక పొదుపులను ప్రోత్సహించడానికి చర్యలు చేపట్టారు.
- ■ విదేశీ పర్యటనల ప్యాకేజీలపై ప్రస్తుతమున్న 5%, 20% పన్నులను 2శాతానికి తగ్గించారు.
- ■ విద్య, వైద్యం కోసం పంపే డబ్బుపై ప్రస్తుతమున్న 5శాతం పన్నును 2శాతానికి తగ్గించారు.
- ■ మోటారు వాహనాల ట్రైబ్యునల్ తీర్పుల్లో అందే పరిహారంపై ఆదాయ పన్నును పూర్తిగా మినహాయించారు. ఈ పరిహారంపై పన్నును ఇక నుంచీ వసూలు చేయబోరు.
- ■ డివిడెండ్లు, వడ్డీలపై ముందుగానే పన్ను వసూలు చేసే విధానంలో సింగిల్ విండో వ్యవస్థను అందుబాటులోకి తేనున్నారు.
- ■ 17 క్యాన్సర్ మందులకు సుంకాలను మినహాయించారు. ఔషధాలను దిగుమతి చేసుకుంటే పన్ను వసూలు చేయబోరు. మరో 7 అరుదైన వ్యాధులకూ ఇది వర్తిస్తుంది.
- ■ రైతులకు స్మార్ట్ వ్యవసాయ సేవల కోసం భారత్ విస్తార్‌ను కేంద్రం ప్రకటించింది.
- ■ గ్రామీణ మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి షీ మార్ట్‌లను ఏర్పాటు చేయనున్నారు.
- ■ పారిశ్రామిక, రవాణ కారిడార్ల సమీపంలో యూనివర్సిటీల టౌన్‌షిప్‌లను ఏర్పాటు చేసి అనుసంధానం చేయనున్నారు. ప్రతి జిల్లాలో ఒక బాలికల హాస్టల్‌ను నిర్మిస్తారు.
- ■ రూ.10,000 కోట్లతో చిన్న, మధ్యతరహా పరిశ్రమల గ్రోత్ ఫండ్‌ను ఏర్పాటు చేయనున్నారు.
- ■ వచ్చే ఐదేళ్లలో లక్ష మంది వైద్య సంబంధ ప్రొఫెషనల్స్‌ను తయారు చేయడంతోపాటు 1.5 లక్షల మంది కేర్ గివర్స్‌కు శిక్షణ ఇవ్వనున్నారు.

- నేషనల్ డెస్క్

అన్ని ఐటీ ఉప విభాగాలకు ఒకటే సేఫ్ హార్బర్ మార్జిన్



ఐటీకి చెందిన సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సేవలు, ఐటీ ఎనేబుల్డ్ సేవలు, నాలెడ్జ్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ సేవలు తదితర అన్ని ఉప విభాగాలనూ ఒకే విభాగం కిందకు తీసుకురానున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. వీటన్నిటికీ ఏకరీతిన 15.5% సేఫ్ హార్బర్ మార్జిన్ విధించనున్నారు. అంటే ఆ స్థాయి నిర్వహణ మార్జిన్ ఉన్న కంపెనీలకు నిబంధనల భారం తక్కువగా ఉంటుంది.

- ■ ఐటీ సేవల సేఫ్ హార్బర్ పరిమితిని రూ.300 కోట్ల నుంచి రూ.2,000 కోట్లకు పెంచారు.
- ■ పన్ను అధికారుల పరిశీలన అవసరం లేకుండానే దరఖాస్తులు సైతం ఆటోమేటెడ్‌గా జరుగుతాయి. ఒక్కసారి ఐటీ సేవల కంపెనీగా దరఖాస్తు చేసుకుంటే అయిదేళ్ల పాటు అదే సేఫ్ హార్బర్ కొనసాగుతుంది.

లక్ష్యం: ఈ చర్యతో ఐరోపా, అమెరికా దేశాలకు చెందిన ఐటీ దిగ్గజాలకు భారత్ ఆకర్షణీయ గమ్యస్థానంగా కనిపిస్తుందని భావిస్తున్నారు.

రూ.10 వేల కోట్లతో 'పట్టణీకరణ'

ఈనాడు, దిల్లీ: దేశంలో పట్టణీకరణను ప్రోత్సహించడానికి 16వ ఆర్థికసంఘం రూ.10 వేల కోట్లతో 'అర్బనైజేషన్ ప్రీమియం' అనే కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. అయిదేళ్లలో ఈ మొత్తాన్ని ఖర్చుచేయాలని పేర్కొంది. దీని ప్రకారం లక్ష జనాభా ఉన్న పట్టణాల్లోకి సమీప శివారు ప్రాంతాలను విలీనం చేసి అక్కడున్న జనాభాను 2011 లెక్కల ప్రకారం పరిగణనలోకి తీసుకుంటారు. ఈ పట్టణాలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద తలసరిగా రూ.2 వేలు కేటాయించాలని ఆర్థికసంఘం సిఫార్సు చేసింది. శివారు ప్రాంతాలను విలీనం చేయడం వల్ల అక్కడి ప్రజలకు మౌలిక వసతులు కల్పించే భారం ఆయా మున్సిపాల్టీలపై పడుతుంది. ఈ ఒత్తిడి నుంచి బయటపడటానికి పై నిధులను ఉపయోగించాలని సూచించింది.

అకౌంటింగ్ సంస్థలకు చేయూత

దేశీయంగా పెద్ద అకౌంటింగ్, సలహా సంస్థలను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఆదాయ గణన, వెల్లడి ప్రమాణాల (ఐసీడీఎస్) అవసరాలను భారతీయ అకౌంటింగ్ ప్రమాణాలలో విలీనం చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డుల నుంచి ఒక ఉమ్మడి కమిటీని ఇందుకోసం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. 2027-28 నుంచి ఐసీడీఎస్ ఆధారిత ప్రత్యేక అకౌంటింగ్ అవసరాన్ని రద్దు చేయనున్నట్లు ప్రకటించారు. సేఫ్ హార్బర్ నిబంధనల ప్రయోజనాల కోసం అకౌంటెంట్ నిర్వచనాన్ని హేతుబద్ధీకరిస్తున్నాను అని ఆమె పేర్కొన్నారు. నిర్దిష్ట షరతులకు లోబడి జరిగే లావాదేవీల్లో బాధ్యతల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ సేఫ్ హార్బర్ నిబంధనలు ఉపయోగపడతాయి.





బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందుగా పార్లమెంటు ఆవరణలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌధరి, ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, ఇతర ఉన్నతాధికారులు

ప్రభుత్వ ఉద్యోగుల శిక్షణకు రూ.299 కోట్లు

• పాలనా సంస్కరణలకు రూ.65 కోట్లు

దిల్లీ: రాబోయే ఆర్థిక సంవత్సరంలో దేశంలో, విదేశాల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి, మౌలిక సదుపాయాలపై అవగాహన పెంపునకు కేంద్ర బడ్జెట్లో రూ.299 కోట్లు కేటాయించారు. దీనికితోడు పాలనాపరమైన సంస్కరణలకు మరో రూ.65 కోట్లు వెచ్చించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఆధునికీకరణ, ఈ-గవర్నెన్సును ప్రోత్సహించడం, సుపరిపాలన పెంపొందించడం, ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సమగ్ర వ్యవస్థ వంటివి ఇందులో ఉన్నాయి. శిక్షణ కోసం కేటాయించిన రూ.299 కోట్లలో కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జాతీయ పౌరసేవల సామర్థ్య నిర్మాణ కార్యక్రమం 'మిషన్ కర్మయోగి'కి రూ.126 కోట్లు వెచ్చించనున్నారు. బ్యూరోక్రాట్లను మరింత సృజనాత్మకం, క్రియాశీలం, వృత్తిపరంగా - సాంకేతికంగా తీర్చిదిద్దటం దీని ఉద్దేశం. సమాచారహక్కు చట్టం (ఆర్టీఐ) ప్రచారం కోసం రూ.3.5 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు వ్యవహారాలను పరిష్కరించే సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (సీఏటీ) కింద సంస్థాగత వ్యయాల నిమిత్తం రూ.166.42 కోట్లు వెచ్చిస్తారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (ఐఐపీఏ), నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌సీజీజీ)లకు రూ.52.07 కోట్లు కేటాయించారు.

■ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు వివిధ నియామక పరీక్షలను నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌కు తాజా బడ్జెట్‌లో రూ.525.2 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్లో దీనికి రూ.515.15 కోట్లు కేటాయించి, రూ.548.5 కోట్లుగా సవరించారు.

'దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్'

కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంటులో తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈ క్రమంలోనే వివిధ కవుల సూక్తులను సందర్భానుసారంగా ఆమె ప్రస్తావించారు. 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అంటూ తెలుగుకవి గురజాడ అప్పారావు సూక్తిని తన తొలి వాక్యాల్లో పేర్కొన్నారు. పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం.. 100శాతం నాణ్యమైన పాఠశాల విద్య.. మెరుగైన, అందరికీ అందుబాటులో ఉండే సమగ్ర ఆరోగ్య సంరక్షణ.. వందశాతం నైపుణ్యాలు కలిగిన లేబర్‌లకు అర్థవంతమైన ఉద్యోగావకాశాలు.. ఆర్థిక కార్యకలాపాల్లో 70 శాతం మహిళల భాగస్వామ్యం.. ప్రపంచ ఆహార కేంద్రంగా దేశాన్ని రైతులు రూపొందించడం మొదలైనవి వికసిత్ భారత్‌లో భాగమని ఈ సూక్తిని ఉటంకిస్తూ.. చెప్పుకొచ్చారు.

లోకంలోని ప్రాణులన్నీ.. ఆకాశం వైపు ఆశగా...

తమిళ ప్రాచీన కవి తిరువళ్లువార్ రచించిన తిరుక్కురల్ గ్రంథంలోని ద్విపద పద్యం 'వానోక్కి వాళుం ఉలగెల్లాం మన్నవన్ కొల్నోక్కి వాళుంగ్ కుడి'ని ఆమె ఉటంకించారు. 'లోకంలోని ప్రాణులన్నీ వర్షం కోసం ఆకాశం వైపు ఎలా ఎదురుచూస్తాయో, అలాగే దేశంలోని ప్రజలందరూ తమ రాజు(ప్రభువు)న్యాయమైన పాలన కోసం ఎదురుచూస్తారు' అంటూ దీని అర్థాన్ని ఆమె చెప్పారు. ప్రజలు చెప్పేది వినడానికి, వారి నాడి తెలుసుకొని, ప్రతిస్పందించడానికి కేంద్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

దేశీయ విపణిలో విక్రయాలకు సెజ్‌లకు అనుమతి

రాయితీ సుంకాలతో దేశీయ విపణిలో వస్తువులను విక్రయించే నిమిత్తం, ఒకసారికి గాను ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్)లోని తయారీ యూనిట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో.. ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడుతున్నందున, దేశీయ విపణిలో వాటిని విక్రయించేందుకు అవకాశం కల్పించాలని సెజ్‌లలోని యూనిట్లు అభ్యర్థిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా, తక్కువ టారిఫ్‌లపై విక్రయించేందుకు ఒకసారి అనుమతిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకు ఆ తరహా ఉత్పత్తుల దిగుమతి సుంకం చెల్లించాల్సి వచ్చేది. 2024-25లో సెజ్‌లలోని యూనిట్ల నుంచి 176.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.15.90 లక్షల కోట్ల) ఎగుమతులు జరిగాయి.

బూజెట్ నుంచి బడ్జెట్!

'బడ్జెట్' అనేది 'బూజెట్' అనే ఫ్రెంచ్ పదం నుంచి పుట్టుకొచ్చింది. బూజెట్ అంటే.. 'తోలుతో తయారుచేసిన చిన్న బ్రీఫ్‌కేస్' అని అర్థం.

రెండు భాషల్లో..

1955 నుంచి ఏటా కేంద్ర బడ్జెట్‌ను రెండు భాషల్లో (హిందీ, ఆంగ్లం) సిద్ధం చేస్తున్నారు. అంతకుముందు కేవలం ఆంగ్లంలోనే ప్రవేశపెట్టేవారు.

తొలి పద్దు.. ఏడున్నర నెలలకే

స్వతంత్ర భారత మొట్టమొదటి బడ్జెట్‌ను దేశ తొలి ఆర్థిక మంత్రి షణ్ముఖం చెట్టి ప్రవేశపెట్టారు. కేవలం ఏడున్నర నెలల (1947 ఆగస్టు 15 నుంచి 1948 మార్చి 31 వరకు) కాలం కోసం దాన్ని రూపొందించారు.

ఆ ఘనత ఇందిరది

కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తొలి మహిళ- ఇందిరాగాంధీ. 1970లో ప్రధానిగా ఉన్న ఆమె ఆర్థిక మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తూ పార్లమెంటులో పద్దును ప్రవేశపెట్టారు.

బడ్జెట్ లీక్‌తో కలకలం!

తొలినాళ్లలో బడ్జెట్ ప్రతులను రాష్ట్రపతి భవన్‌లో ముద్రించేవారు. అయితే 1950లో పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే బడ్జెట్‌లోని కొన్ని పత్రాలు లీకవడం కలకలం సృష్టించింది. అలాంటి వైఫల్యాలు పునరావృతం కాకుండా ఉండేందుకు ముద్రణను దిల్లీలోని మింటో రోడ్‌లో ఉన్న ప్రభుత్వ ప్రెస్‌కు మార్చారు. భద్రత మరింత కట్టుదిట్టంగా ఉండే సెక్రటేరియట్ భవనంలోని నార్త్ బ్లాక్ బేస్‌మెంట్‌లో 1980 నుంచి పద్దు ప్రతులను ముద్రిస్తున్నారు.

ఆదంపుర్ విమానాశ్రయానికి గురు రవిదాస్ పేరు

● ఇది అసలైన నివాళి: మోదీ


జలంధర్ సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

జలంధర్: పంజాబ్‌లోని జలంధర్‌లో ఉన్న ఆదంపుర్ విమానాశ్రయం పేరును 'శ్రీ గురు రవిదాస్ మహారాజ్ జీ ఎయిర్‌పోర్ట్'గా మార్చారు. ఆయన 15 శతాబ్దికి చెందిన సుప్రసిద్ధ కవి, సంస్కర్త. గురు రవిదాస్ జయంతి రోజు ఈ పేరును ఆవిష్కరించడం గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత డేరా సచ్‌ఖండ్ బాలన్‌ను సందర్శించారు. గురు రవిదాస్ 649వ జయంతి సభలో ఆయన ప్రసంగించారు. 'అసంఖ్యాక భారత ప్రజలకు ఇది సంతోష సమయం. సమానత్వం, దయ, సేవా భావాలను పెంపొందిస్తూ రవిదాస్ ప్రవచించిన సందేశం నేటికీ మనలో స్ఫూర్తి నింపుతోంది' అని మోదీ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సాధించిన ఇన్నాళ్లకు ప్రభుత్వం గురు రవిదాస్ ఆశయ సాధనకు పాటుపడటం సంతోషంగా ఉందన్నారు. లుధియానాలోని హల్వారా విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని వర్చువల్ పద్ధతిలో ఆయన ప్రారంభించారు.

నగరాలు అభివృద్ధి కేంద్రాలవుతాయి

2026-27 సంవత్సర బడ్జెట్ జలంధర్, లుధియానా వంటి అనేక నగరాలను అభివృద్ధి కేంద్రాలుగా మారుస్తుందని ప్రధాని అన్నారు. యూరోపియన్ యూనియన్‌తో ప్రభుత్వం ఇటీవల కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారతీయ ఉత్పాదక రంగానికి ఊతమిస్తుందని, ఎగుమతులకు ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. కొన్నేళ్లుగా తమ ప్రభుత్వం రహదారులు, విద్యుత్తు, జల వనరులు, రైల్వే, నీటి పారుదల రంగాలపై భారీగా వ్యయం చేసిందని చెప్పారు. గ్రామంలో రహదారులు బాగుంటే రైతులు తమ వ్యవసాయోత్పత్తులను మార్కెట్‌కు అవలీలగా తీసుకెళ్లగలరని ఆయన తెలిపారు.

వెనెజువెలా చమురు కొనుగోలుకు భారత్ సిద్ధం!

● ట్రంప్ ప్రకటన

న్యూయార్క్: వెనెజువెలా నుంచి చమురు దిగుమతులకు భారత్ ముందుకొచ్చిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వెనెజువెలాకు చైనా ఇచ్చిన అప్పును తిరిగి చమురు రూపంలో పొందవచ్చా.. అని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ "చమురు విషయంలో ఒప్పందం కుదుర్చుకోవడానికి మేము చైనాను స్వాగతిస్తున్నాం, మేము ఇప్పటికే వెనెజువెలాతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాం. ఇందులో భారత్ కూడా చేరనుంది. భారత్ ఇకపై ఇరాన్ నుంచి కాకుండా వెనెజువెలా నుంచి చమురును దిగుమతి చేసుకుంటుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై ఒక అవగాహనకు వచ్చాం" అని ట్రంప్ తెలిపారు. అయితే, దీనిపై భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.



క్యూబాతో చర్చలు జరుపుతాం..

క్యూబా నాయకులతో చర్చలు జరపనున్నామని, ఆ దేశంపై ఒత్తిడి పెంచుతున్నామని ట్రంప్ అన్నారు. క్యూబాకు చమురు సరఫరాను నిలిపివేయడం ద్వారా చర్చల వైపుగా దాన్ని నెట్టివేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇది మానవీయ సంక్షోభంగా మారాల్సిన అవసరం లేదని, క్యూబా కచ్చితంగా తమ వద్దకు వచ్చి ఒప్పందం కుదుర్చుకుంటుందని ట్రంప్ అన్నారు. అప్పుడు క్యూబా మళ్లీ స్వేచ్ఛ పొందుతుందన్నారు.

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే...

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన 2026-27 బడ్జెట్‌పై పారిశ్రామిక ప్రముఖులు ఇలా స్పందించారు.

ఆర్థిక వ్యవస్థకు ఊతం

వాస్తవిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే బడ్జెట్. రక్షణ రంగానికి కేటాయింపులు పెంచడాన్ని స్వాగతిస్తున్నాం. ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే.. దేశ దీర్ఘకాలిక అభివృద్ధికి మధ్య సమతుల్యత సాధించేలా ప్రతిపాదనలున్నాయి.
- ఉదయ్ కోటక్, వ్యవస్థాపకుడు, కోటక్ మహీంద్రా బ్యాంక్

ఉపాధి కల్పనకు పెద్దపీట

ఇదొక వృద్ధి ఆధారిత బడ్జెట్. ప్రభుత్వ మూలధన వ్యయం పెంపు, తయారీ రంగంపై దృష్టి సారించడం వల్ల యువతకు జీవనోపాధి మెరుగవుతుంది. మహిళలు ఆర్థిక స్వేచ్ఛ సాధించేందుకు, వైద్య పర్యాటకం వంటి ఉపాధి కల్పన రంగాలు పుంజుకునేందుకు దోహదపడుతుంది.
- అనిల్ అగర్వాల్, ఛైర్మన్, వేదాంత గ్రూప్

స్వావలంబన దిశగా

ప్రపంచవ్యాప్తంగా మనదేశ పోటీతత్వాన్ని పెంచేలా, స్వయం సమృద్ధి దిశగా నడిపించే ప్రతిపాదనలున్నాయి. ఇది దేశ ఆర్థిక స్వావలంబనను వేగవంతం చేసే కీలకడుగుతో పాటు, ఆవిష్కరణలను వేగవంతం చేసి ప్రపంచంలో భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తాయి.
- అనిష్ షా, సీఈఓ, ఎండీ, మహీంద్రా గ్రూప్

ఔషధ రంగానికి ప్రాధాన్యం

స్థిరమైన వృద్ధి, ఆకాంక్షలను నెరవేర్చడం, సమ్మిళిత వృద్ధిగా అనే మూడు కర్తవ్యాల ద్వారా నిర్మాణాత్మక సంస్కరణలు బడ్జెట్‌లో కనిపించాయి. ఫార్మా రంగానికి వ్యూహాత్మక ప్రాధాన్యం లభించింది. జీవ ఔషధాలు, బయోసిమిలర్లపై దృష్టి సారించడం సరైన సమయంలో తీసుకున్న నిర్ణయం. ఈ రంగంలో ప్రపంచానికి నాయకత్వం వహించేందుకు మనదేశం సిద్ధంగా ఉంది.
- సతీష్ రెడ్డి, ఛైర్మన్, డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్

వాహన రంగానికి ఆశాజనకం

మౌలిక వసతులు, తయారీ రంగం, ఆర్థిక క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాలిక వృద్ధిపై బడ్జెట్ దృష్టి సారించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయం లక్ష్యాన్ని రూ.12.2 లక్షల కోట్లకు పెంచడం వల్ల డిమాండ్ పెరిగి, వాహన రంగానికి లాభం చేకూరుతుంది.
- శైలేష్ చంద్ర, సియామ్ ప్రెసిడెంట్

ఆరోగ్య ఆవిష్కరణలకు తోడుగా

బయోఫార్మాను ఏడు వ్యూహాత్మక అగ్రగణ్య రంగాలలో ఒకటిగా గుర్తించడం, రూ.10,000 కోట్లతో 'బయోఫార్మా శక్తి'ని ప్రారంభించడం గొప్ప విషయం. ఇది దేశ ఆరోగ్యం, ఆవిష్కరణల భవిష్యత్తుపై చేసిన నిర్మాణాత్మక పెట్టుబడి.
- కిరణ్ మజుందార్ షా, ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్, బయోకాన్

వైద్యం మరింత అందుబాటులోకి

క్యాన్సర్ మందులు, అరుదైన వ్యాధుల ఔషధాలపై సుంకాల మినహాయింపు ప్రశంసనీయం. ఇది చికిత్స ఖర్చులను గణనీయంగా తగ్గిస్తుంది. ఖర్చు గురించి ఆందోళన లేకుండా వైద్యులు సరైన వైద్యం అందించేందుకు వీలు కల్పిస్తుంది. మౌలిక వసతులపై పెట్టుబడులు ఆరోగ్య సేవల పంపిణీని మెరుగుపరుస్తాయి.
- గాయత్రి కామినేని, సీఓఓ, కామినేని హాస్పిటల్స్

గృహోపకరణాలకు జోష్

సెమీకండక్టర్ మిషన్, ఎలక్ట్రానిక్స్ తయారీకి నిధుల పెంపు వల్ల దేశీయ విలువ జోడింపు పెరుగుతుంది. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి వల్ల గృహోపకరణాల డిమాండ్‌ను పెంచుతుంది. పన్ను సంస్కరణలు వినియోగదారుల కొనుగోలు శక్తిని పెంచుతాయి.
- ముకుందన్ మేనన్, ఎండీ, వోల్టాస్



అర్టెమిస్-2 ప్రాక్టీస్ కౌంట్‌డౌన్ ఆరంభం

కేప్ కెనావెరాల్: నలుగురు వ్యోమగాములను చందమామ కక్ష్యలోకి తీసుకెళ్లడానికి ఉద్దేశించిన అర్టెమిస్-2 మిషన్ ప్రయోగానికి అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా రెండు రోజుల ప్రాక్టీస్ కౌంట్‌డౌన్‌ను శనివారం ప్రారంభించింది. అనంతరం కీలకమైన ఇంధనాన్ని నింపే పరీక్షను చేపట్టనుంది. తద్వారా ఈ యాత్ర ఎప్పుడు ప్రారంభమవుతుందన్నది వెల్లడవుతుంది. చందమామ వద్దకు పయనం కావాల్సిన నలుగురు వ్యోమగాములు ఇప్పటికే క్వారంటైన్‌లో ఉన్నారు. రాకెట్‌కు ఇంధనాన్ని నింపే పరీక్ష అనుకున్నరీతిలోనే జరిగితే.. వారం రోజుల్లోనే ప్రయోగాన్ని నాసా చేపట్టే అవకాశం ఉంది. కెనెడీ అంతరిక్ష కేంద్రంలోని లాంచ్ ప్యాడ్ వద్ద శీతల వాతావరణం కారణంగా ఈ పరీక్ష ఇప్పటికే రెండు రోజులపాటు వాయిదా పడింది.

ఇరాన్‌పై దాడి చేస్తే 'ప్రాంతీయ యుద్ధం'

● ఖమేనీ హెచ్చరిక
● ఈయూ దేశాల సైన్యాలన్నీ ఉగ్రసంస్థలే!

దుబాయ్: అమెరికా తమపై దాడికి పాల్పడితే అది పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హెచ్చరించారు. "మేం యుద్ధ ప్రేరేపకులం కాదు. కానీ తమపై దాడికి పాల్పడేవారికి ఇరాన్ గట్టిగా సమాధానం చెబుతుంది" అని ఖమేనీ అన్నారు. యుద్ధనౌకలను ట్రంప్ యంత్రాంగం రంగంలోకి దించాక ఖమేనీ ఇంత సూటిగా అమెరికాను హెచ్చరించడం ఇదే ప్రథమం. అయితే అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై బలప్రయోగం చేస్తారా లేదా అన్నది ఇంకా ఇదమిత్థంగా తేలలేదు. ఇరాన్ తమతో చర్చలకు సిద్ధమవుతోందంటున్న ట్రంప్, టెహ్రాన్ అనుసరిస్తున్న అణ్వాయుధ విధానం వల్ల తలెత్తుతున్న సమస్యను కూడా తానే పరిష్కరిస్తానని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరాన్ సైతం హర్మూజ్ జలసంధిలో ఆది, సోమవారాల్లో వ్యూహాత్మక సైనిక కసరత్తు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ కసరత్తు సమయంలో తమ యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలకు ముప్పు కలిగించే ధోరణిని అనుసరిస్తే ఊరుకునేది లేదని అమెరికా సైనిక కేంద్ర కమాండ్ హెచ్చరించింది. మరోవైపు ఇరాన్‌లో జరిగిన దేశ వ్యాప్త నిరసన ప్రదర్శనలను ఒక కుట్రగా ఖమేనీ అభివర్ణించారు.



✦ యూరోపియన్ యూనియన్ సభ్యదేశాల సైన్యాలన్నిటినీ తాము ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తామని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాఘేర్ ఖాలిబాఫ్ ప్రకటించారు.

✦ అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల నాయకులు అశాంతికి ఆజ్యం పోస్తూ తమ దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నారని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ వ్యాఖ్యానించారు. అయితే, అగ్రరాజ్యంతో తాము యుద్ధం కోరుకోవడం లేదన్నారు.

దర్శకుడు రోహిత్‌శెట్టి ఇంటి వద్ద కాల్పులు.. నలుగురి అరెస్ట్


రోహిత్‌శెట్టి

ముంబయి: బాలీవుడ్ దర్శకుడు రోహిత్‌శెట్టి ఇంటి వద్ద ఆదివారం జరిగిన కాల్పుల ఘటనలో ముంబయి పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ప్రాథమిక సమాచారం మేరకు.. బాబా సిద్దీఖీ హత్యకేసు నిందితుడైన లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడు శుభమ్ లోన్కర్‌తో వీరికి సంబంధమున్నట్లు అనుమానిస్తున్నారు. ముంబయిలోని జుహు ప్రాంతంలో ఉన్న తొమ్మిది అంతస్తుల భవనం మొదటి ఫ్లోరుపై మధ్యాహ్నం 12.45 గంటల ప్రాంతంలో అయిదు రౌండ్ల కాల్పులు జరిపారు. ఓ బుల్లెటు ఆ ఫ్లోరులో ఉన్న జిమ్ అద్దాన్ని తాకింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని, ఆ సమయంలో రోహిత్‌శెట్టి ఇంట్లో ఉన్నారా.. లేదా అన్నది తెలియదని ముంబయి పోలీసు అధికారి తెలిపారు. భవనం చుట్టుపక్కల ఉన్న సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్నామని, ఫోరెన్సిక్ నిపుణులు కూడా రంగంలోకి దిగినట్లు వెల్లడించారు.



గంగా నదిలో 2.1 కోట్ల మంది పుణ్యస్నానాలు

ప్రయాగ్‌రాజ్: మాఘ పూర్ణిమ సందర్భంగా ఆదివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు. తీవ్రమైన చలిగాలులను కూడా లెక్కచేయకుండా అర్ధరాత్రి 12 గంటల నుంచి గంగా నది, త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేశారు. దాదాపు 2.1 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెల 15న శివరాత్రితో మాఘ మేళా ముగియనుంది. దాదాపు 5లక్షల మంది భక్తులు తమ నెల రోజుల దీక్షను వీడనున్నారు.

మాఘ పూర్ణిమ సందర్భంగా పుణ్య స్నానాల కోసం ఆదివారం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ త్రివేణీసంగమానికి పోటెత్తిన భక్తులు


అమృత్ ఉద్యాన్‌ను ఆదివారం సందర్శించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

రేపటి నుంచి తెరుచుకోనున్న 'అమృత్ ఉద్యాన్'

దిల్లీ: రాష్ట్రపతి భవన్‌లోని సుందరమైన 'అమృత్ ఉద్యాన్' ప్రజల సందర్శన కోసం మంగళవారం నుంచి తెరుచుకోనుంది. ఈ నెల 3 నుంచి మార్చి 31 వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందని రాష్ట్రపతి భవన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. అమృత్ ఉద్యాన్‌ను సందర్శించాలనుకునేవారు రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్ https://visit.rashtrapatibhavan.gov.in/ లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. సోమవారాలు ఉద్యానవనాన్ని మూసి ఉంచుతారు. మిగతా రోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకు తెరిచి ఉంటుంది. మార్చి 4న హోలీ కారణంగా ఆరోజు సందర్శకులకు అనుమతి ఉండదు.

బలోచిస్థాన్‌లో కొనసాగుతున్న సైనిక ఆపరేషన్

● 145 మంది తిరుగుబాటుదారుల మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లోని కల్లోలిత బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో భద్రతా బలగాలు ఆదివారం కూడా ఆపరేషన్ కొనసాగించాయి. ఈ దాడుల్లో మరో 92 మంది తిరుగుబాటుదారులు మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు. దీంతో ఇప్పటివరకూ మొత్తంగా 145 మంది తిరుగుబాటుదారులు మరణించినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా తాజా దాడుల్లో 17 మంది సైనికులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. తిరుగుబాటుదారుల కాల్పుల్లో 18 మంది సామాన్య పౌరులు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

యువాన్‌కు అంతర్జాతీయస్థాయి తీసుకురావాలి

● చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్

బీజింగ్: చైనా యువాన్‌ను అత్యంత బలమైన కరెన్సీగా తీర్చిదిద్దాలని, ఇంటర్నేషనల్ రిజర్వ్ స్థాయికి తీసుకువెళ్లాలని ఆ దేశ అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. శనివారం కమ్యూనిస్ట్ పార్టీ అధికారిక పత్రిక కియుషిలో రాసిన వ్యాసంలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. చైనాను ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక శక్తిగా మార్చడానికి బలమైన కరెన్సీ అత్యవసరమని ఆయన తేల్చిచెప్పారు. 'ప్రపంచంలో బ్యాంకింగ్ ఆస్తులు, విదేశీ మారక నిల్వలు, క్యాపిటల్ మార్కెట్ పరిమాణంలో చైనా అగ్రగామిగా ఉంది. మనది పెద్ద దేశమే కానీ ఆర్థికంగా ఇంకా బలమైన దేశంగా మారలేదు. చైనాను నిజమైన ఫైనాన్షియల్ పవర్ హౌస్‌గా మార్చడం అనేది ఒక దీర్ఘకాలిక ప్రక్రియ' అని జిన్‌పింగ్ విశ్లేషించారు. ఆయన నేరుగా ఏ కరెన్సీనీ ప్రస్తావించకపోయినప్పటికీ దశాబ్దాలుగా ఆధిపత్యం చెలాయిస్తున్న అమెరికా డాలర్‌ను బలహీనపరచాలనే ఆయన ఉద్దేశం మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది.

దిల్లీ-షాంఘై మధ్య నేరుగా విమాన సేవలు షురూ

బీజింగ్: దిల్లీ- షాంఘై మధ్య నేరుగా విమాన సేవలను ఎయిరిండియా ఆదివారం ప్రారంభించింది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత ఈ రెండు నగరాల మధ్య విమాన సేవలు ప్రారంభమయ్యాయి. ఇది భారత్- చైనాల నడుమ వాణిజ్య, సంస్థాగత అనుసంధాలను పునరుద్ధరించేందుకు కీలక ముందడుగని షాంఘైలోని భారత దౌత్యవేత్త ప్రతీక్ మాథుర్ పేర్కొన్నారు. ఇరు దేశాల నడుమ మెరుగుపడుతున్న ద్వైపాక్షిక సంబంధాలకు ఇది స్పష్టమైన సంకేతమన్నారు.

సెల్ఫోస్ విష ప్రభావానికి విరుగుడు

● పీజీఐఎంఈఆర్ పరిశోధనలో సత్ఫలితాలు

చండీగఢ్: నిల్వ ఉంచిన ధాన్యం, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను క్రిమికీటకాలు, ఎలుకల బారి నుంచి రక్షించేందుకు ఉపయోగించే సెల్ఫోస్ అనే క్రిమిసంహారకం వల్ల కలిగే విష ప్రభావానికి విరుగుడు దొరికింది. లిపిడ్ ఎమల్షన్‌ను రక్తనాళాల్లోకి ఎక్కించడం ద్వారా ప్రాణాంతకమైన అల్యూమినియం ఫాస్ఫైడ్ విష ప్రభావాన్ని ఉపశమింపజేసే ప్రక్రియను ఇక్కడి పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (పీజీఐఎంఈఆర్)కు చెందిన ఇంటర్నల్ మెడిసిన్ విభాగం కనుగొంది. యూరోపియన్ రివ్యూ ఆఫ్ మెడికల్ అండ్ ఫార్మకాలాజికల్ సైన్సెస్ అనే జర్నల్ ఈ పరిశోధన ఫలితంపై వ్యాసాన్ని ప్రచురించింది. ఈ పరిశోధనకు పీజీఐఎంఈఆర్ సంస్థ డీన్ డాక్టర్ సంజయ్ జైన్ మార్గదర్శకత్వం వహించారు. "విష ప్రభావాన్ని తొలగించేందుకు ఉపయోగించే సాధారణ ఔషధాలకు తోడు లిపిడ్ ఎమల్షన్‌ను రక్తనాళాల్లోకి ఎక్కించినప్పుడు రోగి మరణించే అవకాశాలు తగ్గిపోయాయి. విష ప్రభావం వల్ల కలిగే జీవక్రియ సంబంధ అసిడోసిస్ అనే పరిస్థితి కూడా త్వరగా చక్కబడింది. విష ప్రభావం వల్ల హృద్రోగ సమస్యలకు, షాక్‌కు గురైన వారిలో కూడా ఈ చికిత్సా విధానం మేలైన ప్రయోజనాలను చూపింది" అని పీజీఐఎంఈఆర్ ఒక అధికార ప్రకటనలో పేర్కొంది. రోగి విషప్రభావానికి గురైన తర్వాత వీలైనంత త్వరగా ఈ చికిత్సా పద్ధతిని అవలంబిస్తే మెరుగైన ఫలితాలు కనిపిస్తాయని వివరించింది.

ఇరాన్‌లోని మరో నగరంలో పేలుడు

● ఓ చిన్నారి మృతి, 14మందికి గాయాలు

దుబాయి: ఇరాన్‌లోని అహ్వాజ్ నగరంలో గ్యాస్ లీకేజీ కారణంగా పేలుడు సంభవించింది. శనివారం జరిగిన ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందినట్లు అధికారులు తెలిపారు. అంతకు ముందు బందర్ అబ్బాస్ నగరంలో ఉన్న ఓ భవనంలోనూ భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోగా, మరో 14మంది గాయపడినట్లు అధికారులు పేర్కొన్నారు.


అతిశీతల ఉష్ణోగ్రతల కారణంగా కెనడాలోని అంటారియోలో గడ్డకట్టి కనువిందు చేస్తున్న నయగరా జలపాతం

ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారం.. బ్రిటన్ మాజీ యువరాజుపై పెరుగుతున్న ఒత్తిడి

లండన్: జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం కేసులో బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ మరోసారి వార్తల్లో నిలిచారు. 2010లో లండన్‌లోని రాజ భవనం విండ్సర్ క్యాజిల్‌లో ఆండ్రూను కలిశానంటూ మరో మహిళ ఆయనపై లైంగిక ఆరోపణలు చేశారు. దీంతో ఈ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారుల ముందు ఆండ్రూ వాంగ్మూలాన్ని నమోదు చేయాలంటూ ఆయనపై ఒత్తిడి పెరుగుతోంది. ఎప్‌స్టీన్ కుంభకోణంలో తొలుత వచ్చిన ఆరోపణలన్నింటినీ కొట్టివేస్తూ వచ్చిన ఆండ్రూ తాజా ఆరోపణపై మాత్రం స్పందించలేదు. అటు అమెరికా కాంగ్రెస్‌లోని విపక్షాలు సైతం తమ ప్రశ్నలకు ఆండ్రూ సమాధానమివ్వాలని డిమాండు చేస్తున్నారు. జపాన్‌లో పర్యటన ముగించుకొని ఆదివారం స్వదేశం చేరిన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌ను ఆండ్రూ వ్యవహారంపై విలేకరులు ప్రశ్నించారు. "ఎప్‌స్టీన్ వ్యవహారంలో నేను ఎప్పుడూ బాధిత మహిళల దృష్టికోణంలోనే ఆలోచించాను. బాధితులకు న్యాయం జరగడానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి" అని స్టార్మర్ అన్నారు. ఈ వ్యవహారంలో బహిరంగ క్షమాపణ చెప్పాలా వద్దా అని నిర్ణయించాల్సింది మాజీ రాకుమారుడేనని తెలిపారు. సెక్స్ కుంభకోణంలో ఆరోపణలు రావడంతో ఆండ్రూను 'యువరాజు' హోదా నుంచి తొలగిస్తున్నట్లు ఆయన సోదరుడు, బ్రిటన్ రాజు చార్లెస్-3 గతేడాది నవంబరులో ప్రకటించిన విషయం తెలిసిందే.

ఎప్‌స్టీన్ దస్త్రాల్లో ప్రస్తావనపై మోదీ వివరణ ఇవ్వాలి: కాంగ్రెస్

దిల్లీ: అమెరికాలో ప్రకంపనలు సృష్టిస్తోన్న ఎప్‌స్టీన్ దస్త్రాల్లో ప్రధాన మంత్రి మోదీ పేరు బహిర్గతమవడం పట్ల కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. దీనిపై స్వయంగా ప్రధానే వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఎప్‌స్టీన్ వంటి నేరస్థులకు ప్రధాని వద్దకు ఎలా యాక్సెస్ లభించిందో మోదీ స్పష్టం చేయాలని కోరింది. భారత ప్రజలకు ఆయన నుంచి సమాధానం తెలుసుకునే హక్కు ఉందని కాంగ్రెస్ నేతలు కె.సి.వేణుగోపాల్, జైరాం రమేశ్, పవన్ ఖేడాలు 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 'ఎప్‌స్టీన్‌ను మోదీ కలిశారా? లేదంటే మరెవరినైనా అతడి వద్దకు పంపించారా? ఎప్‌స్టీన్‌తో ఎలాంటి సంభాషణలు జరిపారు?' మొదలైన వాటిపై స్పష్టతనివ్వాలి అని వారు డిమాండ్ చేశారు.

డ్రోన్‌తో రష్యా దాడి.. 15 మంది ఉక్రెయిన్ కార్మికుల మృతి

కీవ్: ఉక్రెయిన్ నగరమైన దినిప్రోపై రష్యా చేసిన డ్రోన్ దాడిలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. గనుల్లో పనులుచేసే కార్మికులతో వెళ్తున్న బస్సుపై జరిగిన దాడిలో మరో ఏడుగురు గాయాలపాలయ్యారని, చెలరేగిన మంటల్ని అదుపు చేశామని అత్యవసర సేవల అధికారులు ఆదివారం వెల్లడించారు. ఈ ఘటనను పెద్దస్థాయి ఉగ్రదాడిగా బస్సు యాజమాన్య సంస్థ డీటీఈకే అభివర్ణించింది. గడ్డకట్టించే చలిలో ఉక్రెయిన్ తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ఉక్రెయిన్ రాజధాని సహా అన్ని నగరాలపై దాడుల్ని తాత్కాలికంగా నిలుపు చేయడానికి రష్యా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన రోజుల వ్యవధిలోనే ఈ దాడి జరగడం గమనార్హం. జపోరిజియాలో ఒక ప్రసూతి ఆసుపత్రిపై రష్యా డ్రోన్లు చేసిన దాడిలో ఆరుగురు గాయపడ్డారు. ఉక్రెయిన్ దళాలు వాడుతున్న రవాణా సదుపాయాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. ఉక్రెయిన్ పంపిన 21 డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని ప్రకటించింది.

4 నుంచి త్రైపాక్షిక చర్చలు

రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య తదుపరి దశ శాంతి చర్చలు వచ్చే బుధ, గురువారాల్లో జరగనున్నాయి. ఈమేరకు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రకటన చేశారు. అబూధాబిలో జరిగే ఈ త్రైపాక్షిక చర్చల్లో రష్యా, ఉక్రెయిన్, అమెరికాల ప్రతినిధులు పాల్గొంటారు. "మా సంప్రదింపుల బృందం నుంచి ఇప్పుడే సమాచారం అందింది. తదుపరి త్రైపాక్షిక చర్చలు ఈనెల 4, 5 తేదీల్లో అబూధాబిలో జరుగుతాయి. ఉక్రెయిన్ సమగ్ర చర్చలకు సిద్ధంగా ఉంది. ఈ చర్చలు యుద్ధాన్ని అంతం చేయాలన్న లక్ష్యానికి చేరువ చేయాలని కోరుకుంటున్నాం" అని జెలెన్‌స్కీ తన సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టారు. దీనిపై రష్యా, అమెరికాల నుంచి తక్షణ స్పందన లేదు. ఉక్రెయిన్‌లో ఆక్రమించుకున్న భూభాగం నుంచి రష్యా నిష్క్రమించాలా వద్దా అన్న అంశంపైనే చర్చలు ప్రధానంగా కేంద్రీకృతం కానున్నాయి. ఇదిలా ఉండగా...ఆదివారం ఉదయం ఉక్రెయిన్‌లోని జపోరిజియా నగరంలోని ఓ మెటర్నిటీ ఆసుపత్రి లక్ష్యంగా రష్యా జరిపిన డ్రోన్ దాడుల్లో ముగ్గురు మహిళలు గాయపడ్డారు.

ఈనాడు సినిమా

కొత్త ఏడాది చిత్రసీమకు అదిరే ఆరంభం దక్కింది. ఎప్పుడూ లేని విధంగా ఈ సంక్రాంతికి ఏకంగా ఐదు చిత్రాలు ప్రేక్షకుల్ని పలకరించడం.. వాటిలో ఒకటీ అరామినహా మిగిలినవన్నీ హిట్టు మాట వినిపించడం తెలుగు చిత్ర పరిశ్రమకు నూతనోత్తేజాన్ని అందించింది. ఇప్పుడీ జోరు వేసవి సినిమాలతోనూ ఇలాగే కొనసాగాలన్నది అందరి ఆకాంక్ష. కానీ, వేసవి విడుదలల విషయంలో నిర్మాతల నుంచి ఇప్పటికీ సరైన స్పష్టత కనిపించకపోతుండటం సినీప్రియుల్ని గందరగోళానికి గురిచేస్తోంది. అసలు ఈ వేసవి బరిలో నిలిచే చిత్రాలేవన్నది ఆసక్తిరేకెత్తిస్తోంది.

వేసవి విడుదలలు తేలేదెప్పుడో!


చిరంజీవి


వెంకటేశ్


పవన్ కల్యాణ్

నిజానికి ఓ నెల క్రితం వరకు వేసవి సీజన్ విషయంలో పక్కా ప్రణాళికతోనే కనిపించింది తెలుగు చిత్రసీమ. అగ్రతారలు చిరంజీవి 'విశ్వంభర'తో.. వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47'తో, పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్'తో వేసవి బరిలో నిలవడం పక్కా అని భరోసా ఇవ్వడం.. రామ్‌చరణ్ 'పెద్ది', నాని 'ది ప్యారడైజ్', అడివి శేష్ 'డెకాయిట్', నిఖిల్ 'స్వయంభూ' లాంటి కీలక చిత్రాలన్నీ విడుదల తేదీలపై స్పష్టత ఇచ్చేయడం.. ఈ సమ్మర్ సినీ సందడి మామూలుగా ఉండదనిపించింది. కానీ, ఇప్పుడు వీటిలో చాలా చిత్రాలు వాయిదా పడనున్నట్లు ప్రచారం ఊపందుకోవడం మరోసారి టాలీవుడ్‌లో విడుదల తేదీల గందరగోళం మొదలైపోయింది. వీఎఫ్ఎక్స్ పనుల వల్ల ఆలస్యమవుతూ వచ్చిన 'విశ్వంభర' ఈ వేసవి బరి నుంచి పూర్తిగా తప్పుకుంది. దీన్ని జులైలో తెరపైకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చిరు ఇటీవలే స్పష్టత ఇచ్చేశారు. వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం..' చిత్రీకరణ ప్రారంభ దశలోనే ఉండటంతో ఈ సమ్మర్‌కి రావడం సాధ్యమేనా అనే సందేహాలు కనిపిస్తున్నాయి. ప్రణాళిక ప్రకారం 'పెద్ది', 'ది ప్యారడైజ్' చిత్రాలు మార్చి నెలాఖరున ఒక్క రోజు వ్యవధిలో వరుసగా తెరపైకి రావాల్సి ఉంది. కానీ, ఈ రెండు సినిమాలు ఇంకా చిత్రీకరణ పూర్తి చేసుకోకపోవడం.. నిర్మాణానంతర పనులకి ఇంకా సమయం పట్టే అవకాశముండటం.. ఇవి మార్చికి రావడం కష్టమనే సంకేతాలు అందుతున్నాయి. ఒకవేళ ఇదే జరిగితే ఇవి మళ్లీ వేసవి బరిలోనే నిలుస్తాయా? లేక ద్వితీయార్ధానికి వెళ్లిపోతాయా? అన్నది ఆసక్తికరంగా మారుతుంది. పవన్ 'ఉస్తాద్ భగత్ సింగ్' మార్చి 27న రావొచ్చనే ప్రచారం వినిపిస్తున్నప్పటికీ.. ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ ఉస్తాద్ కూడా రాకుంటే మార్చి వెలవెలబోయినట్లే.

యువహీరోల దారెటు!

ఫిబ్రవరిలో రావాల్సిన నిఖిల్ పాన్ ఇండియా సినిమా 'స్వయం భూ' వాయిదా పడింది. ఇది ఏప్రిల్ 10న తెరపైకి రావొచ్చని తెలిసింది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. అడివి శేష్ ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం ఈ వేసవిలో 'డెకాయిట్', 'జీ2' సినిమాలతో ప్రేక్షకుల్ని పలకరించాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం మార్చిలో రావాల్సిన 'డెకాయిట్' ఏప్రిల్‌కు వెళ్లనుందని సమాచారం. అదే జరిగితే మే 1న రావాల్సిన 'జీ2' కూడా వెనక్కి వెళ్లిపోయే అవకాశముంది. త్వరలోనే ఈ రెండు విడుదల తేదీలపైనా స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. కథానాయకుడు నాగచైతన్య పాన్ ఇండియా సినిమా 'వృషకర్మ' ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. కానీ, విడుదలపై స్పష్టత లేదు. సాయిదుర్గా తేజ్ 'సంబరాల ఏటి గట్టు' సినిమా ప్రస్తుతం క్లైమాక్స్ చిత్రీకరణలో ఉంది. ఇది ఈ వేసవిలోనే వస్తుందా? లేదా? అన్నది ఇంకా తేలలేదు. వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'గా ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ప్రకటించారు. కానీ, విడుదల తేదీని ఇంకా వెల్లడించలేదు. త్వరలోనే దీనిపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది. అఖిల్ 'లెనిన్' చిత్రంతో మే 1న ప్రేక్షకుల్ని పలకరించనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇదిప్పుడు ఆ తేదీ లక్ష్యంగానే చకచకా ముస్తాబవుతున్నట్లు తెలిసింది. గతేడాదిలా తెలుగు చిత్రసీమ ఈ వేసవిని కూడా వృథా చేసుకోకూడదంటే ఇప్పటికైనా ప్రణాళికతో వ్యవహరించాలి. ప్రస్తుతం వేసవి లక్ష్యంగా తమ చిత్రాల్ని ముస్తాబు చేస్తున్న నిర్మాతలంతా వీలైనంత త్వరగా విడుదల తేదీలపై స్పష్టత ఇవ్వాలి. దానివల్ల ఇప్పటికే సిద్ధమైన మిగిలిన చిన్న, మీడియం బడ్జెట్ చిత్రాలకీ ఎప్పుడు రావొచ్చనే విషయంలో ఓ స్పష్టత దొరుకుతుంది.


నాని


అడివి శేష్


నిఖిల్


అఖిల్


వరుణ్ తేజ్


మహిళలే మా గొప్ప బలం


రామ్‌చరణ్, ఉపాసన

రామ్‌చరణ్ - ఉపాసన దంపతులకు కవలలు జన్మించడంతో కొణిదెల, కామినేని కుటుంబాల్లో సందడి నెలకొంది. ఈ తీపి కబురుని చరణ్ సామాజిక మాధ్యమాల వేదికగా అభిమానులతో పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డెలివరీకి ముందు తన సతీమణితో కలిసి దిగిన ఫొటోని నెట్టింట షేర్ చేశారు. "మాకు బాబు, పాప జన్మించారని తెలియజేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుణ్ని కలిగి ఉండటం ఎంతో కృతజ్ఞతగా భావిస్తున్నాం. మా జీవితాల్లో మహిళలే మా గొప్ప బలం. ప్రతి క్షణం మా వెంట నిలిచిన అభిమానులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు" అని చరణ్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ దంపతులకు ఇప్పటికే కుమార్తె క్లీంకార ఉన్న సంగతి తెలిసిందే. వీళ్లకు శనివారం రాత్రి (జనవరి 31న) కవలలు జన్మించగా.. ఆ విషయాన్ని చిరంజీవి సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకున్నారు. దీంతో పలువురు సినీతారలు సోషల్ మీడియా ద్వారా చరణ్ - ఉపాసన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రాణస్నేహితులుగా?


రజనీకాంత్


షారుక్ ఖాన్

"టైగర్ కా హుకుం" అంటూ అభిమానుల్ని అలరించే అగ్రహీరో.. . తన యాక్షన్‌తో థియేటర్లలో విజిల్స్ వేయించుకునే మరో కథానాయకుడు... వీరిద్దరూ కలిస్తే అభిమానులకు పండగే కదా! అలాంటి వేడుకను ప్రేక్షకులకు పరిచయం చేయడానికి సన్నద్ధమవుతున్నారు రజనీకాంత్, షారుక్ ఖాన్. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజనీ హీరోగా 'జైలర్ 2' తెరకెక్కుతుంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో షారుక్ అతిథి పాత్రలో మెరవనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా ఆయన పాత్ర గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో సందడి చేస్తోంది. ఈ చిత్రంలో షారుక్.. రజనీకాంత్ ప్రాణ స్నేహితుడిగా, సన్నిహితుడిగా కనిపించనున్నారని, ఆయన పాత్ర సినిమాకే కీలకంగా నిలవనుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

జాబిలి ప్రేమ మొదలైంది


శ్రీదేవి

విద్యార్థి జీవితం, ప్రేమ, కలలు.. లాంటి అంశాలతో యువతను ఆకట్టుకోవడానికి మరో సినిమా ముస్తాబవుతోంది. అదే 'హైకూ'. 'కోర్ట్' చిత్రంలో జాబిలిగా కనిపించి యువతను అలరించిన కథానాయిక శ్రీదేవి, ఏగన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా పోస్టర్లకు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణను ప్రారంభమైనట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఫొటోలను పంచుకుంది చిత్ర బృందం. "ఈరోజు 'హైకూ' ప్రేమ ప్రారంభమైంది. అద్భుతమైన తారాగాణం, కథతో మీ ముందుకు రాబోతున్నామ"నే వ్యాఖ్యను జోడించింది. రొమాంటిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో ఫెమినా జార్జ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. విజయ్ బుల్గానిన్ సంగీతమందిస్తున్నారు.

సీనియర్ నటుడు రఘునాథ రెడ్డి ఇకలేరు!



తెలుగు చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. తనదైన విలక్షణ నటనతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు కె.రఘునాథ రెడ్డి (82) శనివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదరాబాద్‌లోని తన ఇంట్లో కన్నుమూశారు. ఆయన భార్య అన్నపూర్ణ. వీరికి సుధాలక్ష్మి, అరుణ, సుధాకర్ రెడ్డి ముగ్గురు సంతానం. గతేడాది డిసెంబరులో కొడుకు సుధాకర్ గుండెపోటుతో మరణించగా.. అప్పటి నుంచి రఘునాథ రెడ్డి మానసికంగా బాగా కుంగిపోయారు. ఈక్రమంలోనే ఆయన శనివారం బ్రెయిన్ స్ట్రోక్‌తో తుదిశ్వాస విడిచారు. ఆదివారం అంత్యక్రియలు పూర్తయ్యాయి.

రంగస్థలం నుంచి వెండితెరపైకి..

సహాయ నటుడిగా తెలుగు, తమిళంతో పాటు హిందీ భాషలోనూ నటించిన రఘునాథ రెడ్డి.. మూడున్నర దశాబ్దాల సినీ ప్రయాణంలో దాదాపు 370కి పైగా సినిమాలు, పలు బుల్లితెర ధారావాహికల్లో సందడి చేశారు. కృష్ణా జిల్లా కుందేరులో జన్మించిన ఆయన.. సౌత్ సెంట్రల్ రైల్వేలోని లాలాగూడ వర్క్‌షాప్‌లో కొన్నాళ్లు పని చేశారు. ఆ సమయంలోనే శ్రీహరి మూర్తి, టి.శివరామ కృష్ణ ప్రోత్సాహంతో నాటక రంగం వైపు అడుగులు వేశారు. 'ఆకాశ రామన్న', 'పునరపి జననం', 'సంధ్యా ఛాయా', 'సాలభంజికలు', 'రాణి రుద్రమ', 'శ్రీకృష్ణ తులాభారం' లాంటి నాటకాల్లో విభిన్నమైన పాత్రలతో మెప్పించారు. ఎంవీ రఘు దర్శకత్వంలో వచ్చిన 'కళ్లు' సినిమాతో నటుడిగా వెండితెరకు పరిచయమయ్యారు. 1991లో వచ్చిన 'సర్పయాగం'తో చిత్రసీమ దృష్టిని ఆకర్షించారు. ఇక అక్కడి నుంచి తెరపై తండ్రిగా, పోలీసు అధికారిగా, న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా, వైద్యుడిగా.. ప్రతి పాత్రకు న్యాయం చేశారు. ఈక్రమంలోనే 'మదరిండియా', 'ఒరేయ్ రిక్షా', 'యమ్.ధర్మరాజు ఎం.ఎ', 'యమజాతకుడు', 'పెళ్లి పందిరి', 'చూడాలని ఉంది', 'రాజకుమారుడు', 'మల్లీశ్వరి', 'బొమ్మరిల్లు'.. ఇలా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో భాగమయ్యారు. గతంలో మూడు సార్లు బ్రెయిన్ స్ట్రోక్‌కి గురవ్వడంతో కొన్నేళ్లుగా సినిమాలకు దూరమయ్యారు. ఆయన 'సుబ్రహ్మణ్యపురం' (2018) సినిమాలో చివరి సారిగా నటించారు. – న్యూస్‌టుడే, చర్లపల్లి

వెంటాడే 'హనీ'


దివ్య పిళ్లై, నవీన్ చంద్ర

"ప్రేక్షకులకు ఓ విభిన్నమైన అనుభూతిని పంచిచ్చే సినిమా 'హనీ'. కచ్చితంగా ఇది మౌత్ టాక్‌తో నిలబడే సినిమా అవుతుంది" అన్నారు హీరో నవీన్ చంద్ర. ఆయన.. దివ్య పిళ్లై జంటగా నటించిన ఈ చిత్రాన్ని కరుణ కుమార్ తెరకెక్కించారు. రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా ఈనెల 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ.. "అందర్నీ వెంటాడే చిత్రమిది. ఆలోచన రేకెత్తించేలా ఉంటుంది. దీంట్లో ఓ చీకటి సమాజాన్ని చూపించాం" అన్నారు.

నవ్వులు పంచే లగ్గం టైమ్


నవ్య, రాజేశ్

"ఆద్యంతం వినోదాత్మకంగా సాగే సినిమా 'లగ్గం టైమ్'" అన్నారు దర్శకుడు ప్రజోత్ కె. వెన్నం. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాజేశ్ మేరు, నవ్య చిట్యాల జంటగా నటించారు. కె.హిమబిందు నిర్మించారు. ఈ సినిమా ఈనెల 6న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రజోత్ మాట్లాడుతూ.. "అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునే మంచి కథతో రూపొందిన చిత్రమిది. తప్పకుండా ప్రతి ఒక్కరూ మెచ్చుకునేలా ఉంటుంది" అన్నారు. "ఎన్నో వ్యయప్రయాసలు పడి ఈ చిత్రాన్ని నిర్మించాం. దీన్ని చూసి ప్రేక్షకులు థియేటర్ నుంచి మనస్ఫూర్తిగా నవ్వుతూ బయటకు వస్తారని నమ్మకంగా చెప్పగలను" అన్నారు నిర్మాత హిమబిందు. ఈ కార్యక్రమంలో రాజేశ్, కృష్ణప్రసాద్, విశ్వనాథ్, పవన్, రెతీషా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అందమైన ప్రేమకథతో..


సాయి దుర్గా తేజ్

కథానాయకుడు సాయిదుర్గా తేజ్ ప్రస్తుతం 'సంబరాల ఏటి గట్టు' సినిమాతో సెట్స్‌పై తీరిక లేకుండా గడుపుతున్నారు. ప్రస్తుతం ఇది ముగింపు దశకు చేరుకుంది. ఈ చిత్రం పూర్తయిన వెంటనే కొద్ది నెలల గ్యాప్‌లోనే మరో కొత్త సినిమాని పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాతో హీరో ప్రభాస్ కజిన్ సిద్ధార్థ్ రాజ్‌కుమార్ దర్శకుడిగా పరిచయం కానున్నట్లు సమాచారం. ఇదొక అందమైన ప్రేమకథతో ముస్తాబు కానుందని.. దీంట్లో సాయితేజ్ లవర్‌బాయ్‌లా క్లాస్ లుక్‌లో కనిపించనున్నారని తెలిసింది. ఈ పాత్ర కోసం ఆయన పూర్తిగా బరువు తగ్గనున్నట్లు తెలుస్తోంది. దీన్ని రెండు ప్రముఖ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.

కరణ్ నిర్మాణంలో హారర్ థ్రిల్లర్?


కరణ్ జోహార్


ఆదిత్య రాయ్

గతేడాది 'మెట్రో ఇన్ దినో' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించాడు బాలీవుడ్ కథానాయకుడు ఆదిత్య రాయ్ కపూర్. ఇప్పుడాయన మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ ఓ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌ను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇందులో హీరోగా ఆదిత్య రాయ్‌ను ఎంపిక చేశారట. "కరణ్ తన బ్యానర్ ధర్మప్రొడక్షన్స్ కోసం ఒక హారర్ థ్రిల్లర్‌ను ప్లాన్ చేస్తున్నాడు. ఆదిత్య రాయ్ ఇప్పటికే.. స్క్రిప్ట్ చదివి ఈ ప్రాజెక్టుకు ఓకే చెప్పేశాడు. మేలో సెట్స్‌పైకి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇందులో ఆదిత్య సరసన ఓ అగ్ర కథానాయిక కనిపించనుంది. ఇప్పటికే ఆమెతో చర్చలు ప్రారంభమయ్యాయి. త్వరలో పూర్తి వివరాల్ని వెల్లడించనున్నార"ని కరణ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన నిర్మాణంలో రూపొందిన 'చాంద్ మేరా దిల్' విడుదలకు సిద్ధంగా ఉంది.

రైల్వేలో కొలువుల జాతర కొనసాగుతోంది. గత రెండేళ్ల నుంచీ పలు ప్రకటనలు వెలువడుతున్నాయి. తాజాగా లెవెల్-I పోస్టులకు దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఈసారి దేశవ్యాప్తంగా 22,195 ఖాళీలు ఉన్నాయి. వీటికి పదో తరగతి/ ఐటీఐ/ అప్రెంటిస్ విద్యార్హతలతో పోటీ పడొచ్చు. ఆన్‌లైన్ పరీక్ష, ఫిజికల్ టెస్టులు, ధ్రువపత్రాల పరిశీలన, మెడికల్ టెస్టులతో నియామకాలుంటాయి.



కొలువుల రైలు పిలుస్తోంది

సీటు కోసం సిద్ధమేనా?

ఈ పోస్టులకు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు(ఆర్‌ఆర్‌బీ)ల వారీ నియామకాలు ఉంటాయి. అభ్యర్థులు ఏదో ఒక ఆర్‌ఆర్‌బీకే దరఖాస్తు చేసుకోవాలి. పరీక్షలు ఉమ్మడిగానే నిర్వహిస్తారు. ఎంపికైనవారికి అసిస్టెంట్, ట్రాక్‌మెన్, పాయింట్స్‌మెన్.. మొదలైన హోదాలు దక్కుతాయి. వీరు మొదటి నెల నుంచే సుమారు రూ.35,000 వేతనం అందుకోవచ్చు. కొత్త పే కమిషన్ అమలైతే రూ.50,000 కంటే ఎక్కువే పొందవచ్చు. సర్వీసు, విద్యార్హతలు, అంతర్గత పరీక్షలతో భవిష్యత్తులో మెరుగైన స్థాయికి చేరుకునే అవకాశం కూడా ఉంటుంది.

పరీక్ష

ఆన్‌లైన్‌లో వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ మార్కులో మూడో వంతు తగ్గిస్తారు. వంద ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 90 నిమిషాలు. జనరల్ సైన్స్ 25, మ్యాథమెటిక్స్ 25, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 30, జనరల్ అవేర్‌నెస్ అండ్ కరెంట్ అఫైర్స్‌లో 20 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్షలో అర్హతకు అన్‌రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్‌లు 40, ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ, ఎస్టీలు 30 శాతం మార్కులు సాధించాలి.

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్టు(పీఈటీ)

ఆన్‌లైన్ పరీక్షలో అర్హుల జాబితా నుంచి మెరిట్ ప్రకారం విభాగాల వారీ ఉన్న ఖాళీలకు మూడు రెట్ల మందికి పీఈటీకి అవకాశమిస్తారు. పురుషులు 2 నిమిషాల్లో 35 కిలోల బరువున్న ఇసుక బస్తాని దించకుండా 100 మీటర్ల దూరానికి మోసుకెళ్లాలి. ఆ తర్వాత కిలోమీటర్ దూరాన్ని 4 నిమిషాల 15 సెకన్లలో చేరుకోవాలి. అదే మహిళలైతే.. 20 కిలోల బరువున్న ఇసుక బస్తాని దించకుండా 2 నిమిషాల్లో 100 మీటర్ల దూరానికి తీసుకెళ్లాలి. కిలోమీటర్ దూరాన్ని 5 నిమిషాల 40 సెకన్లలో చేరుకోవాలి. బరువుల మోత, పరుగు ఈ రెండిటికీ తొలి ప్రయత్నాల్లోనే లక్ష్యాలను చేరుకోగలగాలి. పీఈటీలో విజయవంతమైనవారి జాబితా నుంచి విభాగాల వారీ ఖాళీల ప్రకారం పరీక్షలో ఎక్కువ మార్కులు పొందినవారి ధ్రువపత్రాలు పరిశీలిస్తారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి, ఉద్యోగంలోకి తీసుకుంటారు.

లెవెల్-1 ఉద్యోగాలకు డిసెంబరు, 2024లోనూ ప్రకటన వెలువడింది. 32,438 పోస్టులకు 1.08 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో సికింద్రాబాద్ జోన్‌కు ఎక్కువ పోటీ నెలకొంది. ఒక్కో పోస్టుకూ సగటున 585 మంది పోటీ పడుతున్నారు. అత్యధికంగా ముంబయి జోన్‌కు 15.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఈ పరీక్షలు కొనసాగుతున్నాయి. పరీక్షకు హాజరైతే చాలు. స్వల్ప మొత్తం మినహాయించుకుని, దరఖాస్తు ఫీజు వెనక్కి ఇచ్చేయడం రైల్వే పోస్టుల ప్రత్యేకత.

సన్నద్ధత

- ✦ ప్రకటనలో విభాగాల వారీ ఉన్న సిలబస్ వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలి.
- ✦ సిలబస్‌లోని పలు అంశాలు 8, 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాల్లో ఉన్నవే. అందువల్ల సన్నద్ధత వాటితో ప్రారంభించాలి.
- ✦ విభాగంలోని అంశాల వారీ చదవాలి. ప్రాథమికాంశాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి.
- ✦ ప్రతి అంశంలోనూ వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేయాలి.
- ✦ పాత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. పరీక్ష కోణంలో ఆలోచించి, ఏ అంశాలకు ప్రాధాన్యమివ్వాలో తెలుసుకుని, వాటిని బాగా చదవాలి.
- ✦ సన్నద్ధత పూర్తయిన తర్వాత వీలైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఫలితాలు విశ్లేషించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. తక్కువ మార్కులు వస్తోన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- ✦ తక్కువ సమయంలో ఎక్కువ ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించగలిగినవారే విజేతలు అవుతారు. ఒక్కో ప్రశ్నకూ 54 సెకన్ల సమయమే ఉంటుంది. అందువల్ల సులువైన ప్రశ్నలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. జవాబు గుర్తించడానికి కొంచెం ఎక్కువ సమయం తీసుకునేవాటిని చివరిలోనే ప్రయత్నించాలి. అలాగే రుణాత్మక మార్కుల కారణంగా ఏ మాత్రం తెలియని వాటిని పూర్తిగా వదిలేయాలి.
- ✦ సన్నద్ధత కోసం పరిమిత పుస్తకాలనే ఎంపిక చేసుకుని, వాటినే ఎక్కువ సార్లు చదివి, మాదిరి ప్రశ్నలు సాధన చేస్తే గరిష్ఠ ప్రయోజనం దక్కుతుంది. పుస్తకం ఏదైనప్పటికీ పరీక్షలో పేర్కొన్న అంశాలకే పరిమితం కావాలి.
- ✦ మ్యాథ్స్, సైన్స్ విభాగాల్లో ఎక్కువ మార్కులు పొందడానికి.. ఆర్‌జేసీ, పాలిటెక్నిక్ పాత ప్రశ్నపత్రాలు చదవొచ్చు. అలాగే ఎస్ఎస్‌సీ మల్టీ టాస్కింగ్ స్టాఫ్ ప్రశ్నపత్రాలనూ పరిశీలించవచ్చు.
- ✦ జనరల్ అవేర్‌నెస్ కోసం పత్రికలు చదివి, ముఖ్యాంశాలు నోట్సు రాసుకోవాలి. సిలబస్‌లో పేర్కొన్న అంశాలకు చెందిన తాజా వార్తలకు ప్రాధాన్యమివ్వాలి.

వివరాలు

పోస్టు: లెవెల్-1

ఖాళీలు: 22,195.

విద్యార్హత: పోస్టు ప్రకారం పదో తరగతి/ ఐటీఐ లేదా తత్సమానం/ ఎన్‌సీవీటీ జారీ చేసిన నేషనల్ అప్రెంటిస్‌షిప్ సర్టిఫికెట్(ఎన్‌ఏసీ).

వయసు: జనవరి 1, 2026 నాటికి 18-33 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ(ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, దివ్యాంగులకు కేటగిరీ ప్రకారం పది నుంచి పదిహేనేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 2

దరఖాస్తు ఫీజు: మహిళలు, ఎస్సీ, ఎస్టీ, ట్రాన్స్‌జెండర్, ఈబీసీలకు రూ.250. ఇతర వర్గాల వారికి రూ.500.

పరీక్ష తేదీలు: తర్వాత ప్రకటిస్తారు. **వెబ్‌సైట్:** https://www.rrbapply.gov.in/#/auth/landing

ఎస్ఏఐలో

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ).. రెగ్యులర్ ప్రాతిపదికన 48 పర్ఫార్మెన్స్ అనలిస్ట్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

విభాగాల వారీగా ఖాళీలు:
- ● ఆంత్రోపోమెట్రీ: 01
- ● బయోమెకానిక్స్: 01
- ● న్యూట్రిషియన్: 04 ● ఫిజియోథెరపీ: 24
- ● సైకాలజీ: 04 ● ఫిజియాలజీ: 04
- ● స్ట్రెంత్ అండ్ కండిషనింగ్: 10

అర్హత: బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు స్పోర్ట్స్ సైన్స్ విభాగంలో ఏడాది అనుభవం ఉండాలి.

వేతన శ్రేణి: రూ.35,400 - రూ.1,12,400.

వయసు: 30 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: యూఆర్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.2000. ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగులు/ మహిళలకు రూ.1500.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)తో.

దరఖాస్తుకు చివరి తేదీ: 09.03.2026

వెబ్‌సైట్: https://sportsauthorityofindia.nic.in/sai_new/

ఐఐడబ్ల్యూఎంలో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ మేనేజ్‌మెంట్, భువనేశ్వర్.. తాత్కాలిక ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్, సీనియర్ రిసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● యంగ్ ప్రొఫెషనల్-II: 01 ● సీనియర్ రిసెర్చ్ ఫెలో: 01

అర్హత: ఎంఈ, ఎంటెక్, పీజీ ఉత్తీర్ణత.

వయసు: సీనియర్ రిసెర్చ్ ఫెలో- పురుషులకు 35, మహిళలకు 40 ఏళ్లు. యంగ్ ప్రొఫెషనల్ పోస్టులకు 21-45 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతనం:** నెలకు సీనియర్ రిసెర్చ్ ఫెలోకు మొదటి ఏడాది రూ.37,000, రెండో ఏడాది రూ.42,000; యంగ్ ప్రొఫెషనల్-IIకు రూ.42,000.

ఇంటర్వ్యూ తేదీ: 11.02.2026.

వేదిక: ఐసీఏఆర్- ఐఐడబ్ల్యూఎం, భువనేశ్వర్.

వెబ్‌సైట్: https://icar.org.in/index.php/hi/vacancies

డేటా ఎంట్రీ ఆపరేటర్లు

ఇంటెలిజెంట్ కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ (ఐసీఎస్ఐఎల్), న్యూదిల్లీ ఒప్పంద ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
- ● డేటా ఎంట్రీ ఆపరేటర్: 08 పోస్టులు

అర్హత: డిగ్రీతో పాటు కంప్యూటర్, టైపింగ్ పరిజ్ఞానం ఉండాలి.

వేతనం: నెలకు రూ.24,356.

వయసు: 01.10.2025 నాటికి 42 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు: ఇంటర్వ్యూకు ఒకరోజు ముందు వన్‌టైమ్ రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాలి.

దరఖాస్తు ఫీజు: రూ.590.

ఇంటర్వ్యూ తేదీ: 10.02.2026.

వేదిక: ఆఫీస్ ఆఫ్ ది డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ వైల్డ్‌లైఫ్, జీఎన్‌సీటీడీ, నార్త్ ఫారెస్ట్ డివిజన్, ఆలీపుర్, న్యూదిల్లీ.

వెబ్‌సైట్: https://icsil.in/walkin

ఇన్స్యూరెన్స్, మ్యూచువల్ ఫండ్స్ అడ్వైజర్‌గా ఎనిమిదేళ్ల నుంచీ పనిచేస్తున్నాను. పదో తరగతి తర్వాత దూరవిద్యలో డిగ్రీ పూర్తిచేశాను. ఇంటర్మీడియట్ చదవలేదు. సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ (సీఎఫ్‌పీ) కోర్సులో చేరడానికి అవకాశం ఉందా? -రాజు

ఇంటర్ లేకుండా సీఎఫ్‌పీ?



■ మీకు ఇప్పటికే ఇన్స్యూరెన్స్ అండ్ మ్యూచువల్ ఫండ్స్ అడ్వైజర్‌గా ఎనిమిదేళ్ల వృత్తి అనుభవం ఉంది. కాబట్టి సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ (సీఎఫ్‌పీ) కోర్సు బాగా ఉపయోగపడుతుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రొఫెషనల్ సర్టిఫికేషన్. వ్యక్తులు, కుటుంబాలు, సంస్థలకు ఆర్థిక ప్రణాళికకు సంబంధించిన సలహాలు ఇవ్వడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యం, నైతిక విలువలు ఉన్నాయని నిరూపించే అర్హత పరీక్ష ఇది. ప్రస్తుతం పెట్టుబడులు, బీమా, పన్ను ప్రణాళిక, రిటైర్‌మెంట్ ప్లానింగ్ లాంటి అంశాలపై మార్గనిర్దేశం చేసే నిపుణుల అవసరం ఎక్కువగా ఉంది. ఇందుకు సీఎఫ్‌పీ కోర్సు ఎంతో ఉపయోగపడుతుంది.

● సీఎఫ్‌పీలో ప్రధానంగా ఆర్థిక ప్రణాళికకు సంబంధించిన విభిన్న విభాగాలు ఉంటాయి. వీటిలో ఇన్వెస్ట్‌మెంట్ ప్లానింగ్, రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్స్యూరెన్స్ ప్లానింగ్, టాక్స్ ప్లానింగ్, రిటైర్‌మెంట్ ప్లానింగ్, ఎస్టేట్ ప్లానింగ్, సమగ్ర ఫైనాన్షియల్ ప్లానింగ్ లాంటి అంశాలు ఉన్నాయి. ఈ కోర్సుతో ఆర్థిక సమస్యలను పరిష్కరించే సామర్థ్యమూ పెరుగుతుంది.

● సీఎఫ్‌పీ కోర్సులో చేరడానికి ఏదైనా గ్రూపుతో ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఉండాలి. కామర్స్, మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్, బ్యాంకింగ్ లేదా ఫైనాన్స్ లాంటి నేపథ్యం ఉన్నవారికి ఇది మరింత అనుకూలం.

“ సీఎఫ్‌పీ కోర్సు పూర్తిచేసినవారికి బ్యాంకులు, ఆర్థిక సేవలు అందించే సంస్థలు, బీమా సంస్థలు, మ్యూచువల్ ఫండ్ కంపెనీలు, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజరీ సంస్థలు, సంపద నిర్వహణ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఫైనాన్షియల్ ప్లానర్‌గా స్వయం ఉపాధీ పొందవచ్చు. అనుభవం పెరిగేకొద్దీ ఎక్కువ ఆదాయానికీ అవకాశం ఉంది. ”



● ప్రస్తుతం అమల్లో ఉన్న యూజీసీ నిబంధనల ప్రకారం పదో తరగతి నుంచి నేరుగా డిగ్రీ చేయడం కుదరదు. ఏదైనా డిగ్రీ చదవాలంటే ఇంటర్ కచ్చితంగా పూర్తిచేయాలి. ప్రొఫెషనల్ కోర్సులు ఇంటర్మీడియట్ తర్వాత చేస్తేనే ఉపయోగకరంగా ఉంటాయి. దీన్ని ఓపెన్ స్కూల్ ద్వారా చేసినా డిగ్రీ చదివే అవకాశం ఉంది. చట్టపరంగా రెగ్యులర్ ఇంటర్‌కు, ఓపెన్ ఇంటర్‌కు గుర్తింపులో తేడా లేదు. కొన్ని ఉద్యోగ ఇంటర్వ్యూల్లో మాత్రం ఓపెన్ ఎడ్యుకేషన్‌పై కొంత వివక్ష చూపుతున్నారు. దాన్ని అధిగమించడానికి రెగ్యులర్‌గా చదివినవారి కంటే ఎక్కువ విషయ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచుకోవాలి.

సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్ కోర్సు.. ఫైనాన్స్ రంగంలో స్థిరమైన, గౌరవప్రదమైన, మంచి ఆదాయం కలిగిన కెరియర్‌ను నిర్మించుకోవాలనుకునే వారికి మంచి ఎంపిక. సరైన ప్రణాళిక, నిరంతర అభ్యాసం, నైతిక విలువలతో ముందుకు సాగితే, వ్యక్తిగతంగా, వృత్తిపరంగా ఉన్నతస్థాయికి చేరుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇటీవలే ప్రకటించిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 ఫలితాల్లో మన్నం వేణు రాష్ట్ర టాపర్‌గా నిలిచారు. ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఒక పోస్టు నా కోసమే అనే కృతనిశ్చయంతో చదివానని ఆయన తెలిపారు. తన సన్నద్ధ ప్రణాళికను 'చదువు'తో పంచుకున్నారు. ఆ వివరాలు..

మాది పల్నాడు జిల్లా శావాల్యపురం మండలం కారుమంచి గ్రామం. నాన్న శ్రీనివాసరావు ఊరులోనే కిరాణ దుకాణం నడుపుతున్నారు. అమ్మ కరోనా సమయంలో చనిపోయారు. తమ్ముడు హైదరాబాద్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాల, హైదరాబాద్‌లో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్ కోర్సు 2018లో పూర్తిచేశాను. రాజమహేంద్రవరంలోని నారాయణలో ఇంటర్మీడియట్ చదివాను. పదో తరగతి నరసరావుపేటలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో పూర్తయింది. గ్రూప్-2, 2018లో ఎక్సైజ్ ఎస్సైగా అవకాశం వచ్చినా ఆ ఉద్యోగం నా మనస్తత్వానికి సరిపోకపోవడంతో మధ్యలోనే వదిలేశాను. ఆ తర్వాత హైకోర్టులో అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. గ్రూప్-2లో మేటి కొలువు కోసం ప్రయత్నించి, టాపర్‌గా నిలిచాను. సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-2 పోస్టుకు ఎంపికయ్యాను.

నా కోసమే ఒక పోస్టు అనుకున్నా..

లక్ష్యం.. గ్రూప్-I

2018 గ్రూప్-2 ఫలితాలు 2021లో వెలువడ్డాయి. అప్పుడు పన్నెండో ర్యాంకు రావడంతో ఎక్సైజ్ ఎస్సై పోస్టులో చేరాను. ఆ ఉద్యోగం నచ్చక పోవడంతో 2022లో హైకోర్టులో అసిస్టెంట్, జిల్లా కోర్టుల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు దరఖాస్తు చేశాను. హైకోర్టు పోస్టుల్లో రెండో ర్యాంకు, జిల్లా కోర్టులకు సంబంధించి మొదటి ర్యాంకు వచ్చింది. దీంతో హైకోర్టులో అసిస్టెంట్‌గా చేరాను. డిసెంబరు, 2023లో గ్రూప్-2 ప్రకటన రావడంతో దరఖాస్తు చేశాను. సబ్ రిజిస్ట్రార్ గ్రేడ్-2 పోస్టుకు మొదటి ఐచ్ఛికం ఇవ్వడంతో జోన్-4లో స్థానికేతర కోటాలో ఎంపికయ్యాను. డిప్యూటీ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-3 పోస్టులు వచ్చే అవకాశం ఉన్నా వాటిని వద్దనుకున్నాను. రెండో ప్రాధాన్యంగా పురపాలిక కమిషనర్, మూడో ఎంపికగా డిప్యూటీ తహసీల్దార్ పెట్టుకున్నాను. ఉద్యోగంతో పాటు కుటుంబానికీ సమయం కేటాయించేందుకు అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు ప్రాధాన్యం ఇచ్చాను. నా మనస్తత్వానికీ ఈ ఉద్యోగం సరిపోతుందని భావిస్తున్నాను. గ్రూప్-1కు బాగా సన్నద్ధమై డిప్యూటీ కలెక్టర్ కావాలనేది నా లక్ష్యం. గత ప్రకటనలో గ్రూప్-1, గ్రూప్-2 రెండిటికీ సన్నద్ధం కావాల్సి రావడంతో గ్రూప్-2పైనే ఎక్కువ దృష్టి పెట్టాను.



సన్నద్ధత ఇలా

బీటెక్‌లో ఉన్నప్పుడే గ్రూప్స్ కోసం సన్నద్ధత ప్రారంభించాను. క్యాంపస్ నియామకాల్లో టీసీఎస్ సంస్థలో అవకాశం వచ్చినప్పటికీ చేరలేదు. కళాశాలలోని గ్రంథాలయంలో కరెంట్ అఫైర్స్, ఇతర పుస్తకాలు చదువుతూ నోట్స్ రాసుకునేవాడిని. తక్కువ వ్యవధిలోనే సబ్జెక్టులపై పట్టు సాధించాను. ఇంజినీరింగ్ పూర్తికాగానే 2018లో గ్రూప్-2, గ్రూప్-3 ప్రకటనలు వచ్చాయి. రెండిటికీ ఎంపికయ్యాను. గ్రూప్-2 ఉద్యోగాన్ని వదిలేసి, హైకోర్టు అసిస్టెంట్‌గా చేరాను. అక్కడ నుంచి జ్యుడీషియల్ అకాడమీకి డిప్యుటేషన్ మీద పంపారు. దీంతో సన్నద్ధతకు కొంత సమయం దొరికింది. ఒక పోస్టు నా కోసమే అనే లక్ష్యంతో గ్రూప్-2కు సిద్ధమయ్యాను. అయితే టాపర్‌గా నిలుస్తానని అనుకోలేదు. గతంలో ఈ పరీక్ష రాసిన అనుభవం ఉండటంతో సన్నద్ధత కొంత తేలికైంది. రోజుకు 8 గంటల చొప్పున చదివాను. కొన్ని సార్లు మాత్రం పది గంటలు అధ్యయనం కొనసాగేది.

ఆ అలవాటే

చిన్నప్పటి నుంచీ పత్రికలు చదివే అలవాటు ఉంది. మా కిరాణ దుకాణంలో కూర్చుని 'ఈనాడు' పేపర్ ఎక్కువగా చదివేవాడిని. పోటీ పరీక్షల్లో విజయానికి పత్రికలు చదవడం ఎంతో మేలు చేస్తుంది. రోజూ ముఖ్యాంశాలు నోట్సు రాసుకునేవాడిని. గ్రూప్-2 కోసం సన్నద్ధమయ్యేవారు ముందుగా సిలబస్‌కు అనుగుణంగా మెటీరియల్ సిద్ధం చేసుకోవాలి. బిట్లు బట్టీ పట్టకుండా కాన్సెప్టులు అర్థం చేసుకుంటూ అధ్యయనం కొనసాగించాలి. దీంతో ప్రశ్న ఎలా అడిగినా సమాధానం గుర్తించడానికి వీలవుతుంది. ఒత్తిడి లేకుండా చదవాలి. ప్రాథమికాంశాలకూ ప్రాధాన్యమివ్వాలి. వీలైనన్ని నమూనా పరీక్షలు రాసి, సన్నద్ధతలో లోపాలు సరిదిద్దుకోవాలి. ఒత్తిడి లేకుండా, సానుకూల దృక్పథంతో అధ్యయనం కొనసాగించినవారు పోటీలో ముందుంటారు.

– మాసిని శ్రీనివాసరావు
ఈనాడు, అమరావతి

వర్క్ ఫ్రమ్ హోమ్ ఇంటర్న్‌షిప్స్

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: ఈజ్‌రెంట్
నైపుణ్యాలు: సేల్స్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://shorturl.at/Cm2B6

గ్రోత్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: బేసిక్ ఫిట్
నైపుణ్యాలు: బిజినెస్ డెవలప్‌మెంట్, క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, మార్కెట్ రిసెర్చ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 28
☛ https://shorturl.at/4IHIb

ఈమెయిల్ మార్కెటింగ్

సంస్థ: క్వాంటం ఐటీ ఇన్నోవేషన్
నైపుణ్యం: ఈమెయిల్ మార్కెటింగ్
స్టైపెండ్: రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 28
☛ https://shorturl.at/OdN9i

లీడ్ జనరేషన్

సంస్థ: న్యూరో యాడ్స్
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, లీడర్‌షిప్, లీడ్ జనరేషన్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.10,000-32,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 28
☛ https://shorturl.at/rbCEZ

కోఆర్డినేషన్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: సన్ ఇండియా ఫైర్ సేఫ్టీ సిస్టమ్స్
నైపుణ్యాలు: కోఆర్డినేషన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, షెడ్యూలింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.12,000-20,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 28
☛ https://shorturl.at/jL8TP

ఇంటర్నేషనల్ సేల్స్

సంస్థ: ప్రింటింగ్ నీడ్స్
నైపుణ్యాలు: అటెన్షన్ టు డిటెయిల్, బీ2బీ సేల్స్, క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, ఈమెయిల్ మేనేజ్‌మెంట్, ఇంగ్లిష్ రాయడం, గూగుల్ షీట్స్, మార్కెటింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిసెర్చ్ అనలిటిక్స్, సెల్ఫ్-లెర్నింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: మార్చి 1
☛ https://shorturl.at/kk0QQ

కంటెంట్ రైటింగ్

సంస్థ: వెబాక్సిస్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్
నైపుణ్యాలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.5,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/4b6tfa9x

నైపర్‌లో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్), గువాహటి.. ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ● అసిస్టెంట్ ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ): 01
- ● అసిస్టెంట్ ప్రొఫెసర్ (మెడికల్ డివైజ్): 01
- ● మెడికల్ ఆఫీసర్ (అడ్మినిస్ట్రేషన్): 01

అర్హత: పోస్టును అనుసరించి పీహెచ్‌డీ, ఎంబీబీఎస్, ఎంఫార్మసీ/ బీటెక్/ ఎంటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి.

మూల వేతనం: నెలకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.78,000. మెడికల్ ఆఫీసర్‌కు రూ.56,100. **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు ఫీజు: రూ.1000; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.

దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తుకు సంబంధిత ధ్రువపత్రాలను జతచేసి.. ది రిజిస్ట్రార్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్, గువాహటి చిరునామాకు స్పీడ్ పోస్ట్ లేదా కొరియర్‌లో పంపాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.02.2026.

పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ: 07.03.2026

వెబ్‌సైట్: https://niper.gov.in/

కన్సల్టెంట్లు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (జాతీయ భారతీయ వైద్య పరంపర సంస్థ), గడ్డి అన్నారం, తెలంగాణ.. ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
- ● కన్సల్టెంట్ (ఆయుర్వేద): 01
- ● కన్సల్టెంట్ (అడ్మిన్): 01
- ● కన్సల్టెంట్ (సంస్కృతం): 01
- ● ఎస్ఆర్ఎఫ్ (కన్జర్వేషన్/ఆర్కియాలజీ)- 01

అర్హత: డిగ్రీ/ పీజీ/ బీఏఎంఎస్/ ఎండీ/ ఎంఎస్, పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వేతనం: నెలకు ఎస్ఆర్ఎఫ్‌కు రూ.42,000; ఇతర పోస్టులకు రూ.50,000.

వయసు: ఇంటర్వ్యూ తేదీ నాటికి ఎస్ఆర్ఎఫ్‌కు 35 ఏళ్లు; ఇతర పోస్టులకు 64 ఏళ్లు మించకూడదు.

దరఖాస్తు: ఈమెయిల్ niimh.recruitment@gmail.com ద్వారా.

దరఖాస్తుకు చివరి తేదీ: 17.02.2026.

ఇంటర్వ్యూ తేదీ (ఆన్‌లైన్/ఆఫ్‌లైన్): 19.02.2026.

వెబ్‌సైట్: https://niimh.nic.in/#/home

ఎయిమ్స్ దిల్లీలో

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, దిల్లీ.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1 (ల్యాబొరేటరీ) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
- ● ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-1 (ల్యాబొరేటరీ)

అర్హత: ఎంఎల్‌టీ/ డీఎంఎల్‌టీ/ ఐటీఐ.

వయసు: 28 ఏళ్లు మించకూడదు.

మూల వేతనం: నెలకు రూ.18,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

దరఖాస్తుకు చివరి తేదీ: 15.02.2026. **వెబ్‌సైట్:** https://www.aiims.edu/index.php/en/notices/recruitment/aiims-recruitment

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512
edc@eenadu.in

కరెంట్ అఫైర్స్



◆ ఐక్యరాజ్య సమితి అత్యున్నత పర్యావరణ పురస్కారం 'ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డును 2025కు ఏ భారతీయ అధికారిణి గెలుచుకున్నారు? (ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్‌ఈపీ) ఈ పురస్కారాన్ని ప్రకటించింది.)

మాదిరి ప్రశ్నలు

జ: తమిళనాడు ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు

◆ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ) తొలి మహిళా అధ్యక్షురాలిగా ఇటీవల ఎవరు ఎన్నికయ్యారు? (1958లో పీసీఐను స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయం న్యూదిల్లీలో ఉంది.)
జ: సంగీత బరూహ్ పిషారోతి

◆ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన పూర్తిగా హైడ్రోజన్ ఇంధనంతో నడిచే ప్రయాణికుల నౌకను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు?
జ: వారణాసి (ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యూఏఐ) యాజమాన్యంలోని ఈ నౌకను కొచ్చిన్ షిప్ యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) నిర్మించింది.)


మరింత సమాచారం

◆ 2026, మార్చిలో మొదటి కామన్వెల్త్ ఖో ఖో ఛాంపియన్‌షిప్‌నకు ఏ దేశం ఆతిథ్యం ఇవ్వనుంది? (ఈ టోర్నీలో 16 పురుష, 16 మహిళల జట్లు పాల్గొంటాయి.)
జ: భారత్

◆ జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? జ: డిసెంబరు 14

జూనియర్ ఇంటర్ - జంతు శాస్త్రం

శ్వాసించడం, వాయువుల వినిమయం



ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. జల శ్వాసక్రియ (మొప్పల ద్వారా), పుపుస శ్వాసక్రియల మధ్య తేడాలను ఉదాహరణలతో వివరించండి.

జ: జలచర ఆర్థ్రోపోడ్స్, మొలస్కా జీవులు రక్తకేశ నాళికలతో కూడిన ప్రత్యేక నిర్మాణాలైన మొప్పల ద్వారా (జల శ్వాసక్రియ), భూచర జీవులు రక్తకేశనాళికలతో కూడిన తిత్తులను (ఊపిరితిత్తులు) ఉపయోగించి (పుపుస శ్వాసక్రియ) వాయువుల వినిమయం జరుపుతాయి.
సకశేరుకాలైన చేపలు మొప్పల ద్వారా, ఉభయచరాలు, సరీసృపాలు, పక్షులు, క్షీరదాలు ఊపిరితిత్తుల ద్వారా శ్వాసిస్తాయి. కప్పల లాంటి ఉభయచరాలు చర్మ శ్వాసక్రియను కూడా జరుపుతాయి.

2. శ్వాస వాయువుల వ్యాపన రేటును ప్రభావితం చేసే అంశాలు ఏవి?

జ: శ్వాస వాయువుల వ్యాపన రేటు O_2, CO_2 ల పాక్షిక పీడన (PO_2, PCO_2) వాయువుల ద్రావణీయత, వ్యాపన త్వచం మందంపై ఆధారపడుతుంది.

3. ఆక్సిజన్ రవాణాపై PCO_2 ప్రభావం ఏమిటి?

జ: వాయుకోశాల్లోని అల్ప PCO_2, (అధిక PO_2, అల్ప H^+ గాఢత (అధిక pH), అల్ప ఉష్ణోగ్రతలు) ఆక్సీహిమోగ్లోబిన్ ఏర్పడటానికి అనుకూలించే కారకాలు. కణజాలాల్లోని అధిక PCO_2 (అల్ప PO_2, అధిక H^+ గాఢత (అల్ప pH), అధిక ఉష్ణోగ్రతలు) ఆక్సీహిమోగ్లోబిన్ నుంచి ఆక్సిజన్ వియోగం చెంది ఆక్సిజన్ విడుదలకు అనుకూలంగా ఉంటుంది.

4 మార్కులు

1. శ్వాసవ్యవస్థ అపస్థితులను వివరించండి.

జ: **ఉబ్బసం:** శ్వాసనాళం, శ్వాస నాళికల్లో వాపు ఏర్పడటం వల్ల శ్వాసించడం కష్టంగా ఉండి ఈల లాంటి శబ్దాన్ని కలిగిస్తుంది.
ఎంఫైసీమా: ఇది దీర్ఘ రుగ్మత. దీనిలో వాయుకోశ గోడలు శిథిలమై, కలసిపోవడం వల్ల వాయువుల వినిమయం జరిగే శ్వాసతలం తగ్గుతుంది. దీనికి ముఖ్యకారణం పొగ తాగడం.
వృత్తిపర శ్వాసరుగ్మతలు: కొన్ని పరిశ్రమల్లో ముఖ్యంగా రాళ్లు పగులగొట్టడం, నూరడం లాంటి వాటిలో అధికంగా దుమ్ము, ధూళి ఏర్పడి శ్వాస మార్గంలో చేరినప్పుడు దేహ రోగనిరోధక వ్యవస్థ దానిని తట్టుకోలేకపోవడం వల్ల అనేక రుగ్మతలు ఏర్పడతాయి. దీర్ఘకాలం వీటికి గురైనప్పుడు ఊపిరితిత్తుల్లో వాపు, ఫైబ్రోసిస్ (తంతుయుత కణజాలం వృద్ధిచెందడం) జరిగి ఊపిరితిత్తులను తీవ్రంగా నష్టపరుస్తాయి. ఇలాంటి పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ముఖానికి రక్షణ ఇచ్చే తొడుగులను ఉపయోగించాలి.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: రవిచరణ్ కంటి


ఏపీపీఎస్సీ - భారతీయ సమాజం

బంధుత్వ ఆచరణలు

ఆట పట్టించినా.. ఆత్మీయత చాటినా!

సామాజిక, జైవిక సంబంధాల వ్యవస్థ అయిన బంధుత్వం పరిధి భారతీయ సమాజంలో విస్తృతంగా ఉంది. వ్యక్తిగత, సామాజిక జీవనంలో అది ముఖ్యమైన భాగం. కుటుంబం, సమాజ నిర్మాణంలో బంధుత్వానికి, అందులోని వివిధ ఆచరణలకు ప్రాముఖ్యత ఉంది. కుటుంబం, బంధుత్వ సమూహం ద్వారా వ్యక్తికి సమాజంలో తగిన గుర్తింపు, సహకారం, మద్దతు లభిస్తుంది. ఈ విధంగా బంధుత్వంలో స్థూలంగా కనిపించే ప్రవర్తనలు, బంధు సమూహాలకు సూచికలైన గోత్రం తదితర రూపాల లక్షణాలు, వాటి ప్రయోజనాల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఉమ్మడి భాగస్వామ్యాలు, ఆచారాల ద్వారా వివిధ సమాజాల్లో వ్యక్తుల మధ్య బంధాలను బలపరుస్తూ, సమైక్య భావాన్ని పెంపొందిస్తున్న బంధుత్వం విశిష్టతను అర్థం చేసుకోవాలి.

బంధువులు, సమూహాల్లోని వ్యక్తుల మధ్య వివిధ రకాలైన బంధుత్వ సంబంధాలు ఉంటాయి. ఒక్కో బంధుత్వ సంబంధం ఒక్కో రకమైన ప్రవర్తనను నిర్దేశిస్తుంది. ఆ విధంగా సమాజం మొత్తం మీద చూస్తే బంధు సమూహాల్లోని వ్యక్తుల మధ్య కొన్ని నిర్దిష్టమైన ప్రవర్తనలు కనిపిస్తాయి. వాటినే 'బంధుత్వ ఆచరణలు' అంటారు. ఇవి ప్రధానంగా ఆరు రకాలుగా ఉంటాయి.



1) పరిహాస సంబంధాలు: సమాజంలో కొంతమంది బంధువుల మధ్య పరిహాస సంబంధాలు కనిపిస్తాయి. వీటికి సమాజ ఆమోదం ఉంటుంది. అందులో ఒకరినొకరు హేళన చేసుకోవడం, ఆస్తిని నష్టపరచుకోవడం తదితర ఎన్నో రకాల చనువులు తీసుకుంటారు. ఈ సంబంధాలు రెండు విధాలుగా ఉంటాయి. 1) ఇద్దరు బంధువులు ఒకరినొకరు సమానంగా పరిహాసించుకోవడం. దీనిని 'సౌష్ఠవ పరిహాసం' అంటారు. 2) ఇద్దరు బంధువుల్లో ఒకరినొకరు పరిహసించే స్వేచ్ఛ ఉంటుంది. కానీ రెండో వ్యక్తి తిరిగి మొదటి వ్యక్తిని పరిహసించకూడదు. దీనినే 'అసౌష్ఠవ పరిహాసం' అంటారు. పరిహాస సంబంధాలు బావామరదళ్లు, బావబామ్మరుదులు, తాతామనవళ్ల మధ్య సామాన్యంగా కనిపిస్తాయి.



2) వైదొలగే నడవడి: కొన్ని సమాజాల్లో సంప్రదాయంగా కొందరు బంధువుల మధ్య సన్నిహిత సంబంధాలు ఉండటానికి వీలులేదు. దీనినే 'వైదొలగే నడవడి' అంటారు. కోడలు-మామ, అత్త-అల్లుడు మధ్య వైదొలగే నడవడి కనిపిస్తుంది. కొత్తగా కాపురానికి వచ్చిన కోడలి ప్రభావం ఆ ఇంట్లో ఉన్న ఇతర వ్యక్తులపై పడకుండా చూడటానికి ఆమెతో పరిచయాన్ని భర్తకు మాత్రమే పరిమితం చేస్తారని రాబర్ట్. హెచ్. లెవి పేర్కొన్నారు. కుటుంబంలో వివాహేతర సంబంధాలు, కుటుంబ వాతావరణాన్ని కలుషితం చేసే విరుద్ధ భావాలు ఏర్పడకుండా ఉంచేందుకు కోడలు - మామ, అల్లుడు - అత్త మధ్య సంబంధాలను వైదొలగే నడవడి ద్వారా అదుపులో ఉంచుతారని రాడ్ క్లిఫ్ బ్రౌన్ అభిప్రాయం.





3) మాతులాధికారం: కొన్ని సమాజాల్లో ఒక వ్యక్తి జీవితానికి అతడి తల్లి సోదరుడు అంటే మేనమామ బాధ్యత వహిస్తుంటాడు. ఆ వ్యక్తికి తండ్రి కంటే మేనమామే ముఖ్యం. మాతులస్థానీయ నివాసం, మేనమామ నుంచి ఆస్తి పొందడం తదితర ఆచారాలున్న ఈ విధానాన్ని మాతులాధికారం అంటారు.

4) పితృష్వాధికారం: మాతులాధికారం ఉన్న సమాజాల్లో మేనమామ నిర్వర్తించే పాత్రలన్నింటినీ కొన్ని సమాజాల్లో పితృష్వ అంటే మేనత్త నిర్వరిస్తుంది. ఒక వ్యక్తి జీవితానికి మేనత్త బాధ్యత వహించే పద్ధతిని పితృష్వాధికారం అంటారు. మేనమామ ప్రభావం మాతృవంశీయ సమాజాల్లోనూ, మేనత్త ప్రభావం పితృవంశీయ సమాజాల్లోనూ కనిపిస్తుంది.

5) కుహనా ప్రసూతి: కొన్ని ఆదిమ సమాజాల్లో భార్య ప్రసవించేటప్పుడు భర్త ఒక వ్యాధిగ్రస్థుడిలా నటించాలి. సామాన్యమైన అవసరాలన్నీ తగ్గించుకుని రోగి తీసుకునే ఆహారాన్నే తినాలి. తోడ, ఖాసీ సమాజాల్లో ఈ ఆచారాలు కనిపిస్తాయి. భార్య కష్ట సమయాల్లో భర్త కూడా ఆమెతో సమానంగా కష్టపడుతూ దాంపత్య జీవితాన్ని పటిష్ఠం చేసుకోవడానికి ఉద్దేశించిందే ఈ కుహనా ప్రసూతి అని బ్రొనిస్లో మలినోవస్కీ వివరించారు.

6) సాంకేతిక సంబోధన: కొన్ని సమాజాల్లో బంధువులను పేరు పెట్టి పిలుస్తారు. కొందరు బంధుత్వ పదంతో పిలుస్తారు. ఈ రెండు విధాలుగా కాకుండా మరికొందరు బంధువును 'ఫలానా వారి తండ్రి' లేదా 'ఫలానా వారి తల్లి' అని పిలుస్తారు. ఆ విధంగా పిలిచే బంధుత్వ ఆచారాన్ని 'సాంకేతిక సంబోధన' అంటారు. ఉదాహరణకు భర్తను భార్య సంబోధించేటప్పుడు.. తన కుమారుడి పేరు సన్నీ అయితే 'సన్నీ నాన్న' అని, కూతురు పేరు విన్నీ అయితే 'విన్నీ నాన్న' అని పేర్కొంటుంది. అలాగే భర్తలు కూడా భార్యలను పిలిచేందుకు ఆ విధమైన సాంకేతిక సంబోధనలనే వాడతారు.

బంధుత్వ సమూహాలు

బంధుత్వం ఉన్న వ్యక్తుల సమూహమే బంధుత్వ సమూహం. ఇది ప్రధానంగా మూడు సూత్రాలపై ఆధారపడి ఏర్పడుతుంది. 1) వంశానుక్రమన విధానం 2) నివాస విధానం 3) వారసత్వ సంక్రమణ విధానం. వంశానుక్రమం ఆధారంగా బంధు సమూహాలు ఏర్పడతాయి. వారంతా ఒకే ఇంటిలో నివసించరు. ఒక కుటుంబానికి చెందినవారు మాత్రమే ఒక ఇంటిలో నివసిస్తారు. బంధుత్వ సమూహాలు రెండు రకాలు అవి 1) నివాస బంధు సమూహాలు, 2) ఏకరక్త బంధు సమూహాలు.

1) **నివాస బంధు సమూహాలు:** కొందరు బంధువులు ఒకే ఇంటిలో కలిసి నివసిస్తూ ఉంటే దానిని నివాస బంధు సమూహం అంటారు. **ఉదా:** కుటుంబం

2) **ఏక రక్త బంధు సమూహాలు:** ఇవి వంశానుక్రమం, వారసత్వ సంక్రమణ విధానంపై ఆధారపడి ఏర్పడే బంధు సమూహాలు. వీరంతా ఒకే పూర్వీకుడి వంశస్థులై ఉంటారు. ఈ పూర్వీకుడు స్త్రీ లేదా పురుషుడు కావచ్చు. వీరంతా ఒకచోట నివసించరు. అంటే ఈ ఏకరక్త బంధు సమూహాల్లో అనేక కుటుంబాలు ఉంటాయి. బంధువులంతా ఒకే వంశ కర్త సంతతికి చెందినవారమనే భావిస్తారు. దీనిలో మాతృ వంశానుక్రమం, పితృ వంశానుక్రమమనే బంధు సమూహాలు ఉంటాయి. అవి ప్రధానంగా వంశం, గోత్రం, గోత్రకూటమి, ద్విశాఖి అనే 4 రూపాల్లో ఉంటాయి.

ఎ) వంశం: ఒకే పూర్వీకుడి నుంచి ఉద్భవించామనే భావన ఉన్న వ్యక్తుల సమూహమే వంశం. ఏక వంశానుక్రమాన్ని అవలంబించే బంధువుల సమూహం వంశం అవుతుంది. ఇది ఏకరక్త బంధు సమూహం. వంశకర్త పురుషుడని భావిస్తే పితృ వంశమని, వంశకర్త స్త్రీ అని భావిస్తే మాతృ వంశమని పిలుస్తారు. వంశానికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉంటాయి. ప్రతి వంశానికి ఒక పేరు ఉంటుంది.

బి) గోత్రం: ఇది ఏక వంశానుక్రమ సమూహం. దీనిలో అసంఖ్యాక తరాలకు చెందిన సభ్యులు ఉంటారు. పూర్వీకులతో తమ సంబంధాన్ని వీరు వివరించలేరు. ఈ ఊహాపరమైన వంశానుక్రమ సమూహానికి అతి ప్రాచీన కాలానికి చెందిన పితృదేవత ఉంటాడు. ఆ పితృదేవత మనిషే కావాల్సిన అవసరం లేదు. జంతువు, చెట్టు, జీవి, అజీవి కూడా కావచ్చు.

సి) గోత్ర కూటమి: రెండు, అంత కన్నా ఎక్కువ గోత్రాలున్న ఏక వంశానుక్రమ సమూహాన్ని గోత్ర కూటమి అంటారు. ఇందులో అన్ని గోత్రాల మధ్య సన్నిహిత సంబంధాలు, సమష్టి మతాచారాలు, సంప్రదాయాలు ఉంటాయి. కొన్ని ఆదిమ సమాజాల్లో గోత్ర కూటమి రాజకీయ వ్యవస్థగా పని చేస్తుంది. దానికి టోటెమ్ కూడా ఉంటుంది.

డి) ద్విశాఖి: సమాజం 2 బంధు సమూహాలుగా విభజితమై ఉంటే అందులో ఒక్కోదానిని ద్విశాఖిగా పేర్కొంటారు. ఇలాంటి విభజనను ద్వివిధ వ్యవస్థాపన అంటారు. కొన్ని సమాజాల్లో రెండు, మూడు గోత్ర కూటములు కలిసి ద్విశాఖిగా ఏర్పడతాయి. మరికొన్నింటిలో సమాజం మొత్తానికి రెండే గోత్రాలుండి, ఒక్కో గోత్రం ఒక్కో ద్విశాఖిగా ఏర్పడుతుంది. సాధారణంగా ద్విశాఖీలు బహిర్వివాహ పద్ధతి పాటిస్తాయి.




రచయిత: బద్దం పురుషోత్తంరెడ్డి

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం


ధ్వని

వస్తు కంపనాలకు యాంత్రిక శక్తి రూపం!



గాలిలో కంటే నీటిలో శబ్దం వేగంగా ప్రయాణిస్తుంది. ఆ రెండింటి కంటే లోహంలో ఇంకా అధిక వేగంతో ప్రసరిస్తుంది. భారీ పరిమాణంలో ఉండే ఏనుగు చేసే ఘీంకారం కంటే చిన్న కీటకం చేసే శబ్దంలో కీచుదనం ఎక్కువగా ఉంటుంది. పగలు కంటే రాత్రిళ్లు శబ్దాలు స్పష్టంగా వినిపిస్తాయి. పిల్లనగ్రోవి సంగీతం ఆహ్లాదంగా ఉంటే, ట్రాఫిక్ రణగొణ ధ్వనులు చికాకు పుట్టిస్తాయి. తరంగ రూపంలో ప్రసరించే శబ్దానికి సంబంధించిన ఇలాంటి సాధారణ అంశాల్లోని శాస్త్రీయతను తెలుసుకోవాలంటే ధ్వని ప్రసార నియమాలపై అవగాహన కలిగి ఉండాలి. ధ్వనిలోని రకాలు, వాటిని కొలిచే పరికరాలు, వివిధ లోహాలు, వాయువులు తదితర యానకాల్లో ప్రామాణిక శబ్ద వేగం, నిత్యం అందరూ వినే పలు రకాల ధ్వని తీవ్రతల విలువలు మొదలైన వాటిని పోటీపరీక్షల కోణంలో చదువుకోవాలి.

1. 'గాలిలో అణువులు ముందుకు, వెనక్కి కదలడం ద్వారా ధ్వని ప్రయాణించి చెవిని చేరి గ్రహణ సంవేదన కలిగిస్తుంది' అని మొదట పూర్వకాలంలో ధ్వని ప్రసరణను తెలిపింది ఎవరు?
   1) న్యూటన్
   2) హైగెన్స్
   3) పైథాగరస్
   4) అరిస్టాటిల్



పైథాగరస్

2. కింది వాటిలో ధ్వనికి సంబంధించి సరైనవి గుర్తించండి.
   ఎ) ధ్వని ఒక యాంత్రిక శక్తి రూపం. కంపన స్థితిలో ఉన్న వస్తువులు ధ్వనిని ఉత్పత్తి చేస్తాయి.
   బి) ధ్వని అనేది అనుదైర్ఘ్య తరంగాల రూపంలో ప్రయాణిస్తుంది.
   సి) కంపించడానికి వీల్లేని వస్తువులు (థర్మాకోల్, దూది) లాంటి వాటిలో ధ్వని సులభంగా ప్రయాణిస్తుంది.
   డి) శూన్యంలో శబ్ద ప్రసరణ జరగదు.
   1) ఎ, బి, సి, డి   2) ఎ, బి
   3) ఎ, బి, డి   4) ఎ, సి, డి

3. 'ధ్వని ప్రసరణకు యానకం అవసరం. శూన్యంలో శబ్ద ప్రసరణ జరగదు' అని తెలిపిన మొదటి వ్యక్తి?
   1) గెలీలియో
   2) అరిస్టాటిల్
   3) రాబర్ట్ బాయిల్
   4) న్యూటన్



రాబర్ట్ బాయిల్

4. ధ్వని ప్రసరించే యానకానికి ఏ లక్షణం ఉండాలి?
   1) స్థితిస్థాపకత   2) జడత్వం
   3) స్నిగ్ధత   4) 1, 2

5. కింది వాటిలో ధ్వని ప్రసరణకు సంబంధించి సరికానిది?
   ఎ) ధ్వని ప్రసరణను మొదట పూర్తిగా వివరించిన వ్యక్తి - న్యూటన్
   బి) గాలిలో ధ్వని వేగాన్ని కచ్చితంగా కనుక్కున్న వ్యక్తి - క్రిస్టియన్ హైగెన్స్
   సి) గాలిలో ధ్వని వేగాన్ని కనుక్కోవడానికి ప్రయత్నించిన మొదటి వ్యక్తి - రాబర్ట్ బాయిల్
   డి) చంద్రుడిపై ధ్వని ప్రసారం జరుగుతుంది.
   1) ఎ, బి, సి, డి   2) సి, డి   3) సి   4) డి

6. కింది వాటిలో ఏ తరంగాల ప్రసరణకు యానకం అవసరం?
   1) రేడియో తరంగాలు   2) మైక్రో తరంగాలు
   3) ధ్వని తరంగాలు   4) X-కిరణాలు

7. కింది వాటిలో సరైనవి గుర్తించండి.
   ఎ) చంద్రుడిపై, కృత్రిమ ఉపగ్రహాల్లో ధ్వని వేగం - శూన్యం
   బి) న్యూటన్ ప్రకారం గాలిలో 0°C వద్ద ధ్వని వేగం - 280 మీ./సె.
   సి) హైగెన్స్ ప్రకారం గాలిలో 0°C వద్ద ధ్వని వేగం - 331 మీ./సె.
   డి) ధ్వని వేగాన్ని అనునాదం దృగ్విషయం ఆధారంగా ప్రయోగశాలలో కనుక్కున్న వ్యక్తి - డి.సి.మిల్లర్
   1) ఎ, బి, సి, డి   2) ఎ, బి, సి
   3) ఎ, సి   4) ఎ, బి, డి



డి.సి.మిల్లర్

8. వివిధ పదార్థాల్లో ధ్వని వేగాలను జతపరచండి.
   1) వజ్రంలో ధ్వని వేగం   ఎ) 6420 మీ./సె.
   2) నీటిలో 0°C వద్ద   బి) 1500 మీ./సె.
   3) అల్యూమినియంలో   సి) 12000 మీ./సె.
   4) సముద్రపు నీటిలో   డి) 1435°C మీ./సె.
   1) 1-బి, 2-సి, 3-డి, 4-ఎ   2) 1-డి, 2-బి, 3-ఎ, 4-సి
   3) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి   4) 1-ఎ, 2-డి, 3-సి, 4-బి

9. గాలిలో ధ్వని వేగానికి లాప్లాస్ సమీకరణం?
   1) $V = h\upsilon$ 2) $v = \sqrt{\frac{E}{\rho}}$
   3) $v = \sqrt{\frac{\gamma p}{\rho}}$ 4) $v = n\lambda$

10. కింది వాటిలో వాయువులో ధ్వని వేగం ఆధారపడని అంశం?
   1) పీడనం   2) సాంద్రత
   3) ఉష్ణోగ్రత   4) ఆర్ద్రత

11. కింది వాటిలో ధ్వనివేగం, ఉష్ణోగ్రతకు సంబంధించి సరికానిది?
   1) గాలిలో ఉష్ణోగ్రత పెరిగితే ధ్వని వేగం పెరుగుతుంది ($V \alpha \sqrt{T}$)
   2) వాయువు ఉష్ణోగ్రత 1°C పెంచితే దానిలో ధ్వని వేగం 0.61 మీ./సె. పెరుగుతుంది.
   3) శీతాకాలంలో ధ్వని వేగం అన్ని కాలాల కంటే అధికం.
   4) వక్రీభవనం వల్ల పగలు కంటే రాత్రివేళ ధ్వని స్పష్టంగా వినిపిస్తుంది.

12. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) వినడానికి వినసొంపుగా, ఆహ్లాదకరంగా ఉండే ధ్వనులు - సంగీత స్వరాలు
   బి) జాతరలో వెలువడే రోద అనేది ఒక శబ్దం.
   సి) శ్రావ్య స్వరం అనే ఒక శబ్దం తర్వాత ఒకటి ఉత్పత్తి అవుతాయి. వినడానికి ఇంపుగా ఉంటుంది.
   డి) జల తరంగణి అనేది ఒక అనుస్వర ధ్వని.
   1) ఎ, బి, సి, డి   2) ఎ, బి, సి
   3) ఎ, సి   4) ఎ, సి, డి

13. కింది వాటిని జతపరచండి.

వాయువులు	ధ్వని వేగం
1) CO_2	ఎ) 965 మీ./సె.
2) SO_2	బి) 1284 మీ./సె.
3) He (హీలియం)	సి) 256 మీ./సె.
4) H (హైడ్రోజన్)	డి) 221 మీ./సె.

   1) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి   2) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి
   3) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ   4) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి

14. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) గాలి/వాయువులో సాంద్రత తగ్గితే వాటిలో ధ్వని వేగం పెరుగుతుంది.
   బి) గాలిలో తేమ పెరిగితే దానిలో ధ్వని వేగం తగ్గుతుంది.
   సి) పొడి గాలి కంటే తడి గాలిలో ధ్వని వేగం అధికం.
   డి) వీచే గాలి దిశలో ధ్వని వేగం ఎక్కువగా ఉంటుంది.
   1) ఎ, బి, సి, డి   2) ఎ, బి, డి
   3) ఎ, సి, డి   4) ఎ, బి, సి

15. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) వాతావరణంలో పీడనం మారిన ప్రతిసారి సాంద్రత కూడా మారుతుంది.
   బి) ధ్వని వేగం అనేది వాయు > ద్రవ > ఘన పదార్థంగా ఉంటుంది.
   సి) ఘనపదార్థాల్లో ధ్వని వేగం $V_s = \sqrt{\frac{Y}{d}}$ (Y = యంగ్ గుణకం)
   డి) ద్రవ పదార్థాల్లో ధ్వని వేగం $V_l = \sqrt{\frac{K}{d}}$ (K = స్థూల గుణకం)
   1) ఎ, బి, సి, డి   2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి   4) బి, సి, డి

16. నీటిలో ధ్వనులను కొలవడానికి వాడే పరికరం?
   1) హైడ్రోమీటర్   2) హిప్సామీటర్
   3) హైడ్రోఫోన్   4) డెన్సిటోమీటర్

17. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   ఎ) తీగ వాయిద్యాల నుంచి వచ్చే శబ్దం తీగ పొడవు, తన్యత మందంపై ఆధారపడుతుంది.
   బి) బుల్-బుల్, ఏక్తారా అనేవి తీగ వాయిద్య పరికరాలు.
   సి) మృదంగం, నాదస్వరం, డప్పు వాయిద్య పరికరాలు.
   డి) వాయు వాయిద్యాల్లో గాలి స్తంభాల పొడవులను మార్చడం ద్వారా వేర్వేరు శబ్దాలు పలికించవచ్చు.
   1) బి, సి   2) సి   3) ఎ, బి   4) బి



ఏక్తారా
బుల్-బుల్

18. కింది వాటిలో సరైన వాక్యాన్ని గుర్తించండి.
   ఎ) భారతీయ సంగీతం అనేది వినడానికి ఇంపుగా ఉన్న మాధుర్యం.
   బి) పాశ్చాత్య సంగీతం అనేది వినడానికి ఇంపుగా లేని హార్మోని స్వరం.
   సి) రోడ్డుపై ట్రాఫిక్ శబ్దం, తరగతి గది శబ్దం అనేవి అనుస్వర ధ్వనులు.
   1) ఎ, బి, సి   2) ఎ, బి   3) ఎ   4) బి

19. సంగీతం అనేది అనుస్వరం, దీని అభిలక్షణం కానిది?
   1) కీచుదనం   2) నాణ్యత
   3) తీవ్రత   4) తరంగదైర్ఘ్యం

20. వస్తువు నుంచి వెలువడే ధ్వని తరంగల తీవ్రత కొలవడానికి వాడే పరికరం?
   1) ఆడియోమీటర్
   2) టోనోమీటర్
   3) సోనోమీటర్
   4) ఆల్ట్రామీటర్



సోనోమీటర్

21. కింది వాటిలో ధ్వని స్థాయికి సంబంధించి సరికానిది?
   ఎ) ధ్వని కీచుదనం (పౌనఃపున్యం)ను ధ్వని స్థాయి అంటారు.
   బి) ధ్వని పౌనఃపున్యం పెరిగితే ఆ శబ్ద స్థాయి లక్షణం తగ్గుతుంది.
   సి) ధ్వని స్థాయి కంపన పరిమితిపై ఆధారపడదు. అది మారినా స్థాయిత్వం మారదు.
   డి) కీటకాల శబ్దం ధ్వని స్థాయి తక్కువ, ఏనుగు ఘీంకారం శబ్ద స్థాయి ఎక్కువ.
   1) ఎ, బి, సి   2) బి, సి   3) బి, డి   4) సి, డి

22. కింది వాటిలో ధ్వని తీవ్రతకు సంబంధించి సరైనవి గుర్తించండి.
   ఎ) మానవుడి చెవిలో గ్రహణ సంవేదన అవధి తీవ్రత.
   బి) దీన్ని డెసిబెల్‌లో కొలుస్తారు. ఇది బెల్ అనే ప్రమాణంలో పదో వంతు ఉంటుంది.
   సి) ఇది కంపన పరిమితి వర్గం మీద ఆధారపడుతుంది.
   డి) కంపన పరిమితి పెరిగితే ధ్వని తీవ్రత పెరుగుతుంది. దూరం పెరిగితే ధ్వని తీవ్రత తగ్గుతుంది.
   1) ఎ, బి, సి, డి   2) ఎ, బి, సి
   3) ఎ, బి, డి   4) ఎ, సి



23. కింది వాటిలో ధ్వని తీవ్రత విలువలను జతపరచండి.
   1) సాధారణ సంభాషణ   ఎ) 140 dB
   2) ధ్వని కాలుష్య కనీస శబ్దం   బి) 120 dB
   3) చెవి భరించలేని శబ్దం   సి) 60 dB
   4) తుపాకీ, బాణసంచా పేలుడు శబ్దం   డి) 80 dB
   1) 1-డి, 2-బి, 3-సి, 4-ఎ   2) 1-సి, 2-డి, 3-బి, 4-ఎ
   3) 1-సి, 2-డి, 3-ఎ, 4-బి   4) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి

24. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   ఎ) ధ్వని తరంగ రూపం మీద ఆధారపడేది - నాణ్యత లక్షణం.
   బి) విజిల్ శబ్దం పిచ్ ఎక్కువ, డ్రమ్ శబ్దం పిచ్ తక్కువ.
   సి) ధ్వని కంపన పరిమితి పెరిగితే ఆ ధ్వని బిగ్గరగా, పెద్దగా ఉంటుంది.
   డి) డెసిబెల్ స్కేలు అనేది దశాంశ మానంలో ఉంటుంది.
   1) ఎ   2) బి   3) సి   4) డి

25. కింది వాటిని జతపరచండి.
   1) తీగ వాయిద్యం   ఎ) కర్తాల్, మంజీరా
   2) డప్పు వాయిద్యం   బి) షెహనాయ్, నాదస్వరం
   3) వాయు వాయిద్యం   సి) మృదంగం, కంజీరా
   4) తట్టడం ద్వారా శబ్ద వాయిద్యం   డి) బుల్‌బుల్, ఏక్తారా
   1) 1-బి, 2-సి 3-ఎ, 4-డి   2) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ
   3) 1-ఎ, 2-సి, 3-డి, 4-బి   4) 1-ఎ, 2-డి, 3-బి, 4-సి

సమాధానాలు

1-3; 2-3; 3-3; 4-4; 5-2; 6-3; 7-1; 8-3; 9-3; 10-1; 11-3; 12-1; 13-4; 14-3; 15-3; 16-3; 17-2; 18-3; 19-4; 20-3; 21-3; 22-1; 23-2; 24-4, 25-2.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

చక్రవడ్డీకి అప్పు తీసుకుంటే ఏడాదికి చెల్లించే మొత్తం?

చక్రవడ్డీ

ముఖ్యాంశాలు

ఒక సంవత్సరానికి అయ్యే వడ్డీని అసలుకు కలిపి, దాన్ని తర్వాతి సంవత్సరానికి అసలుగా పరిగణిస్తారు. ఈ రకంగా అసలు, వడ్డీలు వరుస సంవత్సరాల్లో క్రమంగా పెరుగుతూ ఉంటాయి. ఈ విధంగా వడ్డీ లెక్కకట్టే పద్ధతిని చక్రవడ్డీ (CI) అంటారు.

అసలు = P, వడ్డీరేటు = r%, కాలం = n సంవత్సరాలు అయితే

మొత్తం $A = P\left(1 + \frac{r}{100}\right)^n$

చక్రవడ్డీ = మొత్తం − అసలు = A − P

అర్ధ సంవత్సరానికి ఒకసారి వడ్డీ లెక్కిస్తే $A = P\left(1 + \frac{r}{200}\right)^{2n}$

3 నెలలకు ఒకసారి చక్రవడ్డీని లెక్కిస్తే $A = P\left(1 + \frac{r}{400}\right)^{4n}$

మాదిరి ప్రశ్నలు

1. సరళ రూ. 50,000 అప్పుగా తీసుకుని 16% చక్రవడ్డీ చొప్పున రెండేళ్లకు బాకీ తీర్చింది. అయితే ఆమె ఎంత మొత్తం చెల్లించింది?
1) రూ. 68,000 2) రూ. 67,280
3) రూ. 67,000 4) రూ. 68,280

సాధన: అప్పు తీసుకున్న సొమ్ము P = 50,000
వడ్డీరేటు R = 16%, కాలం T = 2 సంవత్సరాలు
రెండు సంవత్సరాలకు అయ్యే మొత్తం $A = P\left(1 + \frac{r}{100}\right)^n$

$= 50000\left(1 + \frac{16}{100}\right)^2 \Rightarrow 50000 \times \frac{29}{25} \times \frac{29}{25}$

= రూ. 67,280

సమాధానం: 2

2. కొంత సొమ్ము చక్రవడ్డీ ప్రకారం రెండేళ్లలో రూ. 4,840, మూడేళ్లలో రూ. 5,324 అయితే వడ్డీరేటు ఎంత?
1) 10% 2) 8% 3) 7% 4) 12%

సాధన: r = (n సంవత్సరాలు, (n + 1) సం.ల మొత్తాల వడ్డీకి వ్యత్యాసం) / (n సంవత్సరాల తర్వాత అయ్యే మొత్తం)

$= \frac{5324 - 4846}{4840} \times 100 = 10\%$

సమాధానం: 1

3. కొంత సొమ్ము చక్రవడ్డీ చొప్పున 15 ఏళ్లలో రూ. 51,168, 16 ఏళ్లలో రూ. 51,701 అయ్యింది. అయితే వడ్డీరేటు ఎంత?
1) $\frac{25}{24}\%$ 2) $\frac{1}{24}\%$ 3) $\frac{3}{23}\%$ 4) $\frac{7}{24}\%$

సాధన: $\frac{51701 - 51168}{51168} \times 100$

$= \frac{533 \times 100}{51168} = 1\frac{1}{24}\% = \frac{25}{24}\%$

సమాధానం: 1

4. దినేష్ రూ. 2,550లను 4% వడ్డీరేటు చొప్పున చక్రవడ్డీకి అప్పు తీసుకుని రెండేళ్లలో రెండు సమాన వాయిదాల్లో చెల్లించాడు. అయితే ఒక్కో వాయిదాలో (ఏడాదికి) చెల్లించిన మొత్తం?
1) రూ. 1,234 2) రూ. 1,345
3) రూ. 1,352 4) రూ. 1,314

సాధన: $2550 \times \left(\frac{104}{100}\right)^2 = x\left(\frac{104}{100}\right) + x$

$2550 \times \frac{26}{25} \times \frac{26}{25} = x\left[\frac{104}{100} + 1\right]$

$2550 \times \frac{26}{25} \times \frac{26}{25} = x \times \frac{204}{100}$

x = 1352

సమాధానం: 3

5. కొంతసొమ్ము చక్రవడ్డీతో 3 ఏళ్లకు మూడు రెట్లు అయ్యింది. అయితే 9 ఏళ్లకు ఎన్ని రెట్లు అవుతుంది?
1) 9 2) 27 3) 16 4) 18

సాధన: 3 ఏళ్లకు 3 రెట్లు
మరో 3 ఏళ్లకు = 3 × 3 = 9 రెట్లు
ఆపై 3 ఏళ్లకు = 9 × 3 = 27 రెట్లు

సమాధానం: 2

6. చక్రవడ్డీ 5% చొప్పున రూ. 800 ఎన్ని సంవత్సరాల్లో రూ. 882 అవుతుంది?
1) 2 2) 3 3) 4 4) 5

సాధన: $A = P\left(1 + \frac{r}{100}\right)^n$

$882 = 800\left(1 + \frac{5}{100}\right)^t \Rightarrow \frac{882}{800} = \left(\frac{21}{20}\right)^t \Rightarrow \frac{441}{400} = \left(\frac{21}{20}\right)^t$

$= \left(\frac{21}{20}\right)^2 = \left(\frac{21}{20}\right)^t \Rightarrow t = 2$ సంవత్సరాలు

సమాధానం: 1

7. కొంత మొత్తం చక్రవడ్డీ పద్ధతిలో నాలుగేళ్లలో రెండింతలు అయితే, ఆ మొత్తం ఎనిమిది రెట్లు కావాలంటే ఎన్ని సంవత్సరాలు పడుతుంది?
1) 8 2) 10 3) 9 4) 12

సాధన: అసలు x అనుకుందాం
4 ఏళ్లలో 2x అవుతుంది
2x అనేది మరో 4 ఏళ్లలో 4x అవుతుంది
4x మరో 4 ఏళ్లలో 8x అవుతుంది
∴ 4 + 4 + 4 = 12 సంవత్సరాల్లో 8x అవుతుంది
సంక్షిప్త పద్ధతి: $3 \times 2^{3-1}$
$3 \times 2^2 = 12$ సంవత్సరాలు

సమాధానం: 4

8. కొంత మొత్తంపై మొదటి సంవత్సరం 3%, రెండో ఏడాది 4%, మూడో సంవత్సరం 5% వడ్డీరేటు చొప్పున అప్పు ఇస్తే మొత్తం రూ. 2249.52 అయ్యింది. అయితే అసలు ఎంత? (రూ.లలో)
1) 1900 2) 2100 3) 2250 4) 2000

సాధన: $2249.52 \times \frac{100}{100+3} \times \frac{100}{100+4} \times \frac{100}{100+5}$

$= 2249.52 \times \frac{100}{103} \times \frac{100}{104} \times \frac{100}{105} = 2000$

సమాధానం: 4

9. రూ. 2400 నాలుగేళ్లలో రూ. 3000 అయ్యింది. 12 ఏళ్ల తర్వాత అయ్యే మొత్తం ఎంత? (రూ.లలో)
1) 4687.5 2) 4500 3) 4906.75 4) 4700.50

సాధన: $2400\left(1 + \frac{r}{100}\right)^4 = 3000$

$= \left(1 + \frac{r}{100}\right)^4 = \frac{3000}{2400} \Rightarrow \left(1 + \frac{r}{100}\right)^{4 \times 3} = \left(\frac{5}{4}\right)^3$

$= \frac{125 \times 37.5}{64 \times 37.5} = \frac{4687.5}{2400} \Rightarrow 2400\left(1 + \frac{r}{100}\right)^{12} = 4687.50$

∴ 12 ఏళ్ల మొత్తం = రూ. 4687.50

సమాధానం: 1

10. 20 శాతం చక్రవడ్డీతో కొంత పెట్టుబడి మూడేళ్లలో రూ. 8640 అయ్యింది. అయితే మొదట పెట్టిన పెట్టుబడి ఎంత? (రూ.లలో)
1) 7500 2) 6000 3) 5500 4) 5000

సాధన: $8640 \times \frac{100}{120} \times \frac{100}{120} \times \frac{100}{120} \Rightarrow 5000$

సమాధానం: 4

11. తులసి రూ. 30,000లను 7% చక్రవడ్డీ చొప్పున పెట్టుబడి పెడితే ఎన్నేళ్లలో ఆమెకు రూ. 4337 వడ్డీ వస్తుంది?
1) 3 2) $2\frac{1}{2}$
3) 2 4) 4

సాధన: మొత్తం A = P + I
30000 + 4347 = 34347
కాలం n అనుకుందాం.

$\left(\frac{107}{100}\right)^n = \frac{34347}{30000}$

$= \frac{11449}{10000} = \left(\frac{107}{100}\right)^2$

n = 2 సంవత్సరాలు

సమాధానం: 3



రచయిత
హెచ్. అరుణ శివప్రసాద్,
విషయ నిపుణులు

909 Word of the Day

Staunch

Telugu meaning: దృఢమైన, స్థిరమైన

English meaning: The word staunch (స్టాన్చ్) is an adjective that describes someone who is very loyal, firm, and committed in their beliefs or support.

Synonyms: Loyal, Firm; ***Antonyms:*** Disloyal, Unreliable

Usage: **1.** She remained a staunch supporter of the policy despite growing opposition.

2. The leader's staunch dedication to ethical values earned him widespread respect.

కరెంట్ అఫైర్స్



ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను ఒలీవియా గడెకి, జాన్ పీర్స్ జోడీ సొంతం చేసుకుంది. 2026, జనవరి 30న మెల్‌బోర్న్‌లో సాగిన ఫైనల్లో ఆస్ట్రేలియా ద్వయం 4-6, 6-3, 10-8తో క్రిస్టినా, గినార్డ్ (ఫ్రాన్స్) జంటను ఓడించింది. ఒలీవియా, పీర్స్ జోడీకి వరుసగా ఇది రెండో ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ టైటిల్. ఒక జోడీ ఈ టైటిల్‌ను నిలబెట్టుకోవడం 37 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1988, 1989లో పగ్, నవోత్నా ద్వయం వరుసగా రెండు సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ మిక్స్‌డ్ టైటిల్ గెలిచింది.



దేశానికి వచ్చే వివిధ దేశాల విద్యార్థుల సంఖ్య ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గుజరాత్‌లలో పెరిగిందని కేంద్ర ఆర్థిక సర్వే వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం 2026, జనవరి 29న ఆర్థిక సర్వే-2025-26ను విడుదల చేసింది. గతంలో విదేశీ విద్యార్థులను ఆకర్షించడంలో ప్రధాన కేంద్రాలుగా ఉన్న కర్ణాటక, తమిళనాడులలో ప్రస్తుతం ప్రవేశాలు తగ్గగా.. కొత్తగా దక్షిణాదిలో ఏపీలో విదేశీ విద్యార్థుల నమోదు పెరిగింది. దేశానికి వచ్చే విదేశీ విద్యార్థుల సంఖ్య 2000-01లో 7 వేల లోపు ఉండగా.. 2020 నాటికి సుమారు ఇది 49 వేలకు చేరింది. అయినప్పటికీ ఇది మొత్తం ఉన్నత విద్యలో నమోదైన విద్యార్థుల్లో కేవలం 0.10 శాతమే.



భారత్‌కు వచ్చే అయిదేళ్ల పాటు ఏటా 8-10 బి. డాలర్ల (దాదాపు రూ. 72,800-91,000 కోట్లు) మేర రుణాలు ఇవ్వడానికి ప్రపంచ బ్యాంక్ అంగీకరించింది. ఆ మేరకు కొత్త కంట్రీ పార్ట్‌నర్‌షిప్ ఫ్రేమ్‌వర్క్ (సీపీఎఫ్)ను ప్రపంచ బ్యాంక్ గ్రూప్, భారత్ ప్రకటించాయి. ఒక అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలన్న మనదేశ లక్ష్యానికి అనుగుణంగా, తదుపరి వృద్ధి దశను వేగవంతం చేసేందుకు ఈ రుణాలు సహాయపడనున్నాయి.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

ఫిబ్రవరి 2
చరిత్రలో ఈనాడు

జీవుల మనుగడకు, పర్యావరణ సమతౌల్యతకు చిత్తడి నేలలు ఎంతో అవసరం. శీతోష్ణస్థితి, వరదల నియంత్రణ, నీటి శుద్ధి, పర్యావరణ పరిరక్షణలో ఇవి ప్రముఖ పాత్ర పోషిస్తాయి. అంటార్కిటికా మినహా అన్ని ఖండాల్లో ఇవి ఉన్నాయి. చిత్తడి నేలలు ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తాయి, నీటిని శుభ్రపరుస్తాయి, వరదలను నివారిస్తాయి, అనేక రకాల మొక్కలు - జంతువులకు ఆవాసాలుగా ఉంటాయి. ప్రాణికోటికి ఎంతో ఉపయోగకరమైన ఈ నేలలు కొన్నేళ్లుగా కనుమరుగవుతున్నాయి. జనాభా పెరుగుదల, పట్టణీకరణ లాంటివి ఇందుకు ప్రధాన కారణాలు. చిత్తడి నేలల ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఏటా ఫిబ్రవరి 2న 'ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం'గా (World Wetlands Day) నిర్వహిస్తారు. పర్యావరణ పరిరక్షణలో ఈ నేలల పాత్ర గురించి ప్రజలకు తెలియజేయడంతోపాటు వీటిని కాపాడుకోవడం ఎంత ఆవశ్యకమో చాటిచెప్పడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

చిత్తడి నేలలు అంటే?

☛ సముద్ర, నదీ తీర ప్రాంతాల్లో ఏడాది పొడవునా నీటితో నిండి ఉండే ప్రదేశాలను చిత్తడి నేలలు అంటారు. మంచి - ఉప్పు నీటి సరస్సులు, తుంపర, బీల భూములు, పగడపు దిబ్బలు, మడ అడవులు, మానవ నిర్మిత చేపల చెరువులు, వరి పొలాలు, సాగునీటి ఆనకట్టలు మొదలైనవన్నీ వీటికి ఉదాహరణలు.

☛ రామ్‌సర్ అంతర్జాతీయ చిత్తడి నేలల పరిరక్షణ ఒప్పందం ప్రకారం, ప్రవహించే లేదా స్థిరమైన నీటిని కలిగి ఉన్న ప్రాంతాలన్నీ చిత్తడి నేలలే.

☛ ఈ నేలలు తక్కువ లోతుతో వివిధ జంతు, వృక్ష జాతులకు ఆవాసాలుగా ఉంటాయి.

చారిత్రక నేపథ్యం



☛ 1971, ఫిబ్రవరి 2న ఇరాన్‌లోని రామ్‌సర్ పట్టణంలో ఒక సదస్సు నిర్వహించారు. ఇందులో భారత్ సహా 164 దేశాలు చిత్తడి నేలల పరిరక్షణకు సూచించిన ఉమ్మడి ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ సమావేశానికి గుర్తుగా 1997, ఫిబ్రవరి 2న మొదటిసారి 'ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని' జరిపారు. అప్పటి నుంచి ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు.

చిత్తడి నేలల ప్రాముఖ్యం, భారత్‌లో చిత్తడి నేలలు, గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

బాల కార్మిక వ్యవస్థ



ఇంట్లో తల్లిదండ్రులకు సహాయపడితే కూడా బాలకార్మికులు అవుతారా? తల్లిదండ్రులతోపాటు సొంత పొలంలో పనిచేస్తే బాలకార్మికులవుతారా? అసలు బాలకార్మిక వ్యవస్థ అంటే ఏంటి? దీనివల్ల బాలలు, సమాజంపై పడుతున్న ప్రభావమేంటి? ఈ సమస్య తీవ్రత ఎంత? ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి?

బాలలు, బాలకార్మికులు

☛ జూన్ 12న ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటారు. యునిసెఫ్ ప్రకారం 18 ఏళ్ల లోపున్నవారు కొన్ని కార్యకలాపాల్లో పాలుపంచుకుంటే వారిని బాలకార్మికులుగా పరిగణిస్తారు.

☛ ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాలల హక్కుల సంప్రదాయం (యునైటెడ్ నేషన్స్ చైల్డ్ రైట్స్ కన్వెన్షన్) ప్రకారం 18 సంవత్సరాల్లోపు వారు ఆర్థిక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లయితే బాలకార్మికులుగా పరిగణిస్తారు.

☛ ఓటు హక్కు ప్రకారం 18 సంవత్సరాల్లోపు వారంతా బాలలు అవుతారు.

చిన్నాచితక పనుల్లో ఉన్న బాలకార్మికులు, ఎంతలోపు వయసు ఉన్నవారు పని చేయడానికి అనర్హులు, బాలకార్మికులు అధికంగా ఉన్న రంగాలు, బాలకార్మిక వ్యవస్థపై అంతర్జాతీయ స్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలు, ఈ వ్యవస్థను నిర్మూలించేందుకు రాజ్యాంగం తీసుకుంటున్న చర్యలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Indian Army Recruitment

Indian Army invites applications from eligible Engineering Graduates for the 67th Short Service Commission (SSC) (Tech) course commencing in October 2026 at Pre-Commissioning Training Academy (PCTA). Total no.of posts is 350. Last date for online applications 5 February 2026.

Assam Rifles Recruitment Rally 2026

Assam Rifles, under the Ministry of Home Affairs, Government of India, has released the Recruitment Rally 2026 notification inviting online applications from eligible male and female Indian citizens for the post of Rifleman / Riflewoman (General Duty) under Meritorious Sports Persons Quota. The recruitment rally will be conducted at designated centres between February 2026 and May 2026. Total no.of posts is 95. Application fee is 100. Last date for online applications 9 February 2026.

Did You Apply..?

Today (February 2) is the last date for the following Jobs

☛ Senior Hydrographer jobs at SM Port.
Eligibility: B.Sc. (Nautical Science).

☛ 40 Manager Posts in National Aluminium Company Limited.
Eligibility: Engineering degree.

☛ 22 Non-Teaching Posts in IISER Tirupati.
Qualifications: Bachelor's degree.

For more information and other notifications - scan QR code

Sentence Improvement

Directions (Qs.1 - 18): *Select the most appropriate option to substitute the bold segment in the given sentence. If there is no need to substitute it, select No improvement as your answer.*

1. The manager **is possessing vast experience** in handling financial crises.
A) possesses vast experience
B) has been possessing vast experience
C) is possessed of vast experience
D) No Improvement

2. Hardly had he reached the station **when the train had left.**
A) when the train left
B) than the train left
C) when the train lefted
D) No Improvement

3. She speaks English **more fluently than any student** in her class.
A) more fluently than any other student
B) most fluently than any student
C) more fluent than any other student
D) No Improvement

4. The project will fail unless the workers **do not cooperate properly.**
A) did not cooperate properly
B) cooperate properly
C) will not cooperate properly
D) No Improvement

5. The officer along with his assistants **have submitted the report** to the director.
A) has submitted the report
B) were submitted the report
C) have been submitting the report
D) No Improvement

6. The teacher made the students **to complete the assignment** before leaving the class.
A) complete the assignment
B) completed the assignment
C) completing the assignment
D) No Improvement

7. There are **too much problems** in the system to ignore.
A) very much problems
B) too many problems
C) too many problem
D) No Improvement

8. He has been working here **since 2018** as a senior accountant.
A) from 2018 B) for 2018
C) since he joined 2018
D) No Improvement

9. One should respect **their elders** and learn from their experiences.
A) his or her elders
B) its elders C) his elders
D) No Improvement

SSC Exams
English

10. The meeting was postponed **due to the manager was absent.**
A) because of the manager was absent
B) due to the manager's absence
C) owing to the manager absent
D) No Improvement

11. She is **married with** a software engineer from Hyderabad.
A) married for B) married by
C) married to D) No Improvement

12. She has **a unique talent** for solving complex mathematical problems.
A) an unique talent
B) the unique talent
C) unique talents
D) No Improvement

13. He behaved so foolishly that everyone **laughed on him.**
A) laughed at him
B) laughed over him
C) laughed upon him
D) No Improvement

14. If he **will study hard**, he will easily crack the examination.
A) studies hard
B) studied hard
C) had studied hard
D) No Improvement

15. The furniture in this room **are very expensive.**
A) are very expensively
B) is very expensive
C) have been expensive
D) No Improvement

16. He prefers tea **than coffee** in the morning.
A) than to coffee B) over coffee
C) to coffee D) No Improvement

17. Being a rainy day, we decided to stay at home.
A) Being rainy
B) As it was a rainy day
C) Being the day rainy
D) No Improvement

18. This solution is **more better than** the previous one.
A) most better than
B) more good than
C) better than
D) No Improvement

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert

పవర్ ప్రాజెక్టుల పనులను పరిశీలించిన గౌతమ్ అదానీ



గండికోట సమీపంలో సొరంగం పనులు జరుగుతున్న ప్రాంతంలో గౌతమ్ అదానీ, ఎంపీ సీఎం రమేశ్ తదితరులు

కొండాపురం, లింగాల, న్యూస్‌టుడే: అదానీ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గౌతం అదానీ వైఎస్సార్ కడప జిల్లాలో ఆదివారం పర్యటించారు. లింగాల మండలంలోని పెంచికల బసిరెడ్డి జలాశయం(పీబీఆర్) సమీపంలో రూ.2,300 కోట్ల వ్యయంతో చేపట్టిన 500 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం కొండాపురం మండలం కె.బొమ్మేపల్లె రెవెన్యూ పరిధిలో గండికోట వెనుక జలాల ఆధారంగా ఏర్పాటు చేస్తున్న 1,800 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్టు పనులను ఆయన కుమారుడు జీత్ అదానీతో కలిసి పరిశీలించారు. పనుల పురోగతిపై సంస్థ ప్రతినిధులతో చర్చించారు. అంతకుముందు దొంతికోనకు చేరుకున్న గౌతమ్ అదానీకి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తదితరులు స్వాగతం పలికారు.

సముద్ర సరిహద్దు రక్షణలో కోస్ట్‌గార్డ్ సేవలు అమోఘం: సీఎం

ఈనాడు, అమరావతి: భారత సముద్ర సరిహద్దు రక్షణ, భద్రతను కాపాడటంలో తీర రక్షక దళం పాత్ర అమోఘమని సీఎం చంద్రబాబు కొనియాడారు. ఇండియన్ కోస్ట్ గార్డు 50వ స్థాపన దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మానవతా సేవల్ని అందించడంలో వారి అచంచల నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు.

రాంబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబు మీద తీవ్ర అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబును వైకాపా నుంచి సస్పెండ్ చేయాలని తెదేపా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సభ్యసమాజం తలదించుకునేలా అంబటి ప్రవర్తించారని ఆదివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. చంద్రబాబుకు, రాష్ట్ర ప్రజలకు అంబటి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

శాంతిభద్రతల విఘాతానికి వైకాపా కుట్ర

ఎమ్మెల్సీ రామచంద్రయ్య ధ్వజం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు వైకాపా నాయకులు కుట్రలు పన్నుతున్నారని తెదేపా ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఆరోపించారు. రాష్ట్ర ప్రతిష్ఠను మసకబార్చి పెట్టుబడులు రాకుండా చేయాలని చూస్తున్నారని ఆదివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. అసభ్య పదజాలంతో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న వైకాపా నేతల్ని ఆ పార్టీ అధినేత జగన్ ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుపై మాజీమంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండించారు.

కల్తీ మద్యంతో జోగి రమేశ్ ప్రజల ప్రాణాలు తీశారు

గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి

ఈనాడు, అమరావతి: కల్తీ మద్యం సరఫరా చేసి 30 వేల మంది ప్రజల ప్రాణాల్ని వైకాపా నేత జోగి రమేశ్ తీశారని గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి ఆరోపించారు. జోగిపై దాడిని బీసీ కులాలకు ఆపాదిస్తూ రాజకీయం చేయాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం గురుమూర్తి విలేకరులతో మాట్లాడారు.

27న ఏపీ ఎన్జీవో ఎన్నికలు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఎన్నికలు ఈ నెల 27న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి, సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఆచంట రామారాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు. 75 ఏళ్ల చరిత్ర గల ఈ సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడు, సహాధ్యక్షుడు, 12 మంది ఉపాధ్యక్షులు, మహిళా ఉపాధ్యక్షురాలు తదితర విభాగాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. విజయవాడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఈ నెల 2న ఓటర్ల తుది జాబితా ఉంచుతామన్నారు. 8న ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు నామినేషన్ పత్రాల స్వీకరణ, మధ్యాహ్నం 3 గంటలకు వాటి పరిశీలన ఉంటుందని, 9న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట లోపు నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు.



మీ జీవితం ఆరోగ్యకరంగా సాగిపోయేందుకు..

ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందేందుకు నాలుగు తేలికపాటి చిట్కాలు..

1. రోజుకు రెండుసార్లు భోజనం. ఫలితంగా శరీర జీవక్రియల రేటు పెరుగుతుంది.
2. రోజూ గంట వ్యాయామం. దీంతో వ్యాధుల నుంచి కండరాలు రక్షణ పొందుతాయి.
3. ఏడు గంటల నాణ్యమైన నిద్ర. ఈ కారణంగా హార్మోన్లు సమతౌల్యంగా పనిచేస్తాయి. కొవ్వు కరుగుతుంది.
4. చక్కెర, జంక్‌ఫుడ్, అతిగా శుద్ధిచేసిన ఆహారాలను దూరం పెట్టాలి. తద్వారా శరీరంలో వాపు ప్రక్రియ నెమ్మదించి జీవిత కాలం పెరుగుతుంది.

– రిషి కుమార్ నికం, హోమియోపతి వైద్యుడు

22 నగరాల్లో మౌలిక వసతులకు రూ.56 వేల కోట్లు

- ఇందులో విశాఖపట్నం, విజయవాడలకు చోటు
- 16వ ఆర్థిక సంఘం సిఫార్సు

ఈనాడు, దిల్లీ: 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 10 లక్షల నుంచి 40 లక్షల లోపు జనాభా ఉన్న 22 నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం 16వ ఆర్థిక సంఘం రూ.56,100 కోట్లు కేటాయించింది. ఈ మొత్తాన్ని ఐదేళ్లలో ఖర్చుచేయాలని సిఫార్సు చేసింది. ఈ నగరాల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడలకు చోటు కల్పించింది. ఈ నిధులతో ఆ నగరాల్లో ఇప్పుడున్న డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించడం, వరదనీరు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలను వేరుగా చేయడం, మురుగునీటి పారుదల వ్యవస్థ లేని ప్రాంతాలకు ఆ నెట్‌వర్క్‌ను విస్తరించడం లాంటి పనులు చేస్తారు. నగరాల్లోని ప్రత్యేక సమస్యలను గుర్తించి వాటిని చక్కదిద్దుతారు. తొలుత ఎంపికచేసిన నగరాల్లో ఉన్న సమస్యలపై పూర్తిస్థాయి అధ్యయనం చేసి, ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేయాలో గుర్తించాల్సి ఉంటుంది. ఏ ఏడాది ఏయే పనులు చేపట్టాలి, అందుకు ఎంత ఖర్చవుతుందన్న దానిపై డీపీఆర్‌లు తయారుచేయాలి. ఆ పనుల కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత నగరపాలక సంస్థలు త్రైపాక్షిక ఒప్పందం చేసుకోవాలి. ఆ ఒప్పందంలో ప్రాజెక్టు వివరాలు, సంవత్సరాల వారీగా సాధించాల్సిన లక్ష్యాలను కూడా పొందుపరచాలి. తొలి మైలురాయి కోసం ఎంఓయూ కుదుర్చుకున్న తర్వాత నిధులు విడుదల చేస్తారు. ప్రతి మైలురాయి దాటిన తర్వాత తదుపరి లక్ష్యాలకు నిధులు మంజూరుచేస్తారు. 'గత 50 ఏళ్లలో దేశంలో పట్టణ జనాభా 4 రెట్లు పెరిగింది. నగరాల్లో మౌలిక వసతులను ఆధునికీకరించాల్సిన అవసరముంది. తద్వారా అక్కడ తక్కువ వేతనాలకే కార్మికులు అందుబాటులో ఉంటారు. పరిశ్రమలు పెద్ద నగరాలకు బదులు 40 లక్షల లోపు జనాభా ఉన్న నగరాలవైపు దృష్టి సారించే వీలుంటుంది. ఇప్పుడు సిఫార్సు చేస్తున్న ఈ నిధులతో 15 లక్షలకు మించిన నగరాలైతే రూ.5వేల కోట్ల వరకు ప్రాజెక్టులకు, ఆలోపు జనాభా ఉన్న నగరాలకైతే రూ.3,500 కోట్ల ప్రాజెక్టుల వరకు ఆర్థికసాయం చేయాలి. మొత్తం ఖర్చులో 60% కేంద్రం, మిగిలిన 40% రాష్ట్రాలు సమకూర్చుకోవాలి. మొత్తంగా అన్ని నగరాలకూ కలిపి ఐదేళ్లలో రూ.56,100 కోట్లు ఖర్చుచేయాలి" అని ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. ఇందులో ఆర్థిక సంఘం పుణె, జైపుర్, లఖ్‌నవూ, కాన్పూర్, నాగ్‌పుర్, ఇందౌర్, భోపాల్, విశాఖపట్నం, పట్నా, వడోదర, లూథియానా, ఫరీదాబాద్, రాజ్‌కోట్, ధన్‌బాద్, అమృత్‌సర్, హౌడా, రాంచి, కోయంబత్తూరు, విజయవాడ, జోధ్‌పుర్, మదురై, రాయ్‌పుర్‌లను చేర్చింది. 2011 జనాభా లెక్కల ప్రకారం విశాఖపట్నంలో 17,28,128 మంది, విజయవాడలో 10,34,358 మంది జనాభా ఉన్నట్లు పేర్కొంది.

గీతం వర్సిటీ భూముల వ్యవహారంపై జగన్ వ్యాఖ్యలు తగవు: ఎంపీ శ్రీభరత్

మధురవాడ, న్యూస్‌టుడే: గీతం యూనివర్సిటీ భూముల వ్యవహారంపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ వ్యాఖ్యలు చేయడం బాధాకరమని విశాఖ ఎంపీ, గీతం వర్సిటీ అధ్యక్షుడు శ్రీభరత్ అన్నారు. వర్సిటీ భూముల వ్యవహారంపై 'ఎక్స్'లో జగన్ పేర్కొన్న విషయాలపై శ్రీభరత్ స్పందిస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని రోజులుగా వైకాపా నాయకులు, వారి అనుబంధ మీడియా తనపై, వర్సిటీపై అబద్ధాలు, విషపూరిత ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వర్సిటీకి కేటాయించబోయే 54.79 ఎకరాల భూమి విలువ రూ.5 వేల కోట్లు అన్న ఆరోపణల్లో నిజం లేదని చెప్పారు. క్యాంపస్‌కు చేరువగా ఉన్న కొండ ప్రాంతంలోని భూమిని గతంలో రాజీవ్ స్వగృహ హౌసింగ్ ప్రాజెక్టులో భాగంగా తక్కువ ధరకు మధ్య తరగతి ప్రజల కోసం కేటాయించారని, వైకాపా హయాంలోనే ఆ భూమిని నివాస వినియోగం నుంచి 'మిక్స్‌డ్ యూజ్'గా మార్చి ప్లాట్లుగా విభజించి వేలం వేశారని గుర్తు చేశారు. 2022-24 మధ్య సంబంధిత ప్లాట్లు చదరపు గజానికి రూ.60-రూ.65 వేలకే అమ్ముడయ్యాయని, ఎకరా విలువ సుమారు రూ.20 కోట్లకు మించదని పేర్కొన్నారు. ఈ లెక్కన 54.79 ఎకరాల భూమి రూ.వెయ్యి కోట్లకు మించదని చెప్పారు. వైకాపా హయాంలో స్వాధీనం చేసుకుని ఫెన్సింగ్ వేసిన భూములను ఇప్పుడు ఉచితంగా ఇచ్చేస్తున్నారని చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, ప్రభుత్వం నిర్ణయించే ధరను చెల్లించేందుకు గీతం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, తాము ఉచితంగా భూమిని కోరలేదని తెలిపారు. గీతం విశ్వవిద్యాలయం ఇప్పటి వరకు లక్ష మంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిందని, విశాఖ ఐటీ రంగంలో భవిష్యత్తులో ఉన్నత మానవ వనరులు, ఔత్సాహిక వ్యాపారవేత్తలను తయారు చేయడంలో గీతం కీలక పాత్ర పోషిస్తుందని, సమాజానికి సేవ చేస్తున్న సంస్థపై దురుద్దేశపూరిత దాడులు చేయడం, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. జగన్ చేసిన వ్యాఖ్యలను తిరిగి పరిశీలించుకోవాలని శ్రీభరత్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వైద్య విద్యార్థిని దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్రగాయాలు



లిఖిత



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రాజానగరం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ దంత వైద్య విద్యార్థిని మృతిచెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా చాగల్లుకు చెందిన జొన్నకూటి లిఖిత(23), తునికి చెందిన పట్టూరి వాత్సల్య సాయి, విశాఖపట్నానికి చెందిన సమయమంతుల జాహ్నవి రాజేశ్వరి రాజమహేంద్రవరం సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో దంత వైద్యవిద్య పూర్తి చేసుకుని, ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. మరో పది రోజుల్లో అది కూడా పూర్తవ్వనుంది. వీరంతా రాజానగరంలోని ఓ ప్రైవేటు వసతిగృహంలో ఉంటున్నారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత వీరంతా కారులో రాజమహేంద్రవరం నుంచి వసతిగృహానికి బయలుదేరారు. కారును విశాఖపట్నానికి చెందిన వీరి స్నేహితుడు వి.కిశోర్ నడుపుతున్నారు. రాజమహేంద్రవరం దాటిన తర్వాత దివాన్‌చెరువు, రాజానగరం మధ్య కారు ముందున్న గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని డివైడర్‌పైకి వెళ్లింది. దీంతో ముందు సీట్లో కూర్చున్న లిఖితను కారు బానెట్ నొక్కేయడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు. కారులోని మిగిలిన ముగ్గురూ తీవ్రంగా గాయపడగా వేర్వేరు ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. మరో పదినిమిషాల్లో వసతిగృహానికి వెళ్లిపోతారనగా ఈ ఘోరం జరగడంతో అంతా విషాదంలో మునిగిపోయారు. దీనిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మరో గ్రంథాలయ ఉద్యమం' పేరుతో హైదరాబాద్-అమరావతి బస్సు యాత్ర



మరో గ్రంథాలయ ఉద్యమం యాత్రను ప్రారంభిస్తున్న తెలంగాణ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్

హైదరాబాద్, న్యూస్‌టుడే: విజ్ఞాన తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. 'హైదరాబాద్ నుంచి అమరావతికి మరో గ్రంథాలయ ఉద్యమం' పేరిట నిర్వహించే బస్సు యాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆదివారం హైదరాబాద్ అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు త్వరలో 'ఆదిలాబాద్-అచ్చంపేట' పేరిట గ్రంథాలయ యాత్రను నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని, జిల్లా, ప్రధాన గ్రంథాలయాలను ఆధునికీకరించేందుకు కృషి చేస్తామన్నారు. చేతిలో సెల్‌ఫోన్‌కు బదులుగా పుస్తకం ఉండే విధంగా యువతలో చైతన్యాన్ని పెంపొందించేందుకు విద్యావేత్తలు, మేధావులు, కవులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర రెండు తెలుగు రాష్ట్రాల మీదుగా కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అఫ్జల్‌గంజ్ రాష్ట్ర, కేంద్ర గ్రంథాలయం ముఖ్య గ్రంథపాలకురాలు పీజీవీ రాణి, కవి యాకుబ్, కాసుల రవికుమార్, కస్తూరి ప్రభాకర్, ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, బండారు విజయ, శిరీష, ఎం.దినకర్, క్రాంతి నల్లూరి, సజయ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ప్లకార్డులు పట్టుకుని పుస్తక పఠనం.., గ్రంథాలయాల ప్రాధాన్యం గురించి అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

యాత్ర ఇలా....

తొలిరోజు ఫిబ్రవరి1న భువనగిరిలో సభ నిర్వహించి, వెల్లంకిలోని కూరెళ్ల విఠలాచార్య ప్రజా గ్రంథాలయాన్ని బృంద సభ్యులు సందర్శించారు. అనంతరం నల్గొండ వెళ్లారు. 2వ తేదీ నకిరేకల్, సూర్యాపేట, కోదాడలో పిల్లలు, విద్యావేత్తలు, సాహితీవేత్తలతో కార్యక్రమాలుంటాయి. 3వ తేదీ జగ్గయ్యపేట, నందిగామల మీదుగా యాత్ర విజయవాడ చేరుకుంటుంది. అక్కడ నాగార్జున యూనివర్సిటీలో కార్యక్రమం అనంతరం అమరావతిలో ముగింపు కార్యక్రమం ఉంటుంది.

జీఎస్టీ వసూళ్ల పంట

- గతేడాది జనవరి కన్నా ఈసారి 6.72% అధికం
- వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ వెల్లడి

2026 జనవరిలో ఇలా వసూళ్లు (రూ.కోట్లలో)

ఎస్జీఎస్టీ	1,284
ఐజీఎస్టీ సర్దుబాటు:	1,789
పెట్రోలియం వ్యాట్:	1,490
వృత్తి పన్ను	38

ఈనాడు–అమరావతి: రాష్ట్రంలో 2026 జనవరి నెలకు సంబంధించి గతంలో ఏ ఏడాది జనవరి నెలలోనూ రానంత జీఎస్టీ నికర వసూళ్లు వచ్చాయి. కిందటేడాది జనవరితో పోలిస్తే ఈ ఏడాది వసూళ్లు 6.72% అధికంగా ఉన్నాయి. జాతీయ సగటు కన్నా ఇది ఎక్కువ. అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక తర్వాతి స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. కర్ణాటక కిందటి ఏడాది కన్నా 7.23% అధిక వసూళ్లు సాధించింది. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు.

✦ కేంద్ర ప్రభుత్వం 2026 జనవరి నెలకు సంబంధించి రూ.1,788.79 కోట్ల మేర ఐజీఎస్టీ సర్దుబాటు చేసింది. 2025 జనవరి నెలలో ఐజీఎస్టీ సర్దుబాటు మొత్తం కన్నా ఇది రూ.94.37 కోట్లు ఎక్కువ. అంటే 5.57% అధికం. 2025 డిసెంబరులో ఐజీఎస్టీ సర్దుబాటు వల్ల రూ.1,549.27 కోట్లు మాత్రమే వచ్చింది. జనవరిలో రూ.239.52 కోట్లు అధికంగా వచ్చింది. ✦ 2026 జనవరిలో నికర జీఎస్టీ రూ.3,073 కోట్లు, వివిధ జరిమానాల రూపంలో రూ.11 కోట్లు, పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ ద్వారా రూ.1,490 కోట్లు మద్యంపై వ్యాట్ ద్వారా రూ.92 కోట్లు.. మొత్తం రూ.4,704 కోట్లు వసూలయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జనవరి వరకు రూ.44,221 కోట్ల మేర జీఎస్టీ వసూలైంది.

జనవరిలో వసూళ్లు ఇలా.. (రూ.కోట్లలో)

అంశం	2025	2026
నికర జీఎస్టీ వసూళ్లు	2,879	3,073
స్థూల జీఎస్టీ వసూళ్లు (సెస్ మినహాయించి)	3,482	3,475

సినీ ప్రముఖులతో మోహన్ భాగవత్ భేటీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ శనివారం హైదరాబాద్‌లో పలువురు సినీప్రముఖులతో భేటీ అయ్యారు. మణికొండలోని సినీనటుడు వెంకటేశ్ నివాసంలో సమావేశమయ్యారు. భేటీలో దగ్గుబాటి సురేశ్‌బాబు, రానా, అక్కినేని నాగార్జున, నాని, రామ్ పోతినేని, వరుణ్‌తేజ్ పాల్గొన్నారు. మన సంస్కృతికి అద్దం పట్టే విధంగా సినిమాలను చిత్రీకరించాలని, దేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా కథలను ఎంపిక చేసుకోవాలని మోహన్ భాగవత్ సూచించినట్లు సమాచారం. దర్శకులు హరీశ్‌శంకర్, అనిల్ రావిపూడి, త్రివిక్రమ్, మెహర్ రమేశ్‌తోపాటు నిర్మాతలు మైత్రి రవి, సాహు గారపాటి తదితరులు కూడా పాల్గొన్నారు. అయితే భేటీ వివరాలను ఇటు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు గానీ, అటు సినీ వర్గాలు గానీ వెల్లడించలేదు.

ఉద్యోగులకు ఊరట లభించలేదు

ఉపాధ్యాయ సంఘాలు

ఈనాడు, అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులకు ఏమాత్రం ఊరట లభించలేదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘునాథరెడ్డి, ఎల్.సాయిశ్రీనివాస్ తెలిపారు. ఆదాయపు పన్ను మినహాయింపుల్లో మార్పు చేయలేదని, గృహ నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఇంటి రుణంపై చెల్లించే వడ్డీ మినహాయింపు పరిమితిని పెంచలేదని పేర్కొన్నారు. విద్యారంగానికి కేవలం రూ.1.39 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారని, ఇది మొత్తం బడ్జెట్‌లో 2.6 శాతమేనని తెలిపారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు నిరాశే ఎదురైందని ఏపీ ఉపాధ్యాయ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి విమర్శించారు. ఆదాయపు పన్నులో స్టాండర్డ్ డిడక్షన్ రూ.75వేల నుంచి పెంచుతారని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైందని పేర్కొన్నారు.

అంబటి అనుచిత వ్యాఖ్యలకు సీపీఎం ఖండన

కృష్ణలంక, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైకాపా నాయకుడు అంబటి రాంబాబు.. అభ్యంతరకరమైన రీతిలో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సీపీఎం ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భాష రాజకీయ వాతావరణాన్ని కలుషితం చేసేలా.. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉందన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని తెదేపా శ్రేణులు రాంబాబు ఇంటిపై దాడికి పాల్పడడాన్ని కూడా సీపీఎం ఖండిస్తోందన్నారు. తిరుపతి లడ్డూ వివాదంపై సిట్ నివేదికను బహిరంగపరిచి వాస్తవాలను వెల్లడించాలని శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. వైకాపా నాయకుడు జోగి రమేష్ ఇంటిపై తెదేపా శ్రేణులు దాడికి పాల్పడడాన్ని కూడా ఆయన తప్పుపట్టారు.

ఎంఈఓలకు పదోన్నతులు కల్పించాలని సీఎంకు వినతి

ఈనాడు, అమరావతి: మండల విద్యాధికారులకు నోషనల్ ప్రమోషన్స్‌తో డీఈఓలుగా ఇవ్వాలని ఎంఈఓల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరత్నం, కిశోర్‌బాబు కోరారు. ఈ మేరకు కుప్పంలో సీఎం చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. డిప్యూటీ విద్యాధికారులుగానూ పదోన్నతులు కల్పించాలని, ఎంఈఓల బదిలీలు, అన్ని ఖాళీలను సీనియర్ ప్రధానోపాధ్యాయుల ద్వారా భర్తీ చేయాలని విన్నవించారు.


విష ప్రయోగంతో వీధి కుక్కల హతం

గొల్లపల్లి, న్యూస్‌టుడే: వీధి కుక్కలను విష ప్రయోగంతో చంపడం తెలంగాణలోని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్‌లో కలకలం రేపింది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుక్కల బెడద నివారణకు కొందరు ఆదివారం విష ప్రయోగం చేశారు. దీని ప్రభావంతో పదుల సంఖ్యలో శునకాలు మృత్యువాతపడ్డాయి. దీనిపై స్థానిక యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైతు బలవన్మరణం

రామాయంపేట (చేగుంట), న్యూస్‌టుడే: అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురైన ఓ రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన తెలంగాణలోని మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతిధర్మారంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెండేల కృష్ణ(45), రేణుక దంపతులకు ఇద్దరు కుమారులు. కృష్ణ సాగు కోసం రూ.3 లక్షల వరకు అప్పు చేశారు. ఏడాదిన్నర కిందట పొలంలో బోర్లు వేయగా ప్రయోజనం లేకపోయింది. పంటలు సరిగా పండక అప్పు తీర్చలేక మనోవేదనకు గురయ్యేవారు. ఈ క్రమంలోనే శనివారం పొలానికి వెళ్లిన కృష్ణ పురుగుమందు తాగారు. ఈ విషయాన్ని చిన్న కుమారుడు నాగరాజుకు ఫోన్ చేసి చెప్పారు. వెంటనే కృష్ణను నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందారు.

ఆదిలాబాద్ జిల్లాలో అరుదైన జల ప్రాణులు



ఆదిలాబాద్ జిల్లాలో అరుదైన నీటి జంతువులను గుర్తించారు. 'స్మూత్ కోటెడ్ ఓటెర్'లుగా పిలిచే ఈ జల ప్రాణులు బోథ్ అటవీ రేంజి పరిధిలోని సొనాల మండలం గొల్లాపూర్ చెరువు వద్ద కనిపించినట్లు ఎఫ్ఆర్వో ప్రణయ్ ఆదివారం తెలిపారు. ఈ అరుదైన జాతి జంతువులు శుభ్రమైన నీటి వనరులు, సమృద్ధిగా చేపలు లభించే ప్రదేశాల్లో కనిపిస్తాయన్నారు. పాకిస్థాన్, చైనా, మలేసియా, ఇండోనేసియాలలో వీటి సమూహాలు ఉంటాయని తెలిపారు. చెరువు వద్ద నిరంతర పర్యవేక్షణ, ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు.

– న్యూస్‌టుడే, సొనాల (బోథ్)

అర్ధ బ్రహ్మోత్సవం.. ఆధ్యాత్మిక వైభవం



సువర్ణముఖి తీరంలో కొలువుదీరిన పంచమూర్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: మాఘ పూర్ణిమ సందర్భంగా సువర్ణముఖి నదీ తీరం ఆధ్యాత్మిక వైభవాన్ని చాటుకుంది. ఏటా ఈ రోజున సువర్ణముఖి పుష్కర మహోత్సవాన్ని అర్ధ బ్రహ్మోత్సవంగా నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం ముక్కంటి ఆలయం నుంచి శ్రీవినాయకస్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీసోమస్కందమూర్తి, శ్రీజ్ఞానాంబిక, శ్రీచండికేశ్వర స్వామి ఉత్సవమూర్తులతో పాటు ఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామి కొలువుదీరిన త్రిశూలాన్ని సువర్ణముఖి నదీ తీరానికి తీసుకెళ్లి పూజలు చేశారు. ప్రత్యేక పుష్కరిణిలో త్రిశూలస్నాన మహోత్సవం కనువిందుగా జరిగింది. అదే సమయంలో పెద్ద ఎత్తున భక్తులు పుష్కరస్నానాలు ఆచరించారు.

రూబిక్ క్యూబ్స్ కళ.. చిత్రాలు భళా



రూబిక్స్‌తో తీర్చిదిద్దిన ప్రధాని మోదీ, నటుడు షారుక్‌ఖాన్ చిత్రాలు



తిరుపతి నగరపాలక మైదానంలో ఆదివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలో చిన్నారులకు మెలకువలు వివరిస్తున్న శ్రీచరణ్

రూబిక్ క్యూబ్స్‌కు ఉన్న రంగుల్ని ఓవైపు చేర్చేందుకు చిన్నారుల నుంచి పెద్దల వరకు కుస్తీ పడటం చూస్తుంటాం. అందులో నైపుణ్యం సాధించడంతో పాటు వాటిని చిత్రాలుగా తీర్చిదిద్ది మెప్పిస్తున్నాడు కడప నగరానికి చెందిన శ్రీచరణ్. బీటెక్ చదివిన ఈ యువకుడు 2017 నుంచి వాటిపై ఆసక్తి పెంచుకోగా.. కరోనా సమయంలో విభిన్నంగా ఆలోచించి క్యూబ్స్‌తో చిత్రాలు తీర్చిదిద్దడంలో సఫలీకృతుడయ్యాడు. వీటితో మహనీయులు, రాజకీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, సినీ కళాకారులు, క్రీడాకారుల చిత్రాలున్నాయి. పండగలు, ప్రత్యేక దినాల్లో నిలువెత్తు క్యూబ్స్‌తో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాడు. దీన్ని ఉపాధి మార్గంగానూ మలచుకున్నాడు. చాక్‌పీస్.. పెన్సిల్ లెడ్, ఆకులపై చిత్రాలు గీయడంలోనూ ప్రావీణ్యం సంపాదించాడు. ఆసక్తి ఉన్నవారికి, విద్యార్థులకు రూబిక్ క్యూబ్స్ కళపై ఆన్‌లైన్ తరగతులు చెబుతున్నాడు.

– ఈనాడు, తిరుపతి

16వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు స్థానిక సంస్థలు, ప్రకృతి వైపరీత్య కార్యకలాపాలకు గ్రాంట్లు (రూ.కోట్లలో)

సంవత్సరం	గ్రామీణ	పట్టణ	ఎస్‌డీఆర్‌ఎఫ్	ఎస్‌డీఎంఎఫ్
2026-27	2,136	1,562	1,182	296
2027-28	2,724	2,250	1,241	311
2028-29	3,521	2,497	1,303	327
2029-30	3,908	2,772	1,368	343
2030-31	4,338	3,077	1,439	356
మొత్తం	16,627	12,158	6,533	1,633

సూది మందు వేసిన కాసేపటికే చిన్నారి మృతి

- వైద్యుడి నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబసభ్యుల ఆందోళన



క్రితార్స

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: కుక్క కాటుకు మూడో డోసు సూది మందు వేసిన తర్వాత చిన్నారి అపస్మారక స్థితిలోకి వెళ్లి రెండు గంటల్లోనే ప్రాణాలు విడిచింది. తెలంగాణలోని కామారెడ్డిలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలను పట్టణ సీఐ నరహరి తెలిపారు. కామారెడ్డి మండలం కొటాల్‌పల్లికి చెందిన రమేష్-అర్చన దంపతులు బతుకుదెరువు కోసం తమ ఇద్దరు పిల్లలతో కామారెడ్డి పట్టణంలోని అయ్యప్పనగర్ కాలనీలో నివాసముంటున్నారు. వీరి కుమార్తె క్రితార్స (రెండున్నరేళ్లు) గత నెల 25న బయట ఆడుకుంటుండగా కుక్క కరిచింది. వెంటనే కామారెడ్డిలోని బోధనాసుపత్రికి తీసుకెళ్లగా వ్యాక్సిన్ ఇచ్చారు. మూడో డోస్ కోసం ఆదివారం మధ్యాహ్నం చిన్నారిని తీసుకెళ్లగా డ్యూటీ డాక్టర్ వ్యాక్సిన్ వేశారు. ఇంటికి వెళ్లాక బాలిక అస్వస్థతకు గురికావడంతో దగ్గరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పల్స్ పడిపోయిందని అక్కడి సిబ్బంది చెప్పడంతో నేరుగా బోధనాసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే క్రితార్స మరణించిందని వైద్యులు చెప్పారు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబసభ్యులు, బంధువులు ఆసుపత్రికి పెద్దసంఖ్యలో చేరుకొని ఆందోళన చేశారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే చిన్నారి మరణించిందంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పాప తండ్రి ఫిర్యాదు మేరకు విధుల్లో ఉన్న వైద్యుడిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వివరించారు. వ్యాక్సిన్‌లతో మరణాలు సంభవించవని... పాప ఎలా చనిపోయిందో శవ పంచనామా, ఇతర దర్యాప్తు తర్వాతే నిర్ధారించగలమని బోధనాసుపత్రి పర్యవేక్షకుడు వెంకటేశ్వర్లు తెలిపారు.



లోహ విహంగం.. రోడ్డుపై పయనం!

ఆర్మీకి చెందిన ఈ భారీ విమాన భాగం ఆదివారం నిర్మల్ జిల్లా సోన్ వంతెనపై కనిపించింది. దీన్ని చెన్నై నుంచి దిల్లీకి ట్రాలీపై తరలిస్తున్నారు. బుల్లెట్‌లా దూసుకుపోతున్నట్లు కనిపిస్తుండటంతో స్థానికులు, ప్రయాణికులు ఆసక్తిగా చూస్తూ కనిపించారు.

– న్యూస్‌టుడే, నిర్మల్